ద్రావిడి

PRASAARAANGA

PRASARANGA

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

ద్రావిడి

సంపుటి - 6

జనవరి-జూన్ 2026

సంచిక-1

ISSN: 2319-3905

ద్రావిడి

(Peer Reviewed Journal)

అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక

సంపుటి - 6 | జనవరి-జూన్ 2026 | సంచిక-1

గౌరవ సంపాదకులు

ఆచార్య ఎల్.సి.మల్లయ్య, ఉపాధ్యక్షులు

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్, సంచాలకులు, ప్రచురణలు

DRAVIDIAN UNIVERSITY

ద్రావిడ విశ్వవిద్యాలయం

ద్రావిడి

(Peer Reviewed Journal)

(అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

సంపుటి - 6 **జనవరి-జూన్ 2026** **సంచిక - 1**

గౌరవ సంపాదకులు

ఆచార్య ఎల్.సి.మల్లయ్య, *ఉపాధ్యక్షులు*

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

సంచాలకులు, ప్రచురణలు

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య కె.శ్రీదేవి, *ద్రా.వి.వి.*

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, *హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.*

ఆచార్య విస్తాలి శంకరరావు, *మద్రాసు విశ్వవిద్యాలయం.*

ఆచార్య.డి.ఉదయ కుమారి, *ద్రా.వి.వి.*

డా.వి.పళని, *ద్రా.వి.వి.*

డా.యం.హరికృష్ణ, *ద్రా.వి.వి.*

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

Dravidi (Peer Reviewed Journal)
HALF-YEARLY RESEARCH JOURNEL IN TELUGU
January-June 2026, Vol.VI, Issue No.1

© Dravidian University

Editorial Board

Editor

Prof. D.V.Sravan Kumar

Members

Porf. K.Sridevi
Prof. Darla Venkateswara Rao
Prof. Vistali Shankara Rao
Prof. D.Udaya Kumari
Dr. V.Palani
Dr. M.Harikrishna

PRASARANGA

Published by

Director

Department of Publications

Dravidian University

Kuppam - 517 426

ISSN: 2319-3905

సందేశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్రిభాషా ప్రాంతమైన కుప్పంలో 1997వ సంవత్సరం ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది. ద్రావిడ విశ్వవిద్యాలయం భావసమైక్యతను సాధించడానికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రచురణలు విభాగం (ప్రసారాంగ) ఐదు ప్రధాన దాక్షిణాత్య భాషలతో పాటు ఆంగ్ల భాషలో సైతం రచనల్ని వెలువరించింది. ఏ విశ్వవిద్యాలయమూ ఇన్ని భాషల్లో ప్రచురణల్ని చేపట్టిన దాఖలా లేదు. స్వతంత్ర గ్రంథాలతో పాటు అనువాదాలను, నిఘంటువులను పరిశోధనా గ్రంథాలను, భాషాశాస్త్ర గ్రంథాలను ప్రసారాంగ ప్రచురించింది. వీటితో పాటు “ద్రావిడి” వెలువడుతూ వుండడం ఎంతైనా ముదావహం.

“ద్రావిడి” పత్రిక తెలుగు సాహిత్యాభిమానులకు ఒక వరం. సాహిత్యప్రియుల విజ్ఞానకాంక్షకు సమాధానం. పరిశోధకులు ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలను ప్రచురించడానికి ద్రావిడి పత్రిక వేదికగా అలరారుతున్నది. ఈ విషయాన్ని గుర్తించిన నేపథ్యంగా వచ్చిన “ద్రావిడి” పత్రిక పాఠకులను అలరిస్తుందనేది అక్షరసత్యం.

అయితే “ద్రావిడి” పత్రిక ఇంత వరకు అర్ధవార్షిక పత్రికగా ముద్రణలో వెలువడింది. ప్రస్తుతం అంతర్జాల పత్రికగా ప్రారంభం అయింది. మునుపటిలాగానే ఈ అంతర్జాల పత్రికను కూడా ఆదరించి, ఉత్తమ పరిశోధనా పత్రాలను పంపి, సాహిత్యాభిమానులు పత్రిక ప్రామాణికతను ద్విగుణీకృతం చేయగలరని విశ్వసిస్తున్నాను.

ఆచార్య ఎల్.సి.మల్లయ్య
ఉపాధ్యక్షులు

ద్రావిడ వాఙ్మయ స్వరూపం – డిజిటల్ యుగంలో సరికొత్త ప్రయాణం

ద్రావిడ భాషల అధ్యయనం, ద్రావిడ సంస్కృతిని గూర్చిన పరిశోధన, ఆ భాషల్లోని విశిష్ట సాహిత్య పరిశీలన ధ్యేయంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పడింది. విశ్వవిద్యాలయాలు చేపట్టవలసిన మూడు బాధ్యతలు బోధన, పరిశోధన, ప్రచురణ. ఈ మూడింటి వల్ల జ్ఞాన ప్రసారం సుగమమవుతుంది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఈ మూడింటినీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రచురణల విభాగం ఏ విశ్వవిద్యాలయమూ చేపట్టని విధంగా ఆరు భాషలలో గ్రంథాలను ప్రచురిస్తోంది. ఇలా ప్రధాన ద్రావిడ భాషలలో, ఆంగ్లంలో పుస్తక ప్రచురణ చేస్తున్న మరో విశ్వవిద్యాలయం ఏదీ లేదు. అదేవిధంగా తెలుగులో 'ద్రావిడి' అంతర్జాల పరిశోధనా పత్రికను తీసుకువస్తోంది.

అచ్చుపుస్తకాల పరిమితిని దాటి ఇంటర్నెట్ సదుపాయం వున్న ప్రతి ఒక్కరికీ ఈ పరిశోధనా వ్యాసాలను అందుబాటులో వుంచాలన్నదే ఈ అంతర్జాల పత్రిక ముఖ్య ఉద్దేశం. ఈ సంచిక నుండి 'ద్రావిడి'ని ముద్రణలో కాకుండా ఆన్‌లైన్‌లో తీసుకురావడం జరుగుతోంది. ద్రావిడ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో 'ద్రావిడి' పత్రిక దొరుకుతుంది. మునుపటికన్నా మించి ద్రావిడిని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో అంతర్జాల వేదికగా ఈ సంచిక నుండి తీసుకురావడం జరుగుతుంది. 'ద్రావిడి'ని మరింత ఆదరిస్తారనే నమ్మకంతో ఈ ప్రయత్నం చేస్తున్నాం.

భాషా సాంస్కృతిక వైవిధ్యానికి, సుదీర్ఘమైన చారిత్రక వారసత్వానికి ద్రావిడ భాషలు పట్టుగొమ్మలు. కాలం మారుతున్నా, సాంకేతికత విస్తరిస్తున్నా మన మూలాలను కాపాడుకుంటూ, వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ ఆశయంతోనే ద్రావిడ విశ్వవిద్యాలయం గత కొంతకాలంగా ద్రావిడి సాహిత్య, సాంస్కృతిక, భాషా చరిత్రలను అక్షరబద్ధం చేస్తూ వస్తోంది.

ఈ జ్ఞాన యజ్ఞాన్ని మరింత విస్తృతం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులకు, భాషాభిమానులకు డిజిటల్ మాధ్యమం ద్వారా చేరువ చేసేందుకు మా ఈ 'అర్ధ సంవత్సర అంతర్జాల పత్రిక' సరికొత్త సంచికతో మీ ముందుకు వచ్చింది.

ద్రావిడి కోసం –

ద్రావిడ భాషల అంతస్సూత్రాలను, వాటి మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను విశ్లేషించే అద్భుతమైన పరిశోధనా వ్యాసాలను, భాషా చరిత్ర కి సంబంధించి: ద్రావిడ భాషల పుట్టుక, వికాసం, మరియు ఆధునిక కాలంలో వాటి పరిణామ క్రమాలపై లోతైన అధ్యయనాలు, సాహిత్య విమర్శ కి సంబంధించిన ప్రాచీన ద్రావిడ సాహిత్యం నుండి ఆధునిక డిజిటల్ సాహిత్యం వరకు సాగిన వివిధ ప్రక్రియల సమగ్ర అధ్యయనం చేసిన వ్యాసాలు, సాంస్కృతిక వారసత్వంకు సంబంధించిన ద్రావిడ సంస్కృతి, కళలు, ఆచార వ్యవహారాలు, చరిత్రకు అద్దం పట్టే పరిశోధనలకు సంబంధించిన ప్రామాణిక వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం.

జ్ఞానం అనేది పంచుకుంటేనే పెరుగుతుంది. ద్రావిడ భాషా సంస్కృతులపై నిరంతరం కృషి చేస్తున్న సీనియర్ ఆచార్యులతో పాటు, యువ పరిశోధకులను కూడా ఈ వేదిక ద్వారా ప్రోత్సహించడం మా లక్ష్యం. రాబోయే సంచికల కోసం మీ ప్రామాణిక పరిశోధనా వ్యాసాలను, సమీక్షలను మాకు పంపించాల్సిందిగా కోరుతున్నాము.

చివరగా, ఈ పత్రికను ఇంత ఉన్నతంగా తీర్చిదిద్దడంలో సహకరించిన గౌరవ ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్ సి మల్లయ్య గారికి, ప్రత్యేక కృతజ్ఞతలు. అన్నింటా సహకరిస్తున్న కులసచివులు ఆచార్య వి.కిరణ్ కుమార్ గారికి, సంపాదక మండలి సభ్యులకు, వ్యాసకర్తలకు, సాంకేతిక నిపుణులకు మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ డిజిటల్ సంచిక పాఠకులకు సరికొత్త ఆలోచనలను, పరిశోధనాత్మక దృక్పథాన్ని అందిస్తుందని ఆశిస్తూ…

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

సంపాదకులు

విషయ సూచిక

సందేశం iiii

సంపాదకీయం v

1. తెలుగు భాషా, సాహిత్య పరిరక్షణ కోసం ద్రావిడ విశ్వవిద్యాలయం కృషి 01
– ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

2. పల్లిపట్టు నాగరాజు గారి 'యాలై పూడ్సింది' : దళిత ఈస్తటిక్స్ 07
– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

3. తెలుగు కథా సాహిత్యం – రచయిత్రుల భాగస్వామ్యం 25
– ప్రొ. కె. శ్రీదేవి & ఆర్. సి. కాంతివర్ధిని

4. చిత్తూరు కవిత్వం – విద్య 37
– బి.శంకరరాజు

5. బౌద్ధం జాతక కథలలో రామాయణం 44
– యం.రాజు

6. ఏరువాక పూర్ణిమ 50
– యాళ్ళ ఉమామహేశ్వరి

7. మద్దూరి నగేష్ బాబు – సాహిత్యం – పరిశీలన 57
– పేరెల్లి శ్రీను

8. స్త్రీ జనోద్ధరణం – కందుకూరిపాత్ర 66
– ఆచార్య ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి

9. మల్లెమొగ్గల గొడుగు (మాదిగ కతలు) – పరిశీలన 71
– డా॥ తోట వెంకటస్వామి

10. ముస్లిం మహిళల వెతలకు అద్దంపట్టిన "నఖాబ్" 79
– డాక్టర్ ఎం. హరికృష్ణ

11. నల్లగొండ జిల్లా నవలా సాహిత్యం(2000–2019) – భాషా వైవిధ్యం 86
– మహేష్ ఎడ్ల

12. భారతీయ గిరిజన వీరవనితల పరిచయం 93
– ముదావత్ లోకేందర్

13. "గురువాయాణం" బై డా॥ గురువారెడ్డి : ది ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ వెల్‌నోన్ ఇండియన్– వ్యక్తిగతంలోంచి సార్వత్రికం వరకు.. 103
– ఆచార్య సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్

14. దక్షిణ భారతీయ భాషలలో అంతర్ముఖ నవల – అంతరంగ అన్వేషణ 108
– డాక్టర్ వేలం పళని & ఆచార్య డి. ఉదయ కుమారి

రచయితల చిరునామాలు 118

శైలీ పత్రం 119

"ద్రావిడి" పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలే బాధ్యులు. విశ్వవిద్యాలయం బాధ్యత వహించదు.

1

తెలుగు భాషా, సాహిత్య పరిరక్షణ కోసం ద్రావిడ విశ్వవిద్యాలయం కృషి

– ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

ద్రావిడ విశ్వవిద్యాలయం 1997 వసంవత్సరంలో 17వ చట్టం ప్రకారం చిత్తూరు జిల్లాలోని కుప్పంలో ఏర్పడింది. ప్రధాన ద్రావిడ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, తుళు భాషా సాహిత్య, సంస్కృతీ వికాసాల కోసమై విశ్వవిద్యాలయం కృషి చేస్తుంది. అనువాదాల ద్వారా ద్రావిడ భాషీయుల మధ్య భావ సమైక్యతకు ప్రధాన సాధనంగా ద్రావిడ విశ్వవిద్యాలయం పని చేస్తోంది. అందులోనూ ప్రధానంగా తెలుగు భాషా, సాహిత్య వికాసాలకు ప్రత్యేకంగా కృషి చేస్తోంది. అందుకోసంగా 2005 న సం॥లో ప్రచురణల విభాగాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రారంభించింది.

'ప్రసారాంగ' పేరుతో పిలువబడే ప్రచురణల విభాగం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, తుళు భాష లతో పాటు ఆంగ్లం లోనూ పుస్తకాలను ప్రచురిస్తోంది. అంతేగాక అనువాదాలనూ ప్రోత్సహిస్తూ, అనువాద గ్రంథాలను ప్రచురిస్తోంది. ఈ విధంగా ఇప్పటికి సుమారు 300 గ్రంథాలను ప్రచురించింది. తెలుగు భాషా, సాహిత్య వికాసాలకై 'ద్రావిడి' పేరుతో ఒక పరిశోధనా పత్రికను తీసుకువస్తోంది. ఇందులో తెలుగు భాష, సాహిత్యాలకు సంబంధించిన పరిశోధనాత్మక వ్యాసాలను ముద్రించడం జరుగుతోంది.

తెలుగు భాషా, సాహిత్య వికాసాలకై ప్రచురణల విభాగం అనేక నిఘంటువులను, సాహిత్య గ్రంథాలను, జానపద, గిరిజన సాహిత్య గ్రంథాలను, భాషా శాస్త్ర గ్రంథాలను, వ్యాకరణ గ్రంథాలను, అనేక అనువాదాలను ప్రచురించింది.

1. నిఘంటువులు:

ఏ భాషను గురించి అయినా తెలుసుకోవాలంటే ఆ భాషలోని పదజాలం తెలిసుండాలి. దీనికోసం ద్రావిడ విశ్వవిద్యాలయం నడుం బిగించింది. తెలుగు భాషపై పట్టుకోసం అనేక రకాలైన నిఘంటువుల్ని ముద్రించింది.

వజ్రకోశం:

తెలుగు భాషలోని పదాలకు తెలుగులోనే అర్థాలు తెలిపే నిఘంటువు ఇది. తెలుగునాట ప్రతి విద్యార్థికి ఉపయోగపడే విధంగా ఈ నిఘంటువుని రూపొందించింది.

తెలుగు దేశ్యవ్యుత్పత్తి నిఘంటువు:

ఆచార్య కోరాడ మహాదేవశాస్త్రి సంపాదకత్వంలో 'తెలుగు దేశ్యవ్యుత్పత్తి నిఘంటువు'ని రూపొందించి ప్రచురించారు. భాషలో పద వ్యుత్పత్తి అనేది ప్రధానమైన అంశం. దీన్ని తెలుసుకుంటే శబ్దాన్ని చక్కగా ప్రయోగించవచ్చు. ఒక అర్థానికున్న అనేక శబ్దాలు ఒక్కో సందర్భంలో ఔచిత్యస్ఫోరకంగా సరిపడేట్టు ఉంటుంది. ఆ దృష్టితో శబ్దవ్యుత్పత్తి జ్ఞానం భాషను ప్రయోగించే వారికి చాలా అవసరం. ఈ నిఘంటువులో కేవలం దేశ్యమైన తెలుగు శబ్దాల వ్యుత్పత్తిని వివరించడం జరిగింది. ఒక ధాతువు నుండి ఏర్పడిన పదజాలానికి సంబంధించిన సముదాయాన్ని ఒక చోట కూర్చి ఒక అంశంగా పరిగణించడం ఈ నిఘంటువు ముఖ్య లక్షణం.

బహుళ భాషా నిఘంటువులు:

వివిధ దక్షిణ భాషా పదాల అర్థాలు తెలుసుకునే నిమిత్తమై తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, తుళు, ఆంగ్ల భాషల్లో ఒక పదాన్ని ఏవిధంగా పలుకుతారో తెలియజేసే బహుళ భాషా నిఘంటువుల్ని మొత్తం ఆరు భాషల్లోనూ ప్రచురణల విభాగం ప్రచురించింది.

జ్యోతిష్యపదకోశం:

మన సంస్కృతిలో ఒక భాగమైన జ్యోతిష్య శాస్త్రానికి సంబంధించిన పదాలకు అర్థాలను తెలిపే పదకోశాన్ని విశ్వవిద్యాలయం వెలువరించింది. ఇది అనువాద పదకోశం. కన్నడ మూలం నుండి తెలుగులోకి డా.టి.నారాయణ అనువదించారు.

భాషాశాస్త్ర నిఘంటువు:

భాషాశాస్త్ర రంగానికి సంబంధించి పారిభాషిక కోశాలు వచ్చాయి గానీ, తెలుగులో భాషాశాస్త్ర నిఘంటువు లేని లోటు ఈ నిఘంటువు తీరుస్తుంది. డా.ఎల్.కె.మల్లేశ్వరరావు గారి శ్రమ ఫలితమే ఈ భాషాశాస్త్ర నిఘంటువు. భాషాశాస్త్ర జిజ్ఞాసువులకు ఈ నిఘంటువు ఉపయోగపడుతుంది.

మానవీయ శాస్త్రాల పరిభాష:

మానవీయ శాస్త్రాలు వర్తమానంలో ప్రముఖంగా వాడబడుతున్న పదాలకు తెలుగు పదాల్ని రూపొందించే లక్ష్యంతో ఈ నిఘంటువు రూపొందించబడింది. ఒక్కో సందర్భంలో ప్రాంతీయ భాషా పదాలకంటే ఇంగ్లీషు పదాలే సులువుగా అనిపిస్తున్న తరుణంలో వేసిన తొలి అడుగు మాత్రమే ఇది. ఇటువంటి ప్రయత్నాలు ఇంకా జరగాలి. తద్వారా తెలుగు భాష అస్తిత్వాన్ని, మనుగడను నిలుపుకోవడమే గాక, తెలుగు భాషా వికాసానికి కూడా దోహదపడుతుంది.

2.సాహిత్య గ్రంథాలు:

ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగులో ప్రచురించిన గ్రంథాలు సుమారు 106 గ్రంథాలున్నాయి. కొన్ని ముఖ్యమైన గ్రంథాలు మాత్రమే ఇందులో తెలియజేస్తున్నాను.

వేమన కవితాతత్త్వం:

సంఘసంస్కర్తగా, తత్త్వవేత్తగా, మహాకవిగా, యోగిగా అనేక విధాలుగా సంఘాన్ని ప్రభావితం చేసిన వేమన కవితాతత్త్వాన్ని వివరించే ప్రముఖుల వ్యాసాలతో కూడిన గ్రంథాన్ని ప్రచురించింది.

నీతిచంద్రిక:

పరవస్తు చిన్నయసూరి విరచితమైన నీతిచంద్రికను ప్రచురించింది.

గీతగోవిందం:

తెలుగు సాహిత్య రంగంలో అద్వితీయ స్థానాన్ని సంపాదించిన ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి గారు రచించిన ఈ గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ప్రచురించింది. భారతీయ సాహిత్యంలో ఒక విలక్షణ నాదమాధురిని ఆవిష్కరించిన గీతగోవిందానికి సంస్కృతంలో కూర్చిన అభినయ లక్షణ స్వరూపాన్ని వివరిస్తూ తంజావూరు సరస్వతీ మహల్‌లో లభించిన రాతప్రతుల పాఠాన్ని సరిచూసి తెలుగులోకి అనువదించి, నృత్య లక్షణ సహితమైన ఈ గ్రంథాన్ని వెలువరించింది. గీతగోవిందంలోని పదహారు అష్టపదులు, 46 శ్లోకాల్లోని ప్రతి పదానికి శాస్త్రీయ వివరణలు ఈ గ్రంథంలో ఇవ్వడం జరిగింది.

కరదీపిక:

తెలుగుభాషని చక్కగా నేర్చుకుని, తగిన నైపుణ్యంతో భాషని వాడే సామర్థ్యం సంపాదించుకోవడం విద్యార్థులకు ముఖ్యం. ఈ నైపుణ్యం రావాలంటే భాష స్వరూపాన్ని తెలుసుకోవాలి. సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. ఈ దృష్టితో భాష స్వరూప పరిశీలన, సాహిత్య రూపాల విశ్లేషణ, వ్యాకరణ శాస్త్రాల స్థూల పరిచయం ఉండాలనే సంకల్పంతో భాషాచరిత్ర, భాషాశాస్త్రం, వ్యాకరణం, ఛందస్సు, అలంకారాలు, సాహిత్య చరిత్ర, విమర్శ వంటి అధ్యాయాలను పండితులతో రాయించి ప్రచురించిన 'కరదీపిక' గ్రంథం చాలా విలువైనది. ఈ గ్రంథానికి ప్రధాన సంపాదకులుగా ఆచార్య కడప రమణయ్య, సమన్వయ సంపాదకులుగా ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్, సంపాదకులుగా ఆచార్య ఆర్వీయస్ సుందరం, ఆచార్య జి.ఎస్.మోహన్, ఆచార్య ఇ.విశ్వనాథరెడ్డిలు వ్యవహరించారు.

తెలుగు స్వయంబోధిని:

ఇతర భాషీయులు తెలుగును స్వయంగా నేర్చుకునే ఉద్దేశ్యంతో ఆచార్య జి.ఎస్.మోహన్ గారి 'తెలుగు స్వయంబోధని' పుస్తకాన్ని ప్రసారాంగ ముద్రించింది. పాఠ్యాంశాల రూపంలో

ISSN: 2319-3905

వ్యాకరణాంశాల సహాయంతో తెలుగును సులభంగా నేర్చుకునే విధంగా ఈ గ్రంథం రూపొందించబడింది.

శ్రీమద్రామాయణ కల్పవృక్షము – శాంతరసము:

ప్రముఖ సాహితీవేత్త ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు రచించిన ఈ గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ముద్రించింది. ధ్వని, రస సిద్ధాంతాలకు పరాకాష్ఠగా శాంతరస సిద్ధాంతం వచ్చింది. శాంతరస చర్చను వివిధ కోణాల్లో విమర్శనాత్మకంగా వివరించింది ఈ గ్రంథం. అరవిందుడు ఆంగ్లంలో రాసిన 'సావిత్రి' అనే ఇతిహాసంతో పోలికలు చూపుతూ, లోతుగా అధ్యయనం చేసి రాసిన విమర్శనాగ్రంథం ఇది.

ఇవేగాక డా.కడియాల రామమోహన్‌రాయ్ 'మానసోల్లాసం', సంజీవరావు 'ప్రయోగవాద పతాభి', ఆచార్య తంగిరాల వారి 'వీరగల్లు', 'ద్రావిడ కవిత', 'ద్రావిడ యోగులు', 'ద్రావిడ శాస్త్రవేత్తలు', 'అక్షరంలో అంతరిక్షం (సైన్సు కవితలు)', 'విశ్వనాథ సత్యనారాయణ', రాచపాళెం వారి 'తులనాత్మక దాక్షిణాత్య సాహిత్య వ్యాసాలు' 'రాయప్రోలు సుబ్బారావు', 'గుంటూరు శేషేంద్రశర్మ', 'గుర్రం జాషువా' వంటి అనేక అమూల్యమైన గ్రంథాలను విశ్వవిద్యాలయం ప్రచురించి సాహిత్య వికాసానికి తోడ్పడింది.

3. జానపద, గిరిజన సాహిత్య గ్రంథాలు

జానపద, గిరిజన విజ్ఞాన అధ్యాయానికి ఒక ప్రత్యేకమైన శాఖతో పాటు, ఇందులో పరిశోధనలని ప్రోత్సహిస్తూ అనేక గ్రంథాలను ప్రచురణల శాఖ ప్రచురించింది.

దక్షిణ భారతీయ జానపద విజ్ఞానకోశం:

భారతీయ జానపద విజ్ఞానం వైవిధ్యభరితం. ముఖ్యంగా దక్షిణ భారతీయ జానపద విజ్ఞానం ఉత్తర భారతదేశానికన్నా విభిన్నంగా కనిపిస్తుంది. ఉన్నంత వరకూ జానపదుల సాంస్కృతిక అభివ్యక్తి స్వరూపాన్ని అర్థం చేసుకుని, దానిని ఒక చోట చేర్చడం కర్తవ్యంగా భావించి ఈ ప్రణాళికను చేపట్టడం జరిగింది. ఈ కోశంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో రచించిన వ్యాసాలను తెలుగులోకి అనువదించడం జరిగింది. కన్నడంలోని మూల గ్రంథాన్ని తెలుగులోకి తీసుకువచ్చే బృహత్కార్యాన్ని చేపట్టి ముద్రించడం జరిగింది. ఈ కోశానికి ప్రధాన సంపాదకులుగా ఆచార్య కపడ రమణయ్య, కార్యనిర్వాహక సంపాదకులుగా ఆచార్య ఆర్వీయస్ సుందరం, సంపాదకులుగా ఆచార్య పి.సుబ్బాచారి వ్యవహరించడం జరిగింది.

తెలుగు గిరిజన మాలిక:

తెలుగు గిరిజన మాలికలో భాగంగా గిరిజన సంస్కృతిని చాటిచెప్పే విధంగా 'చెంచు', 'లంబాడి', అనే గ్రంథాలను ముద్రించడం జరిగింది. ఇందులో ఆయా ఆదివాసి తెగల సమగ్ర సమాచారం, సంస్కృతిని విశ్లేషించడం జరిగింది.

జానపద విజ్ఞానాధ్యయనం:

తెలుగులో వున్న ప్రముఖ జానపద సాహిత్యవేత్తల్లో ఒకరైన ఆచార్య జి.ఎస్.మోహన్ గారి 'జానపద విజ్ఞానాధ్యయనం' గ్రంథ ముద్రణ చేయడం జరిగింది. విద్యార్థులకు, పరిశోధకులకు ఆకర గ్రంథమైన ఈ పుస్తకం జానపద విజ్ఞానానికి సంబంధించిన అనేక అంశాలను చర్చించింది.

ఇవేకాక ఇంకా డా.జి.శైలమ్మ రచించిన 'తెలుగు కథా సాహిత్యం – గిరిజన జీవితం', డా.గోపాల్ రచించిన 'తెలుగు భాషాధ్యయనంలో లంబాడీ విద్యార్థుల సమస్యలు – పరిష్కారాలు', 'ఆధునిక సమాజంలో గిరిజన భాష – సంస్కృతులు', 'రాజంపేట తాలూకా జానపద గేయాలు – ఆచార వ్యవహారాలు', 'చిరుతల రామాయణం – ఒక అధ్యయనం' వంటి పుస్తకాలెన్నో జానపద, గిరిజన భాషా సాహిత్య, సంస్కృతులను తెలుగు సాహిత్య లోకానికి అందిస్తున్నాయి.

4. భాషాశాస్త్ర గ్రంథాలు:

భాషాశాస్త్రంపై పరిశోధనలు చేసిన ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి 'ఏ పేపర్స్ ఆన్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్', ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం 'యాస్పెక్ట్స్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్', వంటి రచనలు ముద్రించింది.

5. అనువాదాలు:

తిరుక్కురల్ ఆఫ్ తిరువళ్లువర్ – జి.డి.జగన్నాథం (తమిళ్ – తెలుగు)

హైదరాబాద్ కర్ణాటకలో స్వాతంత్ర్యోద్యమం – డా.అరవింద్ కుమార్ (కన్నడ–తెలుగు)

మూడు ముచ్చట్లు – డా.టి.నారాయణ (కన్నడ – తెలుగు)

విశ్వగురు – కె.సునంద, సత్యబాయి శివదాస్ (మలయాళం – తెలుగు)

భాష – సంస్కృతి – సమాజ దర్శనం – డా.కె.శారద (కన్నడ – తెలుగు)

ప్రతాప్ మొదలియార్ చరిత్ర – డా.ఎస్.జయప్రకాష్ (తమిళం – తెలుగు)

భారతదేశంలో ఆంగ్లేయులు – డా.కె.లక్ష్మణమూర్తి (ఇంగ్లీషు – తెలుగు)

అనువాదకళ – డా.జె.సదానందం (కన్నడ – తెలుగు)

భారతీయ గ్రంథ పరిష్కరణ ప్రవేశిక – డా.బి.వెంకటేశ్వర్లు (ఇంగ్లీషు – తెలుగు)

ఇవేకాక తెలుగు నుండి ఆంగ్లం, తమిళ, కన్నడ, తుళు భాషల్లోకి కూడా అనేక అనువాదాలు చేసి ముద్రించడం జరిగింది.

6.వ్యాకరణ గ్రంథాలు:

తెలుగు భాషా, సాహిత్య వికాసాలకు పట్టుగొమ్మలైన వ్యాకరణాంశాలకు సంబంధించిన గ్రంథాలను కూడా ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురించడం జరిగింది. వంతరాం రామకృష్ణారావు

గారి 'అప్పకవీయ గురుబాల దీపిక' ను అప్పకవీయంలోని యతి, ప్రాస ప్రకరణంను శాస్త్రీయ దృష్టితో పరిశీలించిన గ్రంథం.

అదేవిధంగా 'బాల వ్యాకరణం – ఇతర ద్రావిడ భాషా వ్యాకరణాలు' అనే పేరుతో ఒక తులనాత్మక గ్రంథంగా ప్రచురణల శాఖ ముద్రించింది.

7. గృహసరస్వతి:

'గృహసరస్వతి' గ్రంథ మాలికగా ద్రావిడ విశ్వవిద్యాలయం చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా అనేక పుస్తకాలు ముద్రించింది. తెలుగువారి సంప్రదాయ జ్ఞాన సంపదను తెలుగు వారికి అందించే ఉద్దేశంతో 'ఆయుర్వేదం', 'హోమియోపతి', 'యోగదీపిక', 'పిల్లల ఆరోగ్యం మనస్తతత్వం', 'గృహాలంకరణ', 'గృహవైద్యం' వంటి పుస్తకాలను ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురించింది. ఈ గ్రంథాలు తెలుగు నాట ప్రతి ఇంటికీ, ప్రతి గృహిణికీ అవసరమైనవే.

ఈ విధంగా పుస్తక ప్రచురణ ద్వారా భాషా, సంస్కృతీ, సాహిత్యాలను తెలుగు సమాజానికి అందివ్వడమే ధ్యేయంగా ద్రావిడ విశ్వవిద్యాలయం పనిచేస్తోంది. తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు తన వంతు కర్తవ్యంగా సేవలను అందిస్తోంది.

ఆధార గ్రంథాలు:

ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురించిన తెలుగు గ్రంథాలు:

2

పల్లిపట్టు నాగరాజు గారి 'యాలై పూడ్సింది' : దళిత ఈస్తటిక్స్

–ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో అస్తిత్వ చైతన్యం, శ్రమ సంస్కృతి, సామాజిక వాస్తవికతలను మేళవించి వచ్చిన శక్తిమంతమైన గొంతుక పల్లిపట్టు నాగరాజు గారి **'యాలైపూడ్సింది'.** 2022లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకున్న ఈ సంపుటి, కేవలం అట్టడుగు వర్గాల వేదనను, వారి వృత్తి నైపుణ్యంలోని సౌందర్యాన్ని, ఆత్మగౌరవ పోరాటాన్ని అక్షరబద్ధం చేసింది. రాయలసీమ మాండలికపు గాఢతతో, మట్టి మనుషుల జీవన స్పందనలను ప్రతిబింబిస్తూ వెలువడిన ఈ కవిత్వం, సామాజిక వివక్షను లోతుగా చర్చించడమే కాకుండా శ్రమను ఒక పవిత్రమైన యోగంగా, కళగా ఆవిష్కరించింది. కేవలం ప్రాంతీయ సరిహద్దులకే పరిమితం కాకుండా, విశ్వజనీనమైన మానవీయ విలువలను, అణచివేతపై ధిక్కార స్వరాన్ని వినిపించిన ఈ కావ్యం ఆధునిక కవితా రంగంలో ఒక నూతన ఒరవడిని సృష్టించింది. ఈ నేపథ్యంలో, *'యాలైపూడ్సింది'* సంపుటిలోని సాహిత్య ప్రయోగాలు, సామాజిక దృక్పథం మరియు దాని చారిత్రక ప్రాధాన్యతను విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. పల్లిపట్టు నాగరాజు గారి కవితా సంపుటి ***'యాలై పూడ్సింది'.*** దీన్ని కవి సంగమం బుక్స్, హైదరాబాదు వారు 2020లో ప్రచురించారు. దీనికి 2022లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం వచ్చింది. ఈ కవితా సంపుటిని కవి, తన తల్లిదండ్రులు శ్రీమతి భూలక్ష్మి, రాఘవయ్య గార్లకు అంకితమిచ్చారు. ***యాలై పూడ్సింది*** కవితా సంపుటిలో గల సాహిత్య, సామాజికాంశాలను ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేస్తున్నాను.

ఈ కవిత్వం ఎందుకు చదవాలి?

మన చుట్టూ ఉండే మనుషులతో మన స్పందనలు వినాలంటే ఈ కవిత్వం చదవాలి. మన చుట్టూ ఉండే కులవృత్తిలో,చేతి వృత్తుల్లో చేస్తున్న వాళ్ళ నైపుణ్యం తెలుసుకోవాలంటే ఈ

ISSN: 2319-3905

కవిత్వం చదవాలి. బహుజనులలోని శ్రమ తత్వాన్ని, ఆకలి బాధల్ని, గుప్పెడుమెతుకుల కోసం ప్రాణాలే పోగొట్టుకున్న ఆకలి హత్యల్ని తెలుసుకోవాలంటే ఈ కవిత్వం చదవాలి. తండ్రి త్యాగం, అతని సకలవృత్తుల్లో ప్రదర్శించే నైపుణ్యం, అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా, నలుపు, తెలుపుల తేడా తెలియని అమ్మ ప్రేమ ముద్దల రుచులు తెలియాలంటే ఈ కవిత్వం చదవాలి. అమ్మలాంటి ఊరునీ, అన్నీ తానై రక్షణనిచ్చే ఇల్లనుకొనే గుడిసె నైనా వదిలి పోవాలంటే ఆ ప్రాణాలు ఎలా విలవిలాడతాయో తెలియాలంటే ఈ కవిత్వం చదవాలి. నమ్ముకున్న మట్టినీ, ఆ మట్టి వాసనను సర్వ పంచేంద్రియాల్లో నింపుకున్న మట్టి మనిషి ప్రాణ స్పందన తెలియాలంటే ఈ కవిత్వం చదవాలి. పాదాలు కందిపోకుండా మల్లిపువ్వుల్లాంటి మృదుత్వాన్ని పెట్టిచెప్పులు కుట్టే మనిషిని మహర్షిగా, జుత్తు కత్తిరించి నాగరికతను నేర్పే మనిషిని మహనీయునిగా... ఒక్కొక్క వృత్తిలో ఒక్కొక్క పవిత్రతను ఆపాదించిన మానవత్వాన్ని చూడాలంటే ఈ కవిత్వం చదవాలి. దళిత ఈస్తెటిక్స్ కి నిలువెత్తు నిదర్శనమెలా ఉంటుందో తెలియాలంటే కవిత్వం చదవాలి. అటువంటి మనస్తత్వాన్ని ఇతరుల్లో చూసిన మహోన్నతమైన సంస్కారం తెలియాలంటే ఈ కవితలు చదవాలి. అనేక అనుభవాలు ఒకే అనుభవంగా ద్రవించికూర్చి అక్షరాల్లోని అందం తెలియాలంటే ఈ కవిత్వం చదవాలి.

ఎందుకంటే...

"ఏ సంధి కాలంలో నైనా/మార్క్స్ కవితలో మొదటి వాక్యమో/అమ్మ పుస్తకంలో ఆఖరి మాటో/అంబేద్కర్ మహాశయుని ఆలోచనా భాష్యమో ఆప్తవాక్యాలు చదువుకునే తీరండి" అంటూ బహుజనగొంతుగా వస్తున్నాడు. ఆ బహుజన గొంతుకేమిటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

పల్లిపట్టు నాగరాజు జీవిత విశేషాలు:

పల్లిపట్టు నాగరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా సత్యవేదు మండలం, వెంకటాపురం గ్రామ నివాసి. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., తెలుగు చదివారు. ఈయన ఓ పాఠశాలలో తెలుగు పండితుడుగా పని చేస్తున్నారు. పార్ట్ టైమ్ గా డాక్టరేట్ కూడా చేస్తున్నారు. తెలుగులో శక్తివంతమైన కవిత్వాన్ని రాస్తున్నవారిలో 37 యేళ్ళ నాగరాజుని ఒకరుగా చెప్పుకోవాలి. ఇంత చిన్న వయసులోనే ఈయనను అనేక పురస్కారాలు వరించాయి. యాలై పూడ్సింది కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో, పాటు ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, శ్రీమతి విమలాశాంతి స్మారక సాహిత్య యువపురస్కారం 2021, శ్రీమతి పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం2021, స్వర్ణ వచన కవితా పురస్కారం2021, శ్రీకొత్తపల్లి నరేంద్రబాబు స్మారక సాహిత్య పురస్కారం 2021, సర్రాజు వేణుగోపాల్రావు స్మారక పురస్కారం, మల్లిశెట్టి సీతారాం స్మారక సాహిత్య పురస్కారం 2021, రొట్టమాకు రేవు కవిత్వ అవార్డు 2022 వంటివి పొందారు. డా.బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డ్ 2023. కలహంస

పురస్కారం, డాక్టర్ రాధేయ కవితా పురస్కారం, వింజమూరి–కవిసంధ్య కవితల పోటీ పురస్కారం, తెలుగు సాహిత్య సంస్కృతి సమితి పురస్కారం, తెలుగు రక్షణవేదిక భాషా సేవక పురస్కారం అందుకున్నారు. కేంద్రసాహిత్య అకాడమీ వారి ఆహ్వానం మేరకు ఆగస్టు 2023 న భోపాల్ లో జరిగిన 'ఉన్మేశ్' ఇంటర్నేషనల్ లిటరరీ ఫెస్టివల్ లో కవితా పఠనం చేశారు. 'దర్శనం' పేరుతో ఒక చెప్పులు కుట్టే చర్మకారుణ్ణి ఎలా వర్ణించాడో చూడండి.

"అచ్చం బోధివృక్షం కింద బుద్ధదేవుడిలా వున్నా/మా తాతని దర్శించుకొనొచ్చాను./ గుడిలోదేవుడి ముందు/అందరూ జోళ్లు వదిలి నిల్చి/దండంబెట్టినట్లూ/వృత్తికాళ్లతో ఆయన ముందర నిలబడ్డవాళ్లని చూస్తూ/రవ్వంత గర్వంతో/నేనూ మోకాళ్లపై వొంగి కూకోని/ఆ నేర్పరితో నాలుగు మాటలు మాట్లాడినాను./...ఎవరో ఒక మునిపుంగవుడు/తాళ పత్రాలకట్టల్ని ఎదుటుంచుకొని/ లోక కల్యాణాన్ని రాస్తున్నట్లూ....పాతచెప్పుల్ని ముందరేసుకుని/మట్టిపాదాల మద్దెన చెప్పుని వూని/ ఆరె మొనలుపైన అలవోకగా/వేళ్లని చూపుల్నికలిపి మైనం పూసిన దారంలా కుట్టేస్తావుంటే/
ముక్కోటి దేవతలూ తాత ముందే మోకరిల్లినంత వేడుగ్గా కుశాలపడ్డాను!" ఈ కవితలో శ్రమజీవి వృత్తిని దైవత్వంతోనూ, తాత్వికతతోనూ కవి అద్భుతంగా సమన్వయం చేశారు. "బోధివృక్షం కింద బుద్ధదేవుడిలా" తన పనిలో నిమగ్నమైన తాతను దర్శించుకోవడం ద్వారా, శ్రమ అనేది ఒక నిశ్చలమైన తపస్సు అని కవి చాటిచెప్పారు. లోకరీతిలో గుడి బయట చెప్పులు విడిచి దేవుడిని దర్శించుకున్నట్లే, ఇక్కడ తాత ముందు "వృత్తికాళ్లతో ఆయన ముందర నిలబడ్డవాళ్లని" చూడటం ద్వారా వృత్తి స్థలాన్నే ఒక పవిత్రాలయంగా మార్చారు. సామాన్యుడి చిరిగిన చెప్పులను కుట్టే ఆ చేతులను "లోక కల్యాణాన్ని రాస్తున్న మునిపుంగవుడి" తాళపత్ర రచనతో పోల్చడం శ్రమ పట్ల కవికి ఉన్న అత్యున్నత గౌరవానికి నిదర్శనం. "మైనం పూసిన దారంలా" అలవోకగా సాగే ఆ వృత్తి నైపుణ్యం ముందు ముక్కోటి దేవతలే మోకరిల్లినంత సంబరపడటంలో, చెమట చిందించే ప్రతి శ్రమజీవిలోనూ ఒక సృజనశీలి, ఒక దైవం దాగి ఉన్నాడనే గొప్ప సత్యాన్ని ఈ కవిత ఆవిష్కరించింది. చెప్పులు కుట్టే వాని దగ్గర నిజానికి వచ్చిన వాళ్లంతా వంగి నిలబడతారు. ఆ దృశ్యాన్ని ఒక దేవుడు ముందు మోకరిల్లిన వ్యక్తులుగా ఉల్లేఖించడం సామాన్యమైన వర్ణన కాదు. జాషువా అప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్ అని మాత్రమే అన్నారు. కానీ, చెప్పులు కుట్టే వ్యక్తిని దేవునిగాను, ఆయన ముందు మోకరిల్లిన వ్యక్తులను భక్తులుగాను వర్ణించటం నభూతో నభవిష్యతి.

జీవితంతో అంతర్మిళితమైన కవిత్వ నేపథ్యం:

ఈ స్థాయికి రావడం వెనుక పల్లిపట్టి నాగరాజు జీవిత నేపథ్యం తెలుసుకుంటే మనందరికీ కన్నీళ్లు రప్పిస్తుంది. "ఇయ్యాల్దాకా..." పేరుతో కవి రాసుకున్న తొమ్మిది పేజీల తన జీవిత నేపథ్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిందే. ఒక ఆత్మ కథకు కావలసినంత వస్తువు దానిలో

ఉంది. తాను పుట్టి పెరిగిన ప్రాంతం, తల్లిదండ్రులు, కుటుంబం ఆర్థిక పరిస్థితులు, వాటి నుండి అతను ఎదుర్కొన్న శారీరక , మానసిక, ఆర్థిక సంఘర్షణలను తట్టుకొని, ఒక ఉపాధ్యాయుడిగా, ఒక కవిగా ఎదిగిన జీవిని పరిణామాన్ని ఎంతో సంక్షిప్తంగా, సమగ్రంగా చెప్పిన తీరు ప్రతి ఒక్కరిని చదివిస్తుంది కన్నీళ్లు పెట్టిస్తుంది. దేశంలో పేదరికాన్ని ఎదుర్కొంటున్న వాళ్ళందరినీ తలపింపజేస్తుంది. నాగరాజు తండ్రి వ్యవసాయం చేయడంతో పాటు డప్పు వాయిధ్య కళాకారుడుగా. వీధినాటకాలు ఆడే కళాకారుడు కూడా.

"ఇప్పటిదాకా నడవడానికి కేవలం/నా పాదాలు మాత్రమే నన్ను నడపలేదు./అనేక పాదాలు నడచిన దారులు/నన్ను నడిపించాయి./నడిపిస్తున్నాయి.

ఏ శ్రామిక కుటుంబం జీవన సౌందర్యం, ఏ బహుజన కుటుంబ కళా తత్వం, ఏ దళితకుటుంబ బతుకు సంఘర్షణ, ఏ పీడన, ఏ వేదన, ఏ లేమితనం ఏ కుంగుబాటు, ఏ ఆకలిపూటలు, ఏ అల్ప సంతోషం, ఏ అధిక దుఃఖం, ఏ అవమానాలకోపం వెనక వుండి నడిపిస్తున్నాయో, మాట్లాడిస్తున్నాయో అవన్నీ నన్ను సాహిత్యంలోకి, కవిత్వంలోకి మళ్లించాయనిపిస్తుంది" అంటూ తన జీవిత నేపథ్యాన్ని ప్రారంభించారు కవి.తను కవిత్వం రాయడానికి గల నేపథ్యన్నంతా చెప్పుకున్నాడు కవి. తన జీవితమూ, తన కుటుంబం ఆర్థిక, సామాజిక పరిస్థితులు, పేదరికం, వీటిపై కొనసాగుతున్న రాజకీయాలు.. ఇవన్నీ తనను ఆలోచింపజేసాయని, ఆ ఆలోచనలకు కవితా రూపాన్ని ఇవ్వడానికి వివిధ సాహిత్య సమావేశాలు ఎంతగానో తోడ్పడ్డాయని పేర్కొన్నారు.

'యాలై పూడ్సింది' శీర్షిక ఏమి చెప్తుంది?:

'యాలై పూడ్సింది' అనే టైటిల్ రాయలసీమ ప్రాంత పలుకు బడిని ప్రతిబింబించేలా ఉంది. దీనిలో 52 వచన కవితలు ఉన్నాయి. 'టైటిల్ లోనే సీమతనం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. విషయ రీత్యా కూడా సీమ సమస్యను చక్కగా పట్టుకున్నాడు కవి' అని ఈ పుస్తకానికి 'మూలాల జల్లుల్లో తడిసిన కవిత్వం' పేరు ఒక ముందుమాట రాసిన ప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు జి. లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. కానీ, దాని వివరణ ఇవ్వలేదు. బహుశా పాఠకులకే వదిలేసినట్లున్నారు. 'ఏ నేటివ్ పోయిట్' పేరుతో ముందుమాట రాసిన ప్రముఖకవి శివారెడ్డిగారు కూడా ఈ టైటిల్ ని వివరించే ప్రయత్నం చేయలేదు. కానీ, తనదైన ప్రత్యేక ముద్రతో కవి పయనిస్తున్నాడంటూ తన కవిత్వ సాధనలో *"అతనిదే అయినా ఒక కొత్త వ్యక్తీకరణను సాధించాడు. యింత మంది మాట్లాడుతున్నారు. తాను మాట్లాడేది ప్రత్యేకంగా వుంటే తప్ప వినరు అనేది అర్థమయింది. అందుకే రోజురోజుకీ అతని పద్యనిర్మాణం పదును తేలింది. తాననుకున్నది, వీలయ్యింది, అనుభవించింది సూటిగా, హాయిగా, సునాయసంగా అందించటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఒక అద్భుతమయిన నెరేటివ్ పద్ధతి సాధించాడు- దానికతని నేపథ్యం, జీవితం, భాష అందివచ్చాయి. తనకి ఒక ప్రత్యేమయిన చూపు వుంది"* (పుట: 9) అని వ్యాఖ్యానించారు. ఈ కవితా సంపుటిలో నాగరాజు రాసిన " **యాలై పూడ్సింది"** (పుట:86) పేరుతో ఒక కవిత ఉంది. ఇదంతా రాయలసీమలోని చిత్తూరు ప్రాంతానికి చెందిన మాండలిక భాషలో కొనసాగింది.

"ఇంగులీసోడు యలబారి ఏండ్లు గడస్తావున్నా.../దుమ్మెత్తి పోస్తారే గానీ/దేశం లోపల దొరల సంగతేందీ...?/దేశమొదిలి పోతున్న దొంగల కతేందీ..?/సెలవిస్తారా సామీ!/ దేశాన్ని భారతమ్మని పిల్సుకుంటున్నామే.../ఈ దేశాన ఆడకూతుర్ల మానపేనాలు/చితికి బూడిదై పోతున్న అగత్యమేందీ...?" *(పుట: 86)*

మన దేశాన్ని కొన్ని వందల సంవత్సరాలు విదేశీయులు, ముఖ్యంగా ఆంగ్లేయులు పరిపాలించడం, ఆ పాలనలో ప్రజలెన్నో ఇక్కట్లకు గురికావడం జరిగిన మాట చారిత్రక వాస్తవమే. కానీ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో జరుగుతున్న అఘాయిత్యాలు, అన్యాయాలకు కారణమెవ్వరని ప్రశ్నిస్తూనే, ఈ దేశ సంపదను కొల్లగొట్టి, విదేశాలకు వెళ్ళిపోతున్న వాళ్ళ గురించి మాట్లాడుకోవాలి కదా అనడం ద్వారా సమకాలీన భారతదేశంలో కొంతమంది వేలాది కోట్లు రుణాలు తీసుకొని, వాటిని ఎగ్గొట్టిన సంఘటనలను చర్చించమంటున్నాడు కవి. అంతే కాదు మనదేశాన్ని భరతమాత గా పిలుచుకొంటూ స్త్రీకి ఎంతో గౌరవాన్ని ఇస్తున్నామని చెప్పుకుంటున్నాం. కానీ, దేశంలో నిత్యం స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యాచారాలకు బలైపోతున్నవాళ్ళెంతో మంది గురించి నిత్యం వార్తలు చదువుతూనే ఉన్నాం. వాళ్ళ గురించి మనమెంతవరకు స్పందిస్తున్నామని ప్రశ్నిస్తున్నాడు కవి. ఒకవైపు తియ్యగా మాట్లాడుతున్నట్లే ఉంటూ, వెన్నుపోట్లు పొడిచే వాళ్ళ గురించి చెప్తూ ...

''యాలై పూడుస్తావుంది/ఎంతకాలం ఈ ఏగులాట/కొన్నాలికిలో బెల్లంపూసుకొని/అంగిట్లో యిసం బెట్టుకొని/బలే మాట్లాడతా వుండారు కాదబ్బా../బలే బేలిపిస్తావుండారు గదయ్యా!" (పుట: 86) అన్నాడు కవి. కొండనాలికలో బెల్లంపూసుకొని అనే మాట చక్కని జాతీయం. పైకి తియ్యగా మాట్లాడుతూ లోన విషం చిమ్మేవాళ్ళ గురించి దీన్ని ఉపయోగిస్తుంటారు. రాజకీయవేత్తలు ప్రసంగాలు అత్యధికశాతం ఇలాగే ఉంటాయి. ఈ కవితాఖండికలో 'యాలై పూడుస్తావుంది" అనే ప్రయోగంతో మొదలైన కవిత మరలా చివరిలో ...

" వారగా బోండప్పా/యాలైపూడ్సింది/వాకిలి చిమ్మాల/కల్లాపు జల్లాల..' (పుట: 88) అని ముగిస్తాడు. ఇదే కవితలో అధికారంలోకి వచ్చేవరకు ఒక మాట, వచ్చిన తర్వాత వాళ్ళు చేసేదొకటి చేసే నాయకుల స్వభావాల్ని వివరిస్తూ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాళ్ళ ప్రయోజనాలే పరమావధిగా చేసే రూపొందే శాసనాల తీరు తెన్నులను. ఉటంకిస్తూ కవి ఇలా అంటున్నాడు.

"ఏనుగుపై/సత్తిపెమానాలు జేసీ పీఠాలెక్కినోళ్లు.../ఏనుగు తొండం తగలబడిపోతావుంటే చూస్తూ కూడా/వులుకూ పలుకులేని ఉప్పాట యాందీ....?/ఉప్పూఊరుగాయకు పనికిరాని

ఊకదంపుడేంది??/.....యాదాదికొకతూరి ఏదోవొకసాకున/జెండాలు ఎగరేయడం మామూలై పూడ్సింది గదా/జుబ్బాలుసాటున గబ్బుతనాలు అగుపిచ్చకుండా/జబ్బలు సర్సుకోండి/ ....ఎవుడేడపోతే యాముండాదిలే/

మీరు కోరుకున్నకొండమీదే వాన గురువాల" (పుట:87) ఈ కవితా సంపుటిలో ఈ కవిత ఎంతో ముఖ్యమైంది. కవి ఆశించేదేమిటో ఈ కవితలో చాలా వరకు కనిపిస్తుంది.ఒక నూతన సమాజం కోసం సిద్దపడే సమయం ఆసన్నమయ్యిందని, అందుకోసమే గతకాలంలోని పీడనను, దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి, ఒక స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మించుకోవడానికి సమయమైందని దానికో సిద్దపడుతున్నామని తన లక్ష్యాన్ని వివరిస్తాడు.

ఈ కవితలో మూడు అంశాల్ని చూడొచ్చు.

1. భారతదేశంలో వర్గాధిపత్యం,కులాధిపత్యం, మతాధిపత్యంతో కొన్ని వర్గాల ప్రజలు పీడిత వర్గాలను మాయమాటలతో మోసంచేస్తున్నారనేది ఒక ప్రతిపాదన.
2. రాజకీయవేత్తలు చెప్పేదొకటి, చేసేదొకటి చేస్తూ అధికారంలోకి వస్తున్నారు. తమ ప్రయోజనాలనే తప్ప పీడితకులాల, వర్గాల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదు. చదువుకున్నవాళ్ళు కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఉండాల్సిందిపోయి, వాళ్ళే వాటిని పెంచిపోషించడం ఆశ్చర్యకరమైన సంఘటలుగా కనిపిస్తున్నాయి. ప్రతి ఏడాదీ స్వాతంత్ర్య దినోత్సవాలు, గణతంత్ర దినోత్సవాల్లో చెప్పుకొనే ప్రసంగాల సారాంశాల్ని, వాటి అమలుని గుర్తుచేస్తున్నాడు.
3. ఈ పరిస్థితుల్లో పీడిత, దళిత వర్గాలకు చెందిన ప్రజలంతా మోసకారి మాటలను నమ్మే వాళ్ళుండరనీ, వాళ్ళంతా చైతన్యవంతులై తగిన గుణపాఠం నేర్పే రోజు ఆసన్నమవుతుందనే ఆశావాద దృక్పథంతో కవిత ముగుస్తుంది.

పీడించేవాళ్ళు, పీడింపబడేవాళ్ళ మధ్య నిత్యం జరుగుతున్నా, పైకి కనిపించని నిత్య సంఘర్షణను వర్ణించి, ఒక నూతన సమాజావిర్భావాన్ని కలగంటున్నాడు కవి. అది కవిగా ఒక వ్యక్తి సంఘర్షణ కాదు. సమాజంలో రెండు వర్గాల సంఘర్షణలకు, వాళ్ళ ఆశయాలకు నిలువుటద్దమైన కవిత. ఈ కవితలో పీడితులు ఊహల నుండి వర్ణనల్లోకి వచ్చిన వారు కాదు. ఆ పీడితుల్లో తాను కూడా ఒకడు. తన జీవిత నేపథ్యాన్ని చెప్పుకుంటూ ఆ పీడన ఎలా ఉంటుందో చెప్తూ కవి...“అమ్మ కూలిపని చేసి మమ్మల్ని సాకింది. పనులు లేని కాలంలో మోదుగ ఆకులు కోసుకొచ్చి, బిక్కికాయలు కోసి, మాగేసి, పండ్లు చేసి, అమ్మి కుటుంబాన్ని నడిపింది. మా ముగ్గురిని చదివించింది. ఎవరికైనా కూలికి పోతే మధ్యాహ్నం రెండు ముద్దలు సంగటి వేస్తారు. దానిలోకి వంగవొరుగులో, గోగాకు పచ్చడో ఏది చవకగా అవుతుందో అదే కూర. అమ్మ ఒక ముద్ద తిని ఒక ముద్ద టేకు ఆకుల్లోనో బెంబేడు ఆకుల్లోనో మూట గట్టుకుని మాకోసం

బడికాడికి వచ్చేది. అప్పటికే మొదటి పీరియడ్ అయిపోయేది. తమ్ముడితో కలిసి వరండాలోనో బోరు కాడో ఆ సంగటి తినేవాళ్లం. అపుడు కిటికీల్లోంచి మా తోటి విద్యార్థులు మమ్మల్ని చూస్తుంటే ఏదో తెలియని ఒక ఇబ్బంది నన్ను తడుముతూ ఉండేది. అప్పటికి మధ్యాహ్నభోజన వసతి లేదు. ఆ వయసులో ఆకలి తట్టుకునే శక్తి ఉండేది కాదు. కడుపులో పేగులు అరిస్తే కడుపునిండా నీళ్లు తాగేవాన్ని. రోజూ చియాబువ్వా, చీలూ చేపలు తిన్న రోజులు, ఇంటి నిండా చుట్టాలతో విందు భోజనాలతో కళకళాడిన దినాలు, తిండిలేని పూటల్ని రుచి చూపాయి. ఆ రేషన్ బియ్యంతో చేసిన ఇగరపుముద్దల్లో వూరుబిండే నా కవిత్వమనుకుంటాను.” అని చెప్పుకోవడమే పీడితులందరి గొంతుగా దీన్ని సాధారణీకరించవచ్చునని తెలుస్తుంది.భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత దళితులు, పీడితుల కష్టనష్టాలను ఈ కవితలో శక్తివంతంగా, చైతన్యపూరితంగా వర్ణించాడు కవి.

ఈ కవిత గురించి వ్యాఖ్యానిస్తూ ప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య ఇలా అన్నారు. *“ఇదీ ఇతని గొంతు ధర్మం. ఇతనిదైన వ్యక్తీకరణ. దళిత దృష్టినుంచి నేటి మత రాజకీయాల్నీ వాటి దేశభక్తి నాటకాలనీ సీమ బహుజనుల వీధి భాష ద్వారా కవిత్వం చేసిన వైనమిది. చివరి మూడు వాక్యాలు ప్రత్యేకమైనవి. బతుకును లోతుగా పరిశీలించగలిగే వాళ్లే ఇలాంటి జానుడిని పట్టుకోగలరు. వాకిలి చిమ్మటం, కళ్లాపి జల్లడంలో వ్యవస్థను శుభ్రం జేసే యుద్ధం తాలూకు ఆకాంక్ష ధ్వనించింది. సిసలైన బహుజన రాజకీయోద్యమ సన్నాహపు ఎరుక ఉంది.’* (పుట:15)

ఈ కవితాసంపుటిలోని ఈ 'యాలైపూడ్సింది' కవితనుగానీ, మిగతా కవితలను గానీ పరిశీలిస్తే, ఈ దేశంలో దళితులు, పీడితులు, బహుజనుల జీవన స్థితిగతులు ఎంత దుర్భరంగా ఉన్నాయో, వాటి నుండి విముక్తి కావాలంటే ఏమి చేయాలో ప్రబోధించే కవిత్వంగా దీన్ని అభివర్ణించవచ్చు. 'యాలై పూడ్సింది' అనే మాట ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా తూర్పు మండలాలు, తమిళనాడు సరిహద్దుని ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోను మాట్లాడుతారు. దీని అర్థం గురించి కవిని అడిగినప్పుడు 'మా ప్రాంతంలో సమయం అయిపోయింది. సమయం అయింది అనే భావంతో ప్రయోగిస్తార'ని వివరించారు. ”వర్తమాన సమాజంలో జరుగుతున్న దారుణాలను, దాష్టీకాలను, ఆధిపత్యాలను, రాజకీయాలను ప్రశ్నించడానికి, వాటిని నిలువరించడానికి సమయం అయింది” అనే ధ్వన్యాత్మక భావనగా ఆయన భావిస్తున్నారు. (కవితో వాట్సాప్ ద్వారా ఇంటర్వ్యూ: 6.8.2024)

దళిత ఈస్తటిక్స్ : శ్రమ సౌందర్యం

దళిత సౌందర్యశాస్త్రంలో 'శ్రమ సౌందర్యం' అనేది ఒక విప్లవాత్మకమైన, మౌలికమైన సిద్ధాంతం. సంప్రదాయ సౌందర్యశాస్త్రం కేవలం ఆనందాన్ని, విలాసాన్ని లేదా ఊహాజనిత

అంశాలను 'అందం'గా పరిగణిస్తే, దళిత సాహిత్యం మట్టిని నమ్ముకుని నిరంతరం కష్టపడే శ్రమజీవి స్వేదాన్ని అసలైన అందంగా గుర్తిస్తుంది. సమాజ మనుగడకు వెన్నెముకగా నిలిచి, అట్టడుగు వర్గాలు చేసే వృత్తులు, వారి శరీరాల మీది గాయాలు, మురికి, చెమట చుక్కలను ఈ సిద్ధాంతం గౌరవిస్తుంది. అంటే, శ్రమ అనేది కేవలం ఒక పని మాత్రమే కాదు, అది ఒక సృజనాత్మకత అని, ఉత్పత్తి క్రమంలో పాల్గొనే ప్రతి చేతిలోనూ ఒక సహజమైన సౌందర్యం దాగి ఉంటుందని ఇది వివరిస్తుంది. దోపిడీకి గురైనప్పటికీ నిరంతరం సృష్టిని నిర్మించే ఆ శ్రామిక తత్వాన్ని ఆరాధించడమే ఈ సిద్ధాంతం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

నాగరాజు ఈ కవితా సంపుటిలో ఈ దేశనిర్మాణంలో దళితుల పాత్రను కవితాత్మకం చేసిన తీరు ఎంతో విశిష్టమైంది. ప్రపంచంలో అత్యంత పొడవైన నది నైలునది. దాన్ని అలా తవ్వడానికి ఎంతమంది శ్రమించారో, బహుశా వారి పేర్లు చరిత్రలో లిఖించబడకపోవచ్చు. దీన్ని ఒక ప్రతీకగా తీసుకొని "కర్రిసూరీడు... నల్లచందమామ" పేరుతో ఒక గొప్ప కవితతో ఈ కవితా సంపుటి ప్రారంభమవుతుంది.

"పుట్టతేనె తాగిన ఆమె మట్టి గొంతులో/ఆ ప్రేమపిలుపు విన్నప్పుడల్లా/బాల్యం బొమ్మలకొలువైన/నా నైలునదివొడ్డు పలకరిస్తుంది./

ఆమె కారుతున్న చెమట చేతులతో/గారంగా కౌగిలించుకుని/కాల్చిన ఎండుతునకవంటి కమ్మటి ముద్దులు/నా నల్లని బుగ్గలుపై పూయిస్తూ/నా కర్రి సూరీడా అని పిలిచినపుడల్లా/నా చర్మంకింద సింధులోయ నిద్దరలేస్తుంది!.....అప్పుడు తాను నల్లచందమామై నవ్వుతూ/

నన్ను నల్లకలువనుచేసి శిగలో ముడుచుకుటుంది/తన కడుపులో ఊకొట్టే కాలంబిడ్డను వింటూ/మేమిద్దరం ఓ యుగళ గీతాన్నిలా పాడుకుంటాము/"కర్రులై యుగాల కయ్యల్ని దున్నిన దేహాలు మేముఆరెలై యుగాల పాదాల్ని కాచిన దేహాలు మేముదేశాల దేహాలు మావి.. దేహాల దేశాలు మావి.." అంటూఎన్ని సార్లు పాడిన పాటెందుకో/ఇంకా ఇంకా మిగిలే ఉంటుంది/నా కర్రోడా!' అని పిలిచే ఆమె పిలుపులా..."

ఈ కవితా ఖండికలో అమ్మ ప్రేమను, శ్రమ సంస్కృతిని మరియు చారిత్రక వారసత్వాన్ని కవి అత్యంత శక్తిమంతమైన ప్రతీకలతో సమన్వయం చేశారు. పుట్టతేనె తాగిన ఆమె "మట్టి గొంతు" లోని పిలుపు విన్నప్పుడు కవికి తన బాల్యం "నైలునది వొడ్డు" లాగా, తన అస్తిత్వం "సింధులోయ" లాగా నిద్దరలేవడం విశేషం. అంటే, అమ్మ పిలుపు కేవలం ఒక మమకారం మాత్రమే కాదు, అది ఒక ప్రాచీన నాగరికత అంతటి గాఢత కలిగినది. ఆమె చెమట చేతులతో కౌగిలించుకుని "కర్రి సూరీడా" అని పిలిచినప్పుడు, ఆ నలుపు రంగులో ఉన్న సౌందర్యాన్ని, సూర్యుడిలోని తేజస్సును కవి దర్శించారు. తాము "కర్రులై యుగాల కయ్యల్ని దున్నిన" వాళ్లమని, "ఆరెలై యుగాల పాదాల్ని కాచిన" వాళ్లమని చెప్పుకోవడంలో శ్రమజీవులే ఈ దేశపు నిజమైన

నిర్మాతలనే చారిత్రక స్పృహ కనిపిస్తుంది. "దేశాల దేహాలు మావి.. దేహాల దేశాలు మావి" అన్న పంక్తులు శ్రమకు, భూమికి, మనిషికి ఉన్న విడదీయలేని బంధాన్ని చాటిచెబుతున్నాయి. చివరగా, ఎన్నిసార్లు పాడినా తనివి తీరని ఆ పాట, అమ్మ పిలుపులాగే నిరంతరం ఒక తీపి జ్ఞాపకంగా, ఒక సామాజిక శక్తిగా మిగిలి ఉంటుందని కవి ఈ కవితలో ఎంతో ఆర్ద్రంగా చిత్రించారు. ఈ కవిత ఒక ఉద్యమగీతంలాంటిది. ఒక ఉద్యమ ఆశయాన్ని ప్రతిఫలిస్తున్న గేయమిది. దీనిలో ప్రయోగించిన కర్రిసూరీడు, నల్లచందమామ' కవితా శీర్షికే అద్భుతం. సూర్యుడు ప్రతిదినం తన విధిని సక్రమంగా నిర్వర్తించే శ్రామికుడులాంటివాడు. విప్లవానికి ప్రతీకగా కూడా సూర్యుడుని ప్రయోగిస్తారు. ఇక్కడ 'కర్రి సూరీడు" అనడం ద్వారా కవి అభివ్యక్తి నైపుణ్యం ద్వారా దళితుణ్ణి ప్రతీక చేస్తున్నాడు. నల్ల సూరీడు అని కూడా అనలేదు. చాలామంది దళిత పిల్లలను శుభ్రంగా లేనప్పుడు, నల్లగా ఉన్నవాళ్ళను చూసినప్పుడు దళితేతరులైన కొంతమంది అవమానకరంగా 'కర్రోడా' అంటుంటారు. ఇలా ఇతరుల దృష్టిలో అవమానకరంగా ఉన్న పిల్లవాడు తన తల్లికి అందమైన వాడిగానే కనిపిస్తాడు. అందువల్ల ఒక్కోసారి సరదా, ముద్దుగా కూడా 'కర్రోడా' అని తమకి ఇష్టమైన వాళ్ళు పిలుస్తుంటారు. తెలుగులో బాలవ్యాకరణంలో కూడా ఇలాంటిదే ఒక సూత్రం ఉంది. "ఓరి యోసి మైత్రియందుం గలవు." ఓరి చిన్నికృష్ణ, ఓసి ముద్దుబాల. (తత్సమ, 16 వ సూత్రం)

అలాగే, సాధారణంగా చందమామను తెల్లదనానికీ, చల్లదనానికీ ప్రతీకగా వాడ్డం సంప్రదాయ కవిత్వ పద్ధతి. కానీ, ఈ కవి 'చందమామ'ను నల్ల చందమామ అనడం ద్వారా ఎంతో అందం, లావణ్యం ఉన్నప్పటికీ నిత్యం శ్రమించడం వల్ల నల్లగా మాడిపోయే దళిత స్త్రీని చెప్తున్నాడు కవి. ఈ కవితలో ప్రయోగించిన ప్రతీకలన్నీ దళితులు, బహుజనులు, శ్రామికులకు సంబంధించినవి. వాచ్యార్థంలో ఒక తల్లీ – కొడుకుల సంభాషణలా అనిపిస్తుంది. కానీ, ధ్వన్యార్థంలో తల్లి 'శ్రామికజీవనాన్ని" తెలియజేసే ప్రతీక. అది మార్క్సిస్టు ప్రతీక కాదు. అది దళిత, బహుజనులకు ప్రతీక. దళితుల శ్రమైక జీవన సౌందర్యంతో నిర్మించిన దేశంలో శ్రమ తప్ప, తగిన గౌరవ మర్యాదలు లభించని స్థితినీ, భవిష్యత్తులో లభిస్తాయనే ఆశనీ పలికించిన కవిత.

ఈ నైలు నది ప్రస్తావన చేస్తూ శ్రీశ్రీ తన 'దేశచరిత్రలు' కవితలో ...

'తరతరాల శ్రమ దోపిడి:/ఇతిహాసపు చీకటి కోణం/అట్టడుగున పడి కాన్పించని/కథలన్నీ కావాలిప్పుడు!/దాచేస్తే దాగని సత్యం/నైలునదీ నాగరికతలో/సామాన్యుని జీవనమెట్టిది?" అని ప్రశ్నించడం గుర్తొస్తుంది. శ్రీశ్రీ కూడా శ్రమదోపిడి జరిగినతీరునీ, దాన్ని ఉపయోగించుకొని ధనికులై, భోగభాగ్యాలను అనుభవిస్తున్నవారి జీవనాన్ని చూడమంటున్నాడు. నైలునది ప్రపంచంలో అత్యంత పొడవైన నది. దీన్ని నిర్మించడానికి ఎంతోమంది తమ శ్రమను ధారపోసారు. అలా

ఎప్పటికీ పూర్తికాని నైలునదులను తవ్వుతున్న దళితులు ఎంతో మంది ఉన్నారు. అలాగే, సింధు లోయ నాగరికతను కూడా ప్రయోగించడంలో ఎంతో లోతైన ఆలోచన ఉంది. కవి చెప్పాల్సిన భావం ఉంది. (క్రీస్తు పూర్వం"). 2500-1750) ప్రస్తుత భారత దేశం, పాకిస్తాన్ లోగల గగ్గర్ హక్రా, సింధు నదుల పరీవాహక ప్రాంతంలో విలసిల్లిన అతి ప్రాచీన నాగరికతల్లో ఒకటి. ప్రాచీన ఈజిప్టు కంచు యుగాలకు సమకాలికమైన అతి ప్రాచీన నాగరికతల్లో ఒకటి.అత్యంత అభివృద్ధి చెందిన దశగా గుర్తించబడిన నాగరికతను హరప్పా నాగరికతగా పేర్కొంటారు. ఈ నాగరికత నిర్మాణంలో మూలపురుషులు దళితులేనని ఒక సిద్ధాంతం ఉంది. దీన్ని మూలవాసీసిద్ధాంతం అంటారు.

మానవ పరిణామ క్రమంలోఆయా ఖండాలలో ఉద్భవించిన మానవ సమాజాలే మూలవాసులు. ఏప్రాంతానికి చెందిన వారు ఆ ప్రాంతాల మీద రాజకీయ, సామాజిక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, భాష ఆధిపత్యం ఉండాలన్నదే ఈ సిద్ధాంతం. నేడు దళితులని పిలవబడుతున్న ఎస్.సి., ఎస్.టి.,బి.సి, మైనారిటీ మతాల్లోకి మారిన అసలైన భారతీయులు మూలవాసులు" అని, ఆ మూలవాసుల శ్రమతోనే సింధునాగరికత విలసిల్లిందనీ, కానీ, ఆ సాంస్కృతిక వారసత్వం నేడు దూరమైపోయిందనీ, మరలా ఆ వైభవం రావాలనే ఆ కాంక్షతో ఈకవితలో "మేమిద్దరం ఓ యుగళ గీతాన్నిలా పాడుకుంటాముపిచ్చుక వాలిన కిటికీ' కవితలో అంతరాలు పోయే సమాజాన్ని కలగంటాడు కవి.

"ఎప్పుడూ మీ గురించేనా/మీ ఎగుడుదిగుడు దారులుగురించేనా?/మీరూ మేమూ/మనదైన లోకానికి ఊపిరల్లాదే/ఒకపచ్చని చెట్టుగురించో పచ్చనికొమ్మపై/మా రెక్కలసప్పుడుగురించో..."పాఠమెప్పుడవుతారన్నట్టూ ప్రశ్నలు వర్షిస్తూ ఎగిరెల్లిపోయింది. / పిచ్చుకగాలిమిత్రుని భుజాలపై చేతులువేసుకుని/ముంబైలో పాదయాత్ర చేస్తున్న రైతుల కాళ్ళు రక్తం పారుతున్న దృశ్యాలు పత్రికల్లో విస్తృతంగా ప్రచురించారు.

"నాగేలి పాదాలతో దారుల్ని దున్నుకుంటూ/ కొడవళ్ల చేతులతో దుఃఖాన్ని కోసుకుంటూ/ ఎండిన దేహాలకు ఎన్ని ఎండలైనా/ లెక్కేమనీ ఎడతెగని ప్రవాహమై /చితికి బొబ్బకట్టిన పాదాల దేశమై పగిలి /నెత్తురు కారుతున్న రాజ్యముఖచిత్రమై వాళ్లు ప్రవహిస్తున్నారు'/ వేల వేల సూర్యుళ్లు / వాళ్ల పాదాలకింద మొలుస్తున్నప్పుడు/ వాళ్లు ప్రవహిస్తున్నారు./ వాళ్లు ప్రవహిస్తున్నారు." కిషన్ క్రాంతి పాదయాత్ర కోసం రాసిన కవితలో కూడా నగరంలో రైతుల ప్రదర్శనలు చేయవలసిన అవసరమేమిటో ఒక అద్భుతమైన కవితలో వివరించాడు.

వాళ్ళను, ఇళ్ళనూ ఖాళీ చేయమంటే...?/*"ఎవడికైనా తినదానికింత తిండి / కట్టుకోవడానికింతగుడ్డ /తలదాచుకోడానికి ఒక ఇల్లున్నట్టే /మాకు మేం నిలబెట్టుకున్న ఇళ్లూ/* ***మా ఇళ్లు అద్దాల మేడలు కాకపోవచ్చు. /మా ఇళ్లు బలిసిన బల్బులై వెలగకపోవచ్చు /మా***

మూలుగులున్నాయి./ మా ఆకటి నిప్పులున్నాయి. /మా ఏడ్పులున్నాయి. /మా వేదనలున్నాయి మా ఇళ్లనిండా/యేవో అమానవీయ గాలులు వీస్తున్నపుడల్లా /రగిలిపోతున్న ఆత్మాభిమాన పొయ్యిలున్నాయి. /పొయ్యలనిండా మండుతున్న మాదేహాల కట్టెలున్నాయి./పొయ్యిమీద కూటికుండలో కుతకుతా వుడుకుతున్న మా కన్నీళ్లున్నాయి. /కన్నీటిపై అప్పుడప్పుడు మెరిసే అన్నిపిడికిళ్ల నవ్వులున్నాయి./మా ఇంటిని వొదిలి పోవడమంటే మేము రావడమేగదా"

నాస్తాల్జియా...గ్రామాలు...ఆత్మీయతలు:

గతించిన కాలపు గుర్తులు కళ్ళముందు కదలాడుతుంటే కలిగే తీపి వేదన 'నాస్తాల్జియా'. పచ్చని పొలాలు, మట్టి వాసనలు, వాగు వంకల గలగలలతో ముడిపడిన పల్లెటూరి జ్ఞాపకాలు మనిషిని ఎప్పుడూ తన మూలాల వైపు లాగుతుంటాయి. అక్కడ మనుషుల మధ్య సంబంధాలు యాంత్రికంగా కాకుండా, ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకునే నిష్కల్మషమైన ఆత్మీయతలతో అల్లుకుని ఉంటాయి. ఆధునిక నగర జీవనపు ఉరుకుపరుగుల మధ్య, పల్లెలోని ఆ పాత స్నేహాలు, ఆప్యాయతలే మనసుకు ఓదార్పునిచ్చే సేదతీరే నిలయాలు.

గ్రామం నుండి పట్టణాలు, నగరాలకు వివిధ కారణాల వల్ల వలస వెళ్లిపోతున్నారు. అక్కడ మానవ సంబంధాలు లేకుండా బ్రతుకుతున్న యాంత్రిక జీవనంలో మళ్లీ గ్రామాలు గుర్తుకొస్తున్నాయి. అటువంటి సమయంలో గ్రామం నుండి వచ్చిన ఒక మిత్రుడిని సంబోధిస్తూ చెప్పిన కవితలో వివిధ వృత్తుల వాళ్ళతో కలిసి మెలిసి బ్రతికిన మానవ సంబంధాలు గుర్తుచేసుకుంటున్నాడు.

"నా మిత్రుడా!/ఆకలితో ఆవురావురమంటున్న/నా ఎండినడొక్కల్లో కాలేకడుపులో / అప్పుడప్పుడు అంత కవణమైకూచున్న అమ్మలాంటిబందిలిసోలమ్మని అడిగాననిజెప్పు/ మండుటెండలో ముళ్లూ ముడకల్లో కాలుతున్న /నాకాళ్లకి పుండ్లవుతున్న వేళ్లకి తెగిన సెప్పుల్ని కుట్టిచ్చిన /అయ్యలాంటి పెద్దింటి పోతన్నని అడిగాననిజెప్పు/నా చింపిరిజుట్టుకత్తరించి /నా మూతికి పొగడ్రా పూసి /నలుగురిలో నన్ను నాగరికున్ని చేసిన తాతలాంటి మంగలి గురవన్నని అడిగాననిజెప్పుచినిగిన చెడ్డీ చొక్కాయల్ని కుట్టి బడిసంచిని బాగుసేసి బడికి బోను చేయిచ్చిన / అన్నలాంటి గుడ్లకుట్టే సలీంచాయన్నని అడిగాననిజెప్పు/సూయమ్మకి కూటికుండిచ్చిన కుమ్మరి రవణన్నా /మా నాయనకి మడకిచ్చిన కంసాలి పెద్దన్న/ఊరిమురికి వుతికి ఇస్త్రీ చేసిన సాకలి చిన్నక్క/చలికాలంలో ఇంటికి గొంగడైన గొల్లకిష్టన్న /ఊస్టంజేసిన వొంటని ముంతకల్లుతో సలువజేసిన ఈంద్రచెంగన్న /ఎలావుందారో ఎలావుండారో నేనడిగినాననిజెప్పూ" గ్రామీణ ప్రాంతాలలో కులానికి మతానికి అతీతంగా వివిధ సంబంధాలతో పిలుచుకుంటూ ఉంటారు. అది నిజమేనా కాకపోయినా గానీ వాళ్ళ మధ్య ఒక కుటుంబ వాతావరణం కొనసాగుతూ ఉంటుంది. చేపల అమ్ముకునే ఒక ఆమెతో గ్రామం సభ్యులకు ఉండే మానవ సంబంధాలను

ఎంతో ఆత్మీయంగా వర్ణించాడు కవి. *"ఆమె కొందరికి చేపలు పాపమ్మ /కొందరికి తూలుపాపమ్మ /నేను మాత్రం అసలుపేర్తో "రుక్కమ్మత్తా" అంటేఆ యత్తా బలేనవ్వి "దొంగనాబట్టా" అని ముదిగారంగా నా బుగ్గగిల్లి/ఒక మెత్తాడో కరువాడో చేతికిచ్చి /కాల్చుకుతినమంటే నా మొఖం సిగ్గుతో సందమామైపోయేది"*

దేశసమగ్రతాకాంక్ష:

భారతదేశం వంటి భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో 'దేశసమగ్రతాకాంక్ష' అనేది జాతి మనుగడకు ప్రాణాధారం. కుల, మత, ప్రాంతీయ మరియు భాషా విభేదాలను అధిగమించి, మేమంతా భారతీయులమనే ఐక్యతను చాటడమే ఈ కాంక్షలోని అంతరార్థం. దేశ సరిహద్దులను కాపాడుకోవడమే కాకుండా, అంతర్గతంగా ప్రజల మధ్య సోదరభావాన్ని, సామరస్యాన్ని పెంపొందించడం ద్వారానే బలమైన రాష్ట్రం సాధ్యమవుతుంది. ప్రతి పౌరుడు స్వార్థాన్ని వీడి దేశ ప్రయోజనాలే పరమావధిగా భావించినప్పుడు, ఆ సమష్టి ఆశయం దేశ సార్వభౌమాధికారాన్ని, అఖండతను సుస్థిరం చేస్తుంది. కుల, మతాలు, వర్గం భేదాలు లేని ఒక స్వేచ్ఛా పూరితమైన ఒక మానవ సమాజాన్ని కలకంటున్నాడు కవి. దాన్ని ఒక ఇంటి గా భావిస్తూ వర్ణించిన కవిత ఒక పాఠ్యాంశంగా ఉండాల్సిన కవిత.

" పుల్లలేరుకుని కాకులు తమకు నచ్చిన కొమ్మలోనో రెమ్మలోనో/తమగూటిని తామే కట్టుకున్నట్టు/పురుగోబుట్రో కాయో గరపో తినీస్వేచ్ఛగా బతికినట్టు తినడంలో ఆంక్షలులేని/ బతకడంలో భయంలేని ఇంటిని నేను కలగంటున్నాను/నా ఇంటిని/నా ఇంటిలాంటి ఇళ్లున్న వీధులని/వివక్షలులేని వీధుల సమూహాల దేశాన్ని/దేశమంతా ఒక్కటైన ఇంటినీ/నావాళ్లందరున్న ఒక ఇంటిని/నేను కలగంటున్నాను.నా నెత్తురు తడవని నాలుగడుగులు నేలపై/నా అడుగులు జంకని నా నేలపొరలపై/నా ఇంటిచుట్టూ కంచెలు లేని/అంతమట్టిని కలగంటున్నాను. నేను నా ఇంటిని కలగంటున్నాను".

దీనితోపాటు కొన్ని సందర్భాలలో ఇళ్లను ఖాళీ చేయడమే కాదు; ఆ ఊరిని వదిలేసి వెళ్లి పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతూ ఉంటాయి. పెద్దపెద్ద ప్రాజెక్టులు కట్టేటప్పుడు కొన్ని గ్రామాలు గ్రామాలే ఖాళీ చేయిస్తారు. అటువంటి అప్పుడు ఆ గ్రామంతో పెనవేసుకున్న అనుబంధాలు ఎలా ఉంటాయో 'కంటికి కడవడవుతున్న ఊళ్లు' అనే కవితలో అద్భుతంగా వర్ణించాడు కవి. ఈ కవితా ఖండికలో "ఇల్లు" అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాకుండా, ఒక విశ్వజనీన స్వేచ్ఛకు, సామాజిక సమానత్వానికి ప్రతీకగా ఆవిష్కరించబడింది. కాకులు తమకు నచ్చిన చోట స్వేచ్ఛగా గూడు కట్టుకున్నట్లే, మనిషి కూడా ఎటువంటి ఆంక్షలు లేని, భయం లేని బతుకును గడపాలనే ఆకాంక్ష ఇక్కడ కనిపిస్తుంది. "తినడంలో ఆంక్షలు లేని, బతకడంలో భయం లేని" ఇంటిని కలగనడం ద్వారా, వర్తమాన సమాజంలోని వివక్షలను,

అభద్రతను కవి పరోక్షంగా ప్రశ్నించారు. తన ఇల్లు, తన వీధి, చివరకు ఈ దేశమంతా వివక్షలు లేని ఒకే ఒక పెద్ద ఇల్లుగా ఉండాలని కోరుకోవడం ద్వారా వసుధైక కుటుంబ భావనను కవి ప్రకటించారు. ముఖ్యంగా "నా నెత్తురు తడవని నాలుగడుగులు నేల" అని అనడంలో సామాజిక హింస లేని ప్రశాంతమైన జీవనం పట్ల ఉన్న ఆవేదన కనిపిస్తుంది. కంచెలు లేని మట్టిని, అడుగు జంకని నేల పొరలను కలగనడం అనేది కేవలం ఒక వ్యక్తిగత స్వప్నం కాదు; అది అణచివేత లేని, సమానత్వంతో కూడిన ఒక నవ సమాజ నిర్మాణానికి కవి వేసిన బలమైన పిలుపు. **ఊళ్లు కూలిపోతేఎలిగిపోయే చరిత్రవుతుందా./కంటికికడవడు కన్నీళ్లైతే చరిత్రలో కళకళలాడే వాక్యం పుడుతుందా/ఊళ్లో నువ్వూ నేనూ నడిచిన వీధులు మాయమయితే/పిల్లలతో బువ్వతింటూ కూర్చున్న అరుగులు /కనుమరుగైతే చరిత్రకెక్కుతుందా/తట్టా బుట్టా సర్దుకుని/**

నెత్తిన దిగులు కొంగులతో /తలోదిక్కుకు తరిలిపోతున్న ఊళ్లను ఎవరు పిలిచారు./ దుక్కిస్తున్న ఊళ్లను ఎవరు పలకరించారు? /ఎవరుచేతిలో చెయ్యేసి /వీపునిమిరి /ఒక బరోసామాటను చేతిక్కిచ్చారు?

సోషల్ మీడియా – మానవ జీవితాలు:

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా మానవ జీవితంలో ఒక విడదీయలేని భాగంగా మారిపోయింది. ఇది ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చి, వ్యక్తుల మధ్య దూరాన్ని తగ్గించడమే కాకుండా, సమాచార మార్పిడిని అత్యంత వేగవంతం చేసింది. ప్రతి ఒక్కరూ తమ భావాలను, సృజనాత్మకతను వెల్లడించడానికి ఇదొక శక్తివంతమైన వేదికగా నిలుస్తోంది. అయితే, దీనివల్ల సామాజిక సంబంధాలు మెరుగుపడుతున్నప్పటికీ, మరోవైపు వ్యక్తులు వర్చువల్ ప్రపంచంలో మునిగిపోయి ప్రత్యక్ష అనుబంధాలకు దూరమవుతున్నారు. అతిగా సోషల్ మీడియాపై ఆధారపడటం వల్ల మానసిక ఒత్తిడి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలగడం వంటి సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. సాంకేతికతను సానుకూల ప్రయోజనాల కోసం వాడుకుంటూ, వాస్తవ జీవితానికి సోషల్ మీడియాకు మధ్య సమతుల్యతను కాపాడుకున్నప్పుడే మానవ సంబంధాలు మరింత అర్థవంతంగా ఉంటాయి. దీని గురించి కవి స్పందనలు ఇలా ఉన్నాయి,

ఎంత విజ్ఞానం పెంచుకున్నామో /అంతే విషాన్ని కుదుళ్లల్లో నింపుకుంటూ /ఎన్ని విజయాలు సాధించామో /అన్ని వినాశనాలు విత్తుకుంటూ /ఎన్ని వలయాలు /ఎన్నెన్ని అల్లికలు పేగులపోగుల్ని అతికించుకున్నట్టే తెంపుకుంటూ/రెక్కలొచ్చిన ఫేస్బుక్ /చిలకలై గిరికీలుకొట్టున్న వాట్సప్ /పావురాలై ట్విట్టర్ పిచ్చుకలపాటలై /నెట్టింటిపడుచులే ప్రతినట్టింటనవ్వుతున్న దీపాలై /ఎన్ని స్పర్శించలేని చూపుల్ని /వాసనలేని నవ్వుల్ని, /నిట్టూర్పుల నెగళ్లను తెరలపై గీసుకున్నామో.

మద్యం వల్ల నాశనమయిపోతున్న కుటుంబాల గురించి కవిత్వం రాశాడు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు లేక క్షామ పరిస్థితులు నెలకొంటుంటాయి. రాయలసీమలో కూడా అటువంటి పరిస్థితి

ISSN: 2319-3905

ఉంటుంది. దీని గురించి వర్ణిస్తూ... ***"మా కన్నీటి తడికి /రాళ్లు మొలుస్తున్నాయే గానీ /ఒక్క నమ్మకపు చినుకు కురవలేదు. /ఒక్క ఆశైనా చిగురించలేదు*** **' ఇది నిత్యం కడుపు మంటల నేల"** అద్భుతమైన అభివ్యక్తి.

సఫాయి కార్మికుల గురించి:

సమాజ ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి నిరంతరం శ్రమించే అదృశ్య సైనికులు సఫాయి కార్మికులు. ఊరు వాడల మురికిని వదిలిస్తూ, సమాజానికి స్వచ్ఛతను అందించే క్రమంలో వీరు ఎదుర్కొనే శారీరక శ్రమ, సామాజిక వివక్ష వర్ణనాతీతం. దళిత సౌందర్యశాస్త్రం దృష్టిలో వీరి శ్రమ అత్యంత పవిత్రమైనది; సమాజ మనుగడకు అత్యవసరమైన వీరి వృత్తిని తక్కువ చూపు చూడటం సామాజిక నేరం. యంత్రాల వాడకం పెరుగుతున్నా, నేటికీ ప్రాణాలకు తెగించి మ్యాన్‌హోల్‌లలోకి దిగుతున్న వీరి జీవితాల్లోని విషాదాన్ని గుర్తించి, వారికి తగిన గౌరవం, రక్షణ మరియు మెరుగైన జీవన స్థితిగతులను కల్పించడం ప్రతి నాగరిక సమాజం యొక్క కనీస బాధ్యత.

'సఫాయమ్మలు'/సోంబేరి ముఖాలు /ఇంకా మొకమన్నా కడుక్కోక ముందే/వాళ్లు నగరం మొకం కడుగుతుంటారు/ ఎందరో తల్లులు బిడ్డలకి మూతికడిగి ముక్కుచీది,/లాలపోసి, పౌగ్రా పూసి, దిష్టిసుక్క పెట్టి దీవించినట్టూ/నగరంలో రోడ్లన్నిటిని బిడ్డలుగా లాలిస్తూదుమ్మూ,ధూళీ తుడిచి అందంగా దిద్దుతుంటారు./మాయమ్మ మాచెల్లికి పాపిటతీసి జడేసినట్టూ/యీ సఫాయమ్మలు పట్నంపిల్లకి చిక్కుదీసి కొప్పుబెడుతుంటారు." చేనేత కార్మికుల గురించి, నాయి బ్రాహ్మణ గురించి ఇలా సమస్త వృత్తుల వారి గురించి తన కార్యక్రమంలో అద్భుతంగా పలికించిన తీరు ఆ వృత్తుల పట్ల మనకి గౌరవాన్ని పెంచేటట్లు చేస్తుంది. ఈ కవితా ఖండికలో సఫాయి కార్మికుల శ్రమను మాతృత్వంతోనూ, ఒక కళాత్మక సృజనతోనూ కవి అత్యంత హృద్యంగా చిత్రించారు. నగరం ఇంకా నిద్రలేవకముందే, సోంబేరి ముఖాలు మొహం కూడా కడుక్కోకముందే "నగరం మొకం కడుగుతుంటారు" అనడంలో వారి శ్రమలోని నైపుణ్యాన్ని, ప్రాధాన్యతను కవి ఎంతో గొప్పగా ఆవిష్కరించారు. రోడ్లను శుభ్రం చేయడాన్ని కేవలం ఒక మున్సిపల్ పనిగా చూడకుండా, ఒక తల్లి తన బిడ్డకు మూతి కడిగి, దిష్టి చుక్క పెట్టి ముస్తాబు చేసే "లాలన" తో పోల్చడం విశేషం. నగరాన్ని ఒక బిడ్డగా, ఆ రోడ్లను పాయలు తీసిన జడలుగా భావిస్తూ, ఈ 'సపాయమ్మలు' పట్నం పిల్లకి చిక్కుదీసి కొప్పు పెడుతున్నారనడం వారి పని పట్ల కవికి ఉన్న అపారమైన గౌరవానికి నిదర్శనం. సమాజం అసహ్యించుకునే మురికిని వీరు మాతృహృదయంతో శుభ్రం చేస్తూ, నగరానికి ఒక అందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తున్నారనే సత్యాన్ని ఈ కవిత ఎంతో సున్నితమైన ప్రతీకలతో సమన్వయం చేసింది.

నేటివిటీ:

కవిత్వంలో 'నేటివిటీ' (నేలతనం/స్థానికత) అంటే ఒక ప్రాంతపు భౌగోళిక, సాంస్కృతిక మరియు సామాజిక అస్తిత్వాన్ని ప్రతిబింబించడం. కవి తాను పుట్టి పెరిగిన నేల యొక్క భాషను, యాసను, అక్కడి ఆచార వ్యవహారాలను, మనుషుల జీవన శైలిని అత్యంత సహజంగా కవిత్వంలో చిత్రించడమే నేటివిటీ. ఇది కేవలం బాహ్య సౌందర్యం గురించి చెప్పడం మాత్రమే కాదు; ఆ నేల తాలూకు దుఃఖాన్ని, పోరాటాన్ని, మట్టి వాసనను అక్షరబద్ధం చేయడం. గ్లోబలైజేషన్ కాలంలో అస్తిత్వ స్పృహ పెరిగిన తర్వాత, కవులు పరాయి ఇతివృత్తాల కంటే తమ కళ్ళ ముందున్న జీవితాలకే ప్రాధాన్యతనిస్తూ, ప్రాంతీయ విశిష్టతను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. అంటే, సార్వజనీనమైన సత్యాన్ని స్థానికమైన అభివ్యక్తితో (Local expression) చెప్పడమే నేటివిటీలోని అసలు సిసలైన మర్మం.

పరాయి తనంతో బతకడం ఎంతో దుర్భరం. అది భాష కావచ్చు, సాంస్కృతిక జీవనం కావచ్చు, ఇతరుల జీవన విధానాన్ని తమ జీవన విధానం మార్చుకోవడం అనేది ఎంతో కష్టం. ఒకవేళ అలా ఎవరైనా జీవించినా దానిలో జీవం ఉండదు. నిజమైన జీవం.. నిజమైన గౌరవం.. నిజమైన ఆనందం.. నిజమైన సంతోషం అరమరకలు లేని జీవితం లోనే సాధ్యం.

*"నేను పలానా కాబట్టే ఇలాగ మాట్లాడుతుండాను /నేనేందో తెల్సుకున్నాకా/నేను నాలాగే మాటాడుతుండాను./ భరించలేని నా కంటి నొప్పినుంచీ/కురుస్తున్న నా ఇంటి కప్పునుంచీ/*__*నా తడితడి నేలమీద నిలబడి /తుపాన్ కండ్లతో తేరిపారజూస్తూ /తుండుగుడ్డతో తుడ్సుకుంటూ/నా*__ **బాదన్నేను నా బాసలో పాడుకుంటున్నాను/కాల్లో ముల్లు గుచ్చుకుంటూవుంటే /కడుపులో పేగులు కా.. లిపోతుంటే /'అబ్బా' అనకుండెలా ఉంటాను/నేనూ నా వేసబాసలు వెక్కిరింతలైన చోట/నా ఇల్లు ఊరవతల కాలనీగా మొలుస్తున్నపూట /నన్ను ఎక్కడికక్కడ వేరు చేస్తున్న చోట /జివ్వుమనే నొప్పితో నవ్వులతోటనెలా అవుతాను"** ఈ కవితా ఖండికలో అస్తిత్వ చైతన్యం మరియు సామాజిక వివక్ష ఎదురైనప్పుడు కలిగే ఆవేదన అత్యంత సహజంగా, ఆర్ద్రంగా ఆవిష్కరించబడింది. తానెవరో తెలుసుకున్న తర్వాతే తనదైన భాషలో, తనదైన శైలిలో మాట్లాడుతున్నానని కవి ప్రకటించడం వెనుక ఒక బలమైన ఆత్మగౌరవ ప్రకటన కనిపిస్తుంది. కురుస్తున్న ఇంటి కప్పు, తడి నేల, కంటి నొప్పి వంటి ప్రతీకలు శ్రమజీవి దైనందిన కష్టాలను సూచిస్తుండగా, ఆ బాధను "తన బాసలోనే పాడుకోవడం" అనేది ఒక సాంస్కృతిక ప్రతిఘటన. కాల్లో ముల్లు గుచ్చుకున్నప్పుడు, ఆకలితో పేగులు కాలుతున్నప్పుడు పుట్టే 'అబ్బా' అనే అరుపు ఎంత సహజమో, వివక్షకు గురైనప్పుడు పుట్టే ఈ కవిత్వం కూడా అంతే సహజమని కవి సమన్వయం చేశారు. తన వేషభాషలు వెక్కిరింతలకు గురవుతున్నప్పుడు, తన ఇల్లు ఊరవతల కాలనీగా వేరు చేయబడుతున్నప్పుడు, ఆ గాయం నుంచి పుట్టిన మనిషి ఒక "నవ్వుల తోటగా" ఎలా మారగలడని ప్రశ్నించడం ద్వారా, సామాజిక అన్యాయం పట్ల కవి తన నిరసనను ఎంతో నిశితంగా వ్యక్తం చేశారు.

నాగరాజు గారి ***'యాలైపూడ్సింది'*** కవితా సంపుటి ప్రధానంగా శ్రమజీవుల అస్తిత్వ చైతన్యాన్ని, వారి దైనందిన జీవితాల్లోని సౌందర్యాన్ని మరియు సామాజిక వివక్షపై నిరసనను వస్తువుగా స్వీకరించింది. ఆయన కవిత్వంలో వస్తువు కేవలం బాహ్య ప్రపంచం నుంచి గ్రహించినది కాదు, అది తన సొంత మూలాల నుంచి, మట్టి వాసన నుంచి ఉద్భవించినది. అందుకే ఆయన కవితల్లో చెప్పులు కుట్టే తాత, వీధులు ఊడ్చే సఫాయి తల్లులు, మట్టి గొంతుతో పలకరించే అమ్మ వంటి పాత్రలు సజీవంగా, అత్యంత గౌరవప్రదంగా కనిపిస్తాయి. నాగరాజు గారి దృక్పథం శ్రమను దైవత్వంతోనూ, మాతృత్వంతోనూ సమన్వయం చేస్తుంది. సమాజం చిన్నచూపు చూసే వృత్తుల్లోని కళాత్మకతను, ఆ పని చేసే వారిలోని తపస్సును గుర్తించి, వారిని బుద్ధుడితోనో, మునిపుంగవుడితోనో పోల్చడం ద్వారా ఒక ఉన్నతమైన మానవీయ కోణాన్ని, సామాజిక సమానత్వ కాంక్షను ఆయన తన కవిత్వంలో ప్రతిష్టించారు.

అభివ్యక్తి విషయానికి వస్తే, నాగరాజు గారి శైలి అత్యంత సహజమైనది, ఆర్ద్రమైనది, ప్రతీకాత్మకమైనది. "మట్టి గొంతు", "నల్లచందమామ", "నైలునది వొడ్డు", "మైనం పూసిన దారం" వంటి ప్రతీకలు ఆయన కవిత్వానికి ఒక కొత్త సొగసును, గాఢతను అద్దాయి. తన భాషను, వేషాన్ని వెక్కిరించే లోకానికి తనదైన 'బాస'లోనే సమాధానం చెప్పడం ఆయనలోని ఆత్మగౌరవానికి నిదర్శనం. వివక్షకు గురైనప్పుడు కలిగే గాయాన్ని, 'అబ్బా' అనే సహజమైన అరుపులా కవిత్వంగా మార్చిన తీరు పాఠకుడి గుండెను తడుముతుంది. వర్ణనల్లో అలంకారికత కంటే అనుభూతి ప్రాధాన్యత ఎక్కువగా ఉండటం, సామాజిక హింస లేని "కంచెలు లేని మట్టిని" కలగనడం వంటివి ఆయన దృక్పథంలోని విశాలత్వాన్ని చాటుతాయి. మొత్తంగా, నాగరాజు గారి కవిత్వం శ్రమ సంస్కృతికి పట్టాభిషేకం చేస్తూనే, అణచివేతపై ధిక్కార స్వరాన్ని వినిపించే ఒక బలమైన సామాజిక దర్పణం.

పల్లిపట్టు నాగరాజు గారి '***యాలైపూడ్సింది'*** కవితా సంపుటి ఆధునిక తెలుగు కవిత్వంలో శ్రమ సౌందర్యానికి, అస్తిత్వ చైతన్యానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. ఈ సంపుటి ద్వారా ఆయన తెలుగు సాహిత్య పీఠంపై శ్రమజీవులను అగ్రభాగాన కూర్చోబెట్టారు. సమాజం అట్టడుగున భావించే వృత్తులను అత్యున్నతమైన 'యోగం'తోనూ, 'తపస్సు'తోనూ పోల్చడం ద్వారా శ్రమ సంస్కృతికి ఒక నూతన తాత్వికతను అద్దారు. చిత్తూరు జిల్లా సరిహద్దు ప్రాంత మాండలికాన్ని కవిత్వీకరించడంలో ఆయన చూపిన నేర్పు, ఆ మట్టి గొంతుకలోని ఆర్తిని, ధిక్కారాన్ని జాతీయ స్థాయికి చేర్చాయి. 2022లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించడం ద్వారా, ఈ సంపుటి ప్రాంతీయ సరిహద్దులను దాటి సార్వత్రిక మానవీయ విలువల కావ్యంలా తెలుగు సాహిత్యంలో తన స్థానాన్ని స్థిరపరచుకుంది. విషయ వ్యక్తీకరణలో నాగరాజు గారు పాటించిన సున్నితత్వం, వాడిన ప్రతీకలు ఈ సంపుటిని ఒక విశిష్టమైన సాహిత్య వనరుగా మార్చాయి.

"నైలునది వొడ్డు", "సింధులోయ" వంటి చారిత్రక ప్రతీకలను మట్టి మనుషుల జీవితాలకు అన్వయించడం ద్వారా, శ్రమజీవులే ఈ నాగరికతకు అసలైన వారసులనే సత్యాన్ని ఆయన ఎంతో లోతుగా ఆవిష్కరించారు. వివక్షకు వ్యతిరేకంగా ఆయన వినిపించిన స్వరం కేవలం ఆక్రోశం కాదు, అది ఆత్మగౌరవ ప్రకటన. భాష, వస్తువు, దృక్పథం. ఈ మూడింటి కలయికతో వెలువడిన ఈ కవిత్వం, వర్తమాన తెలుగు కవిత్వ రంగంలో సామాజిక వాస్తవికతకు మరియు కళాత్మకతకు మధ్య ఒక బలమైన వారధిని నిర్మించింది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కవుల సరసన పల్లిపట్టు నాగరాజు గారిని నిలబెట్టి చూస్తే, ఆయన ఒక 'మట్టి మనిషి తాత్వికత' (Earthly Philosophy) కలిగిన కవిగా కనిపిస్తారు. ఆఫ్రికన్ సాహిత్యంలో వివక్షను ఎదిరించిన చినువా అచెబే, పీడిత ప్రజల పక్షాన నిలిచిన చిలీ కవి పాబ్లో నెరుడా, లేదా నల్లజాతీయుల ఆత్మగౌరవాన్ని పలికించిన మాయా ఏంజెలో వంటి విశ్వకవుల గొంతుకల్లోని ఆర్తి, ధిక్కారం నాగరాజు గారి కవిత్వంలోనూ ప్రతిధ్వనిస్తాయి. నెరుడా వస్తువుల్లోని సౌందర్యాన్ని వెతికినట్లు, నాగరాజు గారు సామాన్యమైన చెప్పులు కుట్టే ఆరెలోనూ, సఫాయి అమ్మల చీపురులోనూ దైవత్వాన్ని, కళాత్మకతను దర్శించారు. ప్రపంచ శ్రామిక వర్గ కవిత్వంలో 'శ్రమ' అనేది ఒక ఆయుధమైతే, నాగరాజు గారి దగ్గర అది ఒక 'ప్రతీక'గా, ఒక 'అస్థిత్వ మూలం'గా మారింది. స్థానిక మాండలికాన్ని వాడుతూనే సార్వత్రిక మానవీయ వేదనను పలికించడంలో ఆయన, తన మట్టిని ప్రేమిస్తూనే ప్రపంచ పౌరుడిగా ఎదిగిన ఒక అంతర్జాతీయ స్థాయి ప్రతిభ ఉన్న దేశీయ కవిగా నిలుస్తారు.

ప్రపంచ సాహిత్య విమర్శనా రంగంలో పల్లిపట్టు నాగరాజు గారి కవిత్వాన్ని విశ్లేషిస్తే, అది అంటోనియో గ్రాంసీ ప్రతిపాదించిన 'సబ్‌ఆల్టర్న్' (Subaltern) సిద్ధాంతానికి నిలువెత్తు రూపంగా కనిపిస్తుంది. గ్రాంసీ తన Selections from the Prison Notebooks (1971, జూ. 9) లో పేర్కొన్నట్లుగా, ప్రతి మనిషి మేధావే, కానీ సమాజంలో అందరూ మేధావుల పాత్రను పోషించలేరు; అయితే నాగరాజు గారి కవితల్లోని శ్రమజీవులు తమ వృత్తి నైపుణ్యం ద్వారా 'ఆర్గానిక్ ఇంటెలెక్చువల్స్'గా ఆవిష్కరించబడ్డారు. చెప్పులు కుట్టే తాతను బుద్ధుడితో పోల్చడం, వాల్టర్ బెంజమిన్ తన The Author as Producer (1934) వ్యాసంలో చెప్పినట్లు రచయిత కేవలం సమాజం గురించి రాయడం కాకుండా, ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వామిగా మారి శ్రమను ఒక కళాత్మక సృజనగా మార్చడమే. నాగరాజు గారు శ్రమను దైవత్వంతో సమన్వయం చేయడం ద్వారా శ్రామిక వర్గపు 'ఎస్థెటిక్స్'కు ఒక అంతర్జాతీయ గౌరవాన్ని కల్పించారు. అంతేకాకుండా, ఎడ్వర్డ్ సైద్ 'Representations of the Intellectual' (1994, జూ. 47) లో వివరించినట్లుగా, అట్టడుగు వర్గాల వారు తమ సొంత మాండలికంలో మాట్లాడటం అనేది ఒక శక్తిమంతమైన రాజకీయ ధిక్కారం. నాగరాజు గారు "నా బాదన్నేను నా బాసలో పాడుకుంటున్నాను" అని ప్రకటించడం ఈ అస్తిత్వ చైతన్యానికి నిదర్శనం. టెర్రీ ఈగిల్టన్ తన Marxism and Literary

Criticism(1976, జూ. 22) లో అన్నట్లు, కవిత్వం అనేది సామాజిక ఉత్పత్తిలో భాగమైన శ్రమ నుంచి పుట్టే రూపం. "కర్రులై యుగాల కయ్యల్ని దున్నిన దేహాలు మేము" అన్న పాదాలు ఈగిల్టన్ చెప్పిన శ్రమ–సాహిత్య బంధాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ విధంగా 'యాలైపూడ్సింది' సంపుటి ప్రాంతీయ సరిహద్దులను దాటి, ప్రపంచవ్యాప్తంగా అణచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవ గీతంగా, విశ్వజనీన సాహిత్య పీఠంపై తన స్థానాన్ని స్థిరపరచుకుంది.

ఆధార గ్రంథ పట్టిక (Bibliography)

- ♦ నాగరాజు, పల్లిపట్టు. (2020). **యాలైపూడ్సింది** (కవితా సంపుటి). హైదరాబాదు: కవి సంగమం బుక్స్.
- ♦ లక్ష్మీనరసయ్య, జి. (2020). **"మూలాల జల్లుల్లో తడిసిన కవిత్వం"** (ముందుమాట). యాలైపూడ్సింది. హైదరాబాదు: కవి సంగమం బుక్స్.
- ♦ శివారెడ్డి. (2020). **"ఏ నేటివ్ పోయిట్"** (ముందుమాట). యాలైపూడ్సింది. హైదరాబాదు: కవి సంగమం బుక్స్.
- ♦ రామారావు, చేకూరి. (2000). **సాహిత్య పరామర్శ.** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
- ♦ రామారావు, ఎస్వీ. (2012). **తెలుగు సాహిత్య విమర్శ – సిద్ధాంతాలు.** హైదరాబాదు: తెలుగు అకాడమీ.
- ♦ Benjamin, Walter. (1934).The Author as Producer.,Institute for the Study of Fascism, Paris
- ♦ Eagleton, Terry. (1976). Marxism and Literary Criticism. University of California Press.
- ♦ Gramsci, Antonio. (1971). Selections from the Prison Notebooks. (Eds. Quintin Hoare & Geoffrey Nowell-Smith). New York: International Publishers.
- ♦ Said, Edward W. (1994). Representations of the Intellectual. New York: Pantheon Books.
- ♦ Spivak, Gayatri Chakravorty. (1988). »»Can the Subaltern Speak?In Nelson, C. & Grossberg, L. (Eds.), Marxism and the Interpretation of Culture. Macmillan.

3

తెలుగు కథా సాహిత్యం – రచయిత్రుల భాగస్వామ్యం

ప్రొ. కె. శ్రీదేవి,

– ఆర్. సి. కాంతివర్ధిని

"Each generation of women writers has found it self, in a sense, without a history, forced to re-discover the past anew." - Ellain Show Snow Walter.

సమాజంలో ప్రతి అంశం పితృస్వామిక భావజాల చట్రంలోంచి నిర్వచించబడుతూ వచ్చింది. ఈ క్రమానికి సామాజిక చరిత్ర, సాహిత్య చరిత్ర కూడా అతీతంగా లేవు. అమలులో వున్న చరిత్ర రచనా పద్ధతులన్నీ పురుషకేంద్రకంగానే వున్నాయి. దీని ఫలితంగా వివిధ రంగాలలో స్త్రీలు చేసిన, చేస్తున్న కృషి ఎటువంటి గుర్తింపుకు నోచుకోకుండా పోతుంది. తెలుగులో స్త్రీ వాదం వూపందుకొని మూడు దశాబ్దాలు దాటినప్పటికీ మన చరిత్రని మనం స్వతంత్రంగా నిర్మించుకొనే పని పూర్తిగా చేయలేకపోయాం. అసలు స్త్రీవాదం లేక స్త్రీవాద (Literary tradition) గుర్తించి దాన్ని 'బలంగా ప్రతిపాదించే పనిని ఇంకా పూర్తిగా చేయలేకపోయాం. మరీ దారుణమయిన విషయం ఏమంటే, తొలి ఆధునిక తెలుగు కథ రాసింది భండారు అచ్చమాంబ అనే వ్యాస సంకలనం) విషయాన్ని మనం తిరుగులేని విధంగా ప్రతిష్ఠించలేకపోయాం. గురజాడే ఇంకా తొలి తెలుగు కథా రచయితగా గుర్తింపబడుతున్నాడు. స్త్రీల సాహిత్య చరిత్ర గురించి పాశ్చాత్య ప్రపంచంలో స్త్రీవాదులు చేస్తున్న కృషి నుంచి మనం తీసుకోవాల్సింది తీసుకుని మన అవసరాలకు అనుగుణంగా మనం వాడుకోలేక పోతున్నాం. Kate Millett Sexual Politics Elaine Show Walter A Literature of Their Own? మన సాహిత్య చరిత్రను అధ్యయనం చేయటానికి అందులో స్త్రీల సాహిత్య సాంప్రదాయాన్ని గుర్తించి అర్థం చేసుకోటానికి ఎంతగానో వుపకరిస్తాయి. అటువంటి పనికి కనీసం ఇప్పుడయినా మనం పూనుకోవటం అవసరం. స్త్రీల చరిత్రకు, స్త్రీల సాహిత్య చరిత్రకు మధ్య గాఢమైన సంబంధం వుంది. Ellen Moer అనే ఆమె అన్నట్లు "One must know the history of the women to understand the history of

literature" 2 దృష్టిలో పెట్టుకొని తెలుగులో స్త్రీల కథా సాహిత్య వికాసాన్ని పరిశీలించాల్సి వుంటుంది.

తెలుగులో స్త్రీలు ఒక సమూహంగా రచన చేయటమనేది 1940ల తరువాత అంటే స్వాతంత్ర్యం తరువాత మాత్రమే మొదలయినప్పటికీ ఆధునిక తెలుగుకథ ప్రారంభ దశలో స్త్రీలు గుర్తించదగిన సంఖ్యలో, స్థాయిలో తెలుగు కథను సంపద్వంతం చేశారు.

కనపర్తి వరలక్ష్మమ్మ, దాసరి అన్నపూర్ణమ్మ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, మైదవోలు పద్మావతి, కొమ్మూరి పద్మావతి, పులుగుర్తి లక్ష్మీనరసమాంబ, బండారు అచ్చమాంబ లాంటి చాలా మంది స్త్రీ రచయితలు కనిపిస్తారు. వీళ్ళ సాహిత్యంలో సాహిత్య విలువలు వెతకటం కంటే అసలు వీళ్ళు రచనా రంగంలోకి రావడమే గొప్ప విషయంగా మనం గుర్తించాలి. పురుషస్వామ్యం స్త్రీలను రచనా రంగానికి వెలుపలనే వుంచింది. రచన అనేది స్త్రీకి సంబంధం లేని విషయంగా ప్రచారం చేసి నమ్మించింది. అటువంటి వాతావరణంలో తాము కూడా రాయగలమనే విశ్వాసాన్ని కలిగి వుండటమే కాకుండా దాన్ని ఆచరణాత్మకంగా రుజువు చేసిన స్త్రీ రచయితలు కథా సాహిత్యంలో కనిపిస్తారు. మిగిలిన సాహిత్య రూపాలలో స్త్రీలు చేసిన కృషిని కాకుండా కేవలం కథా రచనలో స్త్రీల కృషిని చర్చించటానికి ఈ పరిశీలనను పరిమితం చేయటం జరిగింది.

వంద సంవత్సరాల తెలుగు కథా చరిత్రలో స్త్రీ రచయితలు చేసిన కృషి, తెలుగు కథ వస్తు, రూపాలలో ఎదగటానికి వాళ్ళు చేసిన contribution తక్కువ ఏమి కాదని చాలా స్థూలంగా చూసే పరిశీలనలోనైనా తేలే విషయమే. ఆ విషయాన్ని గుర్తిస్తూ తెలుగు కథా సాహిత్య చరిత్రలో స్త్రీల కృషిని ఈక్రింది విధంగా విభజించి పరిశీలించినట్లయితే కొన్ని స్పష్టమైన నిర్ధారణలకు రావటానికి అవకాశం వుంది.

(1) స్త్రీల కథారచన ప్రారంభ దశ లేదా స్త్రీల స్వాతంత్ర్యోద్యమ దశ 1902 నుంచి 1940 వరకు

(2) స్త్రీల స్వాతంత్ర్యోద్యమానంతర దశ 1940-1960

(3) స్త్రీల కథా వికాస దశ 1960-1980

(4) స్త్రీవాద రచనా దశ 1980-1990

(5) స్త్రీల అస్తిత్వ ఉద్యమాల దశ 1990-2020.

20వ శతాబ్దపు మొదటి రెండు మూడు దశాబ్దాలలో వెలువడిన పత్రికలను ముఖ్యంగా హిందూ సుందరి, సరస్వతి, గృహలక్ష్మి, వివేకవతి లాంటి పత్రికలలో స్త్రీలు రచనలు చేసారు. ఆ కాలపు స్త్రీ రచయితలు ఒక పరంపరగా రచనలు చేయటం కనిపించదు. వాళ్ళలో ఎక్కువ మంది ఒకటి రెండు రచనలు చేసి మానివేసిన వాళ్ళే ఎక్కువగా కనిపిస్తారు. అయినప్పటికి

ఇంతకు ముందే చెప్పుకున్నట్లు అసలు స్త్రీలు రాయటమే ప్రధానం అనే దృష్టితో చూసినప్పుడు మొత్తం రచనా రంగం పురుషుల ఆధీనంలో వున్న వాతావరణంలో స్త్రీలు అందులో ఏదో ఒక స్థాయిలోనైనా కొంత space ని సొంతం చేసుకోవటం చిన్న విషయమేమి కాదు. అందుకే తొలినాళ్ళ స్త్రీల కథలను పరిశీలించేటప్పుడు రూప సంబంధమైన ప్రమాణాలతో కాకుండా అసలు ఎంత మంది స్త్రీలు రాయగలరు అనే అంశాన్ని ప్రధానంగా పెట్టుకోవాల్సి వుంటుంది. అలాగే ఏఏ అంశాలపై వ్రాశారు, ఆ ప్రత్యేక అంశాలనే వాళ్ళు ఎందుకు ఎంచుకున్నారు? మిగిలిన అంశాలపై దృష్టి సారించలేక పోవటంలో వాళ్ళకున్న పరిమితులు ఏమిటి? మొదలైన అంశాలు స్త్రీల కథా సాహిత్య విశ్లేషణకు ప్రాతిపదిక కావాలి.

1902 -1940 సంవత్సరాల మధ్యకాలంలో స్త్రీ రచయితలు వేళ్ళ మీద లెక్క పెట్టగలిగినంత మంది మాత్రమే కనిపిస్తారు. ఏదైనా ఒక రంగంలో స్త్రీల ప్రవేశం అనే దానికి సమాజంలో వాళ్ళకున్న స్థానానికి సంబంధం వుంది. ఆ స్థానానికి లైంగికత్వానికి మధ్య కూడా బలమైన సంబంధమే వుంటుంది. చేతనాచేతన రూపాలలో కొనసాగే లైంగిక నియంత్రణ స్త్రీలను కుటుంబానికే పరిమితం చేసి సాహిత్యం వంటి సృజనాత్మకత, భావ వ్యక్తీకరణకు అవకాశం వున్న రంగాలకు స్త్రీలు రాకుండా నిషేధించటం అనేది సమాజంలో అప్రకటితంగా అమలవుతోంది. అంతకంటే ముఖ్యంగా రచననేది విద్యతో ముడిపడి వుంది. స్త్రీ విద్య అనేది నామమాత్రంగా కూడా సమాజంలో లేని సందర్భంలో స్త్రీలు కథలు రాయగలగటం చిన్న విషయం కాదు. 19వ శతాబ్దంలో పారిశ్రామికీకరణ మొదలైన తరువాత సంఘసంస్కరణోద్యమం వూపందుకోవటంతో స్త్రీవిద్యకు ప్రచారం జరిగి కొంతమందయినా స్త్రీలు చదువుకోటానికి అవకాశం ఏర్పడింది. అయితే ఈ అవకాశం అందరికీ దక్కటం అంత సులువుగా లేదు. స్త్రీలు చదువుకోవటమనేది అత్యంత కష్టతరమైన అంశంగా వుండేది. స్త్రీల ఈ స్థితిని గురించి Vasundara Devi అనుభవాన్ని చూస్తే స్పష్టమవుతుంది.

"I was so immersed in the sea of house work. That I, was not consceious of what I was going through day and night. After some time the desire to learnt how to read properly grew very strong in me. I was angry with myself for wanting to read books. Girls did not read That was one of the bad aspects of old system. The other aspects were not so bad. People used to despise women of learning .... In fact, older women used to show a great deal of displeasure if they saw a piece of paper in the hands of women, but I could not accept this.µµ (Women Writing In Modern India, Vol-1, Edt-Susie Tharu & K. Lalitha, P-199)

ఇంతకంటే మరింత ఆశ్చర్యకరమైన విషయం తూర్పు బెంగాల్ కు చెందిన హైమావతీసేన్ (1826, 1932) అన్న మాటలు, "Though I lived like a boy in every respect, in matters of education I remind a women. It is a popular superstition in our coun-

try that women, if educated, have to suffer widowhood". (quoted by Geraldine Forbes in "Women In Modern India", New Delhi: Cambridge University Press, 2009 P- 32).

పై పరిస్థితుల నియంత్రణలను అధిగమించి స్త్రీలు రచన చేయగలిగినవారు తక్కువ మందే అయినా ఆ కాలపు స్త్రీ రచయితలపై సంఘసంస్కరణోద్యమ ప్రభావం వుంది. అలాగే స్వాతంత్రోద్యమ ప్రభావం కూడా. సంఘసంస్కరణ గురించి స్వాతంత్ర్యాన్ని గురించి ఆ కాలపు స్త్రీ రచయితల భావాలు మిగతా పురుష రచయితల భావాలనుండి వేరుగా వుండే వీలు లేదు. పితృస్వామిక చట్రాలు అందుకు కారణం. తొలినాటి స్త్రీ రచయితల కథల్లో ఎక్కువ భాగం ఆ చట్రాలకు లోబడే వుంటాయి. భర్తలకు విధేయులుగా వుండటం, దేశభక్తి, స్వాతంత్ర్య ప్రాధాన్యత, స్త్రీ విద్య లాంటి అంశాలు స్త్రీలు రాసిన కథలకు వస్తువులు అయ్యాయి.

(2) స్వాతంత్ర్యోద్యమ దశ

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధింపచేయటానికి అన్ని వర్గాల వారు తమ అంతర్గత విభేదాలను, సంఘర్షణలను పక్కకు పెట్టి ఏక తాటిపై నడచిన చరిత్ర మనకు తెలిసినదే. అందులో భాగంగా స్త్రీలు కూడా అనాటి స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములవుతూ తమలో కలిగిన ప్రేరణలను స్ఫూర్తిని తమ వంతు పాత్రగా కథాసాహిత్యంలో చిత్రించే ప్రయత్నం కనపడుతుంది. సంఖ్యాపరంగా వీరు ఎక్కువ కథలు రాయకపోయినా ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా స్త్రీ రచయితలు తక్కువగా వున్న కాలంలో కూడా పురుష రచయితలు స్వాతంత్ర్యోద్యమాన్ని చిత్రిస్తూ రచించిన కథలలో స్త్రీ రచయితలు మూడో వంతు భాగాన్ని పూరించగలిగారు. ఇది నిజంగా అభినందించదగిన విషయం. (ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి తెలుగు స్వాతంత్ర్యో ద్యమ కథా సూచి ఆధారంగా చూస్తే మొత్తం స్వాతంత్ర్య వుద్యమ కథలు ఇరవై వున్నాయి. అందులో స్త్రీల కథలు ఏడు). వాటి వివరాలలోకి వెళితే ప్రారంభదశలో సంఘసంస్కరణోద్యమ కాలంలో నెలకొల్పిన సమాజాలు సంస్కరణ భావాలకు విశేషవ్యాప్తిని కలుగచేశాయి. స్త్రీల పరంగా ఈ కాలంలో అనేక పార్శ్వాలలో స్త్రీల గురించి ఆలోచించిన కాలం. స్త్రీల జీవితాలలో అమలవుతున్న ద్వంద్వాన్ని స్త్రీ దృష్టితో చూడలేకపోయారు. సంస్కరణ వుద్యమాన్ని బలోపేతం చేయడంలో భాగంగా సమసంఖ్యలో వున్న స్త్రీల మద్దతును పొందవలసిన చారిత్రక అవసరత ఏర్పడింది. స్రీల భాగస్వామ్యాన్ని పెంచుకోవడం వుద్యమ తక్షణ కర్తవ్యంగా అందుబాటులో వున్న ఆదర్శంగా అప్పటి సంస్కర్తలకు స్త్రీ విద్య అవసరం అయింది. అందుకే స్త్రీలు చదువుకుంటే తప్ప తాము బయట వల్లించే ఆదర్శాలకు ఇంట్లో నడిపే కార్యక్రమాలకు పొంతన లేకపోవటాన్ని సంస్కరణవాదులు గుర్తించారు. వాళ్ళ ఆలోచనలలోని కొనసాగింపుగానే ప్రారంభదశలోని మహిళా రచయితలు సైతం ఆదర్శీకరించబడిన స్త్రీత్వాన్నే తమ కథల్లో ప్రతిపాదిస్తూ రచనలు చేశారు.

బండారు అచ్చమాంబ 'స్త్రీ విద్య', 'ధనత్రయోదశి' కథానికలే ఉదాహరణ. మేధో సంతానం కోసం తన యోగ క్షేమాలను (విరహవేదనలను) తెలపడంకోసం గుర్తించిన స్త్రీల చదువు ఆవశ్యకత స్త్రీలను విద్యావంతులను చేసింది. పితృస్వామిక వ్యవస్థ తమ చుట్టూ కల్పించిన సంప్రదాయాలు ఆచారాలు వాటిలోని ద్వంద్వాన్ని గుర్తించగలిగేట్లు చేసింది.

సంఘసంస్కరణోద్యమ కాలంలో స్త్రీల కోసం చేసిన శారదా వివాహ చట్టం (1930), హిందూ వారసత్వ చట్టం (1937) రాగలిగాయి. ఈ చట్టాలు రావడానికి ఆనాడు కృషి చేసిన సంస్కర్తలయిన పురుషులతో పాటు విద్యావంతులైన స్త్రీలు కూడా పాల్గొన్నారు. ఆనాటి సమాజంలో అమలవుతున్న బహుభార్యత్వం, భర్తల విలాసాలు కుటుంబంపై భర్తల ఆధిపత్య ఛాయలు నందూరి సుబ్బలక్ష్మిదేవి 'స్త్రీతత్వము' (1934) కథలో వితంతు కూతురికి పెళ్ళి చేయని తండ్రి తాను మాత్రం పెళ్ళికి సిద్ధం కావడాన్ని రెండవ భార్యగా వచ్చిన స్త్రీ పాత్ర విమర్శిస్తుంది. స్త్రీల సమస్యలపట్ల విద్యావంతులైన స్త్రీలు స్పందించగలరని చెప్పడానికి 'స్త్రీతత్వము', 'సరస్వతి కష్టములు గట్టెక్కుట' (1929) కథలు ఆధారం. మాగంటి శకుంతలాదేవి ఈ కథలో పునర్వివాహాలను సమర్ధించారు. శారదా చట్టం వచ్చిన తరువాత రజస్వలానంతర వివాహం చేయటాన్ని ఈ కథలో చిత్రించారు. అలాగే 'ఈ రాధేనా' కథలో యల్లాప్రగడ సీతాకుమారి బాల్య వివాహాలు మానేయడం ద్వారా యుక్తవయస్సులో తాను కోరుకున్న యువకున్ని వివాహం ఆడినట్లుగా చిత్రీకరించారు. ఇదే కథావస్తువుతో "ఒకరికి 'సనాతనమూ' ఒకరికి 'సంస్కారమూ'

నా?" కథలో కె.సీతాదేవి రచించారు. ఈ దశలో సమస్యలకు పితృస్వామ్య సమాజమే. కారణమని వాటిని సమస్యలుగా గుర్తించడమే పెద్ద Land Mark. సమాజం సమస్యలను వివరించడం, ఆ సమస్యల పట్ల తమ నిరసనలను తెలపడం, ఆ సమస్యలలోని వేదనను వారు విజయవంతంగా చిత్రించగలిగారు.

1933లో వి.సరస్వతి రాసిన 'ముద్దుకూతురు' కథ కొడుకులతో పాటు కూతుళ్ళకు కూడా ఆస్తిహక్కు వుండాలని ప్రతిపాదించిన కథ. "చట్ట సభల్లో మెజారిటి మీదేగా" (గృహలక్ష్మి జనవరి 1936) రాఘవరావు పాత్ర మహిళల చైతన్యాన్ని ఆకాంక్షించే పాత్ర. పరాయీకరణను, పరాధీనతను వ్యంగ్యంగా ఎత్తిపొడుస్తూనే చతురోక్తులు విసురుతుంటారు ఈ కథలో.

1. కనపర్తి వరలక్ష్మమ్మ – 'కుటీర లక్ష్మి' 2. ఐదు మాసముల ఇరువది దినములు'
2. మైదవోలు పద్మావతి, 'త్యాగిని'
3. గుమ్మడిదల దుర్గాబాయి, –నే ధన్యతనైతిని'
4. బసవరాజు వెంకట రాజ్యలక్ష్మి, 'ఎవరిదదృష్టం'.
5. చంద్రకళ, 'ప్రేమ వేదిక మీద'.
6. తాడి నాగమ్మ 'కథ కాదు'

స్త్రీ రచయితలంతా స్వాతంత్రోద్యమంలో భాగంగా వుద్యమించటం తమ కర్తవ్యంగా భావించటమే కాకుండా భర్తలను, కొడుకులను కూడా వుద్యమంలో భాగస్వామ్యులుగా మారమనే సందేశాలు ఇవ్వటమే కాకుండా ప్రాణ త్యాగాలకు కూడా సిద్ధపడగలిగిన స్థాయి మనకు 'త్యాగిని' కథలోని తల్లి పాత్రలోనూ, 'కథకాదు' కథలోని భార్య పాత్రలోనూ. 'ఎవరిదదృష్టం' కథలోని సరళ పాత్రలోనూ రూపించారు.

ఉదాత్త ఆశయ సాధన కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి కూడా సంశయించని నిబద్ధతను రచనలలో వ్యక్తం చేయటం ఈ దశలోని రచయితల ప్రత్యేకత. స్వాతంత్ర్యోద్యమ రాజకీయాలలో ఆదర్శవంతమైన పాత్ర పోషించటానికి సుశీల దాంపత్య జీవితాన్ని త్యజించటానికి కూడా సంసిద్ధం కావడం బసవరాజు వెంకట లక్ష్మి పాత్ర చిత్రణకు పరాకాష్ఠ, మతాంతర వివాహం చేసుకున్న సుశీల – హకీం బేగ్ ను తల్లితండ్రులు ఆదరించకపోవటంతో పిరికివాడైన బేగ్ సరళను పుట్టింటికి వెళ్ళమంటాడు. కానీ, ఆమె స్నేహితురాలైన కమల దగ్గరకి వెళ్ళి ఖద్దరు వస్త్రాలు ధరించి దేశ స్వాతంత్ర్యం కోసం వుద్యమంలో భాగస్వామి అవుతుంది. వుద్యమం నిర్వహించే అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న సరళ చొరవను అందరూ గుర్తించి గౌరవిస్తారు. బేగ్ ఆమె వ్యక్తిత్వానికి ముగ్ధుడై తిరిగి ఆమెను తన జీవితంలోకి ఆహ్వానిస్తాడు. కాని, సరళ దేశానికి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపచేయటం కంటే నా వ్యక్తిగత సుఖం ముఖ్యం కాదని చెప్పే సందర్భంలో ఆమె స్వతంత్ర వ్యక్తిత్వంతో ఎదిగిన స్థాయికి ఈ క్రింది మాటలే తార్కాణం.

"నీవు పొమ్మన్నపుడు పోవటం, వుండమన్నపుడు వుండటం నా పద్ధతి కాదు. ఇది వరకైనదేదో అయింది. ఇక రాను, దేశమే నా సంసారం. నీకిష్టమైతే దేశ సేవ చేయి. మన మాతృదేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాతనే నాకు సంసార సుఖం. అంతవరకు ఎవరికి వారే. ఇది నా నిశ్చయం' (పుట – 25 – 'ఎవరిదదృష్టం' –బసవరాజు వేంకట రాజ్యలక్ష్మి – భారతి' మే 1931) అతన్ని కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనమని ప్రేరేపిస్తుంది. బేగ్ బ్రిటిష్ వాళ్ళ కాల్పుల్లోను, సరళ అనారోగ్యంతో రాయవేలూరు జైలులో ప్రాణాలు వదులుతారు.

మైదవోలు పద్మావతి – 'త్యాగిని' కథలోని తల్లి పాత్ర తన కొడుకు తనను సంరక్షించడం కోసం స్వాతంత్ర్యోదమంలో భాగస్వామి కాలేకపోతున్నాడని గుర్తిస్తుంది. కేవలం తన కోసం అతడు ఆగిపోకూడదనే వుద్దేశ్యంతో బావిలో దూకి మరణిస్తుంది. కన్నతల్లి రుణం కంటే దేశమాత రుణం తీర్చుకోవడానికి కొంత వరకు ఆస్కారం కలిగింది. ఐతే జాతీయోద్యమంలో పాల్గొనడం కోసం చేయాల్సిన సామాజిక, కౌటుంబిక త్యాగాలకు సాంప్రదాయ భావాల పరంగా వ్యతిరేకతను ఎదుర్కోలేకపోవటం వలన కూడా స్త్రీలు ఎక్కువగా ఈ సమస్యను చిత్రించగలిగారు. దీన్ని సమస్యాత్మకం చేయగలగడంలోని తీవ్రత చెప్పకుండానే చెప్పినట్లయింది. ఐతే స్త్రీల పరంగా వచ్చిన ఈ సందిగ్ధాలన్నీ జాతీయోద్యమంలో పాల్గొనడం వలన కొంత వరకు అధిగమించ గలిగారనిపిస్తుంది.

(3) స్వాతంత్ర్యానంతర దశ

సంఘ సంస్కరణోద్యమం ఏదో ఒక స్థాయిలో స్త్రీలకు సమాజంలో కుటుంబ చట్రానికి వెలువల కొంత space ఇచ్చింది. స్త్రీలు తమ శక్తిని ముఖ్యంగా మేధోశక్తిని ప్రదర్శించే అవకాశం ఇచ్చింది. స్వాతంత్ర్యానంతర దశలో భారత రాజ్యాంగం సమానత్వాన్ని మౌలిక హక్కుగా గుర్తించటం, స్త్రీలకు సమాన అవకాశాలు అవకాశాలు/వివక్షతల గురించి చట్టాలు రావటం, 1950 – 1965ల మధ్య వివాహ చట్టాలు, విడాకుల చట్టాలు, వారసత్వపు హక్కులు, స్త్రీలకు ఓటు హక్కు మొదలైన హక్కుల నేపథ్యంలో స్త్రీలు ముఖ్యంగా అంతకు ముందు జరిగిన జాతీయోద్యమంలో పాల్గొని కొంత సంతృప్తికి లోనయ్యారు. తమ జీవితంలో మార్పులు వస్తున్నాయని, తాము మరింత స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని చవిచూడబోతున్నామని ఆనందించారు. ఈ స్థితి గురించి Geraldine Forbes ఇలా అభిప్రాయపడ్డారు.

»»Many women who have participated in the social reform and political activities of the 1920s, 1930s, and 1940s were pleased with the constitutional provisions and legal reforms. Belonging to the upper and middle classes of society, they were poised to become the beneficiaries of new opportunities. The Government asked prominent womenµs organisations to assist them in developing five - year plans. These women agreed with Government that economic growth was the most silent issue and shared the assumption that women would gain from expected prosperityµµ (Women In Modern India, P224-225).

పై సానుకూల వాతావరణంలో స్త్రీలు ఒకరొకరుగా కాక సమూహాలుగా అన్ని రంగాలకు విస్తరించడం మొదలైంది. ఈ విస్తరణ సాహిత్య రంగంలో కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా కథారంగం దాకా విస్తరించడం సంతోషించాల్సిన విషయం. స్త్రీలు ఏదోఒక స్థాయిలో తమ గురించి తాము అలోచించుకోవటం, తమ ఉద్యోగాల గురించి, ఆర్థిక స్వావలంబనం గురించి చర్చించటం అంతకు ముందు వచ్చిన వుద్యమాలు ముఖ్యంగా స్వాతంత్రోద్యమం, కమ్యూనిష్టు వుద్యమం, స్వేచ్ఛపట్ల తమలో కలుగచేసిన ఆకాంక్ష అన్ని కూడా స్త్రీ రచయితలకు ప్రేరకాలయ్యాయి. అవి వాళ్ళ సాహిత్యంలో వస్తువులుగా రూపుదిద్దుకున్నాయి. స్త్రీల స్వతంత్ర వ్యక్తిత్వాన్ని చిత్రిస్తూ కథలు రావటం, స్త్రీల భావుకత్వాన్ని ఆవిష్కరించే కథలు రావటం కొంత వాస్తవికత నుండి దూరమయినప్పటికీ, కాల్పనిక ఆవేశం వున్నప్పటికీ, ఈ దశలోనే స్త్రీల కథలు ఒక take off దశగా గుర్తించవచ్చు, అలాగే ఈ దశలో స్త్రీలు సాహిత్య రంగంలో తమ space ను బలంగా నిర్మించుకున్నారు. రచనాప్రపంచం కేవలం పురుషులకు మాత్రమే చెందినది కాదని, అది తమది కూడా అని కొంతవరకు సగర్వంగా ఈ దశలో చాటదగిన వాతావరణాన్ని ఈ కథల్లో చూడవచ్చు. 'చట్ట సభల్లో మెజారిటీ మీదేగా' – కనపర్తి వరలక్ష్మమ్మ (1936 గృహలక్ష్మి), 'క్రోటన్ మొక్కలు' పరిమళా సోమేశ్వర్ (1968), 'మాకీ భర్త వద్దు' ఆలూరి విజయలక్ష్మి (1977). భర్త మొదటి

భార్యకు తెలియకుండా రెండవ భార్యను, రెండవ భార్యకు తెలియకుండా మొదటి భార్యను వివాహం చేసుకుని ఇద్దరితోనూ కొనసాగాలనుకొంటాడు. కానీ, అసలు విషయం తెలిసి ఇద్దరు భార్యలు అతన్ని వదలివెళ్ళడం ద్వారా గుణపాఠం చెప్పగలుగుతారు. ఈ కథల్లోని స్త్రీలు తమ సమస్యలపట్ల సృష్టమైన అవగాహనను ఆత్మస్థైర్యాన్ని పరిణి స్వయం చైతన్యాన్ని వ్యక్తీకరించటం మంచి పరిణామం

1960–1980ల మధ్య కాలాన్ని స్త్రీ రచనలకు, ముఖ్యంగా కథలకు సంబంధించి వికాస దశ అనవచ్చు. ఎందుకంటే అంతకు ముందు లేనటువంటి వుధృతి ఈ కాలం స్త్రీ రచయితల్లో కనిపిస్తుంది. అసంఖ్యాకమైన స్త్రీలు రచయితలుగా ఈ కాలంలో మనకు కనిపిస్తారు. ఈ దశలో దాదాపు నాలుగు వందలకు పైగా స్త్రీ రచయితలు వున్నట్లు తెలుస్తుంది. వీళ్ళలో స్త్రీ కథా రచయితల సంఖ్య కూడా దాదాపు మూడు వందల మంది కంటే ఎక్కువే. నవలా ప్రక్రియను కూడా స్త్రీ రచయితలు స్వంతం చేసుకొని విరివిగా రాయటం ఈ కాలంలో కనిపిస్తుంది. ఆధునికత ఇచ్చిన వెసులుబాటు కొంతవరకు స్త్రీలు కథారచనా రంగంలో ఎక్కువగా రావటానికి దోహధమైనది. నగరీకరణ ఫలితంగా స్త్రీలు విద్యావంతులు కావటం ఆధునిక భావాలకు దగ్గర కావటం. వున్నత వుద్యోగాలతో సహా అనేక సామాజిక రంగాలలో స్త్రీలు ప్రవేశించటం ఈ పరిస్థితులన్నీ కూడా స్త్రీల ఆలోచనా శక్తిని, భావుకతను పెంచాయి. తత్ఫలితంగా స్త్రీలు కథా రచనకు పూనుకోవటం ఎప్పుడో 1930లలో మొదలైన అభ్యుదయ సాహిత్యోద్యమం కమ్యూనిష్టు పార్టీలు చేసిన కృషి ఫలితంగా కూడా స్త్రీలు రచనా రంగం పైకి ఎక్కువ సంఖ్యలో రావటానికి దోహదమయ్యాయి. స్త్రీల రచనలలో వైవిధ్యం పెరగటం కూడా ఈ కాలంలో చూస్తాం. అయితే స్త్రీల గురించి సమాజం చేసిన సంప్రదాయ నిర్వచనాలలో ఎటువంటి మార్పులేదు. స్త్రీల గురించి కాల్పనిక దృష్టే ప్రధానంగా కొనసాగింది. స్త్రీ మనసు సున్నితమైనదని, పురుషుడి సాంగత్యంలో తప్ప ఆమె జీవితానికి అర్థం లేదని, మంచి పురుషుడిని భర్తగా పొందగలిగితే తమకే సమస్యలు వుండవని నమ్మారు. స్త్రీల పట్ల వివక్షత కుటుంబంలోనే కాకుండా కుటుంబానికి వెలుపల ఒక తీవ్రమైన స్థాయిలో కొనసాగుతోందని కొంతమంది స్త్రీ కథకులు గుర్తించడం కూడా ఈ కాలంలో జరిగింది. ఆధునికత ఇచ్చిన కొత్త సాంఘిక జీవితంలో స్త్రీలకు ఎదురయ్యే కొత్త సమస్యలను కూడా రేఖా మాత్రంగా ప్రతిబింబించటం కూడా ఈ కాలం కథల్లో కనిపిస్తుంది. సమస్యలను గుర్తించగలిగినప్పటికీ వాటిని ఎదుర్కోటానికి అనివార్యంగా అవసరమయ్యే ఆత్మ స్థైర్యాన్ని గురించిన ప్రస్థావనలు చాలా అరుదుగా కనిపిస్తాయి. సమస్యల మూలాల్లోకి వెళ్ళి విశ్లేషించే శక్తి కూడా స్త్రీ రచయితలకు ఒక పరిమితమైన స్థాయిలోనే ఈ దశలో చూడగలుగుతాం. అయితే వ్యక్తిగత సమస్యలకు వ్యక్తిగత పరిష్కారాల గురించి అన్వేషిం చటంగా అనిపిస్తుంది. సామాజికంగా సమస్యల పరిష్కారాన్ని గురించిన స్పృహ ఆ కాలపు రచయితలకు లేకపోవటం తప్పు పట్టాల్సిన విషయం కాదు. ఎందుకంటే భారతీయ పితృస్వామిక వ్యవస్థ రూపొందించిన బలమైన పునాదులను తక్కువ అంచనా వేసినట్లే అవుతుంది.

వాసిరెడ్డి సీతాదేవి 'ఆమె నవ్వింది' (1972) కథలో ఆనాడు ఉద్యోగినులపై అధికారులనుండి ఎదుర్కొంటున్న లైంగిక హింసను చిత్రించిన కథ. అమల దుర్భర దారిద్ర్యం కారణంగా అతని ప్రవర్తనను భరించాల్సి రావడం, అపుడప్పుడే మొదలైన ఉద్యోగినుల సమస్యలకు ప్రతిస్పందించే మహిళా ఉద్యోగుల రక్షణ కోసం చట్టాలు చేయాల్సిన అవసరాల్ని ఈ కథలో ప్రస్తావించారు. అమల తన విద్యార్థి దశనుండి ప్రదర్శించిన వ్యక్తిత్వం మిగిలిన వారి కంటే విలక్షణంగా రిజర్వుడుగా వుండి అతి చనువును ఎక్కడా ప్రదర్శించాల్సిన అవసరం లేని ఖచ్చితమైన వ్యక్తిగా తీర్చిదిద్దిన పాత్ర, ఉద్యోగస్తురాలిగా మారిన తరువాత తన పూర్వ ప్రవర్తనకు భిన్నంగా ప్రవర్తించక పోవటంతో పై అధికారి రంగనాథం నుండి, "మూడు రోజులు టైమిస్తున్నా ఆలోచించుకో" అన్న వేధింపులను ఎదుర్కోవాల్సివస్తుంది. కుటుంబ నిర్వహణ భారం గుర్తొచ్చి రాజీనామా ఉత్తరానికి బదులు "తోడేలును చూచిన మేకపిల్ల నవ్వుతో" పై అధికారి ప్రవర్తనను భరిస్తుంది.

(5) స్త్రీవాద దశ

1980 వ దశాబ్దం తెలుగు సాహిత్యంలో చాలా కీలకమైన దశాబ్దం. ఈ దశాబ్దంలో తెలుగు సాహిత్య వస్తు రూపాల్లో మౌలిక మార్పులు వచ్చాయి. స్త్రీ వాదం ఒక నిర్దిష్ట సిద్ధాంతంగా ముందుకు రావటం ఈ దశాబ్దంలో కనిపిస్తుంది. అంతకు ముందు సాహిత్యంలో స్త్రీల సాహిత్యంలో కూడా వ్యక్తం కాని, వ్యక్తీకరించటానికి రచయితలు బిడియపడిన అనేక అంశాలను ఈ కాలపు రచయిత్రులు వ్యక్తీకరించటం ఈ దశలో కనిపిస్తుంది. వైయక్తికాంశాలను సామాజికాంశాలలో భాగంగా చూడటం. అంతే ప్రాధాన్యత కలవిగా సమాజం చేత గుర్తింపచేయటం స్త్రీ వాదం ప్రతిపాదించిన మౌలికాంశం. ఈ ప్రతిపాదన మొత్తం స్త్రీల సమస్యలను విభిన్న కోణంలోంచి చూడటానికి ఆస్కారం కల్పించింది. స్త్రీల అనుభవ ప్రాతిపదికగా సామాజిక సమస్యలను। విశ్లేషించగలగటం, పురుషకేంద్రక భాషలో అమలయ్యే అణచివేత తీరును ధిక్కరించటం, స్త్రీ చరిత్రను స్త్రీల దృక్కోణం నుండి వ్యాఖ్యానించటం, దానిని పునర్నిర్మించే పనికి పూనుకోవటం, కుటుంబపు అస్తిత్వాన్ని, స్త్రీల ఎదుగుదలకు అది అవరోధంగా మారుతున్న తీరును నిర్దిష్టంగా విశ్లేషించగలగటం మొత్తం సమాజ విముక్తితో స్త్రీ విముక్తి ముడిపడి వుందనే సాంప్రదాయ కమ్యూనిష్టు ఆలోచనా సరళిని నిరాకరిస్తూ నిరంతరం స్త్రీ సమస్యలను గుర్తించటం, అణచివేత గురించి వున్న స్థూల అవగాహనలోంచి బయట పడి సూక్ష్మ రూపాలలో అవ్యక్తంగా కొనసాగే అణచివేతలను గురించి మాట్లాడటం, కుటుంబం అనేది స్త్రీ లైంగికతను అణచివేసే చట్రంగా ఎలా రూపొంది కొనసాగుతుందో రుజువు చేయటం లాంటి పనులు స్త్రీలు ఈ కాలంలో తాత్విక, సాహిత్య రంగాలలో కొనసాగించారు. అలాగే స్త్రీ రచనా సాంప్రదాయమనేది ఒకటి తెలుగు సాహిత్యంలో కొనసాగుతుందనే విషయాన్ని కూడా ఈ కాలంలో రుజువు చేయటం జరిగింది.

 ISSN: 2319-3905

స్త్రీలు తమ అస్తిత్వాన్ని గురించి తాముగా ఆలోచిస్తున్న తీరు ఈ కాలపు కథల్లో ప్రతిఫలించింది. స్వీయానుభవం కథారచనకు ప్రేరణ కావటం వల్ల ఈ కాలపు స్త్రీలు కథల్లో విస్తృతి, వైవిధ్యం కనిపిస్తాయి. రాజకీయాలతో పాటు లైంగిక రాజకీయాలను గురించి కూడా స్త్రీ కథకుల కాల్పనిక సాహిత్యంలో ఈ కాలంలో చర్చించటం కనిపిస్తుంది.

స్త్రీని ఒక అమూర్త మానవుడి category లో కాకుండా ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన జీవి అనే స్పృహ ఈ కాలపు కథలు కలిగిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా రాజకీయ వుద్యమాలు ముఖ్యంగా కమ్యూనిష్టు రాజకీయ వుద్యమాల ఆలోచనా సరళిలో వుండే పురుష కేంద్రక దృష్టిని ప్రశ్నించటం, వాళ్ళ ఆలోచనకు గల తాత్విక పరిమితులను గురించి చర్చించటం కూడా ఈ కాలం కథల్లో కనిపిస్తుంది. ఒక సమస్యను కేవలం ఆర్థిక కోణం నుంచి మాత్రమే కాకుండా కులం, లింగం (Sex) లాంటి ఆర్థికేతర అంశాలనుంచి అవగతం చేసుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ దశలోని కథలు నొక్కి చెప్పాయి, స్త్రీ పురుష సంబంధాలలో ప్రజాస్వామిక సంబంధం కరువయినప్పుడు అక్కడ నుండి బయటపడి స్వతంత్ర్యంగా తనదైన space ను సృష్టించుకొనే ప్రయత్నం చేస్తున్న స్త్రీల ధైర్యాన్ని కూడా ఈ కాలపు కథలు ప్రతిఫలించాయి.

ప్రపంచీకరణ ఫలితంగా ముందుకు వచ్చి ఆర్థికాభివృద్ధి నమూనా ఎజెండానునిలదీయటం అది ఇప్పటికే మార్జినలైజ్ చేయబడ్డ స్త్రీల జీవితాలను మరింత ధ్వంసం చేస్తుందనే భావాన్ని నగర జీవితం పట్ల వ్యామోహం, అది అంతిమంగా వ్యక్తుల జీవితాల్లో డొల్లతనాన్ని మిగుల్చుతున్న వైనాన్ని 1 ఈ దశలో కుప్పిలి పద్మ లాంటి ఈ కాలపు రచయితలు చిత్రించారు.

1980లలో స్త్రీవాదులు చేసిన అస్తిత్వ సంబంధ ప్రశ్నలు ఆ కాలపు సాహిత్యాన్ని ముఖ్యంగా కథా సాహిత్యాన్ని బలోపేతం చేశాయి. క్రమంగా అవి మిగతా అస్తిత్వ వుద్యమాలకు దన్నుగా నిలిచాయి.

(6) అస్తిత్వ వుద్యమాల దశ

1990ల నుంచి ఇప్పటి దాకా కొనసాగుతున్న కాలాన్ని అస్తిత్వ వుద్యమాల దశగా చెప్పవచ్చు. ఎందుకంటే స్త్రీవాదం, దళిత వాదం, ముస్లిం మైనారిటి వాదం లాంటి అస్తిత్వ వుద్యమాలు ప్రపంచ రాజకీయ, సాహిత్య వుద్యమాలుగా నిలదొక్కుకొని నిర్దిష్టంగా పని చేస్తున్నాయి. వీటి ప్రేరణలలోంచి మంచి సాహిత్యం వస్తోంది. స్త్రీ వాదం, దళిత వాదం రెండూ కూడా అమూర్తతను ప్రశ్నిస్తూ ముందుకు వచ్చిన వుద్యమాలు. అయితే ఈ ఉద్యమాలలో కొనసాగుతున్న ప్రజాస్వామిక వైఖరి వల్ల ఆ వుద్యమాలలో వున్న అమూర్తతను గురించి కూడా ప్రశ్నలు వేయటం ఇవాళ జరుగుతోంది. ఇదొక మంచి పరిణామం. స్త్రీలు అనే స్థూల అర్థంలో ఒక కేటగిరీగా పరిగణించినప్పటికీ సూక్ష్మ అర్థంలో స్త్రీలనందరినీ ఒకే గాటన కట్టేయడం సరి కాదు. ఎందుకంటే స్త్రీల మధ్య కూడా కులం, మతం, తెగ లాంటి అంతరాలున్నాయి.. ఈ అంతరాలలో కూడా ఏదో

ఒక రూపంలో అణచివేతకు కారణమవుతున్నాయి. ఈ అణచివేతను ప్రశ్నించటం కూడా ఇవాళ కథాసాహిత్యంలో కనిపిస్తుంది. అలాగే దళితులు కూడా స్థూల అర్థంలో ఒక కాటగిరీ. సూక్ష్మ అర్థంలో దళితుల మధ్య కూడా ఈ అంతరాలు స్పష్టంగా వున్నాయి. మాదిగ దండోరా వుద్యమం ఈ అంశాన్ని స్పష్టం చేసింది. ఈ అంతరాల్ని ప్రశ్నించే వుద్యమం ఇవ్వాళ దళిత బహుజన స్త్రీలు కొనసాగిస్తున్నారు. దీనికి కథారూపాన్ని కూడా ఇవ్వగలుగుతున్నారు అనడానికి సాక్ష్యం బహుజన స్త్రీల సంకలనం 'ఎల్లమ్మ', దళిత మైనారిటీ స్త్రీల సంకలనాలు 'నల్లపొద్దు' 'నాగేటిచాళ్ళలో'. మైనారిటీ సాహిత్యంలో మాత్రం పై రెండు వుద్యమాలలో వున్నంత స్పష్టత, అంతరాలు అటు రాజకీయరంగంలోగాని ఇటు సామాజిక రంగంలోకానీ వ్యక్తం కాలేదు. ఫలితంగా ముస్లిం మైనారిటీల సాహిత్యం ఒక స్థూల సాహిత్య వుద్యమంగా కొనసాగుతోంది. ఆ కోవలోనే కథా సాహిత్యం కూడా వస్తుంది. అయితే సంతోషించాల్సిన విషయం ఏమంటే ఇప్పుడిప్పుడే ముస్లిం మైనారిటీ వాదంలో అమూర్తత బహిర్గతమయ్యే క్రమం మొదలైంది.

ముస్లిం మైనారిటీ స్త్రీల కథలను షాజహాన 'సండాస్' కథలో ముస్లీం స్త్రీలు మరుగు దొడ్డికి వెళ్ళటం ఈ కథలో ఎంత భయంకర అనుభవమో వ్యక్తం చేస్తుంది. వినోదిని దళిత, క్రైస్తవ, మైనారిటీ స్త్రీలు అదే సమస్యను తాము వృత్తిగా చేసుకుని ఆ 'సండాస్' లను శుభ్రం చేయడానికి పడుతున్న అమానవీయతను 'బ్లాక్' కథలో వ్యక్తం చేయగలిగారు. ఈ రెండు కథలు మైనారిటీ స్త్రీల కథలే. కానీ ఒక వర్గం స్త్రీలు అనుభవిస్తున్న దుర్భరత్వానికి రెండవ వర్గానికి చెందిన స్త్రీలు అనుభవిస్తున్న దుర్భరత్వాన్ని, ఈ రెండు కథలను మైనారిటీ అస్తిత్వ స్పృహతో చూచినపుడు చాలా స్పష్టంగా ఈ రెంటి మధ్య గల వైవిధ్యాల అస్తిత్వ నేపథ్యం నుండి వ్యక్తమయ్యే అనుభవ విభిన్నత అవగతమవుతుంది.

'గత వంద సంవత్సరాల కాలంలో స్త్రీల కథా సాహిత్యం నడుస్తున్న చారిత్రక కాలక్రమాన్ని ప్రశ్నిస్తూ, ప్రజాస్వామిక సంబంధాలు బలపడటానికి స్త్రీ జీవితాల్లో మార్పులు (U రావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తూ ముందుకు నడుస్తోంది. ఈ మొత్తం క్రమాన్ని స్త్రీల కథా సాహిత్యం స్థూల, సూక్ష్మ రూపాలలో ప్రతిఫలిస్తోంది. తద్వారా ఈ వంద సంవత్సరాల తెలుగు కథా వికాసంలో స్త్రీలు గణనీయమైన పాత్రనే నిర్వహించారనే చారిత్రక సత్యాన్ని రుజువు చేస్తోంది. Elain Showalter స్త్రీల రచనా చరిత్రలో మూడు దశలు గుర్తిస్తూ ఈ విధంగా అంటున్నారు.

"First, there is a prolonged phase of imitation of the prevailing modes of the dominant tradition, and internalisation of its standards of art and its views and social roles. Second, there is a phase of protest against these standards and values, and advocacy of minority rights and values, including a demand for autonomy. Finally there is a phase of self discovery, a turning inward freed from some of the dependancy of opposition, a search for identity. An appropri-

ate terminology for women writers is to call these stages, feminine, feminist and female."

ఈ విభజన పూర్తి స్థాయిలో కాకపోయినా కొంత స్థూల స్థాయిలో తెలుగు స్త్రీ వాద సాహిత్యాన్ని అనువర్తింపజేసి చూసినప్పుడు 1900 – 1980ల వరకు Feminism దశగాను 1980 లనుండి వర్తమానం వరకు Feminist దశగాను గుర్తించి, ఇప్పటి నుండి ఇక రాబోయే దశ Female దశగా వుండబోతోందేమో చూడాలి. దీన్ని నిర్దేశించేది స్త్రీవాద రాజకీయాలు, సాహిత్యాచరణ అనటంలో ఎటువంటి సందేహం లేదు.

ఉపయోగపడిన పుస్తకాలు

1. చంద్రశేఖర రెడ్డి రాచపాళెం, కథాంశం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2000.
2. తెలుగు కథకులు–కథన రీతులు–సింగమనేని నారాయణ(సం.) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2005.
3. శ్రీదేవి కిన్నెర, స్త్రీల కథాసాహిత్యం, 'పాలపిట్ట' సాహిత్య మాస పత్రిక -- 2012.
4. గోగు శ్యామల, జూపాక సుభద్ర, 'నల్లపొద్దు' (సంపాదకులు),హైదరాబాద్ బుక్ ట్రస్ట్,2003.
5. నాగమ్మ పూలే, విజయలక్ష్మి, (సంపాదకులు) ఎల్లమ్మలు,జ్వలిత ప్రచురణలు, హైదరాబాద్. 2009.
6. అచ్చమాంబ బండారు, ధన త్రయోదశి – హిందూ సుందరి మాసపత్రిక 1902
7. అచ్చమాంబ బండారు స్త్రీ విద్య – హిందూ సుందరి మాసపత్రిక – డిసెంబర్ 1902.
8. కనపర్తి వరలక్ష్మమ్మ – కుటీర లక్ష్మి' ఆంధ్ర పత్రిక – ఉగాది సంచిక, 5, 1924.
9. కనపర్తి వరలక్ష్మమ్మ 'ఐదు మాసముల ఇరవది దినములు','పాలపిట్ట' సాహిత్య మాస పత్రిక 2012.
10. మైదవోలు పద్మావతి 'త్యాగిని', గృహలక్ష్మి' మహిళా మాసపత్రిక – జనవరి 1931.
11. గుమ్మడిదల దుర్గాబాయి, 'నేధన్యతనైతిని' భారతి – అక్టోబర్, 1921.
12. బసవరాజు వెంకట రాజ్యలక్ష్మి – 'ఎవరిదదృష్టం' భారతి – మే, 1931.
13. చంద్రకళ, 'ప్రేమ వేదికమీద' భారతి, తెలుగు సాహిత్య మాసపత్రిక -- 1932.
14. తాడి నాగమ్మ 'కథ కాదు' భారతి, తెలుగు సాహిత్య మాసపత్రిక – సెప్టెంబర్, 1935.

4

చిత్తూరు కవిత్వం – విద్య

– బి. శంకరరాజు

చదువుకుంటేనే ఉద్యోగాలు లభిస్తాయి, ఉద్యోగాలుంటేనే భవిష్యత్తు బంగారు బాటవుతుందని నమ్మేవారు ఈ సమాజంలో అధికంగా ఉన్నారు. నాడు ఆంధ్రోద్యమకారులు మద్రాస్ ప్రెసిడెన్సీ నుండి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని భావించడం జరిగింది.

నేడు చదివే చదువును బట్టి రాష్ట్ర సరిహద్దులు దాటి దేశ, విదేశాలలో ఉద్యోగాలు పొందుతున్నారు.

చదువు ఒక ఉద్యోగ సంపాదనకే అని భావిస్తే అది పాక్షిక సత్యమవుతుంది.

స్వాతంత్రోద్యమం సమయంలో భారతీయులు లక్షల రూపాయల సంపాదనగల ఉద్యోగాలను దేశ విముక్తి కోసం వదిలేశారు. దీనికి కారణం దేశభక్తి, సంస్కృతిని రక్షించుకోవాలనే తపనతో కూడిన ఉన్నతమైన సంస్కారం.

చదువు వలన సంస్కారం పెరుగుతుంది. వ్యక్తి సంస్కృతికి పరిపూర్ణత లభిస్తుంది. అటువంటి సాంస్కృతిక భావనల నుంచే సామాజిక బాధ్యత ఏర్పడి సమాజ సేవకులుగా మారుతారు.

గాడిచర్ల హరి సర్వోత్తమరావు "వందేమాతరం" అని నినదించి రాజమండ్రిలో కాలేజి నుండి సస్పెండ్ అయ్యాడు. దర్శి చెంచయ్య దేశ సేవ కోసం ఉద్యోగాన్ని వదిలేశాడు.

బడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఉన్నత చదువులు చదివి,ఉన్నత పదవులు పొంది వారికి మార్గదర్శకుడయ్యాడు డా॥అంబేద్కర్. ఉన్నత చదువులు చదివి, ఉన్నత పదవులు పొంది గురువులకే గురువయ్యాడు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్.

చదువులు వ్యక్తిగత అభివృద్ధికి, సమాజ సేవకు రెండింటికీ ఉపయోగపడతాయని రచయితలు, కవులు కూడా గుర్తించారు.

అటువంటి ఆలోచనలలో చిత్తూరు కవులు ఒక అడుగు ముందే వున్నారు.

"అఆఇఈ అచ్చులు మేమే
కఖగఘ హల్లులు మేము
విడదీయరాని విసర్గలు మేమే
భూ... దిగంతాల గుణింతాలు మేమే మేము!"[1] అంటూ

అక్షరాస్యత ప్రాధాన్యతను కె.ఎమ్.బాలరాజు తెలిపారు.

అక్షరాస్యత పెంపుదల కోసం అందరూ తమ వంతు ప్రయత్నాలు చెయ్యాలని, కడుపుకు ఆహారం, మనసుకు "కళాత్మక విద్య" అనే ఆహారం అందించేవారు కావాలంటారు కవి జె.మునిరత్నం.

"అఆలను దిద్దించి అక్షరమాలను
సహజ భూషణముగా సలుపునెవడు
కథలతో సూక్తుల కళలతో గుండెకు
ప్రీతినన్నము బెట్టి పెంచునెవుడు"[2]

కేవలం అక్షరాలను, వాక్యాలను బట్టీ పట్టించడం కాదు, కథలు చెప్పి మనసును ఉల్లాసపరుస్తూ చదువు చెప్పాలని అంటారు "ఇంటు – ఇంటు" కవితలో ఈ కవి.

విద్యకు చాలా విశాలమైన లక్ష్యాలున్నాయి. చదువుకోవాలని అనుకొనేవారు ఉద్యోగ లక్ష్యంతో పాటు మిగతా లక్ష్యాలను కూడా గమనంలో ఉంచుకోవాలంటారు కవి.

"చదువు నేర్వ నువ్వు లేవరో... ఓ... రన్నా!
సమతను అందించరారో...ఓ..రన్నా!
మమతను నేర్పించరారో... మాయన్నా!"[3]

కులమతాల అడ్డుగోడలు తెలియని సామాజిక సంబంధాలను తెలుసుకొనే విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించుకొనే విద్యను పొందాలంటారు కవి.

పుస్తకాల బరువును పదిహేను సంవత్సరాల పాటు మోసి మోసి కష్టపడి చదివే విద్యార్థులకు వారి మనసుకు, శరీరానికి కలిగిన కష్టాల బరువును తొలగించుకొనే చదువును గురువులు చెప్పాలని అంటారు.

"పల్లెపల్లె నువు తిరిగి ప్రగతి మాట నువ్వుజెప్పి
బతుకు బరువు తగ్గించే పద్ధతులను భోద చేసి
బతుకు మీద ఆశజూపి బతుకును నేర్పించనువ్వు
సదువులు సదువించ బూనరో...![4]

అలాగే చదువుకొన్నవారు రైతుకూలీలకు అండగా నిలవాలని, బంజరు భూముల్లో ధాన్యరాశులు పండించే పద్ధతులు తెలపాలని, దున్నేవాడికి భూమి లభించే మార్గాన్ని చూపించాలని అంటారు ఈ కవి.

విద్యావంతులు, గురువులు ఇంతటి విశాలమైన భావంతో కూడుకొన్న లక్ష్యాలను సమాజానికి ప్రజలకు సాధించపెట్టగలరా! అని అనుమానం కలగవచ్చు. ఇతర జిల్లాలలో పరిస్థితి ఏమిటోగానీ చిత్తూరు జిల్లాలో జరిగిన విద్యాభివృద్ధి వలన ఇది సాధ్యమేనని చిత్తూరుకు చెందిన తొలితరం కవి కె.సభా తన "వేదభూమి" పద్యకావ్యంలో..

"వేంకట రమణుని విశ్వవిద్యాలయ
ప్రాంగణంబున గడ్డిపరకలైన
పదునైన కలములై పసమించు కవితల
రుచులీనుచుండు పరోక్ష గతుల
వెంకటేశుని దివ్య విశ్వవిద్యాలయా
వరణములో చెదపురుగులైన
పట్టుగిల్లిన యట్టి పరిశోధనాసక్తి
విజ్ఞాన శాస్త్రాల వింగడించు"[5]

అన్ని వర్ణాలకు చెందిన విద్యార్థులకూ దన్నుగా నిలచే విద్యాలయం. శారదామాత ఆశీస్సులు అందిస్తుంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను తప్పక సాధించగలరు.

వ్యవసాయ విద్యలు చదివి ఎండి బీటలు వారే ఎడారి భూములలో మంచి పంటలు పండించగలరు. విశ్వామిత్రుని వలే ప్రతి సృష్టి చేసే విద్యార్థులు తయారవుతారు. కరువు రక్కసిని తరిమివేసే భీమసేనులు ఈ నేలలో తయారవుతారని ఎంతో నమ్మకంతో అంటారు ఈ కవి.

"పశువైద్య విద్యాలయంబు నందు
శాస్త్రముల సహదేవులై జగమునందు
కామధేనువులను పెంచగలరు ముందు"[6]

వర్షంలేక పంటలు పండకపోతే రైతులకు జీవన భృతిని అందించేది పాలిచ్చే ఆవులే. అటువంటి పశుసంపదను వృద్ధిచేసే పరిశోధనా విద్యాలయం గురించి కవి భావన ఇది.

అలాగే తిరుపతిలోని సంగీత విద్యాలయాలు, మదనపల్లెలో వెలసిన ప్రసిద్ధ విద్యాలయాల గురించి వాటి అభివృద్ధికి కృషి చేసిన దాతల గురించి కూడా ఈ కవి, కవిత్వీకరించారు.

విజ్ఞానవంతులవడానికి విద్య ఒక సాధనం. జీవన నైపుణ్యాలు లేక జీవితం మీద విరక్తి పొందేవారికి తన చుట్టూ గిరిగీసుకొని బ్రతికే బావిలోని కప్పలకు కవయిత్రి సి. హెచ్. అమల.

ISSN: 2319-3905

"చదువు నేర్చుకొని బ్రతుకు విలువ తెలుసుకోవాలి

....

కమ్ముకొన్న అజ్ఞానం చదువుతో తొలగాలి

....

విద్యనభ్యసించి తరలిరండి

పరిసరప్రాంత విషయాల్ని, దేశకాల సంఘవిషయాల్ని

క్షుణ్ణంగా తెలుసుకోవాలి

గుడిసె గుడిసెలో

చదువు తల్లిని ముందుతెద్దాం"[7]

ఇదే విషయాన్ని కవయిత్రి టి. శాంతాదేవి "ఉండాలోయ్ ఉండాలి" అను కవితలో మరింత స్పష్టంగా చెప్పారు.

"అక్షరంపై అక్కర – అతిథిపై గౌరవం

అడివిపై మక్కువ – ఉండాలోయ్ ఉండాలి" [8]

అంటూ అడవుల ప్రాధాన్యతను కూడా చదువు ద్వారానే గుర్తించగలరని అంటారు కవయిత్రి.

అటువంటి ప్రాధాన్యతను గల్గిన చదువును నిర్లక్ష్యం చేసిన యెడల ఏర్పడేటటువంటి దుష్పరిణామాలు గురించి తెలిపారు కవి పి. శ్రీరాముల రెడ్డి "ఒక బాల కార్మికుని వేదన" అను తన కవితలో ...

"చదువు సంధ్యలు లేక

చెల్లా చెదురైన మనసుతో

చిన్న చిన్న దొంగతనాలకు దగ్గరై

సంఘములో చీడపురుగుల మైతిమి"[9]

ఇన్ని రకాల విద్యా నైపుణ్యాలను, జీవన నైపుణ్యాలను విద్యావంతులు నేర్చుకొన్నాక వీరిలో ఎటువంటి సంస్కారం ఏర్పాడాలి! ఎటువంటి సంస్కృతిని వీరు రూపొందిస్తారు? అనేటటువంటి ప్రశ్నలకు మరొక కవి ఎమ్.షణ్ముగం తన "సంస్కారం" కవితలో జవాబులు చెప్పారు.

"మంచి చెడులనెరగి మనగవలయునన్న

విద్యలెన్నియున్న వీలుగాదు

సత్తుగల్గినట్టి సంస్కార విద్యయే

సకల విద్యలకును సంపదౌను"[10]

అంతేకాదు సంస్కృతి ప్రాధాన్యతను కూడా తన కవిత ద్వారా ఇలా తెలిపారు.

"విషయమార్జించి యిచ్చెడి విద్యలెన్ని నేర్చిననుగాని సంస్కృతిని నేర్వలేని

విద్యలన్నియు వ్యర్థమే వినుతశీల మదిని గుర్తించి మసల మంచిదౌను"[11]

మంచి చెడుల విచక్షణాజ్ఞానం, సత్యం, ధర్మం, మమతాను రాగాలు, మానవత్వం మొదలగునవి మనిషిని సమాజంలో సంస్కారవంతునిగా నిలబెడతాయని చెబుతారు కవి.

విద్యవలన పొందిన సంస్కారం, విలువలు పాటించే గుణం, మనిషిని దిన చర్యలలో, ఎంచుకొన్న వృత్తి జీవన విధానంలో బహిర్గతమవుతాయి.

విద్యావంతులు కొందరు స్వదేశంలో స్థిరపడితే మరికొందరు విదేశాలలో ఉద్యోగాలు చేస్తూ జీవిస్తుంటారు. అటువంటివారు పాటించవలసిన విలువల గురించి కవి ఎమ్.డి. నాయుడు తన "అమెరికా ఉద్యోగి" కవితలో ఇలా అంటారు.

"అమ్మనాన్న అలసిసొలసి హైటెక్ చదువు చదివిస్తే

నీవు అమెరికాకు పోయి ఆర్థికంగా బలపడిపోయి అందరిని మరిచిపోవద్దు.....

....

అమ్మనాన్నలపై అనురాగము

అందుకే వారు డాలర్లు వద్దు

ఇండియానే ముద్దు అమ్మనాన్నల చూడొచ్చు"[12]

డాలర్ల సంపాదనకంటే అమ్మ నాన్నల సేవకు ప్రాధాన్యతనిచ్చే సంస్కారం అలవరచుకోవాలని కవి భావన. అలాగే స్వదేశం పట్ల కూడా ప్రేమను కలిగి ఉండాలంటారు ఈ కవి.

విదేశాలకు వెళ్ళకుండా స్వదేశంలో వుండే విద్యావంతులందరూ దేశభక్తి పరులని అనుకోవడానికి వీలులేదు. వారు కూడా సంస్కారం, సంస్కృతిని అనుసరించి జీవించాలి. లేనట్లయితే దేశానికే భారమవుతారని తన "విద్యార్థి ప్రస్థానం" కవితలో కవి కె.వి.ఎస్ రాజు అంటారు.

"దొరవేషంలో దొంగవై

పరదేశీయుల తొత్తువై

ప్రజాసేవ ముసుగులో

తలపెట్టకు దేశద్రోహం"[13]

పొగతాగుతూ, కాఫీలు తాగుతూ, నిషాలో ఖుషీ చేస్తూ సినిమా పోస్టర్లకు పూలమాల వేస్తూ కాలక్షేపం చేస్తే బిగుసుకొన్న నరాలతో వ్యర్థ జీవివై, చరిత్రహీనునిగా మారవద్దు అంటూ చదువుకొన్న యువకులకు హెచ్చరికతో కూడిన చక్కని సందేశం ఇచ్చారు కవి. [14]

ఈ అవలక్షణాలు లేకుండా పొందిన విజ్ఞానాన్ని తెలివిగా ఉపయోగించుకొంటే విద్యార్థులు దేన్నయినా సాధించగలరని అంటారు తన కవిత "విద్యార్థి మిత్రమా" అను కవితలో కవి టి.రాజేష్.

'ప్రవాహంలో పోటీ.... ప్రవహించడం ప్రతి దినం చూస్తున్నావు.
సామర్థ్యంతో, సాధన, కర్తవ్యాలతో సాగుమా"
....
చక్కగా చదివేటి చంద్రమా
తలపెట్టిన కార్యాన్ని తపించి పూర్తిచేయి మిత్రమా"[14]

ఇటువంటి అవలక్షణాలే బ్రిటిష్ ఆంధ్రదేశంలో కూడా కనిపిస్తాయి.

విదేశీ పరిపాలన వలన, స్వయం కృతాపరాధం వలన అనేక అవలక్షణాలు సమాజంలో చోటు చేసుకోవడాన్ని నాటి కవులలో ప్రముఖుడైన కవికోకిల దువ్వూరు రామిరెడ్డి గుర్తించారు.

రైతులనుద్ధేశించి కవిరామిరెడ్డిగారు అన్న మాటలు విద్యార్థులు, ఉన్నత విద్యావంతులకు కూడా వర్తిస్తాయి.

గ్రామ పరిశ్రమలు నశించాయి. సహకారగుణం లోపించింది, సత్యజీవనం, ఐకమత్యం తగ్గాయి. బూటకం, మోసాలు, ఫోర్జరీలు, మత మౌఢ్యం పెరిగిపోయాయని విచారం వ్యక్తం చేశారు. దానికి పరిష్కారాన్ని కూడా కవి తన పద్యకవితలో తెలిపారు.

"కాన జీవనం సంగ్రామ కార్యమందు
విజయ వగులుకు శౌర్యంబు, విద్య, బుద్ధి
సత్యసంధత, యాత్మ విశ్వాస మనెడు
నాయుధంబుల విడవకు"[15]

నిరక్షరాస్యత, అవిద్య చీకట్లను తరిమి వేయడానికి చిత్తూరు కవులందరూ కవిత్వం దివిటీలతో చిరుకాంతులను సృష్టించారు. ఈ విద్యాకాంతుల దివిటీలను రాబోయే తరం కవులు కూడా మరింత కాంతివంతం చేయడానికి కృషి చెయ్యాలి.

ఇక చదువుకోవాలనే బాలలందరికీ యువకులందరికీ విద్యను పొందే మార్గం. జీవన నైపుణ్యాలను పొందే మార్గం స్పష్టంగానే కనిపిస్తుంది.

పాదసూచికలు:

1. కవితా సుమాలు, కవితా సంకలనం, ప్రథమ ముద్రణ, 1975-61 ప్రచురణ చిత్తూరు జిల్లా రచయితల సంఘం, చిత్తూరు.
2. కవితా సుమాలు, కవితా సంకలనం, ప్రథమ ముద్రణ, 1975-20 ప్రచురణ చిత్తూరు జిల్లా రచయితల సంఘం, చిత్తూరు.
3. గాయాలు, కవితా సంపుటి, రచయిత – గొడుగుచింత గోవిందయ్య వెన్నెల సూర్యప్రచురణ, సంవత్సరం – 2022, దామలచెరువు, చిత్తూరు జిల్లా- 25

4. గాయాలు, కవితా సంపుటి, రచయిత – గొడుగుచింత గోవిందయ్య వెన్నెల సూర్యప్రచురణ, సంవత్సరం-2022, దామలచెరువు, చిత్తూరు జిల్లా-25
5. వేదభూమి రచయిత కె. సభా, ప్రథమ ముద్రణ-1974, శ్రీరమణ ప్రచురణలు, చిత్తూరు-73
6. వేదభూమి రచయిత కె. సభా, ప్రథమ ముద్రణ-1974, శ్రీరమణ ప్రచురణలు, చిత్తూరు-75
7. కవితా సుమాలు-23
8. కవితా సుమాలు-54
9. కవితా సుమాలు-18
10. కవితా సుమాలు-40
11. కవితా సుమాలు-40
12. కవితా సుమాలు-24
13. కవితా మంజరి, చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రచురణ, ప్రథమ ముద్రణ 2004, చిత్తూరు-24, 25
14. కవితాసుమాలు-52
15. కృషీవలుడు పద్యకావ్యము, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథమాల, 7వ ముద్రణ-1957, పెమ్మారెడ్డి పాలెం, నెల్లూరు జిల్లా-32

5

బౌద్ధం జాతక కథలలో రామాయణం

- యం. రాజు

బౌద్ధవాఙ్మయం లంకావతార సూత్రమను మహాయాన గ్రంథం కలదు. ఇది మూడవ శతాబ్దానికి చెందినది.[1] ఇందు రావణుడు మహాయాన మతావలంబి. సీతాజన్మ వృత్తాంతం చిత్రంగా ఉంది. ఋషీశ్వరుల రక్తమును తాగుటచే మండోదరి గర్భవతియై సీతను ప్రసవించినదట. కాని బౌద్ధ జాతకకథలలో రావణుని ప్రస్తావన లేదు.

రామకథను చెప్పే జాతకకథలు తొమ్మిదివరకు కనిపిస్తున్నాయి. అందులో అవిశ్రమ, వెశ్శన్ తర, శంబుల ఈ మూడు కథలు రామాయణంలోని కథాఘట్టాలలో ఒక్కొక్కదానితో మాత్రమే సాదృశ్యాన్ని కలిగి ఉన్నాయి. శమజాతకములో శమనకుడు మిగాశమ్మతి నదిలో నీరు తోడుకొంటుండగా కాశీరాజగు పిలియఖ్ఖ వింతజంతువనుకొని విషపూరిత బాణము వదలగా శమనకుడు మరణించుట. ఆ రాజే స్వయంగా ఆ వృద్ధ అంధదంపతులకు వారి పుత్రుని మరణాన్ని తెలుపుట కలదు. అంధముని శ్రావణకుల వృత్తాంతమున కిది సమాంతరముగా ఉంది.

వెశ్శన్ తర జాతకములో అరణ్యవాసమునకు వెళ్ళేముందు తన భార్య మద్దితో అరణ్యవాసములో కష్టనష్టాలను వివరించి, రావద్దని అంటే ఆమె- నువ్వున్నచోటే నాకు అన్ని సౌఖ్యములు, నినువీడి జీవించలేనని బదులు ఇస్తుంది. ఈ సంభాషణ సీతారాముల సంభాషణకు సరిపోలుతుంది. వెశ్శన్ తర తన భాగ్యమునంతటినీ దానము చేయుట, శ్రీరాముడు వనవాసిగా వెళుతూ తన భాగ్యమును దానముచేయుటతో సరిపోలుతుంది. ఈ కథ అయోధ్యాకాండ ఘట్టమునకు ప్రతిబింబిము వలె ఉంది.

శంబుల జాతకమున- శంబలుడను రాజు సొట్టిసేనుడను కాశీరాజు భార్యను ప్రేమించెను. ఆమె విముఖత చూపగా ఆమెను ఖండ ఖండలుగా చేస్తానంటాడు. ఇది రావణుడు సీతను తనని ప్రేమించని యెడల ముక్కలు చేస్తాను అన్నట్లుగా ఉంది.

దశరథ జాతక కథ : ఇది రామాయణమునకు మూలంగా వెబర్ పండితుడు పేర్కొనిన దశరథ జాతకకథ. బౌద్ధమత గ్రంథములకు ప్రధానభాష అయిన పాళీభాషలో ఉంది.

కాశీపురమునకు రాజైన దశరథునికి ఆరువేలమంది భార్యలు. వారిలో పెద్దభార్య ఇద్దరు పుత్రులు, ఒక పుత్రికను కని మరణించెను. ప్రథమ పుత్రుడు రామపండితుడు, రెండవవాడు లక్ష్మణుడు, కుమార్తె సీత

పట్టమహిషి మరణించడంతో రాజు మరొకరిని మహారాణిగా చేసెను. ఆమెవలన భరతుడనే కుమారుడు కలిగెను. మహారాజు ఆ పుత్రుని అమితంగా ప్రేమించి అతని తల్లిని ఏదైనా వరము కోరుకోమనెను. ఆమె కుటిల సంకల్పముతో పుత్రునికి ఏడు సంవత్సరముల వయస్సు వచ్చినందున రాజ్యము భరతునకిమ్మని కోరెను. రాజు ఈమె కుట్రనుండి తప్పించుకోవడానికి పెద్దభార్య పిల్లలను పన్నెండు సంవత్సరములు అరణ్యవాసమునకు పొమ్మని చెప్పెను.

సీత, సోదరులు పాదచారులై హియాలయాలకు చేరి అక్కడ పర్ణశాల నిర్మించుకొన్నారు. ఇలా తొమ్మిది సంవత్సరాలు గడిచాయి. ఇక్కడ దశరథుడు మరణించాడు. అతనిభార్య రాజ్యము భరతునిదని చాటింది. కానీ ప్రజలు సమ్మతించలేదు. భరతుడు రాజ్యము వొల్లక తన సోదరుడు రామపండితుని రాజ్యమునకు పిలుచుకురావాలని తలచి, రాజచిహ్నాములతో రామునియొద్దకు వచ్చెను. ఆ సమయంలో రాముడు ఒంటరిగా పర్ణశాలలో ఉన్నాడు. సీత, లక్ష్మణులు కందమూలములను సేకరించడానికి వెళ్లి ఉన్నారు. భరతుడు విషయమంతా చెప్పి, అన్న పాదములపై పడి దుఖించాడు. భరతుడు కూర్చుని ఉండగా సీత, లక్ష్మణులు వచ్చారు. వారు పసివారు తండ్రి మరణవార్త తట్టుకోలేరని సందేహిస్తూ వారిని స్నానమాచరింపమన్నాడు. స్నానం చేస్తుండగా వారికి తండ్రి విషయము చెప్పాడు. వారు మూర్ఛపోయారు. రాముడు చలించలేదు. భరతుడు రాముని రాజ్యము స్వీకరించమని వేడుకొన్నాడు. తండ్రికి ఇచ్చినమాట ప్రకారం మరి మూడు సంవత్సరముల అనంతరమే రాజ్యానికి వస్తాను. అంతవరకు నా యీ పాదుకలను తీసుకొని వెళ్లి రాజ్యము పాలింపమనెను. భరతుడు చిత్తమన్నాడు.

గడ్డితో చేసిన ఆ పాదుకలు మూడు సంవత్సరములపాటు రాజ్యమును పాలించాయి. న్యాయాధికారులు తప్పుడు నిర్ణయము చేసినప్పుడు ఆ పాదుకలు కొట్టుకొనేవి. మూడు సంవత్సరాల తరువాత రాముడు కాశీదేశానికి తిరిగి వచ్చి 16000 సంవత్సరములు రాజ్యము పాలించెను.

ఈ కథాకాలములో - శుద్ధోధనుడే-దశరథుడు. మహామాయ-రాముని తల్లి. రాహులుని తల్లి-సీత. ఆనందుడు-భరతుడు. బుద్ధుడే-రాముడు. సారిపుట్ట-శారిపుత్రుడే-లక్ష్మణుడు.

రామాయణగాథతో సాదృశ్యంగల జాతకకథలలో మరో రెండు మాతృకలు నేడీ దేశమున లేవు. అవి శతాబ్దాలకు పూర్వమే చైనాభాషలోకి అనువాదితమై అందులోనుండి ఆంగ్లమునకు భాషాంతరీకరణము చెంది లభిస్తున్నాయి.[2] ఈ రెండుకథలలో ఒకటి దశరథుని పేరిటనే ఉంది. రెండవదానికి రాజుకు పేరు లేదు. దశరథుని పేరు చెప్పుగాథ క్రీ.శ. 472లో, పేరులేని రాజుకథ 247-251 మధ్య చైనాభాషలో అనువాదములైనవి.

రాజు పేరు చెప్పిన అనువాదకథలో దశరథుడు దశరతుడుగా చెప్పారు. దశరతుడు అంటే పది భోగములు కలవాడని అర్థం. దశరతుడు జంబూద్వీపమునకు రాజు. అతని పట్టమహిషి ముద్దుల పుత్రుడు రాముడు. రెండవభార్య పుత్రుడు లక్ష్మణుడు. మూడవభార్య కుమారుడు భరతుడు శత్రుఘ్నుడు నాలుగవభార్య తనయుడు. మూడవభార్యంటే రాజు మోజు. తన సంపదలో ఏది కోరుకున్నా కాదనక ఇస్తానన్నాడు. ఆమె అవసరమైనప్పుడు కోరుకుంటా నన్నది.కొంత కాలానికి రాజు వ్యాధిగ్రస్తుడయ్యాడు. ఈ కారణముతో రామునికి పట్టాభిషేకము చేశాడు.

కాలక్రమములో రాజు ఆరోగ్యము కుదుటపడినది. మూడవభార్యకు ఇప్పుడు రాముడు రాజుగా ఉండడం ఇష్టంలేదు. భర్తకు పూర్వపు వరములను గుర్తుచేసి తన కుమారుని రాజుగా చేయమనెను. సత్యవాక్య పరిపాలనకై రాముని తొలగించి, భరతుని రాజును చేయడానికి ఆమెయే ప్రయత్నములు సాగించినది. ఇది విన్న లక్ష్మణుడు రామునితో రాజ్యము వదలవద్దనెను. కానీ తండ్రిమాట జవదాటకూడదని రాముడు సోదరుని మాటను లక్ష్య పెట్టలేదు. దశరతుడు రామలక్ష్మణులను అడవికి పంపి పన్నెండు సంవత్సరముల తరువాత తిరిగి రమ్మనెను.

ఆ సమయంలో భరతుడు పట్టణంలో లేడు. అతన్ని వెదకి తెచ్చి రాజును చేయబోగా సోదరులమీద గౌరవముతో భరతుడు రాజగుటకు నిరాకరించెను. ఈ లోగా తండ్రి మరణించెను. రాముని పిలుచుకు రావడానికి భరతుడు అరణ్యమునకు వచ్చెను.

రాముడు తండ్రిమాట జవదాటననెను. భరతుడు రాముని పాదుకలను తెచ్చి వాటి పర్యవేక్షణలో రాజ్యమేలాడు. రాముడు రాజ్యమునకు వచ్చాడు. భరతుడు ఎదురేగి గౌరవించెను. రాముడు పెక్కు ఏండ్లు రాజ్యమేలెను.

ఇక పేరు పేర్కొనని రాజుకథ : బోధిసత్త్వుడు గొప్పరాజు. కరుణామయుడు. మరొకదేశానికి రాజు అయిన బోధిసత్త్వుని మేనమామ మహా క్రూరుడు. బోధిసత్త్వునిపై దండెత్తి వచ్చాడు. యుద్ధం మారణహోమం ఇష్టంలేక బోధిసత్త్వుడు రాణితో రాజ్యమును వీడిపోయాడు. మేనమామ రాజ్యమును వశపరచుకొనెను. ప్రజలు బాధలతో అల్లాడారు. తమ పూర్వపు రాజు తిరిగివస్తే బాగుండు ననుకొన్నారు.

బోధిసత్త్వుడు భార్యతో అరణ్యము మధ్య వెళుతున్నాడు. సముద్రమధ్యగల ద్వీపానికి రాజు అయిన నాగుడు ఆ రాణి అందము చూసి మోహించాడు. వెంటనే ఒక ఋషిగా మారి తపస్సు చేస్తున్నాడు. రాజు అతన్ని చూసి సంతోషించి ప్రతిరోజు ఫల పుష్పాలతో అతనికి సపర్యలు చేస్తున్నాడు.

నాగుడు ఇలా కొన్నాళ్లు కొంగజపం చేసి రాజులేని సమయాన రాణి నపహరించి తన గృహానికి తీసుకొని పోతున్నాడు. మార్గమధ్యలో ఒక పెద్ద పక్షి నాగునితో పోరాడింది. నాగుడు ఆ పక్షిరెక్కలు ముక్కలు చేసి రాణిని తీసుకొనిపోయాడు.

ఫలాదులు తీసుకొచ్చిన రాజుకు తన రాణి, తాపసి కనబడలేదు. ఏమయ్యారని విల్లంబులు చేతబూని రాజు రాణిని వెదకుటకు బయలుదేరాడు.

మార్గమధ్యలో అతనికి ఒక వానరుడు విచారగ్రస్తుడై కనిపించాడు. ఆ వానరము రాజుతో తన గోడు ఇలా చెప్పుకొనెను. "నేను, నా మామ పక్క పక్క రాజ్యములకు రాజులము. మా మామ నన్ను నా మంత్రులతో తరిమికొట్టాడు. నేనెవరితో చెప్పుకోగలను?" అని చెప్పగా బోధిసత్త్వుడు, ఓ వానరా! నువ్వు నేను సమానమైన దు:ఖితులము. మామకు వెఱచి నేనే రాజ్యమును త్యజించాను. అరణ్యమున నా భార్యను కోల్పోయాను. ఆమె జాడ తెలియడం లేదు అన్నాడు. అప్పుడు ఆ వానరం నువ్వు నాకు సహాయం చేస్తే నేను నా సైన్యం సహాయంతో ఆమెను వెదికింపగలను. ఆమె తప్పకుండా దొరుకుతుంది అన్నాడు. ఇందుకు రాజు ఒప్పుకున్నాడు.

ఆరోజే ఆ వానరము తన మామతో తలపడి విజయం సాధించి రాజయ్యాడు. అతని సైన్యానంతటిని ఒకచోట సమావేశపరచి రాజును చూపించి "ఈ రాజు మన మిత్రుడు. ఇతని భార్యను మీరు తప్పక వెదకండ"ని ఆజ్ఞాపించెను. వారిలో కొందరు నాగునితో పోరాడిన పక్షిని చూశారు. ఆ పక్షి నాగుడొక స్త్రీని సముద్రమధ్యనున్న దీవిలో ఉంచాడని చెప్పి మరణించింది.

వానరరాజు వారధి కట్టించి సముద్రము దాటాలనుకొన్నాడు. నాగుడు వారందరిపై మంచు కురిపించాడు. వానరులందరూ వ్యాధిగ్రస్తులైనారు. బోధిసత్త్వుడు కూడా జ్వరపీడితుడయ్యాడు. ఒక వానరుడు స్వర్గమునుండి దివ్యౌషధిని తెచ్చి వాసన చూపగా అందరూ ఉల్లాసమొందారు.

నాగుడు గాలిని, మేఘములను సృష్టించాడు. బోధిసత్త్వుడు వాన్ని చెండాడాడు. చివరకు బోధిసత్త్వుని చేతిలో మరణించాడు. స్వర్గము నుండి ఔషధి తెచ్చిన వానరమే నాగుని రాజద్వారము తెరిచి రాణిని తీసుకువచ్చాడు.

ఆ సమయానికి బోధిసత్త్వుని మామ మరణించాడు. తిరిగి బోధిసత్త్వుడు రాజయ్యాడు. తన భార్యతో "పరుల ఇంటనున్న స్త్రీని ప్రజలు అవమానిస్తారు కాబట్టి, నువ్వు పుట్టింటికి వెళ్లు" అని అన్నాడు. రాణి "నేను ఆ గుహలో ఉండడం బురదలో పుట్టిన పద్మములాంటిది. నా మాటలు సత్యములైతే భూమి చీలిపోవుగాక!" అన్నది

వెంటనే నేల చీలింది. రాణి మాట సత్యమనెను. రాణి శీల నిరూపణతో స్త్రీలందరు పతివ్రతలైరి.

బుద్ధుడు భిక్షువులతో తానే ఆ రాజునని, ఆ రాణి గోపీయని, తనమామ దేవదత్తుడని తెలిపాడు.

ఇవే కాకుండా మరి మూడుకథలు రామాయణముతో జతపడునవి బౌద్ధవాఙ్మయంలో ఉన్నాయి. ఆ కథల సంగ్రహములు:

దమ్మపద వ్యాఖ్యానములో బుద్ధఘోషుడు వ్రాసిన కథ.[3]

వారణాసిరాజు బ్రహ్మదత్తుడు. అతనికి మొదటిభార్య వలన మహిమ్‌శాసక, చండ అని ఇద్దరు పుత్రులు, రెండవ భార్యకు సూర్య అని ఒక కొడుకు. ఏమి కోరినా ఇస్తానని రాజు రెండవ భార్యకు మాట ఇచ్చాడు. ఆమె కోరిక ప్రకారము సూర్యకు రాజ్యము ఇవ్వడం, పెద్దభార్య పుత్రులను రాజ్యమునుండి వెల్లగొట్టెను. రెండవభార్య పుత్రుడు తనకు తన తల్లి సంపాదించి పెట్టిన రాజ్యము వద్దని అన్నలతో బాటు రాజ్యము విడిచిపోయాడు. హిమాలయ ప్రాంతపు దట్టమైన అరణ్యములో వారు సంచరిస్తున్నప్పుడు ఒక రాక్షసుడు వచ్చాడు. ఆ రాక్షసుడు వీసవన అనే దేవునిచేత ప్రేరితుడై చండ, సూర్య సోదరులను ఒక చెరువులోనికి లాగివేశాడు. ఆ సోదరులకు బౌద్ధధర్మము తెలియకపోవుటవల్ల ఇలా జరిగినది. పెద్దవాడైన మహిమ్‌శాసకు బౌద్ధధర్మము తెలుసు. ఇతడు ఆ రాక్షసునితో వాదించి ప్రశ్నలన్నింటికి సమాధానములు చెప్పి తన సోదరులను విడిపించుకొన్నాడు. తండ్రి మరణానంతరం స్వదేశానికి తిరిగి వచ్చారు. పెద్దవాడు రాజయ్యెను. చండ యువరాజయ్యెను. సూర్య సేనానిగా నిలబడ్డాడు.

సూత్రనిపథవ్యాఖ్యలో యుద్ధఘోషుడు చెప్పిన కథారీతి.[4]

అంబష్టథ ఇక్ష్వాకువంశపు రాజు. అతనికి మొదటిభార్య వలన నలుగురు పుత్రులు, ఐదుగురు పుత్రికలు. రెండవభార్య కోసం ఆ రాజు తొమ్మిదిమందిని అడవికి పంపాడు. అడవిలో జీవిస్తున్న వీరు తమది సంకర కులము కాకుండా ఉండడానికి సోదరులు సోదరీమణులను వివాహము చేసుకొన్నారు.

ప్రియ అను పెద్దసోదరిని మాత్రము తల్లిగా ఎంచుకొన్నారు. కొంతకాలము తరువాత ఆమెకు కుష్ఠురోగము వచ్చింది. అందువల్ల ఆమెను అడవిలో వేరొకచోటులో ఉంచారు. రాముడను రాజకుమారునికి కుష్ఠురోగం రావడంతో అరణ్యానికి వచ్చాడు. కాలక్రమములో రాముడు రోగ విముక్తుడైనాడు. ప్రియను చూసి చికిత్సచేసి ఆమె కుష్ఠురోగము కుదిర్చి ఆరోగ్యవంతురాలిని చేసి ఆమెను వివాహమాడెను.

మహావంశము – ఉపోద్ఘాతములో గల జాతకకథారీతి.[5]

ఒకాకు రాజునకు హస్త, చిత్త, జంతు, పళని, విశాఖ అని ఐదుమంది భార్యలు. హస్తవలన అతనికి నలుగురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లు. హస్త చనిపోగా రాజు వేరొక అందగత్తెను వివాహమాడెను. ఆమెవలన అతనికొక కుమారుడు కలిగాడు. పుట్టిన ఐదవరోజు ఆ పిల్లాడిని తెచ్చి రాజుకు చూపారు. ఆ చిన్నారి సన్మోహనాకారము చూచి రాజు ఉప్పొంగి భార్యను ఏదేని వరము కోరుకోమన్నాడు. తన పుత్రునకు రాజ్యాధికారము కావాలన్నది. రాజు చీకాకుపడినా, ఇచ్చిన మాటకు కట్టుబడి మొదటిభార్య కొడుకులను, కూతుర్లను కానలకు పంపినాడు. తన మరణానంతరము వచ్చి రాజ్యమును ఆదుకోవలసినదిగా వారితో రహస్యముగా చెప్పాడు. వీరు దినమునకొక యోజనము చొప్పున వారు మూడునాళ్లు ప్రయాణము చేసి పొరుగురాజ్యమున

ప్రవేశించారు. కానీ మరొక రాజు ప్రదేశము ఆక్రమించుట ధర్మము కాదనుకొని వారు ఇంకా ఉత్తరముగా ప్రయాణించి హిమాలయ సానువులలో కపిలమహాముని ఆశ్రమమునకు దగ్గరలో ఒక నగరము కట్టుకొన్నారు. కపిలవస్తు నగరమని పేరు పెట్టారు. కపిలుడు బోధిసత్త్వుని పూర్వజన్మవంశం ప్రతిష్ఠ సంకరము కాకుండా వారు తమ సోదరీమణులనే పెండ్లాడిరి. పెద్ద సోదరిని తల్లిగా పెట్టుకొన్నారు. ఈ విషయం తండ్రికి తెలియపరిచారు. తండ్రి ఆనందభరితుడై ఆస్థానికులతో “మిత్రులారా! నా పుత్రులు చాలా సమర్థులు. వీరు నిజముగా శాక్యులు” అన్నాడు. గౌతమబుద్ధుడు ఈ నలుగురు అన్నదమ్ముల సంతతివాడవడం వల్ల శాక్యుడని వ్యవహరింపబడ్డాడు.

ఈ కథల్లో ఒక్కదానిలో తప్ప మిగిలిన ఏ కథలోనూ కాంతాపహరణ వృత్తాంతం లేదు. రాముడు బుద్ధుని జన్మాంతరమని నిరూపించుటకు బుద్ధునివలె రామున్ని కూడా అహింసావాదిగా చేస్తున్నాయి ఈ కథలు. జాతక కథలలో రాముడు తండ్రి మరణవార్త విని కూడా నిరాకులుడుగా ఉన్నాడు. రామాయణంలో రాముడు వెక్కివెక్కి ఏడుస్తాడు. ఒక కథలో మహిమ్‌శక అంటే మహీపాలుడని అర్థం. బౌద్ధధర్మము ఎరుగుట విశేషమని, ఆపనివారణమని ఈ కథ చెప్తుంది. నాగుడు రావణునికి ప్రత్యామ్నాయమైన ఈ కథలో విశేషము రాణికి ప్రజల సమక్షంలో శీలపరీక్ష జరగడంతో శంకించడానికి అవకాశము లేకుండాపోయింది. ఈ కథను బట్టి వాల్మీకి రామయాణమునకు మెరుగుదిద్దినదా అనిపిస్తుంది. ఈ బౌద్ధకథలన్నింటికి ఉత్తరభారతమే రంగస్థలం. పేరు పేర్కొనని రాజు కథలో సముద్రము, ద్వీపము మాత్రమే ప్రస్తావించారు. రాముడు కుష్ఠువ్యాధి బౌద్ధధర్మం ప్రభావంతో కుదుర్చుకొని ఒక కాంతకు అదే రోగము కుదిర్చి వివాహమాడుట.[6] బౌద్ధధర్మముతో రాక్షసునితో వాదించి సోదరులను రక్షించుకొనుట, శాక్యుల ప్రస్తావన, శాక్యుల ఆచారమైన సోదరీ సోదర ప్రస్తావన ఇవి అన్నీ రామాయణ ప్రభావము ఉపయోగించుటకు బౌద్ధులు చేసిన ప్రయత్న ఫలితముగా పుట్టిన గాథలే అనిపిస్తాయి.

పాద సూచికలు:

1. The lankavatara sutra a complete Ms. of which is in the library of Sanskrit college, Culcatta.
2. Ramayana in China by Prof. Raghuvira and Dr. Chikyo Yomonote
3. Notes on the Balakanda by C. R. Srinivasyyagar.
4. Ibid
5. Turnour's Instroduction to the Mahavamsa.
6. Essay on Indo aryan mythology by Narayana Aiyangar Part. II. p. 394-476

ఆధార గ్రంథం:

వివిధ భారతీయ భాషలలో రామాయణం–మలయవాసిని

 ISSN: 2319-3905

6
ఏరువాక పూర్ణిమ

–యాళ్ళ ఉమామహేశ్వరి

పచ్చదనం పరచుకుని, పూల సోయగంతో అలరారుతూ ఆహ్లాదం పంచే ప్రకృతితో, వర్షపు చినుకుల తాకిడితో గుభాళించే మట్టి వాసనకి మురిసిపోని మనసుండదు. అందునా రైతు మనసు మురిసి విరబూయక మానదు. పుట్టుక నుండి గిట్టుట వరకూ మనిషికీ మట్టికీ విడదీయలేని బంధం ఉంది. కాలం పుట్టిన నాటి నుండీ ప్రాణులకు, పక్షులకు, జీవులకు అనుబంధం విడదీయలేనిది.

నాగరికత అభివృద్ధి చెంది మానవుడు వ్యవసాయం చేయడం నేర్చుకున్ననాటి నుండీ మట్టితో మమకారం కలిగి ఉన్నాడు. వేదాలు, ఉపనిషత్తులు, ఋషులు,కవులు మన్నుతో మనిషికి గల అవినాభావ సంబంధాన్ని అనేక సందర్భాలలో తెలిపాయి.

పంటలు పండించే రైతన్నలు ప్రకృతిని పూజిస్తూ వర్షాధార పంటలు వేస్తూ ప్రాణి కోటికి ఆహారం అందిస్తున్నారు. జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఏరువాక పున్నమి జరుపుకుంటారు.

ఏరువాక అంటే ఏమిటి? ఆ పండుగ విశేషాలు ఏమిటి? అనగా శ్రీసురవరము ప్రతాపరెడ్డి ఇట్లు వ్రాస్తున్నారు.

“ఏరువాక అనే పదానికి ఆంధ్రదీపిక నిఘంటుకారుడు ఈవిధంగా వ్రాసియన్నారు.

ఏరు=సర్వావయవములు కలనాగటికి యెడ్లనుపూనినది. సర్వావయములు గల నాగలి. ఏరువాక= దున్నుటకారంభము.

శబ్దరత్నాకరనిఘంటు కారులును నిట్లుసెలవిచ్చియున్నారు. ఏరు=ఎద్దులను గట్టి దున్నుటకు సిద్ధపరచిన నాగలి.

ఏరువాక=దుక్కి యొక్క ప్రారంభము.

ఈ రెండర్థములను విచారించి చూచిననిది వ్యవసాయకులకు సంబంధించినది అని విశదమవుతున్నది..(01)

పండుగలు జనులకు ఉత్సవకాలాలు. ఆనాటి పండుగలే యీనాడును కలవు. అందంతగా భేదము లేదు. ఏరువాక పున్నమ వ్యవసాయకులకు ముఖ్యమైనట్టిది,ఏరువాక అనగా ఏరులు వచ్చేకాలమందు చేయు పండుగ అని ‘పత్రికలలో పెద్ద పెద్ద వ్యాసాలు వ్రాస్తుంటారు. ఏరు నాగ అనిగానీ, ఏరువాక వ్రతం అనికానీ పొలం దున్నుట కారంభించుట అనీ పిలుస్తారు. జ్యేష్టపూర్ణమనాడు ఎద్దులను కడిగి రంగులతో అలంకరించి,

ఎడమన్ను సున్నం పద్దెలు వేసి నూనెరంగులు పూసి చీరలు కట్టించి సొమ్ములు పెట్టి సాయంత్రము మంగళ వాద్యములతో నాగళ్ళను గడలను బుజాల పెడుతూ. ఎద్దులతో ఊరేగి పొలాలకు పోయి దుక్కి పారంభము చేసి వస్తారు. ఆనాడు భక్ష్య భోజ్యములతో గాటికి నైవేద్యమిత్తురు. ఇది ఏరువాక పున్నమ పండుగ. ఇది వైదికోత్సవమే! సందేహములేదు ! జ్యేవశ్యమాసస్య పౌర్షిమాస్యాం బలీవర్జాన్ అభ్యర్చ్య ధావంతి సోయం ఉద్భూష భయజ్ఞః” అని జై మినీ న్యాయమాలలో నుదాహృతము. (01)

“కాలుని దున్ననంది నయి గంటలు దున్నక మంటినా, మహా కాలు నంది దున్ననయి కర్దమ మగ్నతలేక మంటినా, హాలికు లెన్నడున్ దెగని యొరుల చేలును, ఔకుమళ్ళునున్ గా, లలినేరు సాగిరిల గల్గు పసి గొని పేద మున్నుగస్.” 1 కాపులు దొరికిన దున్నలను, ఎద్దులను కట్టి గడ్డినట్లు, దుబ్బలు దున్నుట కానా రంభించిరన్న మాట. (02)

ఏరువాక పున్నమి రైతులు తమ పొలాలలో దుక్కి దున్నడానికి, సేద్యపు పనులు ప్రారంభించడానికి ముందు జరుపుకునే పండుగ. ఈ రోజున, రైతులు తమ పొలాల్లో భూమి పూజ చేసి, ఎద్దులతో నాగలితో దుక్కి దున్నుతారు.

ఏరువాక పూర్ణిమను గురించిన ప్రస్తావన చేస్తూ తెలుగు సినీ సాహిత్యంలో ...

ఏరువాక సాగారో రన్నో చిన్నన్నా...

నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా...” అని కొసరాజు రాఘవయ్య చౌదరి గారు కీర్తించినా.....

ఏరువాక సాగుతుండగా..చుట్టు పైరగాలి వీస్తుండగా....అంటూ ఏ ఎం రత్నంగారు స్మరించినా అనాదిగా వస్తున్న ఏరువాక ప్రస్తావన నేటికీ ఒక ఆచారంగా సంస్కృతిగా ప్రజలలో ఉండడమనేది గమనార్హం.

కాలం ఎంత మారినా రైతులు ఏరువాక పూర్ణిమను జరుపుకోవడం విశేషంగా కనిపిస్తుంది.

ఈ పండుగకు ‘హల పూర్ణిమ’, ‘కృషి పూర్ణిమ , బీజవాపన మంగళ దివసం, వాహణ పుణ్యహ మంగళం, కర్షక పుణ్యాహ మంగళం, అనే పేర్లు ఉన్నాయి.తెలుగునాట ‘ఏరువాక’ వ్యవసాయదారులకు సుప్రసిద్ధమైన పండుగ. (04)

మనదేశ సౌభాగ్యంలో పల్లెవాసుల సంస్కృతీ పరిరక్షణలో కర్షకులపాత్ర ప్రశంసనీయమైనది. మెతుకు పెట్టి బతుకునిచ్చే అన్నదాతల ఉత్సవ దినోత్సవం ఏరువాక పూర్ణిమ.

గ్రామీణులు బండ్లను మంగళవాద్యాలతో ఊరేగిస్తారు. కొన్ని ప్రాంతాల్లో కాడికి ఓవైపు ఎద్దును కట్టి మరోవైపు రైతులే భుజాన వేసుకొని, భూమిని దున్ని పొంగలి బెల్లంతో వండిన పులగాన్ని (పొంగలిని) ఇంద్రుడికి నివేదన చేస్తారు.

ఎడ్లను పరుగెత్తిస్తూ పందేలకు దిగుతారు, రైతులు ఊళ్లో ఊరేగుతూ పాలేళ్లతో మమేకమై సంబరం చేసుకుంటారు...(06)

పొలం దున్నడానికి శుభంకరమైన నక్షత్రం 'జ్యేష్ఠం' అని జ్యోతిష్యశాస్త్రం చెబుతోంది. జ్యేష్ఠ నక్షత్రంతో చంద్రుడిని కూడి ఉండే శుభక్షణం జ్యేష్ఠ పూర్ణిమ. ఓషధులన్నింటికీ అధిపతి చంద్రుడు.ఆ ఓషధులు సమృద్ధిగా ఉంటేనే వ్యవసాయం విశేషమైన ఫలసాయాన్ని అందిస్తుంది.(05) వేద కాలంలో ప్రతి పనిని యజ్ఞంగానే భావించేవారు.

అధర్వణవేదం ఏరువాకను 'అనడుత్సవం'గా చెప్పింది. క్షేత్రపాలకుని మంత్రాలతో స్తుతించి నాగలితో భూమిని దున్ని విత్తనాన్ని చల్లడం వంటి పద్ధతులను ఆచరించేవారు. ఆ తర్వాతి కాలంలో పరాశరుడు, బోధాయనుడు మొదలైన మహర్షులు తమ గుహ్య సూత్రాల్లో ఈ పండుగ గురించి ప్రస్తావించారు.'హలకర్మ' అనే పేరుతో నాగలిపూజ, 'మేదినీ ఉత్సవం' పేరుతో 'భూమి పూజ', 'వృషభ సౌభాగ్యం' పేరుతో పశువుల పూజ జరుపుతారని అధర్వణవేదం చెబుతోంది. (05)

బౌద్ధ జాతక కథల్లోని 'వప్ప మంగల దివస' అనే పండుగ ఈ ఏరువాక పున్నమిని పోలిందే! శుద్ధోదన మహారాజు కపిలవస్తు నగరంలో వర్ష ఋతువు ఆరంభం కాగానే, కర్షకులకు బంగారు నాగళ్లను బహూకరించేవాడని 'లలిత విస్తరం' అన్న గ్రంథం పేర్కొంటోంది. జైమిని 'న్యాయమాల'లో ఈ ఉదంతం ఉంది.(05)

హాలుడి 'గాథాసప్తశతి'లో ఏరువాక పున్నమి ప్రస్తావన ఉంది. ఉత్తర భారతంలో ఇదే రోజున 'ఉద్వృషభయజ్ఞం' పేరుతో ఎడ్లను పూజించి, వాటిని పరుగెత్తిస్తారు. (05)

వరాహమిహిరుడు రాసిన 'బృహత్సంహిత'లో పరాశర విరచితమైన 'కృషి పరాశరం'లో ఈ ఉత్సవాల ప్రస్తావన ఉంది. (05)

ఈ పౌర్ణమి నాడు పద్మపురాణ గ్రంథం దానం చేయడం. అశ్వమేధయాగ తుల్యమని శాస్త్ర కథనం. అంతేకాదు విష్ణు పురాణంలో సీతాయజ్ఞంగా ఏరువాక గురించి ప్రస్తావించబడింది. ఇందులో సీత అంటే నాగలి అని అర్థం. శుద్ధోదనమహారాజు ఆనాడు కపిలవస్తులో లాంఛనంగా ఈ ఏరువాకను ప్రారంభిస్తూ బంగారు నాగలిని కర్షకులకు అందించినట్లుగా శాస్త్రాలలో వివరించబడింది. తెలుగు పండుగల్లో సాహిత్యాధారాలున్న కొన్ని వేల సంవత్సరాల అతి ప్రాచీన పండుగ ఏరువాక. (05)

శ్రీకృష్ణ దేవరాయల కాలంలో కూడా ఏరువాక ప్రస్తావన వచ్చింది. ఈరోజున రైతులందరూ ఊరి బయటకు వెళ్లి చెర్నాకోలతో తోరణాలను కట్టి, ఎవరికి దొరికిన నారను వారు తీసుకొచ్చి ఎడ్ల మెడలో కట్టేవారు. ఈ విధంగా చేయడం వల్ల పంట పొలాలు బాగా పండుతాయని, పశు సంపద పెరుగుతుందని చాలా మంది నమ్మేవారు. రైతులంతా అత్యంతోత్సాహాలతో ఈ పండుగ జరుపుకొని రాబోయే కాలంలో పొలాలు సస్యశ్యామలమై బంగారం పండించాలని, లోకం సుభిక్షమై సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేసేవారు.(05)

ఆరోజున ఆడపడుచులు పుట్టింటికి వస్తారు. ఈ పండుగనాడు చేసే మరో ముఖ్యమైన వేడుక ఎడ్ల పందేలు. ఎద్దులను బాగా అలంకరించి పరిగెత్తిస్తారు. వాటి వెనుక యువకులు పరుగులు తీస్తారు. అంతేకాకుండా ఎద్దులకు బండలు (బరువైన రాళ్ళు) కట్టి పరుగులు తీయిస్తారు. దీన్ని బండలాగుడు పోటీ అంటారు.(05)

ఏరువాక పౌర్ణమి రోజునే ఇళ్ళలో పనిచేసే జీతగాళ్ళ సంవత్సరం ముగిసి కొత్త సంవత్సరం మొదలవుతుంది

బండలు పగిలే భరణి కార్తె ఎండలు– రోళ్లుపగిలే రోహిణి కార్తె ఎండలు వెనకబడ్డాయి. మృగశిర కార్తెతో ముంగిళ్లు చల్ల బడతాయి. ఆ మీద ఆరుద్రవాన అదునువాన. వ్యవసాయానికి అనుకూలమైనకాలం. రోహిణిలో విత్తనాలు చల్లితో రోళ్ళునిండని అల్పపుపంట అని మనరైతులకు అనుభవపునరుక్త విషయం(03)

ఈపండుగ వర్ష ఋతువు ఆరంభదశలో చేయడానికిగల కారణం వర్షాలు బాగా కురిసి భూమి పదునై(పునర్వసు కార్తిలో) పునాసవిత్తనములు వేస్తారు. (పునర్వసు నుండి ఈ పునాస అనే పదం ఏర్పడింది.) . సాయంకాలం తప్పెట, మేళము, మొదలైన మంగళవాయిద్యాలతో పంట నూర్చే పనులన్నిటిని నూరర్చిన తరువాత బయటకు తోలుకుపోతారు. ఊరివాకిటికి ఒక పుంటి(గోగునార/గోంగూర) నారతో చేసిన తోరణము కట్టి, ఆ తోరణమును గ్రామస్థులు చేర్నా కోలలతో కొట్టి పీచుపీచు చేసి యెవ్వరికిదొతికిన పీచు వారుతీసికొనిపోయి యింటిలో దాచుకుంటారు. ఇది పశువులకు మేలు కలిగిస్తుందని వారి విశ్వాసము.

కర్షకులకు ఎద్దులే జీవిత సర్వస్వము. కావున వాటి పూజ కృతజ్ఞతాసూచకము. ప్రశంసనీయము.కాబట్టి ఇది వ్యవసాయదారులకు ప్రధానమైన పండుగగా కనిపిస్తుంది.(03)

వ్రతగ్రంథములందంతగా కానరాక పోయినను సేద్యగాండ్రు మాత్రము తడవులను బట్టి ఈ పండుగను జరుపుతూనే ఉన్నారు. ఈ పండుగ సంబంధమైన పాటలు కొన్ని సేకరించి శ్రీ రావూరు 'కృష్ణా పత్రికలో (యువసంవత్సరం) ప్రచురించారు. అందుండి ఏరువాక పాట, నాగలిపాట అను రెండుపాటలు ఉదాహృతాలు అవుతున్నాయి.

ఏరువాకపాటలి

ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ

ఏళ్ళునదులూపొంగి వెంబడేవచ్చాయి.

నల్లమేఘాలలో నాట్యమాడింది.

కొండగుట్టల మీద కులుకులాడింది.

ఇసుకనదిలో దూరి బుసలుకొట్టింది.

పాడుతూ కోయిలా పరువులెత్తింది.

ఆడుతూ నెమలి అలసిపోయింది.

నవ్వుతూ మా అయ్య బువ్వతిన్నాడు.

ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ

ఏళ్ళునదులుపొంగి వెంబడేవచ్చాయి.

ఆకాశమునమబ్బు లవతరించాయి.

మబ్బులో ఒక మెరుపు మాయమైపోయింది.

ఉరు మొక్కటావేళ ఉరిమిపోయింది.

కాపుపిల్లల మనసు కదిలిపోయింది.

అటకమీద గంప అందుకోవయ్యా

విత్తనాలుతీసి విరజిమ్మవయ్యా

మృగశిరకార్తిలో ముంచెత్తువాన

మృగశిరకార్తిలో ముంచెత్తువాన కలుపరా అబ్బాయి కొత్తదూడల్ని కట్టరా అబ్బాయి కొత్తనాగళ్లు దున్నరా ఓ అయ్య దుక్కుల్లుమీరు ఒకగింజ కోటియై వర్ధిల్లుమీకు ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ ఏరునదులు పొంగి వెంబడేవచ్చాయి. కొత్తల్లుడొస్తాడు కోడలొస్తుంది. కొత్తబట్టలు తెచ్చి దాచండిమీరు పళ్లుపూవులు తెచ్చి పంచి పెట్టాలి. కొత్తబట్టలుకట్టి కొత్త నాగళ్ళతో కొత్తదూడలతో కొత్తపాలేళ్లతో ఏరువాకాసాగి మురుసుకోవాలి కొత్తపంటలు మనము కోరుకోవాలి. ఏరువాకొస్తుంది ఏరువాకమ్మ ఏళ్లనదులూపొంగి వెంబడేరావాలి ఏరువాకమ్మకి ఏమి కావాలి ఎర్రఎర్రనిపూల మాలకావాలి ఎరుపు తెలుపుల మబ్బు టెండకావాలి. ఏరువాకమ్మకీ ఏమి మొక్కాలి పొలముగట్టున నిలిచి వేడుకోవాలి టెంకాయవడపప్పు తెచ్చిపెట్టాలి. ముత్తైదులందరూ పాటపాడాలి పాటబాడుతుతల్లి పాదాలు మొక్కాలి

ఏరవాకమ్మనీ ఏమికోరాలి! ఎడతెగని సిరులివ్వ వేడుకోవాలి పాడిపంటలు కోరి పరవశించాలి. ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ ఏళ్లనదులు పొంగి వెంబడే వచ్చాయి.

నాగలిపాటలి

ముందటేరు దున్నేవాడా ముద్దులబావ! దాపటెద్దుకు దాహమాయెను కాపువదిలావా! వెనుకనాగలి దున్నేవాడా ఎర్రపంచెల చిన్నవాడా! వెలపటెద్దుకు దాహయాయెను తెలుసుకున్నావా! వెండిమురుగులు వెలుగుచూచి ఎర్రపంచెల షోకుచూచి తోలవేమో దొరగిత్తని అలసిపోయావా! ఆపలేక మెట్టనాగలి

ముందు కురులు పైకిచుట్టి ములుకఱ్ఱ చేతపట్టి దుక్కిదున్నిన దేశమందు దుఃఖముంటుందా! కాపునడచిన భూమిమీద పాటలేవో పాడుకుంటూ

సామెతలు

(01) ఏపుతగ్గిందా!

మోటనాగలి దున్నుకుంటూ

పాటుపడితే లోటులుంటాయా!

(02) ఎద్దులు లేని సేద్యం చద్దిలేనిపయనం' –

(03) ఒంటియెద్దు సేద్యం వరిగాలునొప్పి',

(04) 'గొడ్లు, వడ్లు ఉన్నవాడిదే వ్యవసాయము',

(05) 'ఎక్కువ వెల పెట్టి గుడ్డను, తక్కువ వెల పెట్టి గొడ్డును కొనకూడదు' అనే సామెతల వల్ల ఎద్దుల ప్రాముఖ్యం వెల్లడవుతూ ఉంది.

(01) కఱ్ఱమన్ను అయితే కాపు బతుకుతాడు,

(02) దుక్కిచలవే చలవ, తల్లి పాలే పాలు:

(03) దుక్కిగల భూమి దిక్కు గల మనుష్యుడూ చెడడు,

(04) అరక అరిగితే గరిసె విరుగును. అనే సామెతల రూపంలో దుక్కి ప్రాముఖ్యాన్ని గుర్తించారు. కాబట్టి దుక్కికిసాధనాలయిన ఎద్దుల ప్రాముఖ్యాన్ని గుర్తించారు.

జీవితంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. అన్నదాతలు వ్యవస్థలో ఇమిడిన అవస్థలని అనుభవిస్తూనే వృత్తి ధర్మంగా – ప్రకృతి మర్మంగా.. తోటివారికి కడుపునింపే కార్యంలో భాగంగా పుట్టెడు ధాన్యం పండించిన కొందరు. పిడికెడు గుండె తనువు చాలించిన ఇంకొందన్నారు.

అనాదిగా మన వ్యవస్థలో పునాదిగా ఉన్న రైతన్నను కాపాడుకోవలసిన బాధ్యతను ఈ సమాజం గుర్తిస్తూ..మనలోనుండి పుట్టుకు రావలసిన యువరైతులను పాతకులు సైతం స్వాగతించాలని ఓ అన్నదాత బిడ్డగా– ఆంధ్రుల ఆడపడుచుగా ...గోదావరి ప్రాంతపు యువతిగా...డొక్కా సీతమ్మగారి వారసురాలిగా ...అన్నదాత విలువ తెలిసిన వ్యక్తిగా ఆకాంక్షిస్తున్నాను.

ఉపయుక్త గ్రంథసూచి:

01 ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సురవరం ప్రతాపరెడ్డి

02 ఆముక్తమాల్యద –శ్రీకృష్ణ దేవరాయలు.

03 పండుగలు పరమార్థాలు– ఆంధ్ర శేషగిరిరావు

04 https://share.google/TZtEeBP8ositRJ9VP.

05 శ్రీమహాలక్ష్మి (ముఖపుస్తకం) face book

06 https://share.google/R5H3FwOIZ37b75EKt

07 https://share.google/QGp5Ykkod4HafB5KF

7

మద్దూరి నగేష్ బాబు – సాహిత్యం – పరిశీలన

– పేరెల్లి శ్రీను

పరిచయం:

దళిత కవిత్వమే కాకుండా తెలుగు కవిత్వంలో కూడా నగేష్ బాబు ముద్ర విభిన్నమైనది. మద్దూరి రచించిన కవితలతో దళిత వాద చైతన్యానికి పునాది. ఎందరో కొత్త తరం కవులకు మార్గదర్శి. నగేష్ బాబు అంటే ఒక సాహసి, నిరంతరం దళిత కవిత్వం గురించి, ఉద్యమం గురించి, చర్చించి, విమర్శించి, తర్కించే ఒక తాత్వికుడు నగేష్ బాబు. దళిత జీవితాన్ని మొత్తం భారతీయ వాస్తవికతని అంబేద్కర్ దృక్పథం నుంచి చూస్తూ కవిత్వీకరించాడు. దేశంలో ఎక్కడ దళితుల పై దాడులు జరిగినా అణచివేత జరిగినా కించపరుస్తూ మాట్లాడినా సహించలేని నైజం అతని సొంతం. వెయ్యేళ్ల తెలుగు కవిత్వాన్ని, సమాజంలోని ఎత్తుపల్లాల్ని, వివక్షల్ని, అంటరానితనాల్ని, వెలివేతల కాసారాల్ని అట్టాగే కొనసాగనిచ్చిన దాని దగుల్బాజీతనం మీద తుపుక్కున ఉమ్మివేసి, మీసం మెలేసిన ఒకేఒక్క ధిక్కార స్వరం మద్దూరి నగేష్ బాబుది. తాను ఎవరికోసమైతే ఈ కవిత్వం రాస్తున్నాడో ఆ కవిత్వం వాళ్ల దగ్గరకు వెళ్లాలి. వారు ఆ సాహిత్యాన్ని చదివి చైతన్యం పొందాలి అని ఆశించినటువంటి స్వాప్నికుడు. ఆయన కవిత్వంలో స్పష్టంగా తన లక్ష్యాన్ని ప్రకటించుకొని కవిత్వాన్ని రాసేవారు. “ఏం కావాలి?” అని ఎవరైనా అడిగితే “నీ గుండెలో నాకు చోటు కావాలి /నీ ఇంట్లో నేను చెయ్యి కడగాలి, మనం చుట్టాలం కావాలి”[1] అని సింపుల్ గా చెప్తాడు మద్దూరి.

బాల్యం– విద్యాభ్యాసం :

మద్దూరి నగేష్ బాబు గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం రుద్రారం గ్రామంలో 1963 ఆగస్టు 15 తేదీన జన్మించారు. తల్లి అనసూయమ్మ తండ్రి జకరయ్య లు . గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు ఆ తరువాత నరసరావుపేటలో 6వతరగతి నుండి 10వతరగతి వరకు లూథరన్ హై స్కూల్ లోచదువుకున్నారు. ఇంటర్ డిగ్రీ (బి.ఏ) ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో చదువుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం

(విశాఖపట్నం)లో ఎం.ఏ (ఇంగ్లీష్) చదువుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ పూర్తి చేశారు. ఎం.ఫిల్ లో "తెలుగు మరాఠీ దళిత కవిత్వం ఆఫ్రికన్ బ్లాక్ కవిత్వం తులనాత్మక పరిశీలన" అనే అంశంపై పట్టా తీసుకున్నారు. నాదెండ్ల మండలంలో ఎం.ఆర్.ఓ.గా పని చేస్తూనే జనవరి 10వ తారీఖు 2005వ సంవత్సరంలో అనారోగ్యంతో కన్నుమూశారు.

రచనలు: 1.వెలివాడ (1995), 2.లోయ (1997), 3. మీరేవుట్లూ (1998), 4.నరలోక ప్రార్థన (2002) – ఇవి కవితా సంపుటాలు. 1.రచ్చబండ (1996), 2. పుట్ట (2006), 3.గోదావరి (2007) – ఇవి దీర్ఘ కవితలుగా వెలువరించారు. కాస్త సిగ్గు పడదాం (సంఘీభావ కవిత్వం) విడి ఆకాశం (అంబేద్కర్ ప్రేమ కవిత్వం), ఈ రెండు కవితా సంపుటాలకు ఖాజాతో కలిసి సంపాదకులుగా వ్యవహరించారు. వరదయ్య, పైడి తేరేష్ బాబు, ఖాజాలతో కలిసి "నిశాని" ధిక్కార కవితను, రాణి శివ శంకర శర్మతో పాటు "ఊరూవాడ" (సంకర కవిత) ను వెలువరించారు. ఐదు కథలు రాశారు. ఆంధ్రజ్యోతి దిన పత్రిక నవ్య పేజీలో స్త్రీల కవిత్వాన్ని సమీక్షిస్తూ చాలా వారాల పాటు అనేక వ్యాసాలు రాశారు.

వచన కవితా సంపుటాలు:

1. వెలివాడ: మద్దూరి నగేష్ బాబు రాసిన మొదటి వచన కవితా సంపుటి 1995 మే లో శ్రీజ పబ్లికేషన్స్ నరసరావుపేట వారు ప్రచురించారు. ఈ సంపుటిలో వివిధ అంశాలకు చెందిన 40 కవితలు ఉన్నాయి. ఈ కవితా సంపుటిని తల్లిదండ్రులకు అనసూయమ్మ, జకరయ్య గార్లకు అంకితం చేయడం జరిగింది. సమాజంలో జరిగే సన్నివేశాలు ప్రతిరోజు గుర్తుకొచ్చి పదేపదే ఆలోచిస్తూ సంఘర్షణకులోనై రాసిన కవిత్వమే వెలివాడ కవిత్వం.

మహబూబ్ నగర్ జిల్లాలో హన్వాడ అనే గ్రామంలో (1993) దళితుల దుస్థితి గురించి కవి చింతిస్తూ... "రండి/హన్వాడకి రండి/ఆంధ్రప్రదేశ్ కి రండి/భారతదేశానికి రండి/ఇక్కడ కొజ్జాల కావరానికి/ఇంకా ఊరవతలే పారుతున్న రెండు శోక సముద్రాల్ని చూపిస్తా!/రెండూ రెండు ఉచ్చుకుండలై నిండిన/దుఃఖిత ఖండిత జనాంగాల్ని చూపిస్తా! ఒసే హన్వాడా! నువ్వొక ఊరువో/పూల తోటవో/స్మశానానివో/బందెల దొడ్డివో!/ ఏమైతే నాకేం గానీ/నాకిప్పుడు నా నెత్తుటితోనయినా నిన్నో మట్టి ముద్దని చేసి /నీ నరాల్లో మళ్లీ కొత్త ఊపిరి పోయాలనుంది!/ అంతకీ నువ్ మారకపోతే /నీ తాట వలవాలని ఉంది"[2]

రండి మా హన్వాడకు రండి ఆంధ్రప్రదేశ్ కు రండి భారతదేశానికి రండి ఇక్కడ బలహీనులపై దౌర్జన్యం చేసే కొజ్జాల కావరానికి ఊరవతల రెండు మాల మాదిగ వాడలు శోకసముద్రాలై కనిపిస్తునాయి, నీవు ఏదైతే నాకేం కానీ, ఇకనుండి మనుషులను మనుషులుగా చూడాలి, కులాల హెచ్చులు తగ్గులులేకుండా చూడాలి అలా నువ్వు మారకపోతే నీ తాట వలవాలని ఉంది అని తన ధిక్కార స్వరాన్ని "రెండు కుడితి గళాసులు" కవితలో వినిపించాడు మద్దూరి.

2. రచ్చబండ: 1996 సంవత్సరంలో ఈ దీర్ఘ కవితను లోకాయుతా పబ్లికేషన్స్ పొన్నూరు, గుంటూరు జిల్లావారు ప్రచురించారు. ఈ దీర్ఘ కవితను దళిత అమరవీరుడు, తన మిత్రుడు గోవింద్ కు అంకితమిచ్చారు. రచ్చబండ చదువుతుంటే అలెక్స్ హెలి రూట్స్ అంత లోతుగా పల్లె దళిత జీవిత లోతుల్లోకి చొచ్చుకపోతున్నట్టుగా ఉంటుంది. ఈ దీర్ఘ కవితలో దళిత స్త్రీ తాను అనుభవించినటువంటి లైంగిక హింస, మానసిక రోదనను అదే విధంగా గ్రామంలో భూస్వామ్య పెత్తందారుల, కామాంధుల యొక్క అహంకారాన్ని, ఆ అహంకారులను ఎదుర్కోవటానికి దళిత బహుజనులు ఎంత హీనాతిహీనమైనటువంటి ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తుందో దళిత జీవన చిత్రాన్ని ప్రదర్శించాడు.

వాడున్నాడే ఆ దొర /పత్తిచేలో పురుగులేరటానికి కూలికని పిలిసి/పురుగై నన్ను తొలిచి ఆగం జేసిండయ్యా!/నా బిడ్డలమీద పెమాణం జేసి సెబుతున్నా బాబూ/పైటేళ /పొలవంతా నీడలు జాస్తున్న జామున/వాడు నా మీదికి కోరలు చాచిండయ్యా/పత్తిచేలమధ్య వాడు నన్ను పరాభవం జేస్తంటే/ఏ దేవుడూ అడ్డుపడలేదు అయ్యలారా! –2 మద్దూరి "వెత" అనేటటువంటి కవిత లో మాదిగ వాడలో గాని, మాలవాడలో గాని కొంత చక్కదనం కలిగినటువంటి మహిళల మీద ఆధిపత్య కులాల కామాంధుల కన్ను నిరంతరం డేగలాగా పహారా కాస్తుంది, ఏదో ఒక నెపంతో దళిత స్త్రీని లైంగికంగా లోబర్చుకోవాలని ఉద్దేశంతో పత్తి చేలో పురుగు లేరటానికని కూలికి పిలిచి దళిత స్త్రీల మానాన్ని పురుగై తొలచి వేసే విధానాన్ని కళ్ళకుగట్టినట్టుగా మనకి తన వేదనను,అలాగే ఇక్కడ దళిత స్త్రీ తన మానాన్ని కాపాడుకోవటం కోసం తాను ఎంతగా ఆవేదన చెందుతుందో తన మీద ఆధిపత్య పురుషుడు అఘాయిత్యం చేయడానికి పూనుకున్నాడో చివరికి ఈ సమాజాన్ని నమ్మించడం కోసం తన కన్న బిడ్డల మీద ప్రమాణం చేయాల్సి వస్తుందో, ఇంతకంటే అవమానం, ఇంతకంటే దౌర్భాగ్యం, ఏ భారత స్త్రీకి ఉండదు అని చెప్పినటువంటి సందర్భం.

3.లోయ: 1997 వ సంవత్సరంలో లోకాయుతా పబ్లికేషన్స్ పొన్నూరు, గుంటూరు జిల్లా వారు ప్రచురించారు. ఇందులో 38 కవితలు ఉన్నవి. ఈ సంపుటిని ప్రియమైన గురువు ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారికి అంకితమిచ్చారు. దళితుల జీవన వ్యవస్థకు నిలువుటద్దం "లోయ" కావ్యం..

"వాడు బ్రహ్మయితే కావచ్చుగాక /వాడి లోపలి మగజంతువుని మనం విస్మరించొద్దు ఇప్పుడు 'అ' అంటే అంగమనీ, 'ఉ' అంటే ఉపరతనీ / బోధించే బృహస్పతుల్ని బైటకీడ్వాలి పాఠశాలల్ని పడగ్గదుల్ని చేసిన /ఆచార్యదేవుళ్ళ పొటెన్షియాలిటీని పొటాసియం సైనేడ్ తో కడగాలి" కాండక్టుల్ని శాటిస్ ఫై చేసే అర్ధరాత్రి హెడ్మాస్టర్ గదుల్ని కూలగొట్టాలి"[3]

ISSN: 2319-3905

ఈ దేశంలో అధికారాన్ని, కులాన్ని ,మతాన్ని అడ్డం పెట్టుకొని ,పూజారి అనే పెద్దరికాన్ని చూపి ఎంతోమంది స్త్రీల జీవితాలను చిత్ర వధ చేసి లైంగిక హింసకు పాల్పడిన పెద్ద మనుషుల ప్రొటెన్షియాలిటీని సైనైడ్ కడగాలి అని వారి యొక్క పురుషాధిపత్యాన్ని ప్రశ్నించినటువంటి కవి ధీరుడు మద్దూరి. పవిత్ర స్థలాల దగ్గర నుండి విజ్ఞానాన్ని బోధించే యూనివర్సిటీల వరకు జరిగిన అసాంఘిక సంఘటనల కేంద్రాలుగా ఉన్న పడక గదుల్ని కూలగొట్టాలి అని తన ధిక్కార స్వరం ప్రకటించాడు.

4. మీరేవుట్లూ: 1998వ సంవత్సరంలో శ్రీజా పబ్లికేషన్స్ నరసరావుపేట వారు ప్రచురించారు. ఇందులో 51 కవితలు ఉన్నాయి. మీరేవుట్లూ.... అనే కవితలు విభిన్న కోణాలతో వున్నాయి. దీనిని నగేష్ బాబు మేనమామ పుల్లారావు, అత్తమ్మ చిట్టెమ్మకు అంకితమిచ్చారు. మద్దూరి నగేష్ బాబు రచించిన "మీరేవుట్లూ" అనే కవిత్వంలో "వెలివాడ" అనే పేరుతో ఒక కవిత్వాన్ని రచించాడు. అందులో మాదిగ, మాల పల్లెల భౌతిక చిత్రణ అద్భుతంగా చిత్రించాడు. ఆ పల్లెల్లో రోడ్లు ఉండే విధానం, ఆ దళితులు యొక్క గుడిసెలు, ఆ పల్లెల్లో ఉండే మనుషుల యొక్క దీనస్థితిని స్వభావోక్తలంకారంలో చాలా అద్భుతంగా చిత్రించాడు. అదేవిధంగా "దేవుడి పెళ్ళాం" అనే పేరుతో ఈ దేశంలో మతాన్ని అడ్డం పెట్టుకొని బహుజన కులాల మహిళలను ఏ విధంగా లైంగిక దోపిడీకి గురిచేస్తారో కూడా అద్భుతంగా చెప్పారు. అదేవిధంగా "కుక్కిమంచం" అనే పేరుతో దళిత పల్లెల్లో తాను కూర్చున్నటువంటి మంచం మీద కావచ్చు, కుర్చీ మీద కావచ్చు ఆధిపత్య కులాల వాళ్ళు ఎవరైనా వస్తే వారి ముందు గౌరవ సూచకంగా లేచి నిలబడేటటువంటి విధానాన్ని ఖండించాడు. ఈ దేశంలో మనిషిని మనిషిగా చూడలేనటువంటి ఈ సమాజం తాను కూర్చున్నటువంటి మంచం తన కష్టార్జితమైనప్పటికీ తక్కువ కులం అనేటటువంటి నెపంతో ఆ విధంగా లేవక పోయేసరికి కొన్ని గ్రామాల్లో ఆధిపత్య కులాల వాళ్ళు దళితులపై దాడి చేసిన సందర్భాన్ని ఖండిస్తూ అరాచక వ్యవస్థపై తన కవిత్వం అనే ఖడ్గాన్ని ఝుళిపించాడు.

5. నరలోక ప్రార్థన: 2002వ సంవత్సరంలో వెలువరించిన ఈ సంపుటిలో మొత్తం 44 కవితలు ఉన్నవి. అలైస్ పబ్లికేషన్స్ వారు నరసరావుపేట వారు ప్రచురించారు. ఈ కవితా సంపుటిని నగేష్ బాబుకు నచ్చిన కదిలించిన ప్రేరేపణ కలిగించిన ఆత్మీయ మిత్రురాలు ఓల్గా కి అంకితం. ఈ భూమ్మీద దైవరాజ్యాన్ని కాదు మనుషుల రాజ్యాన్ని స్థాపించాలంటాడు. "నరలోక ప్రార్థన" అనే కవిత్వంలో "నూర్పిడి" అనే కవితలు ద్వారా ఒక గొప్ప లక్ష్యాన్ని సిద్ధాంతీకరించాడు. "ఓ నా భారత దేశ ప్రజలారా! మేము ప్రేమించుకుంటున్నాం, ప్రేమించుకుంటూనే ఉంటాం రెండు రక్త నదుల సమ్మేళనమై కొత్త పంటలు నూరుస్తాం... మీరేం చేసుకుంటారో చేస్కో పోండి.."[4] అనే సందర్భం లో మద్దూరి ఒక గొప్ప సైద్ధాతిక విధానాన్ని ప్రకటించాడు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసినటువంటి "కుల నిర్మూలన సిద్ధాంతాన్ని" పునాదిగా చేసుకొని రాసినటువంటి

కవితా పంక్తులు. ఈ దేశంలో ఎన్నో మతాలు, ఎన్నో కులాల, వర్ణాల సమ్మేళనం. ఇవి కులాల పేరుతో, మతాల పేరుతో అభివృద్ధికి ఆటంకం కాకుండా మరో కొత్త పంటను సృష్టిద్దాం అని చెప్పేటటువంటి సందర్భంలో తన లక్ష్యమైనటువంటి కుల నిర్మూలన సిద్ధాంతానికి సపోర్టుగా రాసినటువంటి వాక్యాలు ఇవి. అలా అని "కొత్తిల్లు" అనే కవిత లో కూడా ఈ దేశంలో మనువాదం పేరుతో నిచ్చెన మెట్ల వ్యవస్థను నిర్మించి ఒక కులం ఎక్కువగాను, ఒక కులం తక్కువగాను సృష్టించి, ఎంతో గొప్పగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సంపాదించినటువంటి ఒక దళిత కులానికి చెందినటువంటి కుటుంబానికి పట్టణాలలో, నగరాలల్లో కనీసం ఉండటానికి కిరాయి ఇల్లు దొరకనప్పుడు ఈ దేశం యొక్క దౌర్భాగ్యం, ఈ కుల వ్యవస్థపై తుపుక్కున ఉమ్మేస్తూ రాసినటువంటి కవితా పంక్తులు.

6. పుట్ట: 2006 వ సంవత్సరంలో శ్రీజ పబ్లికేషన్స్, నరసరావుపేట వారు ప్రచురించారు. ఈ సంపుటిని తన ప్రియమిత్రుడు తాడిపత్రి బాలస్వామికి అంకితం ఇవ్వటం జరిగింది. ఈ దేశంలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఎన్నో రూపాలుగా వేళ్ళూనుకు పోయింది. ఆ కుల వ్యవస్థ ను మద్దూరి నగేష్ బాబు "పుట్ట" అనే పేరును ఒక సింబాలిక్‌గా తీసుకొని ఈ దీర్ఘ కవితను మహాద్భుతంగా రాశారు. ఈ దేశంలో ఉన్న దళితులు "పుట్ట" అందాన్ని "పుట్ట" ఒంపు సొంపులను చూసి "పుట్ట" లో ఉన్నటువంటి పాముని చూడకుండా దళితులు బలైపోతున్నారు అనే ఆవేదనను వెలిబుచ్చారు.

ఈ సమాజంలో పాము కళ్ళతో తప్ప చూడలేని, పాము పడగతో తప్ప ఆలోచించలేనివాడు, ఈ సమాజంలో ఉండి అమాయకులైన, అజ్ఞానంతో ఉన్న నిస్వార్థులైనటువంటి దళిత ప్రజలు పద్మవ్యూహం లో చిక్కుకొని బయటికి రాని వారిలా తయారయ్యారు అని ఆవేదనను వెలిబుచ్చాడు మద్దూరి నగేష్‌బాబు. ఇందులో నగేష్‌బాబు విశృంఖలమైన భాషను యథేచ్ఛగా వాడాడు, శరీరంలో భాగాలైన అంగాలు కూడా అశ్లీలంగా, అసభ్యంగా కనిపించే అగ్రకుల హైందవ భావజాలం నుంచి బయటకువచ్చి చదివితే తప్ప అటువంటి ప్రయోగాలు కవి ఎందుకు చేస్తున్నాడని అంతు పట్టదు. నిజంగా ఆలోచన, స్పందన, ఆర్ధత ఉన్నవాళ్లు "పుట్ట" చదివితే తప్పనిసరిగా వాళ్ళ గుండెల్లో ఒక గొప్ప సంచలనం కలుగుతుంది. నిర్వచనాలు తిరగరాయాలన్న సంకల్పాలు కలుగుతాయి అని ఈ దీర్ఘ కవితకు ముందుమాట రాసిన ఖాజా ఎంతో అద్భుతంగా వివరించారు. అదేవిధంగా ఈ పాముని చూసిన దళితుడు–"తను దళితుడైనందుకు సిగ్గుపడేలా ఉద్రేకపరుస్తుంది. "ఒక దళితుణ్ని దళిత తత్వం నుంచి తన ఒంపు సొంపుల్తో పక్కకు లాగి నిర్వీర్యుణ్నే చేసేవ్యవస్థ 'పుట్ట'."

నాకొక నాగరికతలేదు – ఒక సంస్కృతి లేదు!/నాకొక భాషలేదు నాకో చరిత్రలేదు!

కనీసం ఏటవాలు ఎండలోనైనా నాకొక నీడ లేదు! /నేను చచ్చిపోయిన నీ జేష్ఠ పుత్రుడ్ని ప్రియురాలా![5]

ఇలా దళితులు ఎల్లప్పుడూ ఆత్మన్యూనతా భావంతో అందరిలాగా నాకు నాగరికత లేదు,, సంస్కృతి లేదు, భాష లేదు, చరిత్ర లేదు అని ఎల్లప్పుడూ కూడా బానిసలాగా బ్రతుకుతూ ఆధిపత్య కులాలకు సేవకుల్లాగా బతకాలనేటటువంటి ఉద్దేశంతో మనువాద కుట్రలో దళితుల్ని నిర్వీర్యం చేసేటటువంటి సింబాలిక్ వ్యవస్థ "పుట్ట"

7.గోదావరి: మద్దూరి నగేష్ బాబు మరణం తర్వాత 2007వ సంవత్సరంలో మానవతా ప్రచురణలు, అనే పేరుతో నగేష్ బాబు మిత్రులు దీన్ని ముద్రించారు. 1995లోనే పూర్తయింది. నగేష్ బాబు 12వ శ్వాసాల మహాకావ్యం అన్నాడు. గోదావరి నదిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది. కానీ దిగాలంటేనే భయం వేస్తుంది. పుష్కరాల సమయంలో ఎంతో మందిని బలి తీసుకుంటుంది. అందుకే గోదావరికి జాలి, దయ ఉండవు. నదిని చూస్తున్నంత సేపు ప్రశాంతంగా కనిపిస్తుంది.

"నిన్ను చూస్తుంటే, నా నెత్తురు ఉరకలేయడం లేదు/ నిన్ను ముట్టుకుంటే/ నాలో పదవ పాటలు పలకటం లేదు/ నీలో మునిగితే/ నా ఉప్పుచారులైన పోవడం లేదు/ గోదావరీ/ నువ్వెన్నడూ పల్లె కారుల దానివి కావు/నీ యిసుక గుండెల సంగతి / నేలనే కాదు/ మనుషుల్ని పాయలు పాయలుగా చీల్చే నీ కుట్ర/ నాకు తెలిసిపోయింది.../ గోదావరి!/ నీ ముందు నిలబడి/ నేనెన్ని సార్లు గుండెలు బాదుకున్నానో/ ఎన్నిసార్లు ఆకలితోపొల్లిమర్లి ఏడ్చానో/ కనీసం వినిపించు కున్నావంటే?/ ఓపెన్ పాపాలు కడగడానికే పుట్టిన దానా!/ నీ అలల చప్పుడు వింటే/ నా చెవుల్లోకి శ్లోకాలు సలసలా జారుతుంటాయి."[6]

మద్దూరి నగేష్ బాబు గోదావరి నది ఈ దేశంలో ఉన్న దళితులకు ఏమాత్రం కూడా ఉపయోగం లేదు. ఎంతోమంది కవులు, పండితులు, మనువాదులు గోదావరిని ఎన్నో రకాలుగా వర్ణించారు. గోదావరిని చూస్తుంటే నా నెత్తురు ఉరకలు వేస్తుంది, గోదావరిలో మునిగితే పాపాలు పోతాయి అని చెప్పటం ఇటువంటి సందర్భాలను గుర్తు చేసుకుంటూ గోదావరి ని చూస్తుంటే నాలో ఎటువంటి చలనం లేదు, నా నెత్తురు ఉరకటం లేదు, అదే విధంగా నా పాపాలు పోవడం కాదు కదా కనీసం నాపై ఉన్నటువంటి ఉప్పుచారలు కూడా పోవటం లేదు. అదే విధంగా ఈ సమాజంలో ఉన్న మనుషుల్ని పాయల, పాయలగా చీల్చినటువంటి కుట్ర నీది, నాకు నీ వల్ల జరిగిన మంచి కంటే నాకు చెడు జరిగినటువంటి సందర్భాలే కోకొల్లలుగా గుర్తొస్తున్నాయి. కుతికెల దాకా మునిగిన గుడిసెలు ఎల్లప్పుడూ దళితులపై ఒక శాపం లాగానే కూలిన గుడిసెలు కోల్పోవాల్సి వస్తుంది నీ ఉగ్రరూపానికి అంటూ గోదావరి అనే దీర్ఘ కవితలో వివరించారు.

8. నిషాని: 1995 వ సంవత్సరంలో మద్దూరి నగేష్ బాబు సంకలనం చేసిన ఇందులో వరదయ్య, ఖాజా,పైడితేరేష్ బాబు కవితలు ఉన్నాయి. కళా పబ్లికేషన్స్, పాల్వంచ వారు దీనిని ముద్రించారు.

"కవిత్వమంటే/ఒకానొక ఉన్మాదంలో ఊగి ఊగి /నవారు మంచం సందులో సుఖంగా స్కలనం చేసుకోవడం కాదురా నాన్నా!/నిన్నటి నుండి ఈరోజు లోంచి/రేపులోకి సూటిగా ప్రసరించడం కవిత్వం/ఇప్పుడు కవిత్వం నా ధిక్కారం!/నా నరనరాల్లో పారుతున్న నెత్తుటి కాలువ/ నా చర్మ రంధ్రాల్లోంచి ఉబుకుతున్న చెమట ఊట నా కుల విద్యల్లోంచి బతికి బట్టకట్టుతున్న కళారూపం /అంతేగానీ అరవోడి ప్రసంగంలా ముందూ ఎనకా తెలియని తుమ్మ జిగురు కాదు"[7]

తెలుగు సాహిత్య రచన ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు కూడా ఆధిపత్య కులాలు రాసినటువంటి కవిత్వమే కవిత్వం, తాను ఏదో ఉన్మాదంలో ఉండి ఊగి ఊగి రాసిన కవిత్వాన్ని, అచ్చమైన కవిత్వంగా ఇప్పటివరకు భ్రమ కల్పిస్తూ వచ్చారు, కానీ కవిత్వం అంటే శ్రమ సౌందర్యం నుండి రావాలి, శ్రామికుడి నుండి రావాలి, ఉత్పత్తి నుండి రావాలి, నర నరాల్లో నుంచి రావాలి నర నరాల్లో పారుతున్న నెత్తుటి కాలువల్లా రావాలి, చర్మ రంధ్రాలలో నుంచి ఉబుకుతున్న చెమట ఊటలాగా రావాలి, కులాల్లో నుండి, కుల విద్యల్లో నుండి, చేతివృత్తుల్లో నుండి, చెమటను బయటకు తీస్తున్నట్టుగా కవిత్వాన్ని బయటకు తీసేటటువంటి వాడు నిజమైన కవిత్వం రాసేవాడు. ఆ కవిత్వం ఈ దేశ మూలవాసులైనటువంటి దళితులది, బహుజనులది, గిరిజనులది. సాహిత్యం అంటే మాదే, మీది కాదు, మీరు బాగా తాగి, తిని, పెళ్లాల మీద, ఉంపుడుగత్తెల మీద వర్ణన చేస్తూ రాసేది కవిత్వమే కాదని అది చచ్చుకవిత్వం అని, పుచ్చు కవిత్వం అని దాన్ని చీపురుతో పారద్రోలే రోజు కచ్చితంగా వస్తుంది అని తన ఆశాభావాన్ని వ్యక్తంచేశాడు. ఉనికిలో లేని స్వర్గం ఒకటుంటుందని అక్కడ రంభ, ఊర్వసులు ఉంటారు అని, నువ్వు నీ బాబు, వాడి బాబు అంతా కూడా లేని భ్రమలు కల్పించి దేవుళ్లను తయారు చేసి ఇష్టమొచ్చినట్టుగా రాతలు రాసి సుఖ జీవనానికి అలవాటు పడ్డటువంటి మీరు రాసేది కాదు సాహిత్యం, మాది సాహిత్యం. మా కాళ్లు ఈ భూమి మీద నాటితే ఈ భూమి సస్యశ్యామలమై ఈ దేశానికి బుక్కెడు బువ్వ పెడుతుంది.నా ములవాసులు రాల్చినటువంటి చెమట చుక్కల ఆవిరే ఈ దేశానికి ఆహారం అవుతున్నది. వారి ఉత్పత్తి విధానం, వారి యొక్క శ్రమ సౌశీధర్యం, వారి యొక్క కష్టం రాస్తే అది కదా సాహిత్యం. అంటే ఊహా లోకంలో విహరించటం సాహిత్యం కాదు, ఒరేయ్ కుక్కవి, నక్కవి అని ఈ దేశంలో ఉన్నటువంటి హైందవ భావాజాలంతో ఉన్నటువంటి కవులను రచయితలను నిలదీస్తూ ఆ దళిత శ్రమ దళిత సంస్కృతి, దళిత జీవనాన్ని నమోదు చేయనటువంటి సాహిత్యాన్ని వారు విమర్శించారు. వాస్తవ దూరంగా, హేతురహితంగా, శ్రమరహితంగా రాసే కవిత్వాలు అవసరం లేదు అట్లాంటి కవిత్వాలు రాశారంటే జర భద్రం బిడ్డ అని హెచ్చరిక చేస్తున్నాడు కవి.

9. ఊరూ – వాడ (జంట దీర్ఘ వచన సంకర కవిత): 1997వ సంవత్సరంలో ముద్రణకు నోచుకున్న ఈ దీర్ఘకవిత 7 భాగాలుగా సాగింది. ఈ కవితా సంకలనాన్ని బ్రాహ్మణ యువకుడైన రాణీ శివశంకర్ తో కలిసి రాశాడు. దీనిని 'సంకర కవిత'గా వారు పేర్కొన్నారు. అంబేద్కరిజం చెబుతున్న రక్త మార్పిడి జరగాలని కోరుకుంటూ....

"రక్త మార్పిడీ చేసుకున్నారా? అయితే లోపలికి రండి!"[8] అని స్వాగతిస్తాడు. ఈ సంకర కవిత ను ప్రముఖ దళిత సాహిత్య విమర్శకుడైన జి.లక్ష్మీనరసయ్యకు అంకితం ఇవ్వబడింది. మనుషులంతా ఒకటవ్వాలని, కులాలు కూలిపోవాలని, మతాలు మాడిపోవాలని, మానవత్వమే మతంగా వెలుగొందాలని కులం లేని, మతం లేని దేశాన్ని స్వప్నిస్తూ ఊరూవాడ ఒకటైపోవాలని తరించాడు. ఇదే కదా దళిత సాహిత్య లక్ష్యం. ఇదే కదా అంబేద్కర్ ఆలోచనా విధానం. కుల నిర్మూలన జరగాలంటే ఊరూ వాడా మధ్య సంబంధాలు పెనవేసుకుపోవాలి, అటువంటి ప్రయత్నమే మద్దూరి ఆ క్రమంలోనే మద్దూరి ని కూడా నమ్మే స్థితిలో లేదు ఈ సమాజం. ఈ కుల సమాజంలో నీవు నిన్ను మార్చుకుంటూ ఈ సమాజాన్ని మార్చుకుంటూ ముందుకు పోవటమే నిజమైన దళిత చైతన్యమని మిత్రుడికి బోధ చేశారు మద్దూరి.

ముగింపు:

1995 నుండి 2005 వరకు దశాబ్ద కాలం ఎత్తిన కలం దించకుండా విస్తృతంగా, విరివిగా కవిత్వం రాశారు. కవితా సంపుటాలను, దీర్ఘ కవితలను రాశారు. అపూర్వమైన, ప్రయోగాత్మకమైన కవితా సంపుటాలకు సంపాదకుడుగా వ్యవహరించారు. ప్రతి వాక్యంలోనూ అంబేద్కర్‌వాదాన్ని, నినాదాన్ని నిలబెట్టి, ఆయన జ్ఞానాన్ని కవితలోకి, కవిత్వంలోకి పొందుపరిచాడు. తెలుగు దళిత కవిత్వాన్ని సహస్ర గుర్రాల శక్తితో ముందుకు పరిగెత్తించిన మొనగాడు. తెలుగు కవిత్వానికి నలుపు రంగు అద్దాడు. మద్దూరి నగేష్ బాబు స్థానం చెరిగిపోనిది. దళిత కవిత్వం ఒక ముఖ్యమైన పాయగా సాహిత్యంలో స్థిరపడడానికి మద్దూరి వెయ్యి మెదడులతో ఆలోచించటం, రెండు చేతులతో రాయడం, రాష్ట్రమంతా కలయ తిరిగి, బావ సారూప్యం కలిగిన సాహిత్యకారులతో కలిసి సభలు నిర్వహించటం లాంటి కార్యక్రమాలు చేసి సాహిత్య కృషిచేసారు. కొత్త తరం కవులను తయారు చేయటం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసారు. తనతో కనెక్ట్ అయిన వాళ్లందరికీ ఒక పవర్ బ్యాంకు లాగా ఎనర్జీ పంచేవాడు, రీఛార్జ్ చేసేవాడు, దిశా నిర్దేశం చేసేవాడు, దారితప్పిన గొర్రె పిల్లని "జీసస్" మందలోకి చేర్చినట్టుగా అజ్ఞాన మార్గం నుంచి కోటి దివ్వెల బాబాసాహెబ్ అంబేద్కర్ కాంతి లోకం వైపు నడిపించేవాడు. మద్దూరి నగేష్ బాబు అంటే ఒక అన్న, ఒక గురువు, ఒక తండ్రి, ఒక జిగ్రీ దోస్త్, ఒక ప్రియుడు, మరణం ఎరుగని ధీరుడు, నిరంతరం చిరస్మరణీయుడు.

పాదసూచికలు:

1. "వెలివాడ" మద్దూరి నగేష్ బాబు, పుట: 9
2. "రచ్చబండ" మద్దూరి నగేష్ బాబు, పుట: 134
3. "లోయ" మద్దూరి నగేష్ బాబు, పుట: 207
4. "నరలోక ప్రార్థన" మద్దూరి నగేష్ బాబు, పుట: 431
5. "పుట్ట" మద్దూరి నగేష్ బాబు, పుట: 569
6. "గోదావరి" మద్దూరి నగేష్ బాబు, పుట: 579
7. "నిశాని" మద్దూరి నగేష్ బాబు, పుట: 606
8. "ఊరూ–వాడ(జంట దీర్ఘ వచన సంకర కవిత)" మద్దూరి నగేష్ బాబు, పుట: 622

ఆధారగ్రంథాలు:

1. మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం –2024,బహుజన కెరటాలు (ప్రచురణ).

ISSN: 2319-3905

8

స్త్రీ జనోద్ధరణం - కందుకూరిపాత్ర

- ఆచార్య ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి

తెలుగుజాతి నవయుగ వైతాళికుడు, ప్రాతఃస్మరణీయుడైన కందుకూరి వీరేశలింగం పంతులుగారి గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు

తనదేహము, తనగేహము,
తనకాలము, తనధర్మమ్ము, తనవిద్య, జగ
జ్జనులకు, వినియోగించిన
ఘనుడీ వీరేశలింగకవి జనులారా".... అని కీర్తించాడు.

వీరేశలింగంగారు చేపట్టిన స్త్రీజనోద్ధరణం 19వ శతాబ్దపు భారతదేశ సంస్కరణోద్యమాల్లో ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది. ఇందుకు కారణం స్త్రీలు సాంఘిక వివక్షకు, తీవ్రమైన అణచివేతకు గురై ఎలాంటి హక్కులు లేకుండా దాస్యంలో మగ్గిపోవడమే. స్త్రీలను పట్టి పీడించిన అంశాల్లో ముఖ్యమైనవి బాల్యవివాహాలు, నిర్బంధవైధవ్యం, బహుభార్యత్వం, విద్యలేకపోవడం, సాంఘిక స్వేచ్ఛలేకపోవడం.

నాటి స్త్రీలు చదువుకొనే అవకాశం లేక నాలుగు గోడలకే పరిమితమై, మూఢవిశ్వాసాల్లో మునిగి, ఆచారాలచేత పీడింపబడుతూ బానిసలకంటే హీనంగా బతికేవారు. స్త్రీలు ఎంతగానో చదువుకొని, అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా ముందుకెళ్తున్న ఈ ఆధునిక కాలంలో కూడా భ్రూణహత్యలు, అత్యాచారాలు కొనసాగుతుండటం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి పరిస్థితులను మార్చటానికి కావలసిన పట్టుదల, నిర్భీతి మనకు కందుకూరి వారి జీవితం నేర్పుతుంది.

ఏదైనా ఒక గొప్పపనిని ప్రారంభించేముందు క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రజలను ఆవైపుకు మళ్లించే ప్రయత్నంచేయాలి. అందుకు తగ్గట్టుగానే కందుకూరివారు 'స్త్రీజనోద్ధరణకు' పూనుకోవడానికి ముందు ప్రజల మనస్సులను వాటి కనుగుణంగా మార్చటానికి కృషి చేశారు. అందుకనుగుణంగా సాహిత్యకారుడిగా ఎన్నో ఉపన్యాసాలివ్వడమే గాకుండా వివేకవర్థిని పత్రికలో విస్తారంగా రచనలు చేశారు. స్త్రీల సమస్యల గురించి, సాంఘిక దురాచారాల

గురించి ప్రజల్ని ఆలోచింపజేసే విధంగా బ్రాహ్మవివాహం, వ్యవహారబోధిని వంటి నాటకాలతోపాటు 16 ప్రహసనాలను కూడా రచించారు.

19వ శతాబ్దం చివర్లో ఆంధ్రదేశంలో స్త్రీవిద్యపట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉండేది. ఒకరకంగా చెప్పాలంటే స్త్రీలు అస్సలు చదువుకోకూడదు. ఒకవేళ అలా ఎవరైనా చేశారంటే ఆ కుటుంబానికి అరిష్టం దాపురిస్తుందని భావించే రోజుల్లో స్త్రీవిద్యాప్రాధాన్యత గురించి

తే॥గీ॥ "విద్యవలనను జ్ఞానంబు వెలయుగాన
నవని "నిదిమంచి" "యిదిచెడ్డ" యనుచు దెలియు
బాలురను బోలె(దప్పక బాలికలను
విద్యనేర్వంగ వలయును హృద్యముగను"

అని తెలిపి కందుకూరివారు 1874లో ధవళేశ్వరంలో బాలికల పాఠశాలను స్థాపించారు. స్త్రీ విద్యతోపాటు, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తెచ్చేందుకు స్త్రీలకోసం ప్రత్యేకంగా 1883లో 'సతీహితబోధిని' ని ప్రారంభించారు. తద్వారా కుటుంబంలోను, సమాజంలోను స్త్రీలకు తగిన గౌరవాన్ని కల్పించడానికి ఎన్నోవ్యాసాలను ప్రచురించారు.

1890లో భీమవరంలో సొంతభవనంలో 90 మంది విద్యార్థినులతో మరోబాలికా పాఠశాల ప్రారంభించారు. వితంతు శరణాలయానికి అనుబంధంగా 1905 లో బాలికల లోయర్ సెకండరీ పాఠశాల రాజమండ్రిలో ప్రారంభించారు. 1908లో గుంటూరులో ఒక బాలికా పాఠశాలను ప్రారంభించారు. కందుకూరి వారి స్ఫూర్తితో స్త్రీవిద్యతోపాటు, వారి అభ్యున్నతికి సభలు, సమావేశాలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆంధ్రదేశమంతటా ఆరంభమైనాయి. చాలా చోట్ల స్త్రీసమాజాలు ఏర్పడ్డాయి. స్త్రీలలో పెల్లుబికిన ఈ చైతన్యం ఎంతో మందిని రచయిత్రులుగాను, వ్యాసకర్తలుగాను తీర్చిదిద్దింది. ముఖ్యంగా బండారు అచ్చమాంబ, పులుగుర్తి లక్ష్మీనరసాంబలను పేర్కొనవచ్చు.

స్త్రీలు పూనుకోకపోతే సంఘసంస్కారం జయప్రదం కాదనేది వీరేశలింగంగారి ప్రగాఢమైన విశ్వాసం. కాబట్టే స్త్రీలకోసం ప్రత్యేకంగా సత్యవతిచరిత్ర, చంద్రమతిచరిత్ర, సత్యసంజీవని అనే వచన రచనలు చేశారు. ఈ రచనలు స్త్రీలపై ఎంత ప్రభావాన్ని చూపాయంటే వారు తమబిడ్డలకు 'సత్యవతి' అని పేరు పెట్టుకునేంతగా. స్త్రీల అభ్యున్నతికి పాటుపడాలన్న ఉద్దేశంతో కందుకూరివారు ప్రారంభించిన స్త్రీవిద్యాఉద్యమం 1870 నుండి 20వ శతాబ్దం మొదటవరకు క్రమక్రమంగా వృద్ధిచెందుతూ సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని కల్గించింది. సామాన్య విద్యతో ప్రారంభమై, ఉపాధి చూపించే విద్య కావాలనే స్థాయికి ఎదిగింది. ఆంగ్లభాష నేర్చుకోవడం, శాస్త్రీయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతోపాటుగా, సభలు, సమావేశాలు నిర్వహించుకొనే

ISSN: 2319-3905

స్థాయికి స్త్రీలు ఎగబ్రాకారు. 1881లో 2569 మందితో ప్రారంభమైన బాలికల సంఖ్య 1908 నాటికి 17096 వరకు చేరింది.

ఆ రోజుల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు బాల్యవివాహాలు, వితంతు సమస్యలు. బాల్యవివాహాల కారణంగానే వితంతువుల సమస్య ఏర్పడుతోంది. ఈ బాలవితంతువులు చదువుకోకూడదు, వారికి లోకజ్ఞానం ఉండకూడదు. స్త్రీవిద్యావ్యాప్తి బాగా జరిగాక కందుకూరివారి దృష్టి వితంతువివాహాలపై పడింది. బాల్యవివాహాలవల్ల వృద్ధులైన భర్తలు చనిపోగా బాలవితంతువులు సమాజంలో అధిక సంఖ్యలో ఉండేవారు. ముఖ్యంగా బ్రాహ్మణ కుటుంబాల్లో ఈ సమస్య అధికంగా ఉండేది. బాలవితంతువుల గురించి....

సీ॥ వినవయ్య చెప్పెద విస్పష్టముగ నీకు
మనదేశమందలి మగువలందు
వైధవ్యదశ నొందువారల దురవస్థ
గనుగొన్న నెంతటి కఠినునకును
హృదయమందు నీరయి యెంతయు ధుఃఖంబు
పుట్టును వారిలో ముఖ్యముగను
బాల్యకాలమునందు పతిహీన లైనట్టి
యబలల దుర్దశ లాత్మలోన
తే॥ దలచుమాత్రాన దేహంబు జలదరించి
వారియాపద వారింపవలయు ననెడు
బుద్ధి పుట్టకపోవదు భూమిలోన
మానవశరీర మెత్తిన వానికెల్ల.

బాలవితంతువులకు మళ్లీ వివాహం చేయడమనేది తీవ్రమైన సాంఘిక సమస్యగా కందుకూరివారు గుర్తించారు. ఈ వివాహాలను అగ్రకులస్థులైన బ్రాహ్మణ వైశ్యులు వ్యతిరేకించారు. ఏదైనా ఒక ఉద్యమాన్ని ప్రారంభించే ముందు ప్రజలను మానసికంగా తయారుచేయడం వీరేశలింగంగారి నైజం. అందుకే 'రాజశేఖరచరిత్రము' అనే నవలలో బాల్యవివాహాలు, మూఢవిశ్వాసాలు, సాంఘిక దురాచారాల వల్ల కలిగిన నష్టాలను వివరించి, వితంతువుల దయనీయమైన స్థితిగతులను కళ్లకు కట్టినట్లు చూపించాడు.

1879లో రాజమండ్రిలో వితంతు వివాహ సంఘాన్ని స్థాపించి, దాని కార్యదర్శిగా ఉంటూ మచిలీపట్నం, గుంటూరు, బళ్లారి, మద్రాసులకువెళ్లి ఉద్యమ లక్ష్యాలను వివరిస్తూ, ఉపన్యాసాలు చేస్తూ స్థానిక సమాజాల ఏర్పాటుకు కృషిచేశారు. 1881 డిసెంబర్ 11న మొదటి వితంతువివాహం, 15న రెండవ వివాహం రాజమండ్రిలో జరిపించారు. సంప్రదాయవాదులు

ఈ వివాహాన్ని ఆపాలని తీవ్రప్రయత్నం చేశారు. పెళ్లికొడుకు, పెళ్లికూతురులను అపహరించడంలాంటి ప్రయత్నం చేశారు. ఒకదశలో కొట్టడానికి కూడా ప్రయత్నించారు. విద్యార్థుల, ఆంగ్ల అధికారుల సహాయంతో తప్పించుకున్నారు. ఇందులో పాల్గొన్న వారిని దేవాలయాల్లోకి రానివ్వలేదు. బావుల్లో నీళ్లు తోడుకోనివ్వలేదు.

ఒక సంఘసంస్కరణ కార్యక్రమం జరగాలంటే ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కోవాలో తెలుసుకోవలసిన అవసరం నేటి తరంవారికి ఎంతైనాఉంది. నేడు వితంతు పునర్వివాహాలు సులభంగా జరుగుతున్నాయంటే అది వీరేశలింగం నడిపిన సంఘసంస్కరణోద్యమ ఫలితమే.

తరువార దేవదాసీ వ్యవస్థ రద్దుకోసం ఉద్యమించారు. తద్వారా సానివృత్తినుండి స్త్రీలను కాపాడవచ్చని ఆయన భావించాడు. ఈ దురాచారాన్ని నిరసిస్తూ వివేకవర్థినిలో వ్యాసాలు రాశారు. ప్రజల్లో చైతన్యం కల్గించడానికి 'వేశ్యాప్రియప్రహసనం' అనే నాటకం రాశాడు. 1881లో విద్యార్థులు సంతకాలు సేకరించి దేవదాసీ వ్యవస్థ రద్దుకోరుతూ ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ ఉద్యమానికి ప్రజల నుంచే గాకుండా వేశ్యాకులం నుండి కూడా అనూహ్యస్పందన లభించింది. వేశ్యాకులానికి చెందిన ఎందరో తమ వృత్తిని వదలి విద్యనభ్యసించి పెళ్లిళ్లు చేసుకొని గౌరవప్రదమైన జీవనం సాగించారు.

ఆకాలంలో జ్యోతిషం అంటే తెగని పిచ్చి, అమావాస్య, అష్టమి, నవమి, మంగళవారం వంటి మూఢవిశ్వాసాలకేమీ తక్కువలేదు. వీటిని తొలగించడానికి అమావాస్యనాడే ఉద్యోగంలో చేరాడు వీరేశలింగం. సమాజంలో పేరుకుపోయిన ప్రతీ చెడును ఆయన చీల్చిచెండాడాడు. భగవంతుడు సృష్టించిన రోజులన్నీ మంచివనే విషయాన్ని నేటి యువత గ్రహించాలి.

ఆ మహానుభావుడు పరమపదించిన వందేళ్ల తర్వాత ఆయన ఆదర్శాలు, ఆచరణ అత్యంత సమకాలీన అవసరాలుగా కన్పిస్తున్నాయంటే ఆయన ఎంత దార్శనికుడో, సాహసికుడో ఇట్టే అర్థమైపోతుంది. ఆయన విస్తారమైన, విశేషమైన, విలక్షణమైనకృషి ఒక సంస్కర్త పరిధిని మించింది. అంతరిక్షంలోకి రాకెట్లను ప్రయోగించే ఇస్రోఅధినేత గుళ్లుగోపురాలు తిరగడం, ముహూర్తాన్ని నిర్ణయించడం వంటివి నవ్వును తెప్పిస్తాయి. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులే యాగాల పేరిట యాగీచేస్తున్నప్పుడు, వాస్తుకోసం రాజధానులు సచివాలయాల మార్పుచేర్పులు చేసే నేతలు తెలుగు నేలలను ఏలుతున్న నేపథ్యంలో వస్తున్నది వీరేశలింగం శతవర్ధంతి. ఆధునిక భావ విప్లవానికి తొలికృషి బలంగా చేసినవాడు వీరేశలింగం.

"తెలుగుజాతిని తెరలుతెరలుగా కారుచీకటి కమ్మినప్పుడు
మూఢ ఛాందసగాఢ రుగ్మత మూలుగుల్లో చొచ్చినప్పుడు
కాంతి ఖడ్గం కరుణవైద్యం, కార్యవాదిగ, కార్యశీలిగ,
జాతిజనుల సముద్ధరించగా జనన మొందెను తెలుగుగడ్డను"[1]

అని కీర్తింపబడిన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు. వందేళ్ల కిందటే వినోదాత్మకంగా, విశ్లేషణాత్మకంగా చెప్పిన తీరుకు విస్తుపోకుండా ఉండలేం.

నేటి సమాజంలో మహిళల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కులవ్యవస్థ, ఛాందసభావాలు వర్తమాన సమాజాన్ని ఇంకా పట్టి పీడిస్తూనే ఉన్నాయి. పవిత్రస్థలాల్లోనే బాలికలపై అత్యాచారాలు, పనిచేసేచోట వేధింపులు, అవమానాలు చూస్తూనే ఉన్నాం, ఆధునిక కాలం అని చెప్పుకొంటున్న ఈ నవ్యనాగరిక సమాజంలో ఇటీవల జరుగుతున్నవి చూస్తుంటే ఇంకో వెయ్యిమంది వీరేశలింగాలు వచ్చి పోరాడాలేమోననిపిస్తుంది.

పాదసూచికలు:

1. ఆరుద్ర – సమగ్ర ఆంధ్ర సాహిత్యం, పుట–52–4.

ఆధారగ్రంథాలు:

1. వీరేశలింగం – సమగ్ర పరిశీలన, అక్కిరాజు రమాపతిరావు సిద్ధాంత గ్రంథం – 1972.
2. తెలుగు సాహిత్యం పై ఇంగ్లీషు ప్రభావం – కొత్తపల్లి వీరభద్రరావు.
3. సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర – ఆరుద్ర, 4వ సంపుటం, తెలుగు అకాడమీ ప్రచురణ – 2012.
4. వీరేశలింగంగారి స్వీయచరిత్ర–విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ –1982.
5. తెలుగు వెలుగు వీరేశలింగం జీవితచరిత్ర – అక్కిరాజు రమాపతిరావు – స్వీయముద్రణ – 2003.

9

మల్లెమొగ్గల గొడుగు (మాదిగ కతలు) – పరిశీలన

– డా॥ తోట వెంకటస్వామి

పరిచయం:

ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో సామాజిక స్పృహ, మానవ సంబంధాల సూక్ష్మత, గ్రామీణ, పట్టణ జీవన సంక్లిష్టతలను సమన్వయపరచి చిత్రించే రచయితలలో ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు ప్రముఖులు. వారి కథా సంపుటి "మల్లె మొగ్గల గొడుగు" ఒక సాహిత్యాంశం మాత్రమే కాకుండా సమకాలీన సమాజానికి అద్దం పట్టే సామాజిక అంశంగా కూడా నిలుస్తుంది. ఈ కథలు మానవీయ విలువలను, భావోద్వేగాలను, సామాజిక అసమానతలను, వ్యక్తిగత అంతర్మథనాలను సున్నితంగా ఆవిష్కరిస్తాయి.

ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారి మల్లెమొగ్గల గొడుగు అనే కథాసంకలనంలో మొత్తం 27 కథలు ఉన్నాయి. అందులో నుంచి 1) దప్పుగొడితే సరస్పతి సిందులెయ్యాల, 2) నవాబు గుర్రాన్ని నాట్యమాడించిన దరువు, 3) మనకీ గొడ్డుకీ తేడా ఏవుంది సుదయ్యా!, 4) బానిస బతుకు బతకబళ్లే, 5) ఎవుడికంటే తక్కువ? అనే ఓ ఐదు కథలను తీసుకొని వాటిని విశ్లేషించడమే ప్రస్తుత నా పత్ర ఉద్దేశం.

1) దప్పుగొడితే సరస్పతి సిందులెయ్యాల!:

ఎండ్లూరి సుధాకర్ గారు "దప్పుగొడితే సరస్పతి సిందులెయ్యాల!" అనే కథ ద్వారా దళితుల జీవన చిత్రాన్ని, ముఖ్యంగా మాదిగల సంప్రదాయ కళ అయిన దప్పు వృత్తిని సామాజిక విమర్శగా మలిచారు. కథ మొత్తం ఒక సాధారణ పల్లె నేపథ్యంలో సాగినా, దానిలో అంతర్గతంగా ఉన్న కులవ్యవస్థ, శ్రమ దోపిడీ, కళను గౌరవించడం అనే వాటి మధ్య విరోధం స్పష్టంగా కనిపిస్తుంది.

కథకుడు సుదయ్య తన మరిది అంతోనితో కలిసి పెళ్లికి వెళ్లే సందర్భంలో పెదబోడిబావ, చినబోడిబావల పరిచయం ద్వారా దప్పు కళ యొక్క లోతైన ప్రపంచాన్ని మన ముందుంచుతాడు.

డప్పు తయారీ విధానం నుంచి, దాన్ని వాయించేందుకు పడే శ్రమ వరకు వివరంగా చెబుతూ రచయిత దళితుల వారసత్వ జ్ఞానాన్ని "అసలైన విద్య"గా నిలబెడతాడు. డప్పు వాయించడం వారికి కేవలం వృత్తి మాత్రమే కాదు; అది వారి జీవితం, వారి గుర్తింపు. ఈ కథలో డప్పు ఒక బలమైన ప్రతీకగా నిలుస్తుంది. దేవాలయాలు, జాతరలు, పెళ్లిళ్లు, పండుగలు అన్నిటికీ డప్పు తప్పనిసరి. దేవుడు కదలాలన్నా, ఉత్సవం జరగాలన్నా డప్పు వాయించాల్సిందే. కానీ అదే డప్పు వాయించే మాదిగ మాత్రం "బయటి మనిషి". ఇతరుల ఇళ్ళల్లోకి ప్రవేశం ఉండదు, గౌరవం లేదు, తగిన ప్రతిఫలం అంతకన్నా లేదు. ఈ ద్వంద్వ వైఖరినే రచయిత తీవ్రంగా ప్రశ్నిస్తున్నాడు.

చినబోడిబావ పాత్ర ద్వారా దళితుల ఆత్మగౌరవ స్వరం బలంగా వినిపిస్తుంది. "డప్పు గొడితే సరస్వతి సిందులెయ్యాలి" అనే అతని మాట దళితులకున్న కళాశక్తిని, గర్వాన్ని ప్రతిబింబిస్తుంది. విద్యకు, సంస్కృతికి ప్రతీక అయిన సరస్వతి కూడా తమ కళ ముందు తలవంచాల్సిందే అన్న భావనలో దళితుల ప్రతిఘటన దాగి ఉంది. అయితే అదే సమయంలో అతని మాటల్లో ఉన్న కోపం, ఉమ్మిలో బయటపడే కసి, శతాబ్దాలుగా ఎదుర్కొన్న అవమానానికి సూచిక.కథలో మరో ముఖ్యాంశం ఏమిటంటే గురువిజ్జె భావన. డప్పు నేర్చుకోవడం గురువుల దగ్గర కాకుండా తాతల నుంచి, కుటుంబం నుంచి, జీవన అనుభవం నుంచి జరుగుతుంది. ఇది ఆధునిక విద్యా వ్యవస్థ తక్కువగా చూసే జ్ఞాన రూపం. అయితే అదే జ్ఞానం సమాజాన్ని కదిలించే శక్తి కలిగిఉందని రచయిత స్పష్టం చేస్తాడు.

భాషా పరంగా ఈ కథ పల్లె మాండలికంలో సాగుతుంది. ఈ మాండలికం కథకు సహజత్వాన్ని, నిజాయితీని ఇస్తుంది. దళితుల జీవితం అచ్చంగా వినిపించేలా రచయిత భాషను ఉపయోగించాడు. వ్యంగ్యం, ఆవేశం, వేదన అన్నీ కలసి కథను శక్తివంతంగా తీర్చిదిద్దాయి. మొత్తంగా, "డప్పుగొడితే సరస్వతి సిందులెయ్యాల!" కథ దళితుల కళ, శ్రమ, ఆత్మగౌరవాల పక్షాన నిలిచిన సామాజిక ప్రకటన. కులవ్యవస్థలో దాగి ఉన్న అన్యాయాలను ప్రశ్నిస్తూ, గౌరవం లేని సంస్కృతి నిలవదని ఈ కథ ద్వారా స్పష్టమైన సందేశం ఇస్తున్నారు రచయిత.

2) నవాబు గుర్రాన్ని నాట్యమాడించిన దరువు:

ఆచార్య ఎండ్లూరి సుధాకర్ "నవాబు గుర్రాన్ని నాట్యమాడించిన దరువు" అనే కథలో దళితుల చరిత్రను, ముఖ్యంగా మాదిగల సామాజిక పాత్రను జానపద చరిత్ర రూపంలో తిరిగి ఆవిష్కరిస్తారు. అధికారిక చరిత్రలో స్థానం దక్కని దళితుల సేవ, నైపుణ్యం, నిజాయితీ ఈ కథలో ప్రధానంగా నిలుస్తాయి. ఆ కథ ఒక వ్యక్తిగత అనుభవం కాదు; అది ఒక సమాజపు జ్ఞాపకం. కథ యేసునాయన చెప్పే మాటల ద్వారా ముందుకు సాగుతుంది. ఈ కథన విధానం ద్వారా రచయిత "రాయని చరిత్ర"ను పాఠకుడికి చేరువ చేస్తాడు. రావిగుంటపల్లెకు వచ్చిన ముగ్గురు అన్నదమ్ములు– ఒకడేమో వింటిల్లు గురిజూసి కొట్టే దాంట్లో దిట్ట, రెండో వాడు సెప్పులు

కుట్టేదాంట్లో మొనగాడు, మూడోవాడు తప్పెట గొట్టడంలో పనిమంతుడు. ఈ కథలో మాదిగల సంపూర్ణ జీవన వ్యవస్థను ప్రతిబింబిస్తారు రచయిత. వీరు కేవలం పనివాళ్లు కాదు; గ్రామ జీవనానికి అవసరమైన భద్రతకు, ఆర్థికతకు, సంస్కృతికి మూలస్తంభాలు. గ్రామంలో జరిగిన దొంగతనం సందర్భంలో, మాదిగలపై అనుమానం పడినా వారు తమ నిజాయితీతో అసలైన దొంగలను పట్టిస్తారు. ఈ సంఘటన ద్వారా రచయిత దళితులను "నేరస్తులు"గా చూపే సామాజిక అపోహను ప్రశ్నిస్తూ నిజానికి దోపిడీ చేసే వారు ఆధిపత్య వర్గాలేనని స్పష్టం చేస్తాడు. ఈ నిజాయితీకి ప్రతిఫలంగా వారికి మిరాశి భూమి లభించడం ఒక చారిత్రక మలుపు.

కథలో ముఖ్యమైన మలుపు నవాబు ప్రవేశంతో వస్తుంది. నవాబు గుర్రం ముందు డప్పు దరువు వాయించడంతో గుర్రం నాట్యం చేయడం కథలో అద్భుతంగా వర్ణించబడుతుంది. ఇది కేవలం సంఘటన కాదు; ఇది ఒక ప్రతీకాత్మక దృశ్యం. అధికారానికి, శక్తికి ప్రతీక అయిన నవాబు గుర్రం దళితుల కళ ముందు లొంగిపోవడం ద్వారా రచయిత ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నాడు దళితుల సంస్కృతి కూడా శక్తివంతమైనదేనని.

డప్పు ఈ కథలో ప్రధాన ప్రతీక. అది వినోద సాధనం కాదు; అది ఒక శక్తి, నియంత్రణ, ప్రతిఘటనకు రూపం. నవాబు కూడా ఈ కళను గుర్తించి మెచ్చుకుంటాడు. దానికి ప్రతిఫలంగా భూమిని మిరాశిగా ఇస్తాడు. ఇది దానం కాదు; నైపుణ్యానికి లభించిన న్యాయమైన ఫలితం. తర్వాతి భాగంలో సెప్పులు కుట్టే కళ ద్వారా మరోసారి మాదిగల పనితనం వెలుగులోకి వస్తుంది. "ఇవి కాల్లకి కాదు, నెత్తిన పెట్టుకోవాల్సిన సెప్పులు" అన్న నవాబు మాటలు దళిత కళపై ఉన్న గౌరవాన్ని సూచిస్తాయి. ఇక్కడ కూడా భూమి ఇవ్వడం ద్వారా వారి స్థిరత్వాన్ని అంగీకరిస్తాడు. అయితే కథ చివర్లో యేసునాయన నిట్టూర్పు చాలా కీలకం. ఒకప్పుడు సంపాదించుకున్న భూములు ఇప్పుడు అమ్ముడవుతున్నాయని, అంటరాని వాడల మీదే మేడలు కడుతున్నారని చెప్పడం ద్వారా రచయిత సమకాలీన దళిత సమస్యలను చూపిస్తాడు. చరిత్రలో ఒక దశలో లభించిన గౌరవం, హక్కులు నేటి కాలంలో మళ్లీ కోల్పోతున్నామనే బాధ ఇక్కడ వ్యక్తమవుతుంది.

భాషా పరంగా ఈ కథ పల్లె మాండలికంలో సాగుతుంది. ఈ భాష కథకు సహజత్వాన్ని, నమ్మకాన్ని ఇస్తుంది. దళితుల జీవితం, ఆలోచనలు, భావోద్వేగాలు నేరుగా వినిపించేలా ఈ భాష పనిచేస్తుంది. ఇది అధికార భాషకు వ్యతిరేకంగా నిలిచే సాహిత్య రాజకీయంగా కూడా చూడవచ్చు. మొత్తంగా, "నవాబు గుర్రాన్ని నాట్యమాడించిన దరువు" కథ దళితుల చరిత్రను తిరగ రాసే ప్రయత్నం. దళితులు కేవలం అణగారిన వర్గం మాత్రమే కాదు; గ్రామ సమాజాన్ని నడిపించిన కీలక శక్తి అని ఈ కథ నిరూపిస్తుంది. కళ, శ్రమ, నిజాయితీ ఆధారంగా సంపాదించిన గౌరవం కూడా కాలక్రమంలో ప్రమాదంలో పడుతుందనే హెచ్చరికతో కథ ముగుస్తుంది.

3) మనకీ గొడ్డుకీ తేడా ఏవుంది సుదయ్యా!:

ఎండ్లూరి సుధాకర్ గారి "మనకీ గొడ్డుకీ తేడా ఏవుంది సుదయ్యా!" అనే కథలో దళితుల జీవనంలో నిత్యం ఎదురయ్యే అవమానం, దోపిడీ, అమానవీయతను అత్యంత సహజంగా, తీవ్రమైన భావోద్వేగంతో చిత్రించారు. ఈ కథ వ్యక్తిగత జ్ఞాపకంలా మొదలైనా, క్రమంగా అది ఒక సామూహిక అనుభవంగా మారుతుంది. మాదిగల జీవితం ఎంతగా విలువ కోల్పోయిందో, సమాజం వారిని ఎంత అమానుషంగా చూసిందో ఈ కథ స్పష్టంగా వెల్లడిస్తుంది. కథకు ఆరంభం కథకుడు సుదయ్య లింగారెడ్డి పల్లెలో తన బెన్ని మావ ఇంటికి వెళ్లడం. ఆ గుడిసె చుట్టూ తిరిగే పందులు, పేదరికం, సంకటి, ఈరిగల భోజనం అన్నీ కలిసి మాదిగల జీవన వాస్తవికతను చాటిచెబుతాయి. గొడ్డును కోసినప్పుడు గ్రామమంతా పండుగ వాతావరణం ఉన్నా, ఆ ఆనందం వెనుక ఉన్నది కష్టజీవుల శ్రమే. మాంసం తినే హక్కు ఉన్నా, గౌరవం మాత్రం లేని పరిస్థితి కథ అంతటా కనిపిస్తుంది.

బెన్ని మావ పాత్ర ఈ కథకు ప్రాణం. అతని జ్ఞాపకాలు, మాటల్లో దళితుల చరిత్ర దాగి ఉంది. తన తండ్రి మొద్దు గురయ్య గురించి చెప్పే సందర్భంలో దళితుల పనితనం, నిజాయితీ, నైపుణ్యం బయట పడతాయి. తెల్లదొరలు కొంత మానవీయంగా ఉన్నా, నల్లదొరల చేతుల్లో దళితుల పరిస్థితి మరింత దిగజారిందని బెన్ని మావ మాటల్లో స్పష్టమవుతుంది.

"మా కొద్దూ నల్లదొరతనమూ!/బాబు! మా కొద్దు నల్లదొరతనమూ!/దారీలో మేము జూచి/ దూరాదూరముగానీ/దొలగీ పోయేదరయ్యోదేవా!/మేము మీ తోటీ నరులము గామా!/బయము బుట్టించే దయ్యాములామా?/ కసిబెట్టే కందిరీగలామా?/తరిమి గరిసే తాసూ పాములామా?/ అయ్యో సిన్నాబుచ్చుకు రయ్య/ఇది మీకు మర్యాదా?/మాకొద్దు నల్లదొరతనమూ/ఎరికాలూ యానాదు లెగ్గూ బట్టక వారు/కలుపుకోని తిర్గుతారు/సెంచూ లంబాదూల నంటుతారు/అంట్లు తోనయినా బత్కానివరండీ/మా మాలా మాదిగలంటే/మండిపడీ సస్తారు/మాకొద్దూ నల్లదొరతనమూ" – ఈ పాటలో "నల్లదొరతనం" అనే పదం ద్వారా రచయిత ఆధిపత్య వర్గాల క్రూరత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాడు. కథలో వచ్చే పాటలు ఈ విశ్లేషణలో అత్యంత కీలకం. అవి కేవలం వినోదం కాదు; అవి ప్రతిఘటన స్వరాలు. దళితులు ఎదుర్కొన్న అవమానాన్ని, భయాన్ని, కోపాన్ని పాటల రూపంలో వెలిబుచ్చడం ఈ కథలో ప్రత్యేకత. "మాకొద్దు నల్లదొరతనమూ" అనే పదాలు ఒక నినాదంలా మారి, దళితుల ఆవేదనను ప్రతిబింబిస్తాయి. పాట వినిపిస్తున్నప్పుడు ప్రకృతి కూడా స్పందించినట్టుగా రచయిత వర్ణించడం, ఆ బాధ ఎంత విశ్వవ్యాప్తమో సూచిస్తుంది. ఈ కథలో గొడ్డు ఒక బలమైన ప్రతీక. గొడ్డును కోసినప్పుడు దానికి విలువ ఉంటుంది; దాని మాంసం పంచుకుంటారు, ఆనందిస్తారు. కానీ అదే పనిలో ఉన్న మనిషికి, మాదిగకు గౌరవం లేదు. అందుకే కథ శీర్షికలోని ప్రశ్న "మనకీ గొడ్డుకీ తేడా ఏవుంది?" అనే వేదనాత్మక ఆలోచనగా నిలుస్తుంది. ఇది దళితుల మానవత్వాన్ని కూల్చివేసిన సమాజంపై వేసిన ఘాటైన ప్రశ్న.

భాషాపరంగా ఈ కథ పల్లె మాండలికంలో సాగినా కథను మరింత నమ్మదగినదిగా, సహజంగా చేస్తుంది. బెన్ని మావ మాటల్లో వచ్చే కోపం, వ్యంగ్యం, వేదన అన్నీ భాష ద్వారానే పాఠకుడికి చేరతాయి. ఇది అధికార భాషకు వ్యతిరేకంగా నిలిచే దళిత సాహిత్య శైలి. మొత్తంగా, "మనకీ గొడ్డుకీ తేడా ఏవుంది సుదయ్యా!" కథ దళితుల అమానవీయ పరిస్థితిపై చేసిన తీవ్ర విమర్శ. శ్రమ చేసే మనిషికి గౌరవం లేకుండా, జంతువుకే విలువ ఇచ్చే సమాజాన్ని రచయిత ప్రశ్నిస్తాడు. ఈ కథ కేవలం గతాన్ని చెప్పదు; నేటికీ కొనసాగుతున్న కుల వివక్షను గుర్తుచేస్తూ పాఠకుడిని ఆలోచింపజేస్తుంది. దళితుల బాధ, ఆవేదన, ప్రతిఘటన కలిసిన ఈ కథ తెలుగు దళిత సాహిత్యంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని దక్కించుకుంటుంది.

4) బానిస బతుకు బతక బళ్లే!:

సుధాకర్ గారి "బానిస బతుకు బతక బళ్లే!" అనే ఈ కథలో రచయిత దళితుల జీవితంలో తరతరాలుగా కొనసాగుతున్న బానిసత్వం, శ్రమ, అణచివేతలను ఒక కుటుంబ నేపథ్యం ద్వారా చిత్రించాడు. కథ శాంతమ్మ అనే దళిత స్త్రీ జీవితాన్ని కేంద్రంగా చేసుకొని సాగుతుంది. ఆమె జీవితం వ్యక్తిగత గాథలా కనిపించినా, వాస్తవానికి ఇది దళిత స్త్రీల సామూహిక అనుభవాన్ని ప్రతిబింబిస్తుంది. శాంతమ్మ మదరాసు నగరంలో పుట్టి పెరిగి, పెళ్లి తర్వాత రావిగుంట పల్లెకు రావడం ద్వారా కథ ప్రారంభమవుతుంది. నగర జీవితం నుంచి పల్లె జీవితానికి వచ్చిన ఆమె అనేక కష్టాలు ఎదుర్కొంటుంది. పల్లె ఆహారపుటలవాట్లు, ముఖ్యంగా సంగటి తినలేకపోవడం ఆమెకు శారీరకంగా, మానసికంగా బాధను కలిగిస్తుంది. ఇది కేవలం ఆహార సమస్య కాదు; పుట్టుకతోనే శ్రమకు కట్టుబడి ఉండాల్సిన దళిత జీవితానికి ఆమెకు ఎదురైన సంఘటన.

శాంతమ్మ పాత్రలో అమాయకత్వం, సహనం ఉన్నా, అదే సమయంలో మౌనంతో కూడిన తిరుగుబాటు కూడా కనిపిస్తుంది. "నేను సంగటి చేయను" అనే ఆమె మాటల్లో ఆమె అంతర్గత నిరాకరణ స్పష్టంగా కనిపిస్తుంది. ఇది దళిత స్త్రీలపై సమాజం మోపే పాత్రలను ప్రశ్నించే సంకేతం. ఈ కథలో అత్యంత విశిష్టమైన పాత్ర మావ (పెదయ్య). సాధారణంగా కోడలిపై ఆధిపత్యం చూపే పాత్రకు భిన్నంగా, ఈ మావ అత్యంత మానవీయంగా వ్యవహరిస్తాడు. కోడలికి వండి పెట్టడం, నీళ్లు తెచ్చిపెట్టడం, బాలింత పత్తెం చేయడం వంటి పనులు చేయడం ద్వారా రచయిత పితృస్వామ్యానికి ప్రత్యామ్నాయ రూపాన్ని చూపిస్తాడు. ముఖ్యంగా మావ చెప్పే మాట – "నా మాదిరిగా ఈ పిలగాయలు గూడా బానిస బతుకు బతక బళ్లేదు"– ఈ కథకు కేంద్ర భావంగా నిలుస్తుంది. ఇది దళితుల భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశకు ప్రతీక. కథలో బానిసత్వం శారీరక శ్రమకే పరిమితం కాదు. ఆహారం, దుస్తులు, పనులు, ఆలోచనలు – అన్నింటిపైనా నియంత్రణ కనిపిస్తుంది. శాంతమ్మ జీవితం ద్వారా దళిత స్త్రీపై పడే స్త్రీ, కుల, వర్గ అణచివేతను రచయిత స్పష్టంగా చూపించాడు.

భాషా పరంగా ఈ కథ పల్లె మాండలికంలో సాగినా, కథకు సహజత్వం, నిజాయితీని ఇస్తుంది. దళితుల మాటలనే కథ భాషగా ఉపయోగించడం ద్వారా రచయిత వారి అనుభవాలకు గౌరవం ఇస్తాడు. మొత్తంగా, "బానిస బతుకు బతక బళ్లే!" కథ దళిత జీవనంలోని బాధను మాత్రమే కాదు, ఆ బాధ నుంచి బయటపడాలనే తపనను కూడా వ్యక్తం చేస్తుంది. శ్రమకు, బానిసత్వానికి ముగింపు ఉండాలన్న ఆశతో కథ ముగుస్తుంది. అందుకే ఇది దళిత సాహిత్యంలో ముఖ్యమైన కథగా ఇది నిలుస్తుంది.

5) ఎవుడికంటే తక్కువ?:

ఎండ్లూరి సుధాకర్ గారి "ఎవుడికంటే తక్కువ?" అనే కథ దళిత జీవితంలోని ఆత్మగౌరవ పోరాటాన్ని, ముఖ్యంగా దళిత మహిళలోని చైతన్యాన్ని బలంగా ప్రతిబింబించే కథ. ఈ కథలో వ్యక్తిగత జ్ఞాపకాలు, గ్రామీణ అనుభవాలు, సామాజిక అన్యాయాలు అన్నీ కలిసిపోయి ఒక సామూహిక ప్రశ్నగా రూపుదిద్దు కుంటాయి. ఆ ప్రశ్నే కథాశీర్షికగా నిలుస్తుంది. ఈ కథలో రచయిత తన అత్త అయిన సరోజినత్తను కేంద్రంగా పెట్టుకొని కథను నడిపిస్తాడు. ఆమె అయిదో తరగతి వరకు మాత్రమే చదువుకున్న మహిళ. అయినప్పటికీ, ఆమెకు ఉన్న రాజకీయ అవగాహన, సమాజంపై ఉన్న పట్టుదల, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ఆమెను అసాధారణ వ్యక్తిగా నిలబెడతాయి. కథ ప్రారంభంలోనే రచయిత ఒక విషయం స్పష్టంగా చెబుతాడు. కులం, ఆస్తి, అధికారం వుంటే సరోజినత్త ఇందిరాగాంధీ స్థాయికి ఎదిగే వ్యక్తి అయ్యుండేదని. ఇది రచయిత ఆమె ప్రతిభను ఎంత గౌరవంగా చూస్తున్నాడో తెలియజేస్తుంది.

సరోజినత్తకు రాజకీయాలపై సహజమైన ఆసక్తి ఉంటుంది. కాంగ్రెస్ నాయకుల వెంట తిరుగుతుంది, స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచే రాజకీయ పరిణామాలను గమనిస్తుంది. గ్రామంలో అయిదో తరగతి వరకు చదివిన ఏకైక మహిళ ఆమెనే. చదువు తక్కువ అయినా, ఆమె లోకాన్ని చదివింది. కులవ్యవస్థ ఎలా పని చేస్తుందో, అధికారాలు ఎవరి చేతుల్లో ఉన్నాయో ఆమెకు బాగా తెలుసు.

కథలో ఒక ముఖ్యమైన అంశం కట్నం వ్యవస్థపై ఆమె చేసే తీవ్ర విమర్శ. రచయిత ఆమెను కట్నం గురించి అడిగినప్పుడు, ఆమె ఆగ్రహంతో స్పందిస్తుంది. కట్నం అనేది మన దళిత సమాజంలో సంప్రదాయం కాదని, అది పై కులాల నుండి దిగివచ్చిన దోపిడీ వ్యవస్థ అని ఆమె స్పష్టం చేస్తుంది. కట్నం వల్ల ఆడపిల్లల జీవితం నాశనమవుతుందని, కుటుంబాలు బలహీనమవుతాయని ఆమె అభిప్రాయం. ఈ అంశం ద్వారా రచయిత దళిత మహిళల సామాజిక చైతన్యాన్ని బలంగా చూపిస్తున్నాడు. ఇంకో ముఖ్యమైన సంఘటనలో, ఒక రెడ్డి మహిళ సరోజినత్తను అవమానకరంగా పిలిచి, తెగిపోయిన చెప్పులు ఇచ్చి పంపమంటుంది. అప్పుడు సరోజినత్త ఆ మాటను మౌనంగా భరించదు. తాను చెప్పులు కుట్టే మాదిగనని కాదు, తనకు ఆత్మగౌరవం

ఉందని స్పష్టంగా ఎదురు చెబుతుంది. ఈ సంఘటన ద్వారా కథలో ఆత్మగౌరవ భావన స్పష్టంగా బయట పడుతుంది. దళితుడు అంటే తక్కువ అనే భావనను ఆమె తిరస్కరిస్తుంది.

కథలో భూమి సమస్యకు కూడా ముఖ్యమైన స్థానం ఉంది. గ్రామంలో పండిన ధాన్యాన్ని బయటివాళ్లకు ఎక్కువ ధరకు అమ్మి, కూలీలను మోసం చేస్తున్న ఆసాముల్ని సరోజినత్త ప్రశ్నిస్తుంది. లారీ ఎక్కి ధాన్యం దిగబెట్టిస్తుంది. రెడ్డి లాంటి పెత్తందారులికి కూడా ఆమె భయపడదు. దళితుల కష్టానికి న్యాయం జరగాలంటే, ప్రశ్నించే ధైర్యం అవసరం అని ఈ సంఘటన ద్వారా రచయిత చెబుతున్నాడు. ఈ సందర్భంలో సరోజినత్త చెప్పే మాటలు కథ యొక్క తాత్పర్యాన్ని బలంగా వ్యక్తపరుస్తాయి. భూమి లేని వాడు, తిండి లేని వాడు బానిసతో సమానమని ఆమె అభిప్రాయం. దున్నేవాడికే భూమి ఉండాలన్న ఆలోచన ఈ కథలో ప్రధాన భావంగా నిలుస్తుంది. కులం కారణంగా దళితులు భూమికి దూరమయ్యారని, అందుకే వారి జీవితాలు మారడం లేదని రచయిత స్పష్టం చేస్తాడు. కథ మొత్తం స్వచ్ఛమైన గ్రామీణ మాండలిక భాషలో సాగుతుంది. ఈ భాష కథకు సహజత్వాన్ని, నిజత్వాన్ని అందిస్తుంది. సంభాషణలు సూటిగా, పదునుగా ఉంటాయి. రచయిత ఎక్కడా ఉపదేశం చేయడు; పాత్రల మాటల ద్వారానే సమాజాన్ని చూపిస్తాడు. ఇదే ఈ కథ బలం.

"ఎవుడికంటే తక్కువ?" అనే శీర్షిక కథ మొత్తం యొక్క ఆత్మ. ఇది ఒక ప్రశ్న మాత్రమే కాదు, ఒక సవాల్. దళితుడు మేధస్సులో, శ్రమలో, ధైర్యంలో ఎవరికంటే తక్కువ కాదని ఈ కథ స్పష్టంగా ప్రకటిస్తుంది. మొత్తంగా ఈ కథ దళిత మహిళ యొక్క చైతన్యాన్ని, ఆత్మగౌరవాన్ని, సామాజిక పోరాటాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన కథ. చదువు కంటే చైతన్యం ముఖ్యమని, మార్పు ప్రశ్నించడంవల్లే వస్తుందని ఈ కథ మనకు బోధిస్తుంది. అందుకే "ఎవుడికంటే తక్కువ?" కథ నేటికీ ప్రాసంగికంగా నిలుస్తుంది.

ముగింపు:

సుధాకర్ గారి కథలలో పాత్రలు సహజంగా, జీవితానికి దగ్గరగా రూపుదిద్దుకుంటాయి. అవి అసాధారణ వ్యక్తులు కాకుండా, సమాజంలోని సాధారణ మనుషులే. స్త్రీ పాత్రలు ప్రత్యేకంగా పరిశీలించదగినవి. అవి మౌనంగా బాధను భరిస్తూనే, అంతర్గత బలాన్ని ప్రదర్శిస్తాయి. ఈ కథ సంపుటిలో ఉపయోగించిన భాష సరళమైనది, సహజమైనది. గ్రామీణ నుడికారాన్ని అవసరమైన చోట వినియోగించడం వల్ల కథలకు ప్రామాణికత లభించింది. అలంకార ప్రాధాన్యం కాకుండా భావ ప్రాధాన్యమే రచయిత లక్ష్యం. "మల్లెమొగ్గల గొడుగు" కథలలో మానవత్వమే కేంద్రబిందువు. సానుభూతి, ప్రేమ, అనురాగం వంటి విలువలు కథల ద్వారా స్పష్టంగా వ్యక్తమవుతాయి. ఆధునిక సమాజంలో తగ్గిపోతున్న ఈ విలువలను రచయిత పునరుద్ఘాటిస్తారు. సమకాలీన తెలుగు కథ సాహిత్యంలో ఒక విలువైన కృషిగా నిలుస్తుంది. సంప్రదాయ కథన శైలిని కొనసాగిస్తూ, ఆధునిక

భావజాలాన్ని సమన్వయపరచిన రచనగా దీన్ని గుర్తించవచ్చు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారి "మల్లెమొగ్గల గొడుగు" కథా సంపుటి మానవ జీవితంలోని సూక్ష్మ భావాలను సున్నితంగా ఆవిష్కరించిన రచన.

ఆధార గ్రంథాలు:

1. ఎండ్లూరి సుధాకర్. మల్లెమొగ్గల గొడుగు (మాదిగ కతలు), 1999. హైదరాబాద్: దండోరా ప్రచురణలు.
2. కేతు విశ్వనాథ రెడ్డి. తెలుగు కథావికాసం. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
3. కె. శ్రీనివాసరావు. తెలుగు కథాసాహిత్యం–సామాజిక దృక్పథం. చెన్నై.
4. వి. రామకృష్ణ. సాహిత్య విమర్శ–సిద్ధాంతాలు. హైదరాబాద్.
5. యు. గోపాలకృష్ణ. సమకాలీన తెలుగు సాహిత్యం. విజయవాడ.

10

ముస్లిం మహిళల వెతలకు అద్దంపట్టిన "నఖాబ్"

– డా॥ ఎం. హరికృష్ణ

"షాజహానా..." ముస్లిం సమాజం నుండి అగ్నిశిఖలా కవిత్వరంగంలోకి దూసుకువచ్చిన రచయిత్రి. 1974లో ఖమ్మం జిల్లాలో జన్మించిన షాజహానా తెలుగులో ఎం.ఏ చదివారు. "ముస్లింవాద సాహిత్యం" అనే అంశం మీద పరిశోధన జరిపి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆమె తండ్రి దిలావర్ అభ్యుదయ రచయిత. తండ్రిని చూస్తూ పెరిగిన షాజహానా బాల్యంలోనే కవితలు రాయడం ప్రారంభించారు. ఆమె మొదటి కవిత "ఎర". ఆ కవిత స్కూల్ మ్యాగజైన్‌లో అచ్చయింది. ఆ తర్వాత చాలా కవితలు రాసినా, 1997 నుంచి ముస్లిం మహిళల వ్యధల గురించి రాసిన కవితల నుంచే తన వాస్తవ ప్రస్థానం మొదలైందంటారామె.

ముస్లిం మహిళల వెతలను తన కవిత్వం ద్వారా షాజహానా వెలుగులోకి తీసుకువచ్చారు. పరదాల వెనుక, బురఖాల మాటున మగ్గేలాచేస్తూ ముస్లిం మహిళల అస్తిత్వాన్ని, స్వేచ్ఛను హరిస్తున్న పురుష ప్రపంచాన్ని ఆమె తన "నఖాబ్" కవితా సంకలనంలో ధిక్కరించారు. ముస్లిం మహిళల అణచివేత కేవలం ముస్లిం పురుషులకే పరిమితం కాలేదు... యావత్ సమాజమూ వారిని అణచివేస్తోంది అంటారామె. నవ్వడానికి, ఏడ్వడానికి కూడా ముస్లిం మహిళలకు స్వాతంత్ర్యం లేదంటారు షాజహానా.

మతం ఏదైనా సరే స్త్రీల స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తుంది. మతం పేరు చెప్పి పురుష సమాజం స్త్రీని చెప్పుచేతల్లో వుంచుకుని తమ అవసరాలు తీర్చుకుంటుందని షాజహానా అంటారు. షాజహానా తన రచనలకు గానూ రంగవల్లి మెమోరియల్ కథా అవార్డు, సంస్కృతి పురస్కారం, రంగినేని ఎల్లమ్మ అవార్డు అందుకున్నాడు.

ఆమె కవితాసంకలనం "నఖాబ్"లో ముస్లిం స్త్రీలను వస్తువులుగా పరిగణించే సమాజాన్ని తీవ్రంగా విమర్శించారు. అడుగడుగునా ముస్లిం మహిళలు అనుభవించే అణచివేతను, అవమానాలను నిర్భయంగా ప్రస్తావించారు.

హిందూమతంలో కొన్ని వర్గాల్లో పరదా వేసుకునే అలవాటు వున్నా ఆధునికకాలంలో అది కొంతవరకూ తగ్గిందనే చెప్పవచ్చు. కానీ ముస్లింమతంలో పర్దా అన్నది తప్పనిసరి. ఆ పర్దా అన్నది మహిళల అణచివేతకు ఓ ప్రతీకగా చెబుతారు షాజహానా తన “పర్దా హటాకె దేఖో...!” కవితలో...

“ఏ పరదాల మాటున ఎంత నైరాశ్యం గూడుకట్టుకుని వుందో...?
ఏఏ మహాస్వప్నాలు ఒంటరి పరదాల గుహలలో
బలైపోతున్నాయో..?” – అంటారు.

అదే కవితలో

“పుట్టిన్నాటినుంచీ వెన్నెలరుచి ఎరుగక, వానరుచీ ఎరుగక
వసంతం రుచీ ఎరుగక పెరిగి
ఆంక్షల్లోనే హద్దుల్లోనే ఆడబానిసగా పెద్దయి
ఇవ్వాల్టి పద్నాలుగేళ్ల – నా వసంతాన్ని
అరవైఏళ్ల శిశిరానికంకితమియ్యమంటే” – అంటారు.

ముస్లింలలో పేదరికం ఎక్కువ. మహిళల్లో విద్యావంతులు తక్కువ. పైగా ఆడబిడ్డలకు చిన్నవయసులోనే పెళ్లిళ్లు చేయడం ఆనవాయితీ. ఈ పెళ్లిళ్లలో వరుడి వయసు గురించిన పట్టింపులు కూడా పెద్దగా వుండవు. పెద్దవయసు వారితో వివాహం ఆ బాలికల పాలిట శాపంగా మారుతుంది. వైవాహిక బంధంలో సుఖసంతోషాలు ఇసుమంతైనా లేక అణచివేతకు గురవుతుంటారు. ఈ విషయాన్నే షాజహానా ప్రస్తావించారు. అలాగే

“ప్రేమో.... తాపమో... కోరికో...
తడిలేకుండా పోవడానికి ఎడారులం కాదుగా...!” అంటారు “అనార్కలి” కవితలో..
“అనార్కలీ!
ఎవరు వీళ్లంతా...?
హృదయాల నుదుటన శిథిలత్వాన్ని రాయడానికి?!
....
పెదవిప్పనీయని పడగకింద
ఎంతకాలం శరీరాల్ని ఛిద్రం చేయడం?” – అని ఆవేదన వ్యక్తం చేస్తారు.

అన్ని రకాల కోర్కెలనూ అణచివేసుకుని జీవచ్ఛవంగా బ్రతకాలని తమ నుదుటిమీద రాయడానికి ఎవరికి హక్కు వుందని ఆమె ప్రశ్నిస్తారు.

ఆడపిల్లలు తల్లికన్నా తండ్రినే ఎక్కువగా ప్రేమిస్తారన్నది ఒక వాస్తవం. తండ్రి చేసే తప్పులకు నొచ్చుకున్నా తల్లినే మందలిస్తుంది కూతురు. తండ్రిని సమర్ధిస్తుంది. అలాంటి తండ్రి

పాత్రను కూడా ప్రశ్నించారు ఆమె. తండ్రి తనకు తండ్రే అయినా, తన పట్ల ప్రేమను గుమ్మరిస్తున్నా తల్లికి మాత్రం భర్త పాత్రనే పోషిస్తాడన్న వాస్తవాన్ని తెలిపారు.

“మధురోహలలో తేలియాడే వయసు!
అతని అలవాట్ల యాసిడ్‌లో ముంచి
అస్థిపంజరంలా తేల్చాడు
ఏం మిగిలిందమ్మీ నీకు–
అబ్బా పీల్చేసి త్రేన్చిన నీమనసు!” అంటారు.

“.................................
ఎన్నాళ్లిలా ఫ్రేముల్లో బందీల్లా
చీకట్లో గుడ్డిగా తడుముకుంటూ– తడబడుతూ” అంటుంది.

తండ్రి తల్లి సౌకుమార్యాన్ని, ఆశలను, ఆకాంక్షలను కాలికింద తొక్కి ఆమెను వయసులో వుండగానే ముసలిదానిగా, జీవచ్ఛవంగా ఎలా మార్చాడో చెబుతారు. ఇది ఆ మతం, ఈ మతం అని కాదు అన్ని మతాల మహిళలూ అనుభవిస్తున్నదే....

మరో కవిత “గుంగీ”లో

“నిజంగా నికాహ్ కుట్రే..
షాదీ ఐన్నాటి నుండీ
నేను అతని హవాలా అయిన్నాటినుండీ
ఆకాశమంత నవ్వుని కత్తిరించి
చిర్నవ్వుగా మార్చాడు!” అంటారు.

నిజంగానే ముస్లిం సమాజంలోనే కాదు అన్ని మతాల్లోనూ వివాహం కుట్రపూరితమైన పాత్రను పోషిస్తుంది. మహిళ నెత్తిన బాధ్యతల బరువుమోపి తెంచుకోలేని బంధాలలో బందీని చేస్తుంది. పురుషునికి వున్న స్వేచ్ఛలో పది శాతం కూడా స్త్రీకి దొరకనివ్వకుండా చేస్తుంది. స్వేచ్ఛాపూరితమైన బాల్యాన్ని, యవ్వనాన్ని గతజన్మ స్మృతులుగా మారుస్తుంది. ఈ కుట్ర గురించి సమాజాన్ని నిర్భయంగా నిలదీశారు షాజహానా. అదే కవితలో..

“మాటలెక్కడా మనసులెక్కడా
కన్నీళ్లతోపాటు అవెప్పుడో రాలిపొయ్యాయి” అంటారు.

వివాహానంతరం మనసులుకలిసి కలకాలం కళకళలాడుతూ జీవిస్తారని రాసే మాటలన్నీ వట్టి నీటిమూటలంటారామె. కుటుంబాల్లో మనసును వెళ్లబోసుకునేటంత స్వేచ్ఛ స్త్రీకి వుండదని తేల్చిచెబుతారు షాజహానా.

 ISSN: 2319-3905

"నా దూదేకులతనాన్ని పొహర్ ఆపాదించుకోనప్పుడు
అస్లీ ముస్లిం ముద్రని మాత్రం నేనెందుకు భరించాలి?"

అని ప్రశ్నిస్తారు "లద్దాఫ్ని" కవితలో...

ముస్లిం మహిళలను వ్యక్తిత్వాన్ని హరిస్తున్న పరదా మీద తిరుగుబాటు చేస్తారు షాజహానా "ఖబర్దార్" కవితలో..

"ఆ పరదా పంజరాన్నిప్పుడు నిలువునా చీలుస్తున్నా
నన్ను కాఫీర్‌వన్నా బాధలేదు" – అంటారు.

సత్యాన్ని తిరస్కరించినవారిని, దైవదూషణకు పాల్పడినవారిని కాఫిర్‌లు అంటారు. అంటే మతభ్రష్టులు అన్నమాట. ఆ మాట అనిపించుకోవడానికి కూడా తాను సిద్ధం అంటారు షాజహానా.

ముస్లింలలో నిరక్షరాస్యత కారణంగా పేదరికం ఎక్కువ. చాలామంది చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవించేవారే వుంటారు. అలాంటి కుటుంబాలలో వెతలను చూపుతారు ఆమె.

"నీ అబ్బాచేసే డ్రైవర్‌గిరీ–
మూలకప్పడానికీ చాలని తన్‌ఖా–
పెద్దబొమ్మలు తింటానికే ఏంలేవు
నీ బొమ్మలాటకు నేనేమివ్వనమ్మా" – అన్నది ఓ తల్లి ఆవేదన "పుట్టు" కవితలో.

కూతురు అడిగిన పుట్టును ఇవ్వలేక "వద్దమ్మా" అన్నంతవరకూ చితక్కొట్టిన తల్లి నిస్సహాయతను చూపి పాఠకుల మనసులను కుదిపివేస్తుంది ఈ కవిత.

"మనసుకు మనసు బంధం
నల్లపూసలకంటే కఠినమైంది
....
నేను చాలావాటికి ప్రపంచాన్ని
నాకే ప్రపంచమూ లేదు....!"

మనసులు కలిస్తేనే జీవితాలు మధురంగా వుంటాయి. బలవంతపు బంధాలవల్ల మెడలో మెరిసే నల్లపూసలు బరువెక్కుతాయి. కఠినంగా అనిపిస్తాయి. ఈ విషయాన్నే చెబుతారు షాజహానా. స్త్రీ కుటుంబానికి కేంద్రబిందువు. ఒక్కరోజు గృహిణి ఇంట్లో లేకపోతే ఆ ఇల్లు అల్లకల్లోలమవుతుంది. అయితే ఇవే బాధ్యతలు ఆమెకు ప్రపంచం అంటూలేకుండా చేసి జీవచ్ఛవాన్ని చేసి గుంజకు కట్టేస్తున్నాయి. ఈ విషయాన్నే ఆమె "ప్యాసీ" కవితలో ప్రస్తావించారు.

"నా వెనుకటి తరాలకే కాదు
ముందుతరాల వెనుకబాటుకీ
కొనసాగింపు అతడే!"

అంటూ సమాజంలోని పురుషాధిక్యతను ఎత్తిచూపుతారు.

"మా గుండెలయలు దగ్గరయిందెప్పుడూ...?
"శరీరాల ఆబత్వం తప్ప!"

అని వైవాహిక బంధంలోని బోలును ఎత్తిచూపుతారు "ఘుత్కార్" కవితలో.

"బలమదంతో తానెంత నిలువరించినా
ఈ మహల్ల పరదాల వెనుక నేనిక నిలబడలేను" అంటారు.

మరో కవిత ఖౌసెఖిజాలో..

"కొట్టాల్లో పశువులు – ఫారాల్లో కోళ్లు
చీకటి కొట్లలో మేము!
చదువులేదు ఏ ఇఛ్ఛా ఉండకూడదు
ఎడ్లమూతికి బుట్టలాగా...
గాలి పీల్చే స్వేచ్ఛకూడా లేకుండా నఖాబ్‌లు"

అని దుఃఖపడతారు.

"బుర్ఖాల్ని దుప్పటాల్ని
పీలికలుగా చేసి నీ మీదికి విసిరేస్తున్నా
కలిపి బొంత కుట్టుకుని పొర్లుకో" – అని ఆగ్రహం వ్యక్తం చేస్తారు.

"గోల్కొండ.. చార్మినార్... కుతుబ్‌మినార్.
ఏమి అద్భుత సౌందర్యం!
కులీకుతుబ్‌షా
కుతుబుద్దీన్ ఐబక్
ఒకరు రిక్షా లాగుతుంటే
ఒకర్ని మృత్యువు లాగుతుంది" అంటారు "వాహ్ వెన్నెల్లో తాజ్" అనే కవితలో ముస్లింలలో పేదరికాన్ని ప్రస్తావిస్తూ. తాజ్ మహల్ అందాన్ని, ఆనాటి నవాబుల గొప్పదనాలను గురించి చెప్పుకుంటాం. వెన్నెల్లో తాజ్‌మహల్ ఎంత అందంగా వుంటుందో ఊహించుకుంటాం. కానీ పేదరికంలో మగ్గి బాల్యాన్ని, యవ్వనాన్ని, జీవితాన్ని కోల్పోతున్న ముస్లింల గురించి మాట్లాడుకోం అని ఆమె ఈ కవితలో చురకలు అంటిస్తారు.

"ఎప్పుడో కూల్చబడ్డ దేవాలయాల బరువు ఇప్పటి నా భుజాలపై వేయొద్దు
నొప్పితో సలుపుతున్న గాయాల్ని కవిత్వీకరించుకుంటున్న మమ్మల్ని
ఈగల్లా మతవాదులన్న ముద్రతో సతాయించవద్దు."

బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం దేశంలో మతాలమధ్య చీలికలు ఏర్పడడం, సాధారణ జీవనం సాగించే ముస్లింలను కూడా అనవసరంగా విమర్శించడం, తీవ్రవాదుల్లా చూడడం మిథ్యేమీ కాదు. ఈ విషయాన్నే షాజహానా "ఇన్సానియత్" కవితలో ప్రస్తావించారు. ఎప్పుడో జరిగిన ఘటనకు తమను బాధ్యులను చేయవద్దనీ, మతవాదులమన్న ముద్రను తమమీద మోపవద్దని అంటారామె. దేహానికే కాదు దేశానికి బాధొచ్చినా సహించలేను అంటారు.

"ఏ రెండు మూడేళ్లకో నువ్వొస్తున్న కబురు
రోహిణి తర్వాత భూమి ఆకాశంవైపు చూసే చూపు నాది
నీ ఎన్ని రాకలకి చల్లబడతానో" అంటారు "దూస్రా ఆస్మా" కవితలో.. కుటుంబంకోసం అందర్నీ వదిలి పరాయిదేశాలకు వెళ్లేవారి భార్యాబిడ్డల ఆవేదనను ఈ కవితలో చూపుతారు.

"ఎక్కడెవరు నూకలు చల్లినా
మా పావురాల గుంపే బలవుతుంది!
గుజరాత్‌లో కాలుతున్న
వేలశవాల ఒంటరి కఫన్ నేను" అంటారు గుజరాత్‌లో జరిగిన దారుణ మారణకాండ గురించి ప్రస్తావిస్తూ తన "ఒంటరి కఫన్" కవితలో..

"ప్రపంచం మాయిపొరలో ఇరుక్కుని ఉమ్మనీరు తాగి
ఇవ్వాళ కాషాయం కక్కుతోంది....!
మా కాళ్ల సందుల్లోంచిచొచ్చి మమ్మల్ని బరిబిత్తల పరిగెత్తించారే...
నీ ఇంట్లో ఆడది కూడా
రహస్యంగా మా కోసం కన్నీళ్లు కార్చి ఉంటుంది!"

అంటూ మతాల పేరిట జరిగే మారణహోమాన్ని ప్రశ్నిస్తారు. తమపై జరిగే అకృత్యాలను హిందూ స్త్రీలు కూడా సహించరని, వారు కూడా రహస్యంగా కన్నీళ్లు కార్చి వుంటారని అంటారు "కాలీ దునియా" కవితలో...

"నిన్ను పుట్టించి బతికించేదీ నేనే...!
అయినా స్త్రీ తప్ప మగాణ్ణి క్షమించేదెవరు?
ఎప్పటికీ ప్రపంచం నా రొమ్ము తాగుతున్న పసిబిడ్డే...!" అంటారు అదే కవితలో...

"షాజహానా" ముస్లిం సమాజాన్ని సమూలంగా పరికించి రాసిన కవితలివి. తన కవితల్లో ఆమె ముస్లిం స్త్రీ పక్షాన మాత్రమే కాదు.. గుజరాత్ అల్లర్ల అనంతర పరిణామాల నేపథ్యంలో ముస్లిం సమాజం తరపున నిలబడి పోరాడారు. తమపై మతం పేరిట జరుగుతున్న అన్యాయాలను ఆమె ప్రశ్నించారు. బురఖా మాత్రమే కాదు మతమే తమ ఎదుగుదలకు ఓ అడ్డుగోడగా మారిందని,

తమపై సమాజం ఉక్కుపాదం మోపుతోందంటారు. అక్బర్‌ను, షాజహాన్‌ను, ఇతర గొప్ప గొప్ప నవాబులను గురించి చెప్పుకునే మనం కటిక పేదరికంలో మగ్గుతున్న ముస్లింల గురించి ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నిస్తారు. వారికి ఆర్థిక స్వావలంబన కలిగించే దిశగా ఎందుకు అడుగులు వేయడం లేదని, ఎన్నికల్లో పావులుగా ఎందుకు వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. ఈ దిశగా సమాజాన్ని ఆలోచింపజేస్తారు షాజహానా.

ఆధార సూచి:

నవ తెలంగాణ	దినపత్రిక	21-7-2020
ఈమాట	వెబ్ పత్రిక	
ఆంధ్రజ్యోతి	దినపత్రిక	మార్చి 13 2017
సారంగ	సాహిత్య వారపత్రిక	30 అక్టోబర్ 2013
వన్ ఇండియా	వెబ్ పత్రిక	అక్టోబర్ 9 2012

11
నల్లగొండ జిల్లా నవలా సాహిత్యం (2000-2019) - భాషావైవిధ్యం

- మహేష్ ఎడ్ల

1.1 వ్యాస సంగ్రహం:

తెలుగు సాహిత్యాన్ని మన సాహిత్యకారులు ప్రధానంగా ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం అని రెండు భాగాలుగా విభజించారు. అయితే సమకాలీన, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా సాహిత్య ప్రక్రియలు పుట్టుకొస్తాయి. అటువంటి ప్రక్రియే నవల. అయితే ప్రధానంగా ఈ వ్యాసంలో 2000-2019లో మధ్యకాలంలో నల్లగొండ జిల్లాకు చెందిన 14 మంది నవలా రచయితలు రాసినటువంటి 25 నవలల్ని సూత్రప్రాయంగా పేర్కొంటూ, అందులో ఉన్నటువంటి భాషకు సంబంధించిన అంశాలను తెలియజేస్తాను. నల్లగొండ జిల్లా ప్రత్యేకతలను, అక్కడి మాండలికాన్ని ఈ నవలలు ఎలా ప్రతిబింబించాయో అంచనావేస్తాను. అదే విధంగా నవలల్లో శిల్పం, భాషా శైలి, కథాకథన పద్ధతులను, సామెతలు, జాతీయాలు, జంట పదాలు మొదలైన అంశాలను వివరించే ప్రయత్నం చేస్తాను.

1.2 ఉపోద్ఘాతం:

తెలంగాణ నవలా సాహిత్యం, తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన నవల, 19వ శతాబ్దం చివరిలో ప్రారంభమైనది. ప్రాంతీయ నేపథ్యం, ఉద్యమాల ప్రభావం, కాలానుగుణంగా వచ్చే మార్పులు, గ్లోబలైజేషన్ వంటి వాటి కేంద్రంగా నవలా సాహిత్యం ముందుకు సాగుతుంది. 1956కు పూర్వం తెలంగాణ, నైజాం రాష్ట్రంలో భాగంగా ఉండేది. దాంతో ఒక ప్రత్యేకమైన సంస్కృతి, సాంప్రదాయాలు తెలంగాణ ప్రాంతంలో కనిపిస్తాయి. భౌగోళికంగా, భాషాపరంగా, సంస్కృతి పరంగా మహోన్నమైన చారిత్రాత్మక మూలాలు తెలంగాణ ప్రాంతంలో కలవు.

"తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన నవల వికాసాన్ని కుదించినట్లయితే తమ ప్రాంతానిదే పైచేయిగా కొనసాగుతుందని వలసాధిపత్య ఆలోచన ఇది. నిజానికి మొత్తం తెలుగు

సాహిత్యంలోనే మొట్టమొదటి నవల రాసింది తెలంగాణ బిడ్డ. నల్గొండ జిల్లా హుజూర్ నగర్ (బేతవోలు)కు చెందిన తడకమళ్ళ వెంకట కృష్ణారావు. ఈయన రాసిన కంబుకందర చరిత్ర మొట్టమొదటి నవల."(శ్రీనివాస్, సంగిసెట్టి. 2017: పుట-12) అని సంగిసెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. అయితే ముంగిలి పుస్తకంలో కూడా సుంకిరెడ్డి నారాయణరెడ్డి 'కంబుకందర చరిత్ర' తొలి తెలంగాణ నవల అని వ్యాఖ్యానించారు. దీనిని బట్టి తొలి తెలంగాణా నవలగా పేర్కొనవచ్చు. కాకపోతే ఇప్పటికి ఈ నవల పుస్తకరూపంలోకి రాలేదు.

అదేవిధంగా వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి (1955), గంగు, గిర్దావర్ అనే నవలిక రాశారు. సాయుధ పోరాట నేపథ్యంలో బి.యస్.శాస్త్రి విప్లవజ్వాల, తిరునగరి రామాంజనేయులు 'సంఘం' నవల, ముదిగంటి సుజాత రెడ్డి 'మలుపు తిరిగిన రథచక్రాలు', సర్వల్లి కృష్ణారెడ్డి 'ఉప్పెన', కందిమల్ల ప్రతాపరెడ్డి 'బందూక్', బి.ఎన్ రెడ్డి 'ఆయువుపట్టు' నవలలు వెలువరించారు.

నల్గొండ జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన శేషభట్టరు వెంకట రామానుజాచార్యులు 1922వ సంవత్సరంలో 'ప్రాకృత దాంపత్యం' పేరుతో నవల రాశారు. దీనిని గురించి సంగిసెట్టి శ్రీనివాస్ ఈ నవల 1922లో నల్గొండలోని ఉస్మానియా ముద్రణాలయములో ప్రచురించబడినది. మొత్తం 80 పేజీల్లో వెలుపడ్డ ఈ నవలను రచయిత, తన తల్లిదండ్రులకు అంకితం ఇచ్చాడు. లోకజ్ఞుడు కలం పేరుతో అనేక రచనలు వెలువరించిన ఈయన నల్గొండ జిల్లావాడు. సంస్కృతం, ఉర్దూ, అరబ్బీ, ఫార్సీ, మహారాష్ట్ర, కన్నడ, ఇంగ్లీష్ భాషలు స్వయంగా నేర్చుకోవడమే కాకుండా అందులో కవిత్వం చెప్పిన దిట్ట శేషభట్టరు అని సంగిసెట్టి శ్రీనివాస్ తన తెలంగాణా నవలా చరిత్ర అనే పుస్తకంలో పేర్కొన్నారు.

నేను ఈ వ్యాసంలో 2000-2019 మధ్యకాలంలో వచ్చినటువంటి నవలల్లో ఉన్నటువంటి భాషను విశ్లేషిస్తాను. నల్గొండ జిల్లా నవలా సాహిత్యంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది. దళిత ఇతివృత్తంతో వచ్చిన నవలలు. తెలంగాణ దళిత నవలా సాహిత్యంలో వచ్చిన నవలల్లో ఎక్కువ నవలలు, నల్గొండ జిల్లా నవలా రచయితల నవలలే అని చెప్పడంలో సందేహం అవసరం లేదు. బోయ జంగయ్య జాతర(1998), జగడం(2003), పుట్టుమచ్చ(2011) అనే నవలల్ని వెలువరించారు. అలాగే దళిత మాండలికంలో, జీవద్భాషలో నవలలు రాసినవారు వేముల ఎల్లయ్య. వీరు కక్క(2014), సిద్ధి(2014) నవలల్ని రాశారు. మరొక రచయిత భూతం ముత్యాలు సూర(2004), ఇగురం(2012), పురుడు(2007), మొగలి(2016), మాలచ్చువమ్మ(2021) వంటి గొప్ప నవలల్ని చిత్రించారు. అదేవిధంగా కదిరే కృష్ణ, పొద(2010) నవల రాశారు. ఈ మధ్యకాలంలో నవలలు రాస్తున్న సూర్యాపేటకు చెందిన నవలా రచయిత గుండెపంగు వరకుమార్, నేను బానిసనా(పోలీసు దుఃఖం)(2014), మైల(2013), ఊరవతల(2019), నవలల్ని

వెలువరించారు. అలాగే నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన గడ్డం మోహన్ రావు (2017) అనే నవల రాశారు. మరియు గడ్డం మోహన్ రావు, కడియం దేవిడ్ తో కలిసి అతడు అబ్రహం(2019) అనే నవలను వెలువరించారు. అదేవిధంగా కందిమళ్ళ ప్రతాపరెడ్డి బందూక్(2010), ఖామాన్(2014) నవలలు వెలువరించారు. దేవులపల్లి కృష్ణమూర్తి ఊరు వాడ బతుకు(2009), మూడు ముక్కలాట(2017), బయటి గుడిసెలు(2013) నవలలు రాశారు. ఎలికట్టె శంకర్ రావు, దేవుని రాజ్యం(2010), పున్న అంజయ్య మరో మౌన పోరాటం(2018), లెక్కల మల్లారెడ్డి జీవన పోరాటాలు(2014), స్కైబాబా ఆపా(2015), కెవియల్ కల్లుమండువ(2006) నవలల్ని వెలువరించారు.

1.3. నల్లగొండ జిల్లా నవలల్లో భాషా విశ్లేషణ:

నల్లగొండ జిల్లా నవలల్లో భాషా విశ్లేషణను ప్రధానంగా ఐదు అంశాలుగా విభజన చేస్తున్నాను. అవి ఏమిటంటే మాండలికాలు, జాతీయాలు, సామెతలు, జంట పదాలు, అన్యదేశీయాలు. వీటికి అనుగుణంగా నవలల్లో ఉన్నటువంటి ఆయా అంశాలను చర్చిస్తాను.

1.3.1 మందాలికాలు:

1. అర్ర (ఊరు వాడ బతుకు, పుట- 11)
2. కమ్మల కొట్టం (ibid, పుట- 11)
3. ఆసుపోయటం (ibid, పుట- 12)
4. నవిసి (ibid, పుట- 31)
5. జాలు (ibid, పుట- 14)
6. పనెలా (ibid, పుట- 14)
7. మర్ల బంధం (ibid, పుట- 14)
8. పన్గడి (కక్క, పుట- 17)
9. మొగ్లు (ibid, పుట- 7)
10. సంవర్త (ibid, పుట- 44)
11. రుదం (పుట- 62)
12. మాన్క (దేవుని రాజ్యం పుట- 13)
13. అవడాల (ibid, పుట- 13)
14. మొగురం (ibid, పుట- 14)
15. మనాది (ibid, పుట- 14)
16. శల్క (ibid, పుట- 14)
17. సాన్పి (ibid, పుట- 14)

18. మండి (సూర, పుట- 9)
19. మంకు (ibid, పుట- 11)
20. రంకు (ibid, పుట- 18)
21. పొగిలి పొగిలి (ఆపా, పుట- 31)
22. పొద్దుగుకాలి (ibid, పుట- 31)
23. ఇసొంటి (ibid, పుట- 47)
24. సుత్తి (ibid, పుట- 52)
25. ఊటగ (ibid, ఆపా, పుట- 66)

నల్లగొండ జిల్లా నవలల్లోని భాషా విశ్లేషణలో భాగంగా సేకరించిన మాండలిక పదాలు ఆ ప్రాంతపు సాంస్కృతిక, సామాజిక జీవన విధానాన్ని అత్యంత సహజసిద్ధంగా ప్రతిబింబిస్తున్నాయి. 'ఊరు వాడ బతుకు', 'కక్క', 'దేవుని రాజ్యం', 'సూర', 'ఆపా' వంటి నవలల్లో వ్యవహరించిన ఈ పదాలు కేవలం నిఘంటువులకు పరిమితం కాకుండా, తెలంగాణ జనజీవన స్రవంతిలో భాగమైన గ్రామీణ వాతావరణాన్ని, వృత్తి పదజాలాన్ని కళ్ళకు కడతాయి. ఉదాహరణకు, గృహ నిర్మాణానికి మరియు పశువుల పాకలకు సంబంధించిన 'అర్ర', 'కమ్మల కొట్టం' వంటి పదాలు; నేత పరిశ్రమతో ముడిపడిన 'ఆసుపోయటం' వంటి వృత్తిపదాలు నాటి శ్రమజీవుల సంస్కృతిని తెలియజేస్తున్నాయి. అలాగే 'నవిసి', 'జాలు', 'మర్ల బంధం', 'పన్గడి', 'మొగ్లు', 'సంవర్త', 'రుదం' వంటి పదాలు నల్లగొండ ప్రాంతపు ప్రత్యేక ప్రాకృతిక, వ్యవసాయాధారిత జీవనాన్ని సూచిస్తాయి. కొలతలకు, గృహోపకరణాలకు సంబంధించిన 'మాన్క', 'అవడాల', 'మొగురం', 'శల్క', 'సాన్పి', 'మండి' వంటి పదాలతో పాటు మానవ నైజాలను, భావోద్వేగాలను పలికించే 'మనాది', 'మంకు', 'రంకు', 'పొగిలి పొగిలి' వంటి పదాలు ఈ నవలల్లోని పాత్రల స్వభావాన్ని లోతుగా ఆవిష్కరించాయి. 'పొద్దుగుకాలి', 'ఇసొంటి', 'సుత్తి', 'ఊటగ' వంటి నిత్యజీవిత సంభాషణల్లోని పదాలు నల్లగొండ మాండలికానికి ఉన్న సహజమైన పలుకుబడిని, ఆ ప్రాంతపు భాషా సౌందర్యాన్ని, అనన్యమైన అస్తిత్వాన్ని స్పష్టం చేస్తున్నాయి.

1.3.2 జాతీయాలు:

1. పెండ్లైన ఇంట్లో ఆరు నెలల కరువు (ఊరు వాడ బతుకు పుట- 35)
2. దోసిత్తుల గాచారం (ఊరు వాడ బతుకు పుట- 57)
3. వండని కూడు వడకనిబట్ట (ఊరు వాడ బతుకు పుట- 47)
4. అయ్యో అంటే ఆర్నెల్ల పాపం (ఊరు వాడ బతుకు, పుట- 119)
5. మొలతాడు తెగ (కక్క, పుట- 21)
6. లోకులు కాకులు (కక్క, పుట- 30)

7. బట్టగాల్చి మీదేత్తరు (కక్క, పుట- 60)
8. కాల్గాలిన పిల్లోలే (కక్క, పుట- 88)
9. ఇల్లిడిస్తే పిల్లి కర్సుద్ది (దేవుని రాజ్యం, పుట- 19)
10. వానపాములోలిగా (దేవుని రాజ్యం, పుట- 38)
11. బెల్లం కొట్టిన రాయోలిగా (దేవుని రాజ్యం, పుట- 109)
12. ఉసిల్లోలిగా రాలిపోవడం (దేవుని రాజ్యం, పుట- 45)
13. తల నరికేసినట్టు నిలబడటం (దేవునిరాజ్యం, పుట- 104)
14. బెల్లం గొట్న రాయి లెక్క (సూర, పుట- 18)
15. కుక్క తోక పట్టుకొని గోదారి ఈదినట్లు (సూర, పుట- 18)
16. లంకంత కొంప (సూర, పుట- 27)
17. ఉర్కుర్కులాడి పసుల కాస్తే పొద్దుపోతాది (సూర, పుట- 30)
18. దూరపు కొండలు నునుపు (ఆపా, పుట- 13)
19. ముసలం (ఆపా, పుట- 30)

1.3.3 సామెతలు:

1. నాభికాడ చల్లబడితే నవాబు కాడ జవాబియ్యొచ్చు (ఊరువాడ బతుకు, పుట-19)
2. పగటి ముచ్చట్లు పనిచేటు రాత్రి ముచ్చట్లు నిద్ర చేటు (ఊరు వాడ బతుకు, పుట- 22)
3. రాములోరి పెళ్లికి ఊరంతా పండుగ (ఊరు వాడ బతుకు, పుట- 23)
4. గుడ్డి కొంగకు కొర్ర మట్ట దొరికినట్టు (ఊరు వాడ బతుకు, పుట- 24)
5. ఈత చెట్టు ఇల్లు కాదు లేపుకొచ్చినోడు మొగుడు కాదు (ఊరు వాడ బతుకు, పుట- 118)
6. తొడ తొడ కలిస్తే తొంబై ఏండ్లైన సావుసం (కక్క, పుట- 64)
7. బరిగుద్దబామా ఇండ్లలో సోమ (కక్క, పుట- 77)
8. గాలికి పోయే కంప ముడ్డికి తగిలినట్టు (కక్క, పుట- 85)
9. నీరు పల్లం ఎరుగు నిజం దేవుడెరుగు (దేవునిరాజ్యం, పుట- 42)
10. దినదినగండం నూరేండ్ల ఆయుస్సు (దేవునిరాజ్యం, పుట- 44)
11. అంగట్లో అమ్మ అంటే ఎవనికి పుట్టిన బిడ్డ రా అన్నట్లు (దేవునిరాజ్యం, పుట- 68)
12. దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు (దేవునిరాజ్యం, పుట- 83)
13. బతికి షెడ్డొని భాగ్యం చూడు చెడి బతికినోని చెంపలు చూడు (సూర, పుట- 31)

15. ఒకరి ముఖం చూస్తే పెట్టబుద్ధి అయితది ఒకరి మొఖం చూస్తే తిట్టబుద్ధి అయితది (పుట- 51)
16. అలిగి అత్తగారింటికి చెడి చెల్లింటికి పోకూడదు (సూర, పుట- 54)

1.3.4 జంటపదాలు:

1. ఉప్పులు పప్పులు (ఊరు వాడ బతుకు, పుట- 11)
2. పిల్లా జిల్లా (అఎఅఙ, పుట- 12)
3. ఆడమగా (అఎఅఙ, పుట- 12)
4. పండుగ పబ్బం (అఎఅఙ, పుట- 13)
5. జలుబు గిలుబు (అఎఅఙ, పుట- 18)
6. తొండికోమండికో (కక్క, పుట- 8)
7. కచ్చే బొచ్చే (కక్క, పుట- 67)
8. ఆపతా సాపతా (కక్క, పుట- 102)
9. సావో బతుకు (దేవునిరాజ్యం, పుట- 31)
10. కాయా కష్టం (దేవునిరాజ్యం, పుట- 37)
12. ఆల్తు పాల్తు (దేవునిరాజ్యం, పుట- 59)
13. టీకు టాకు (సూర, పుట- 15)
14. నయానో భయానో (సూర, పుట- 35)
15. తప్పో ఒప్పో (సూర, పుట- 46)
16. అంత్రం తంత్రం (సూర, పుట- 52)

1.3.5 అన్యదేశీయాలు:

1. జాగ (ఊరు వాడ బతుకు, పుట- 11)
2. సవులత్ (ఊరు వాడ బతుకు, పుట- 43)
3. ఖడక్ (ఊరు వాడ బతుకు, పుట- 88)
4. కుశ మత్ (సూర, పుట- 9)
5. లాడ్సాబ్ (సూర, పుట- 15)
6. పరేషాన్ (సూర, పుట- 40)
7. హాలత్ (ఆపా,పుట- 6)
8. కిసా (ఆపా, పుట- 7)
9. రస్తా (ఆపా, పుట- 8)
10. గడ్బాడ్ (ఆపా, పుట- 10)

11. ఇజ్జత్ (ఆపా, పుట– 10)
12. మాఫ్ కర్ణ (ఆపా, పుట– 18)
13. ములాకత్ (ఆపా, పుట– 25)
14. అలై బలై (ఆపా, పుట– 27)
15. దోవ (ఆపా,పుట– 34)
16. హరాం (ఆపా, పుట– 42)

1.4 ముగింపు:

నల్లగొండ జిల్లా నవలా సాహిత్యంలో భాషను గమనించినట్లైతే అధిక నవలలు మాండలికంలో వెలువడ్డాయి. అందులోనూ ప్రాంతీయ మాండలికంలో వచ్చాయి. దళిత మాండలికంలో భూతం ముత్యాలు, వేముల ఎల్లయ్య, గుండెపంగు వరకుమార్ నవలలు రాశారు. అదే విధంగా ఎలికట్టె శంకర్ రావు, దేవులపల్లి కృష్ణమూర్తి మాట్లాడే భాషనే రాస్తూ సహజత్వాన్ని ఉట్టిపడేలా చేసారు. ప్రామాణిక బాషలో వచ్చిన నవలలు చాలా తక్కువ. కె. వెంకటేశ్వర్లు, వరకుమార్ తదితరులు ప్రామాణిక భాషను ఉపయోగించినప్పటికీ నుడికారాలు, పలుకుబడులు, జాతీయాలు, సామెతలు, అన్యదేశీయాలలో ప్రాంతీయత ఉట్టిపడుతుంది. ఒక్క ఊరు వాడ బతుకు నవలలోనే 50 కి పైగా సామెతలు వున్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ విధంగా భాషా వైవిధ్యం విషయంలో నల్లగొండ జిల్లా నవలా రచయితలు గ్రామీణుల భాషనే ఉపయోగిస్తూ నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

1.5 ఉపయుక్త గ్రంథ సూచి:

1. సుజాతారెడ్డి, ముదిగంటి. 2017. తెలుగు నవలానుశీలనం. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్.
2. శ్రీనివాస్, సంగిసెట్టి. 2017. తెలంగాణ నవలా చరిత్ర. హైదరాబాద్.
3. ఎల్లయ్య, వేముల. 2014. కక్క. నల్లగొండ: ప్రజాశక్తి బుక్ హౌస్.
4. కృష్ణమూర్తి, దేవులపల్లి. 2009. ఊరు వాడ బతుకు, హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
5. ముత్యాలు, భూతం. 2004. సూర, నల్లగొండ: గుంపు సాహితీ సంస్థ.
6. శంకర్ రావు, ఎలికట్టె. 2012. దేవుని రాజ్యం, నల్లగొండ: నోముల సాహితీ సంస్థ.
7. స్కై బాబా. 2015. ఆపా, హైదరాబాద్: నసల్ కితాబ్ ఘర్.

12

భారతీయ గిరిజన వీరవనితల పరిచయం

– ముడావత్ లోకేందర్

వ్యాస సంగ్రహం:

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గిరిజన మహిళలు కేవలం యోధులుగా మాత్రమే కాకుండా, ఉద్యమాలకు నాయకత్వం వహించిన నేతలుగా, మహిళలను సంఘటితం చేసిన సంఘనాయకులుగా, ప్రజల్లో స్వేచ్ఛా భావనను నూరిపోసిన ఉద్యమకారులుగా నిలిచారు. కుటుంబ బాధ్యతలు, సామాజిక ఆంక్షలను లెక్కచేయకుండా వారు తమ ధైర్యం, పట్టుదలతో స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. ఫూలో––ఝానో ముర్ము, రాణి గైడిన్ల్యూ, రాణి దుర్గావతి, సింగి దాయి, లీపా, రాణి రోపుయిలియాని వంటి గిరిజన వీరవనితలు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. వీరి పోరాటం కేవలం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధమే కాక, గిరిజనుల స్వాభిమానానికి, మహిళల స్వతంత్ర ఆలోచనకు, అణగారిన వర్గాల గౌరవానికి బలమైన పునాది వేసిన మహోన్నత ఉద్యమంగా నిలిచింది.

ఉపోద్ఘాతం:

భారత స్వాతంత్ర్య పోరాటం అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది పురుష యోధుల త్యాగాలే. కానీ ఈ మహత్తర పోరాటంలో గిరిజన సమాజాలకు చెందిన అనేక మంది మహిళలు కూడా అసాధారణ ధైర్యం, త్యాగం, నాయకత్వంతో కీలక పాత్ర పోషించారు. చదువు, సంపద, ఆయుధ వనరులు లేకపోయినా తమ నేల, తమ ప్రజలు, తమ సంస్కృతి, తమ హక్కుల కోసం బ్రిటిష్ పాలనకు ధీటుగా ఎదిరించారు. తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా స్వాతంత్ర్యానికి అంకితమైన జీవితాలను గడిపిన వీరనారులే ఈ గిరజన వీరవనితలు. వారి పోరాటమే భారత స్వాతంత్ర్య సంగ్రామానికి మరింత బలాన్ని అందించింది.

ముఖ్యాంశాలు:

1. భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన మహిళలు కూడా పురుషులతో పాటు సమానంగా కీలక పాత్ర పోషించారు.

2. చదువు, సంపద, ఆయుధ వనరులు లేకున్నా తమ నేల, ప్రజలు, సంస్కృతి రక్షణ కోసం వారు ధైర్యంగా పోరాడారు.
3. గిరిజన మహిళలు కేవలం యోధులుగా మాత్రమే కాకుండా ఉద్యమ నేతలుగా, సంఘ నాయకులుగా కూడా నిలిచారు.
4. పూలో--ఝూనో ముర్ము సంతాల్ తిరుగుబాటులో బ్రిటిష్ సైన్యంపై గెరిల్లా యుద్ధాలు నిర్వహించారు.
5. రాణి మా గైడిన్ల్యూ చిన్న వయసులోనే నాగా ఉద్యమానికి నాయకత్వం వహించి జైలు జీవితం గడిపింది.
6. రాణి దుర్గావతి గోండ్వన రాజ్యాన్ని ధైర్యంగా పాలించి మొఘల్ సైన్యానికి ఎదిరించి వీరమరణం పొందింది.
7. సింగి దాయి, లీపా, రోపుయిలియాని వంటి వీరనారులు తమ ప్రాంతాల్లో బ్రిటిష్ పాలనకు ధీటుగా పోరాడారు.
8. గిరిజన వీరవనితల త్యాగాలు భారతదేశంలో దేశభక్తి, మహిళా శక్తి, గౌరవ భావనలను మరింత బలపరిచాయి.

కీలకపదాలు: స్వాతంత్ర్య సంగ్రామం, గిరిజన మహిళలు, వీరత్వం, త్యాగం, నాయకత్వం, బ్రిటిష్ పాలన, మహిళా శక్తి, దేశాభిమానం

1. పూలో–ఝూనో ముర్ము:

(సంతాల్ తిరుగుబాటుకు స్త్రీ రూపం)

జననం : భోఘనాది, సాహెబ్ గంజ్, జార్ఖండ్

తెగ : సంథాల్

వీరమరణం : 1856

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి ఎదురెళ్లేందుకు మగవాళ్లే వెనుకడుగు వేసిన కాలంలో, గొడ్డలి పట్టుకుని యుద్ధరంగంలోకి దూసుకెళ్లిన గిరిజన వీర వనితలు పూలో ముర్ము, ఝూనో ముర్ము. వారు భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అతి అరుదైన, కానీ అత్యంత పరాక్రమవంతమైన అక్కాచెల్లెళ్లుగా నిలిచిపోయారు. వీరులు సిదూ కన్హూ ముర్ముల చెల్లెళ్లైన పూలో ఝూనోలు, సంతాల్ తెగకు చెందిన ముర్ము వంశంలో జన్మించారు. వీరి కుటుంబం మొత్తం భారత స్వాతంత్ర్య యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన విప్లవ కుటుంబంగా చరిత్రలో నిలిచింది.

బాల్యం నుంచే విప్లవ బాట: బాల్యం నుంచే పూలో ఝూనోలు అబ్బాయిలకు ఏమాత్రం తీసిపోని ధైర్యసాహసాలతో జీవించారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి గుర్రాలపై తిరుగుతూ, సంతాల్ తిరుగుబాటు సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

వారు కేవలం సందేశకారులే కాదు ఒక స్త్రీ సైన్యాన్ని ఏర్పాటు చేసిన విప్లవ నాయకులు.

శక్తివంతమైన సాల్ వృక్షాల చాటుగా మెరుపు దాడులు చేస్తూ బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించారు. గొడ్డళ్లు, ఈటెలు, విల్లులు--బాణాలతో సైనికులను ఎదుర్కొన్న ఆ సాహసం, భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అపూర్వ అధ్యాయంగా నిలిచింది.

సంతాల్ తిరుగుబాటు - ఒక అగ్నిపర్వం (1855-56): 1780ల నుంచి సంతాల్ గిరిజనులు రాజ్మహల్ కొండ ప్రాంతాల్లో స్థిరపడగా, బ్రిటీషువారు రైతులుగా మారేందుకు ప్రోత్సహించారు. అయితే అదే సమయంలో వడ్డీ వ్యాపారులు, దోపిడీదారులకు స్వేచ్ఛనిచ్చారు.

ఫలితంగా గిరిజనుల భూములు లాక్కోవడం, పన్నుల భారంతో నలిపేయడం, కోర్టులు న్యాయం చేయకపోవడం ఇవన్నీ కలిసి సంతా తిరుగుబాటుకు నిప్పంటించాయి.

ఈ విప్లవానికి సిదూ, కన్హూ, చంద్, భైరవ్ ముర్ములు నాయకత్వం వహించారు. బోగ్నాదిహ్లో దేవుని ఆజ్ఞ వచ్చిందని ప్రకటించిన సిదూ ప్రసంగంతో వేలాది మంది లేచారు. డిగ్గిహ్ పోలీసు ఇన్చార్జిని జనసమూహం అక్కడికక్కడే హతమార్చింది.

"డెలాబోన్ మనమే గెలుస్తాం!" అనే నినాదంతో ఉద్యమం అరణ్యమంతా వ్యాపించింది.

భూస్వాములు, వడ్డీ వ్యాపారుల ఇళ్లు, ధాన్యాగారాలు ధ్వంసమయ్యాయి. వేలాదిమంది సంతాళ్లు ప్రాణత్యాగం చేశారు. చివరికి సిదూ కన్హూలు అరెస్టై ఉరితీయబడ్డారు.

పూలో ఝూనో చేసిన అద్భుత సాహసం: ఈ మొత్తం తిరుగుబాటులో పూలో–ఝూనోలు అగ్రభాగాన నిలిచారు. చీకటి ముసుగులో శత్రు శిబిరంలోకి చొరబడి ఏకంగా 21 మంది బ్రిటీష్ సైనికులను గొడ్డళ్లతో హతమార్చారు అన్నది అనేక పరిశోధకుల అభిప్రాయం. ఇది తిరుగుబాటుదారులలో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. మహిళలు కూడా యుద్ధంలో ముందుండ గలరని దేశానికి చాటి చెప్పింది. చివరికి 1856లో, తమ అన్నల మార్గంలోనే, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర వనితలుగా పూలో–ఝూనోలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

చరిత్ర నిర్లక్ష్యం చేసిన వీర వనితలు: విచారకరమైన విషయం ఏమిటంటే పూలో--ఝూనోలు తమ సొంత సంతాల్ సమాజంలో కూడా పెద్దగా గుర్తింపు పొందకపోవడం. నేడు వారు జీవించి ఉండి పోరాడుతున్నా, వారిని ఉగ్రవాదులుగా ముద్ర వేసే పరిస్థితులు ఉండేవని చరిత్రకారులు వ్యాఖ్యానిస్తున్నారు.

జార్ఖండ్ పరిశోధకురాలు వాసవి కిరో తన "ఉల్గులన్ కి ఔరథెన్" పుస్తకంలో గిరిజన ఉద్యమాల్లో పాల్గొన్న అనేక మహిళా విప్లవ యోధులను నమోదు చేశారు:

పూలో ఝూనో ముర్ము (సంతాల్ తిరుగుబాటు): బిర్సా ముండా ఉద్యమంలో మాకి, తిగి, నాగి, సాలి, తానా ఆందోళనలో దేవ్మణి (బందాని), రోహ్తాస్గఢ్ పోరాటంలో సింగి దై, కైలీ దై.

2."రాణి మా గైడిన్ల్యూ":

బ్రిటీష్ పాలనకు గెరిల్లా పోరాటంతో సవాల్ విసిరిన నాగా వీరవనిత

జననం : 26 జనవరి 1915, నుంగ్కావో గ్రామం, మణిపూర్

తెగ : నాగా

వీరమరణం : 17 ఫిబ్రవరి 1993

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఈశాన్య భారత గిరిజన ప్రాంతాల నుంచి అగ్నిపథం ఎక్కిన అరుదైన వీర వనితల్లో రాణి మా గైడిన్ల్యూ అగ్రస్థానంలో నిలిచింది. మణిపూర్లోని టామెంగ్లాంగ్ జిల్లాలో జన్మించిన గైడిన్ల్యూ బాల్యంనుంచే ప్రజా చైతన్య ఉద్యమాల్లో భాగమైంది.

కేవలం 13 ఏళ్ల వయసులోనే తన బంధువు హైపౌ జడోనాంగ్ ప్రారంభించిన హెరాకా మత సామాజిక ఉద్యమంలో చేరి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేసింది. జడోనాంగ్ను బ్రిటీషువారు ఉరితీసిన తరువాత, ఆ ఉద్యమానికి ఆధ్యాత్మిక రాజకీయ నాయకురాలిగా గైడిన్ల్యూ బాధ్యతలు చేపట్టింది.

16 ఏళ్ల వయసులో 4 వేల మంది సైన్యానికి నాయకత్వం: ఇంకా కౌమారదశలోనే ఉండగానే ఆమె దాదాపు 4,000 మంది నాగా యోధులకు నాయకత్వం వహిస్తూ గెరిల్లా దాడులతో బ్రిటీషువారికి నిద్రలేకుండా చేసింది. పన్నులు చెల్లించవద్దని ప్రజలను ప్రేరేపించింది. బ్రిటీష్ ప్రభుత్వం ఆమెను పట్టుకోవడానికి ప్రత్యేక బహుమతులు కూడా ప్రకటించింది.

చివరికి 1932లో 16 ఏళ్ల వయసులోనే ఆమె అరెస్టు అయ్యి జీవిత ఖైదు శిక్షకు గురైంది. గౌహతి, షిల్లాంగ్, ఐజ్వాల్, తురా వంటి జైళ్లలో దాదాపు 14 సంవత్సరాలు చెరసాల జీవితం గడిపింది.

'రాణి' బిరుదు – దేశం ఇచ్చిన గౌరవం: 1937లో షిల్లాంగ్ జైలులో ఆమెను కలిసిన జవహర్లాల్ నెహ్రూ, ఆమె ధైర్యసాహసాలకు మెచ్చి ఆమెకు "రాణి" అనే బిరుదును ఇచ్చారు. అప్పటి నుంచే ఆమె లిలి"రాణి గైడిన్ల్యూ"లిలిగా ప్రసిద్ధి చెందింది.

1946లో విడుదలైన తరువాత, స్వాతంత్ర్య భారతదేశంలో కూడా ఆమె నాగా సంస్కృతి, గిరిజన ఐక్యత, ప్రజల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసింది.

జాతీయ గుర్తింపు పద్మభూషణ్, ఆమె వీరత్వం, సేవలకు గుర్తింపుగా తామ్రపత్ర స్వాతంత్ర్య సమరయోధ పురస్కారం (1972), పద్మభూషణ్ (1982), వివేకానంద సేవా అవార్డు (1983) లభించాయి.

1996లో ఆమె గౌరవార్థం భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంపు కూడా విడుదల చేసింది. నాగాలాండ్ ప్రజలు ఆమెను ప్రేమతో లిలి"నాగా రాణి లక్ష్మీబాయి"లిలిగా పిలుస్తారు.

3. "రాణి దుర్గావతి":

మొఘల్ సామ్రాజ్యానికి తలవంచని గోండ్ వీరవనిత

జననం : 5 అక్టోబర్ 1524, కలింజార్, బుందేల్కండ్, మధ్యప్రదేశ్

తెగ : గోండ్

వీరమరణం : 24 జూన్ 1564

భారత చరిత్రలో గిరిజన వీరత్వానికి ప్రతీకగా నిలిచిన మహారాణి రాణి దుర్గావతి. గోండ్ రాజవంశానికి చెందిన ఈ వీరనారి చిన్ననాటి నుంచే వేట, యుద్ధ విద్యల్లో అసాధారణ ప్రావీణ్యం సంపాదించింది. ఘడ్మండలా రాజ్యం యొక్క రాజా దళపత్ షా భార్యగా ఆమె రాజ్యపాలన బాధ్యతలు చేపట్టింది.

భర్త మరణం తరువాత, చిన్న వయసుగల కుమారుడు వీర్ నారాయణ్ పేరుతో రాజ్యాన్ని సమర్థంగా పాలిస్తూ ధైర్యం, న్యాయం, ప్రజాహితం అనే మార్గాల్లో ఆదర్శ పాలకురాలిగా నిలిచింది. ఆమె పరిపాలనలో గోండ్ రాజ్యం సుభిక్షంగా, శాంతియుతంగా ఎదిగింది.

మొఘల్ సేనతో ఎదురెల్లిన స్త్రీ శక్తి: 1564లో మొఘల్ చక్రవర్తి అక్బర్, తన సేనాధిపతి ఆసఫ్ ఖాన్ను దుర్గావతి రాజ్యంపై దండెత్తేలా పంపాడు. తనకున్న పరిమిత సైన్యంతోనే దుర్గావతి మానవేతర ధైర్యంతో ఎదుర్కొంది. ఏనుగుపై యుద్ధభూమికి దిగిన రాణి, స్వయంగా సైన్యాన్ని నడిపిస్తూ మొఘల్ సేనకు గట్టి ఎదురుదెబ్బ ఇచ్చింది. పోరాటంలో తీవ్రంగా గాయపడినప్పటికీ, శత్రువు చేతిలో బందీగా పడడం కన్నా స్వయంగా తన ఖడ్గంతో ప్రాణాలు విడవడానికే ఆమె మొగ్గుచూపింది.

ఇది భారత స్త్రీ శక్తి చరిత్రలో అమరమైన త్యాగంగా నిలిచింది.

గిరిజన స్వాభిమానానికి చిహ్నం.

రాణి దుర్గావతి కేవలం రాజు భార్య మాత్రమే కాదు. గిరిజన స్వతంత్ర్యానికి, స్వాభిమానానికి, స్త్రీ శక్తికి సజీవ ప్రతీక. ఆమె త్యాగస్ఫూర్తి నేటికీ గోండ్ ప్రజల్లోనే కాదు, దేశమంతటా స్ఫూర్తిని నింపుతోంది.

ఆమె గౌరవార్థం – జబల్పూర్లో రాణి దుర్గావతి విశ్వవిద్యాలయం, దుర్గావతి ఎక్స్ప్రెస్ రైలు, తపాలా బిళ్ల వంటి జాతీయ గుర్తింపులు ఏర్పాటయ్యాయి.

4. "సింగి దాయి":

ఉరావ్ రాజ్యాన్ని కాపాడిన గిరిజన వీరవనిత

జననం : రోహతాస్ ఘడ్, బీహార్

తెగ : ఉరావ్ (ఓరాన్)

వీరమరణం : తేదీ లభించలేదు

గిరిజన వీరత్వ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన పేరు సింగి దాయి. ఉరావ్ (ఓరాన్) తెగకు చెందిన ఈ వీరాంగన శౌర్యం, ధైర్యసాహసం, తెలివితేటలతో చరిత్రలో తనదైన ముద్ర వేసుకుంది. బీహార్లోని రోహతాస్ ఘడ్ రాజు రుయిదాస్ కుమార్తె అయిన సింగి దాయి, అత్యంత క్లిష్ట సమయంలో రాజ్యాన్ని రక్షించిన స్త్రీ శక్తి.

టర్కీలతో జరిగిన తీవ్ర యుద్ధంలో ఉరావ్ సైన్యం చెల్లాచెదురైన సమయంలో, రాజ్యం శత్రువుల చేతిలో పడిపోతుందనే పరిస్థితి నెలకొంది. అనేక మంది పురుష యోధులు దేశ రక్షణలో ప్రాణత్యాగం చేశారు. అటువంటి నిస్సహాయ స్థితిలో తన ధైర్యం, చాకచక్యం, వ్యూహాత్మక తెలివితో సింగి దాయి ఉరావ్ రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని కాపాడింది.

స్త్రీ సైన్యానికి శిక్షణ–చరిత్రలో అపూర్వ ఘట్టం: స్త్రీల శక్తిని గుర్తించిన సింగి దాయి, ఉరావ్ సమాజపు వేట పండుగ అయిన 'విషు సేంద్ర'ను సైనిక శిక్షణకు ఉపయోగించింది. మహిళలకు ఆయుధాల వినియోగం, పోరాట నైపుణ్యాలు నేర్పించి ఒక మహిళా సైన్యాన్ని సిద్ధం చేసింది. ఈ స్త్రీ సైన్యం బలంతోనే టర్కీల దాడిని సమర్థంగా తిప్పికొట్టింది.

నేటికీ దైవత్వంగా పూజ: సింగి దాయి చేసిన త్యాగానికి గుర్తుగా నేటికీ ఉరావ్ సమాజం 'ముక్క సేంద్ర' వేడుకను ఘనంగా నిర్వహిస్తుంది.

చెట్టు, ప్రకృతి, ధైర్యాన్ని దైవంగా భావించే గిరిజనులు రాజ్యాన్ని కాపాడిన సింగి దాయిని దైవస్వరూపంగానే భావించడం వారి భక్తికి నిదర్శనం.

5. "వీరాంగన లీపా":

అండమాన్ స్వాభిమానానికి అగ్నికణం

జననం : అండమాన్–నికోబార్ దీవులు

తెగ : గ్రేట్ అండమాని

వీరమరణం : తేదీ తెలియదు

అండమాన్ గిరిజన చరిత్రలో వీరత్వానికి నిలువెత్తు ప్రతీక వీరాంగన లీపా. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తన ప్రాణాలనే కాదు, తన గర్భంలో ఉన్న శిశువుని కూడా దేశరక్షణ కోసం త్యాగం చేసిన అమర వీరనారి ఆమె. బ్రిటీషువారికి అండమాన్ గిరిజన సమాజంలోని అంతర్గత వ్యూహాలను అందిస్తున్న దేశద్రోహిని అడ్డుకునే క్రమంలో, తన భర్త దుద్నాత్ తివారితో సంబంధం ఉన్నప్పటికీ, దేశహితమే పరమావధిగా లీపా తన వ్యక్తిగత బాధలను తుంచేసుకుంది. ఈ కారణంగానే ఆమెను లిలి"అండమాన్ పన్నధాయ్"లిలిగా ప్రజలు గౌరవిస్తారు.

అబర్డీన్ యుద్ధంలో అపూర్వ పోరాటం: 1859 మే 17న బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా అండమాన్ తెగల మధ్య జరిగిన అబర్డీన్ యుద్ధంలో సుమారు 15 వేల మంది అండమానీయులు

పాల్గొన్నారు. ఈ యుద్ధం బ్రిటీష్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన అత్యంత భీకరమైన గిరిజన ప్రతిఘటనగా చరిత్రలో నిలిచింది.

ఆ యుద్ధంలో చివరి శ్వాస వరకు సమరం సాగించినవారిలో లీపా ముందువరుసలో నిలిచింది. ఓటమి ఎదురైనా, ఆమె పోరాట పతాకం చివరివరకు పడనివ్వలేదు.

అమరత్వంలో లీనమైన వీరనారి: తన పుట్టిన మట్టిని ముద్దాడుతూ ప్రాణాలు విడిచిన వీరాంగన లీపా, అండమాన్ నేలలో శాశ్వతంగా శౌర్యంతో జీవించే అమరాత్మగా నిలిచిపోయింది.

6. "రాణి రోపుయిలియాని":

మిజో స్వాభిమానానికి అగ్ని ప్రతీక

జననం : 1828, మిజోరాం

తెగ : మిజో కమ్యూనిటీ

వీరమరణం : 3 జనవరి 1895

మిజోరాం స్వాతంత్ర్య చరిత్రలో అచంచల వీరత్వానికి ప్రతీకగా నిలిచిన నామం రాణి రోపుయిలియాని. మిజో రాజు లాల్సవుంగా కుమార్తెగా జన్మించిన ఆమె, చిన్ననాటి నుంచే ధైర్యం, స్వతంత్ర భావనను ఒడిసిపట్టుకుంది. భర్త వందుల మరణానంతరం, తన గ్రామమైన డెన్లుంగ్ (రాలవాంగ్) నుంచి పరిపాలన బాధ్యతలు చేపట్టి మిజో ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

బ్రిటీష్ పాలనకు ఎదురు తిరుగుబాటు: 1890లో తేయాకు తోటల పేరుతో బ్రిటీషువారు మిజో ప్రాంతాలపై ఆక్రమణ మొదలుపెట్టగా, రోపుయిలియాని ఆ ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రజలను తిరుగుబాటుకు ప్రేరేపించింది. పన్నులు, బలవంతపు శ్రమ, ధాన్య నివాళులు చెల్లించడాన్ని పూర్తిగా నిలిపివేయించి, బ్రిటీష్ అధికారానికి బహిరంగంగా సవాలు విసిరింది.

బ్రిటీష్ సైన్యంతో జరిగిన ప్రత్యక్ష పోరులో ఆమె స్వయంగా ముందుండి యుద్ధం చేసి, లెఫ్టినెంట్ స్టువర్ట్తో పాటు మరో ఇద్దరు బ్రిటీష్ సైనికులను మట్టుబెట్టింది. దీంతో ఆమె బ్రిటీష్ ప్రభుత్వానికి అత్యంత ప్రమాదకర నాయకురాలిగా మారింది.

బంధనం – వీరమరణం: తీవ్రమైన ప్రయత్నాల అనంతరం బ్రిటీష్ సేనలు ఆమెను బంధించి 1894 ఏప్రిల్ 8న చిట్టగాంగ్ (ప్రస్తుత బంగ్లాదేశ్) జైలుకు తరలించాయి. జైలులో కూడా ఆమె బ్రిటీష్ పాలనకు లొంగలేదు. చివరికి 1895 జనవరి 3న జైలులోనే ఆమె వీరమరణం పాలైంది.

చెరగని సందేశం: "మన గడ్డను మనమే పాలించుకున్నపుడే మనకు నిజమైన శాంతి వస్తుంది" అనే ఆమె సందేశం నేటికీ మిజో ప్రజలను పోరాటానికి ప్రేరేపిస్తూనే ఉంది.

7. "హెలెన్ లెప్చా (సావిత్రి దేవి)"

స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన మహిళ అజేయ గాత్రం

జననం : 14 జనవరి 1902, సంగ్మూ గ్రామం, దక్షిణ సిక్కిం

మరణం : 18 ఆగస్టు 1980

గిరిజన తెగ–లెప్చా: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అలుపెరుగని సేవలందించి కూడా చరిత్ర పుటల్లో తక్కువగా ప్రస్తావించబడిన మహాయోధురాలు హెలెన్ లెప్చా. దక్షిణ సిక్కింలోని సంగ్మూ గ్రామంలో జన్మించిన ఆమె, చిన్న వయస్సులోనే జీవిత కష్టాలను ఎదుర్కొంటూ దేశసేవ పట్ల అంకితభావం పెంచుకుంది. 14 ఏళ్లకే పాఠశాల విడిచిన హెలెన్, 1917లో చరఖా ఖాదీ ఉద్యమంలో చేరి స్వదేశీ ఉద్యమానికి శక్తినిచ్చింది.

గాంధీజీ ఆశీర్వాదంతో "సావిత్రి దేవి": 1920లో బీహార్ వరద బాధితులకు సేవలందించే సమయంలో ఆమె మహాత్మా గాంధీని కలిసింది. ఆమె త్యాగాలకూ సేవలకూ ముగ్ధుడైన గాంధీజీ ఆమెకు "సావిత్రి దేవి" అనే నామాన్ని ఇచ్చారు. ఆ తరువాత ఆమె జాతీయోద్యమ కార్యచరణలో పూర్తిగా మమేకమైంది.

కార్మిక ఉద్యమానికి నాయకత్వం: 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ఝరియా బొగ్గు గనుల ప్రాంతం నుండి 10,000 మందికి పైగా కార్మికులతో ఊరేగింపుకు నాయకత్వం వహించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆమెను 1922 జనవరి 29న బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్ చేసి, డార్జిలింగ్ జైలులో మూడు నెలలు నిర్బంధించింది. అనంతరం మూడు సంవత్సరాలు గృహ నిర్బంధంలో ఉంచారు.

నేతాజీకి సహాయం – చరిత్రలో అరుదైన ఘట్టం: 1939–40లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కుర్సియాంగ్లో గృహ నిర్బంధంలో ఉన్న సమయంలో, ఆయన తప్పించుకునేందుకు హెలెన్ లెప్చా కీలక సహాయం చేసింది. ఇది భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ఉత్కంఠభరిత ఘట్టంగా చరిత్రలో నిలిచింది.

స్వాతంత్ర్యం తరువాత గౌరవం: 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న హెలెన్, స్వాతంత్ర్యం తరువాత కూడా ప్రజాసేవను కొనసాగించింది. 1972 ఆగస్టు 15న భారత ప్రభుత్వం ఆమెను తామ్రపత్ర అవార్డుతో సత్కరించి స్వాతంత్ర్య సమరయోధురాలిగా గౌరవించింది.

8. "లిపుతలిమయ దేవి పొద్దార్ లి" (1920–1984):

గిరిజన స్వాతంత్ర్య సమరయోధురాలు

జననం : 14 జనవరి 1920, కుర్సియాంగ్, డార్జిలింగ్, పశ్చిమ బెంగాల్

మరణం : 1 డిసెంబర్ 1984

తెగ : గూర్ఖా (తమాంగ్ వంశం)

తండ్రి : మన్బహదూర్ తమాంగ్

భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన మహిళల పాత్రకు అద్భుతమైన ఉదాహరణ పుతలిమయ దేవి పొద్దార్. పశ్చిమ బెంగాల్లోని కుర్సియాంగ్ ప్రాంతంలో జన్మించిన ఆమె, చిన్న వయసులోనే దేశభక్తి భావాలతో ఉద్యమాల బాట పట్టింది. 14––15 ఏళ్ల వయసులో కాంగ్రెస్ ఉద్యమం పట్ల ఆకర్షితురాలై బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటంలో చేరాలనే గట్టి సంకల్పం ఏర్పరుచుకుంది.

మహిళా చైతన్యానికి నిలువెత్తు రూపం: 1936లో కుర్సియాంగ్లో కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుకు ఆమె కీలక సహకారం అందించింది. అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం హరిజన్ సమాజ్ను స్థాపించి, పాఠశాల ప్రారంభించి దళితులు, శూద్రుల విద్యకు బాట చూపింది. మహిళలు రాజకీయ రంగంలో సమాన హక్కులు పొందాలనే లక్ష్యంతో మహిళా సమితిని ఏర్పాటు చేసి, ఖాదీ ఉత్పత్తి ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపునిచ్చింది.

1942 ఉద్యమంలో కీలక పాత్ర: క్విట్ ఇండియా ఉద్యమం (1942) సమయంలో బ్రిటీష్ ప్రభుత్వ హెచ్చరికలను ధిక్కరించి కుర్సియాంగ్లో భారీ ఊరేగింపుకు నాయకత్వం వహించింది. ఈ కారణంగా ఆమెను అరెస్టు చేశారు. ఆరోగ్యం క్షీణించినా ఉద్యమం నుంచి వెనక్కి తగ్గలేదు.

సామాజిక బంధనాలను ఛేదించిన ధైర్యం: పుతలిమయ దేవి తన వివాహ విషయంలోనూ సమాజంలోని సంప్రదాయ బంధనాలను ధిక్కరించి స్వయంగా నిర్ణయం తీసుకుని సూర్య ప్రసాద్ పొద్దార్ను వివాహం చేసుకుంది. ఇది ఆ కాలంలో మహిళా స్వాతంత్ర్య భావనకు గొప్ప ప్రతీకగా నిలిచింది.

స్వాతంత్ర్యం తరువాత సేవా పథం: భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా ఆమె కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, సామాజిక సేవకురాలిగా ప్రజల మధ్యే జీవించింది. అణగారిన వర్గాల ప్రజలు ఆమెను గౌరవంగా "మాతాజీ" అనే పేరుతో పిలిచేవారు.

ముగింపు:

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర పుటల్లో గిరిజన వీరవనితల పాత్ర ఇప్పటికీ పూర్తిగా వెలుగులోకి రాలేదు. కానీ ఫూలో ఝానో ముర్ము నుంచి పుతలిమయ దేవి పొద్దార్ వరకు ప్రతి ఒక్కరు తమ తమ ప్రాంతాల్లో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సింహస్వప్నాలుగా నిలిచారు. ఆయుధాలు, సైన్యం, రాజసంపత్తి లేకపోయినా ధైర్యమే ఆయుధంగా, త్యాగమే కవచంగా, స్వేచ్ఛే లక్ష్యంగా ఈ వీరనారులు స్వాతంత్ర్య పోరాటంలో అగ్నిపథాన్ని తొక్కారు.

వారి పోరాటాలు కేవలం రాజకీయ స్వేచ్ఛకే కాదు, గిరిజనుల స్వాభిమానానికి, మహిళల స్వతంత్ర ఆలోచనకు, అణగారిన వర్గాల గౌరవానికి బలమైన పునాదిగా మారాయి. రాణి దుర్గావతి ఖడ్గ త్యాగం, గైడిన్ల్యూ జైలు జీవితం, లీపా గర్భస్థ శిశువుతో చేసిన ఆత్మార్పణ, హెలెన్ లెప్చా చేసిన సేవలు ఇవన్నీ భారతీయ మహిళా శక్తి యొక్క అమర కావ్యాలుగా నిలిచాయి.

ఇప్పటికైనా ఈ గిరిజన వీరవనితల చరిత్రను యువతకు పరిచయం చేయడం, పాఠ్యపుస్తకాల్లో స్థానం కల్పించడం, వారి త్యాగాలను దేశస్మృతిలో చిరస్థాయిగా నిలపడం మన బాధ్యత. ఎందుకంటే "స్వేచ్ఛను మనం అనుభవించగలుగుతున్నామంటే, ఆ వెనుక ఈ గిరిజన వీరనారుల రక్తపు గుర్తులే ఉన్నాయి."

ఉపయుక్త గ్రంథ సూచి:

1. "భారతీయ గిరిజన వీరులు" ఆచార్య ఎం. గోనా నాయక్.
2. అంతర్జాలం.

13

"గురువాయాణం" బై డా॥ గురువారెడ్డి : ది ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ వెల్‌నోన్ ఇండియన్– వ్యక్తిగతంలోంచి సార్వత్రికం వరకు....

– ఆచార్య సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్

ఈ వ్యాసరచన శీర్షిక పాక్షికంగా పాఠకులకు పశ్చిమబెంగాల్‌కి చెందిన, మొదటితరం భారతీయ–ఆంగ్ల సాహిత్య రచయిత నీరద్ సి.చౌదరి వ్రాసిన ప్రసిద్ధిచెందిన "ది ఆటోబయోగ్రఫీ ఆఫ్ యాన్ అన్‌నోన్ ఇండియన్ (The Autobiography of An Unknown Indian)ను స్ఫురణకు తీసుకువస్తుంది. అందులో ఉన్న వలసవాద (colonial) ఉత్తరవలసవాద (post colonial) భావజాల సంఘర్షణలను ప్రతిబింబిస్తూ, అది ఒక 'అనామక' భారతీయుని స్వీయ జీవితచరిత్ర కాదని, ఒకరకంగా భారతదేశ స్వీయజీవిత చరిత్రగా ఎదుగుతుంది.

కాగా, ప్రస్తుత పరిశీలనలో ఉన్న డా॥గురువారెడ్డి రచించిన "గురువాయణం" ఒక ప్రముఖుని స్వీయ జీవితచరిత్రగా ఉంటూనె, దాని సార్వత్రిక సాహిత్యపు విలువలతో, ఇతివృత్తాలతో, బాపు–రమణల స్వీయ హాస్య–వ్యంగ్య రచనావిధాన స్ఫూర్తితో, స్వీయ జీవితచరిత్ర పరిధిని దాటి, ఎందరివో అలిఖిత (unwritten) జీవితచరిత్రగా రూపాంతరం చెందుతుంది. ఈ పరిణితిలో, "గురువాయణం" వర్తమాన తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానం సాధించగల శక్తిని కలిగి ఉంది.

ముఖ్య విషయానికి వస్తే, "గురువాయణం" అనేక కళాప్రక్రియల (genres) కలపోతతో, ఎక్కువగా ఆత్మకథగా, అక్కడక్కడా ఆత్మీయడైరీ (Diary)గా, అప్పుడప్పుడూ ట్రావ్‌లోగ్‌గా (Travelogue), తనను వ్రాసిన కథలు మరియు వ్యాసాలు, అలాగే తనకు నచ్చిన కథకులైన అన్వర్ మరియు మహ్మద్ ఖాదర్‌బాబుల కథలతో, ఒక సంపుటిగా (anthology), ఒక సాహిత్య ప్రయోగాత్మక ప్రక్రియగా ఉంటూ, సాహిత్యం కళాప్రక్రియల బందీకాదని, వాటిని

అధిగమించకలదని నిరూపిస్తుంది. అలాగే వస్తువిషయంలో జీవితాన్ని 360 డిగ్రీల కోణంలో చూపిస్తూ, జీవిత సమగ్ర అవగాహనకి దోహదం చేస్తుంది.

డా॥ గురువారెడ్డి, "గురువాయణం" పుస్తకం, ఇతిహాస రామాయణం శీర్షికకు అనుకరణ అనిపించినా, డా॥గురువారెడ్డి స్వీయవ్యంగ్య, హాస్యధోరణి, రామాయణంని అనుకరించటం, శీర్షికవరకే అని చెప్పక చెపుతుంది. అయినప్పటికి, ఇతిహాస రామాయణం గౌరవం తగ్గకుండానే ఒక సమాంతరాన్ని (parallel)ని ప్రస్తావించవచ్చెమో : ఇతిహాస రామాయణం, శ్రీరాముని ఆగమనం, జీవితచరిత్ర తెలియచేస్తే, డా॥గురువారెడ్డి తన/మన స్థాయిలో తన జీవిత ప్రయాణ పదనిసలు వ్యంగ్య-హాస్య చెపుతూ, అని అందరి జీవితంలో కొద్దోగొప్పో ఉంటాయని భావాన్ని పాఠకులకు కలగచేస్తుంది. వారిని "గురువాయణం" దగ్గరకి చేస్తుంది.

డా॥గురువారెడ్డి వర్తమానకాలంలో ప్రముఖ డాక్టరుగా ఫలవంతమైన జీవితం పొందినా, ఆయన తన స్వీయ జీవితచరిత్ర అయిన "గురువాయణం"లో సమగ్రంగాను, యదార్థవాదంతో, అలాగే స్వీయ హాస్య-వ్యంగ్య ధోరణుల తోడ్పాటుతో, ఇతరుల ఎడ తాదాత్మ్యం (empathy)ని నిత్యం పాటించిన విషయం బయటపడుతుంది. అలాగే ఆయన జీవితాన్ని ఒక పరిణితి మరియు సమదృష్టి (equaminity)తో చూసినట్లుగా పాఠకులకు అర్థమవుతుంది. ఆవిధంగానే పాఠకులను ప్రభావితం చేస్తుంది. ఈ విషయాన్ని వ్యాసకర్త ప్రత్యేకంగా చెప్పనవసరము లేదు. ఎందుకంటే "గురువాయణం" రెండుభాగాలలో అనేకమంది పాఠకులు, ప్రముఖ సమకాలికులు లేఖల రూపంలో ఇదే భావాన్ని వ్యక్తపరచడం జరిగింది.

ఇంతకుముందు ప్రస్తావించినట్లుగా "గురువాయణం" సార్వత్రిక (universal) ఇతివృత్తాలు అయిన నిత్యఆకర్షణ అయిన బాల్యం, జీవితంలో ఎదగటంలో ఉన్న సవాళ్ళను అధిగమించటం అందరి పాఠకుల మన్ననలు పొందుతుంది. డా॥గురువారెడ్డి తన రచనల్లో స్వీయ హాస్యధోరణితో పాఠకులను లోబర్చుకొంటారు. అలాగే దానిద్వారా వారిని తన రచన ("గురువాయణం"లో) మమేకం చెయ్యగలరు. ఈ రచనా చాతుర్యంలో, పాఠకులను, గురువారెడ్డి తన హృదయబందీలుగా చేస్తూ, వారిని అలరిస్తారని చెప్పడంలో సందేహించక్కర్లేదు. డా॥గురువారెడ్డి తన రచనలో తన స్టార్ డాక్టరు స్టేటస్‌ను నిగర్వంగాను, హుందాగాను స్వీకరించడం కనబడుతూనే ఉంటుంది. డా॥గురువారెడ్డి వృత్తిపరంగా విరిగిన అరిగిన ఎముకలను జతపరచటంలో దిట్ట. అంతే సామర్థ్యంతో డా॥గురువారెడ్డి తన "గురువాయణం"లో సామాన్యులు ప్రముఖులతో సమతుల్యతతో ఉన్న సాంగత్యాన్ని చూస్తాం.

"గురువాయణం" రచన సరళరేఖామయంగా (linear) కాకుండా, క్రిస్‌క్రాస్ (criss-cross) గమనంలో, స్వీయ హాస్య+వ్యంగ్య ధోరణితో తన బాల్యాన్ని, ఆనాటి మధ్యతరగతి

అగచాట్లను దాచకుండా, హుందాగాను, అక్కడక్కడ బాపు-రమణల బుడుగు ధోరణిలో తన పాఠశాల జీవితాన్ని గుర్తుకుతెస్తూ అలాగే తన కళాశాల(లు) కాలాన్ని, అందులో ఉన్న 'రెండుజడల సీతల' గుర్తుకుతెస్తూ, తనయొక్క అనేకమంది (దాచుకొన్న) ముచ్చట్లను బయటపెట్టిస్తూ, పాఠకులు కూడా తను కళాశాల జీవితాలను తిరిగి జీవింపచేస్తారు.

ఈ ధోరణిలో, "గురువాయణం"లో డా॥ గురువారెడ్డి తన సహ హాస్యధోరణిని అధిగమిస్తూ/ అనుభవిస్తూ, తన విద్యార్థిదశ ప్రయాణంలో సహచర విద్యార్థుల సాంగత్యం (camaraderie) సహకారంతో ఎదిగి, వెనక్కి చూసుకున్నప్పుడు సహచర విద్యార్థులు తమను తాము, గురువారెడ్డి బ్యాచ్ విద్యార్థులుగా పిలుచుకొనే స్థాయికి చేరడం హృద్యంగాను, గమ్మత్తుగాను ఉండటం, డా॥గురువారెడ్డి చతురతకి నిదర్శనంగా ఉంటుంది. "గురువాయణం" డా॥గురువారెడ్డి వ్యక్తిత్వంలో కృతజ్ఞతకున్న స్థానాన్ని తెలియచేస్తుంది. దీనికి అనుగుణంగానె, డా॥గురువారెడ్డి తన ఎదుగదలలో సహకరించిన అందరినీ కృతజ్ఞతా పూర్వకంగా గుర్తుచేసుకొంటూనే ఉంటారు.

ఈ తరుణంలోనే, డా॥గురువారెడ్డి తనకు ఆంగ్లభాషాపరంగా పట్టుసాధించడానికి తనమీద తనకు నమ్మకమును కలిగించిన ప్రసాద్ మాష్టారుని గుర్తుతెచ్చుకోవడం, ఒదుగతూనే, ఎంతో ఎత్తుకు ఎదగటం మరవలేనిదిగా పాఠకులకి అనిపిస్తుంది. ఇదే నిష్టలో డా॥గురువారెడ్డి తనకు సహకరించిన, సాయంచేసిన ప్రముఖులైన శాంతాబయోటిక్ వ్యవస్థాపకులు వరప్రసాద్‌రెడ్డి గారిని, అపోలో హాస్పిటల్ సి.యి.వో అయిన డా॥శాంతను, డా॥సంచేటి, డా॥కుట్టిలను మరలమరల కృతజ్ఞతా భావంతో తలుచుకోవడం, డా॥గురువారెడ్డి గారి జీవితంలో "కృతజ్ఞత", సాంగత్యం (camaraderic) పాత్రలను తెలియచేస్తుంది. ఈవిధంగా "గురువాయణం", వారి విజయవంతమైన జీవితంలోనైన, ఎవరి జీవితంలోనైనా ఎందరివో సహాయసహకారాలు ఉంటాయనే నొక్కి చెపుతుంది.

"గురువాయణం"లోని ఆకర్షణలలో అత్యంత విలువైనది, సందర్భోచితంగా ప్రముఖమైనది, డా॥గురువారెడ్డి గారి నిత్య సాహిత్యాభిలాష. ఈ గుణం, డా॥గురువారెడ్డి తన ప్రథమ రచన, కళాశాల మ్యాగజైన్‌లో ప్రచురితం అయిన, "రెండుజడలు, మూడుముళ్ళు, నాలుగుకాళ్లు" వారి సాహిత్యపటిమకి సూచికగా ఉందని, సహచర విద్యార్థి డా॥భార్గవి కొంత హాస్య-వ్యంగ్య ధోరిణితో గుర్తిస్తూ డా॥గురువారెడ్డిని సృజనాత్మక వ్యాసాంగంలో పట్టాలెక్కిస్తుంది.

"గురువాయణం" అలా మొదలైన సృజనాత్మక రచనావ్యాసంగా, బాపు-రమణల ప్రభావాన్ని అక్కడక్కడ ప్రతిబింబిస్తూ, ఆంగ్ల, తెలుగు సాహితీకారులైన జేమ్స్ హాడ్లీ చేజ్ (James Hadley Chase), చలం, తిలక్ (అమృతం కురిసిన రాత్రి) మొదలైన వారి సాంగత్యంలో దినదిన ప్రవృద్ధి చెందినదని చెప్పవచ్చు.

"గురువాయణం"లో డా॥గురువారెడ్డి గారి రచనలు, ముఖ్యంగా ఆంధ్రజ్యోతి, స్వాతి మ్యాగ్‌జైన్‌లలో రెగ్యులర్ కాలమ్‌గా ప్రచురించడటంతో పాటు, సమకాలీన రచయితలైన అన్వర్, మహ్మద్ ఖదీర్‌బాబుల రచనలతో, అలాగే "గురువాయణం" మీద సాధారణ మరియు ప్రముఖులు వ్యక్తపరిచిన సాహిత్య విమర్శకులు, అభిమాన లేఖలతో డా॥గురువారెడ్డి సాహితీ జీవన పయనం సంపన్నమైనదిగా కనబడుతుంది.

ఇంతకుముందు ప్రస్తావించినట్లుగా డా॥గురువారెడ్డి సమగ్రంగాను, 360 డిగ్రీల కోణంలో జీవితాన్ని పరిశీలిస్తూ జీవించడం, "గురువాయణం" ప్రస్తావిస్తూనే ఉంటుంది. "గురువాయణం" డా॥గురువారెడ్డి తన అత్యంత బిజీ (busy) జీవితాన్ని బర్న్ అవుట్ (burn ఠు) స్థాయికి చేరకుండా, దేశ, విదేశ పర్యటనలు ఆసరాగా చేసుకోవడం, అలాగే తన చుట్టుప్రక్కల ఉన్న సామాన్య సంతోషాలలో, ఆటపాటలలో భాగం కావటం కనబడుతూ ఉంటుంది.

అలా "గురువాయణం" డా॥గురువారెడ్డి దాపరికం లేకుండా (candidly), మొహమాటం, తప్పుడుప్రతిష్ఠ (false prestige) కి గురికాకుండా జీవించే విధానానికి నిదర్శనంగా నిలిచి ఉంటుంది. ఇందులో భాగంగానే, జీవితంలో చిన్నచిన్న సంతోషాలను (ఎవరికి నచ్చినవి వారు) దూరం పెట్టకూడదని, వారి సినీ ప్రపంచం సాంగత్యం తెలియచేస్తుంది. తన చిన్నతనంలో సామాన్యంగా అందరిలో ఉన్న సినిమా ఆకర్షణ వారిని అంటిపెట్టుకొని ఉండటం, కాలానికి వయస్సుకు అతీతంగా దానిని వారు ఆస్వాదించటం వారి జీవనశైలికి, వారు తమ జీవితాన్ని ఉత్తేజపరుచుకోవడానికి అద్దం పడుతుంది.

ఆఖరుగా కాని, ఎంతో ప్రాముఖ్యతతో ప్రస్తావించవలసినది, "గురువాయణం" డా॥గురువారెడ్డి వ్యక్తిగత, కుటుంబపర, సామాజిక బంధాలు ఎంత దృఢమైనవో చూపించే విధానం. అది డా॥గురువారెడ్డిలోని మానవీయ కోణాన్ని బలవత్తరం చేస్తూ, వారి విజయవంతమైన జీవితానికి ధృఢమైన మానవ సామాజిక సంబంధాలే కారణమనే విషయాన్ని నిరూపిస్తుంది.

ఈ ధోరణితోనే, "గురువాయణం" డా॥గురువారెడిడ్డి పరిణితి చెందిన దృక్పథం ద్వారా, పెద్దవయస్సులోకి ఎలా గౌరవంగా, హుందాగా, సంతృప్తిగా అడుగుపెట్టవచ్చో తెలియచేస్తుంది. అదే స్పిరిట్ (spirit)తో, నిరాస నిస్పృహలకి గురికాకుండా, ఉదాసీనతకు గురికాకుండా, అరవైలలో కూడా చలాకీగా, శక్తివంతంగా మరియు అర్థవంతంగా వ్యక్తిగతంగాను, వృత్తిపరంగా జీవించవచ్చో, "గురువాయణం" ద్వారా డా॥గురువారెడ్డి చెప్పకనే చెపుతారు. ఇదే "గురువాయణం" సారాంశం!

వ్యాసరచయిత వివరణ : ఒక పేషంట్ సహాయకుడిగా వెళ్ళినప్పుడు, డా॥గురువారెడ్డి గారితో స్వల్పకాల ఆహ్లాద సంభాషణ వలన, మరియు ఆ సందర్భాలలో "గురువాయణం"

(రెండు వాల్యూమ్‌లు) అభినందన (complimentary) కాపీలుగా, గురువారెడ్డి గారు తన సహజ సాహిత్య అభిలాషతో అందచేసిన ఉత్ప్రేరణతో...

ఆధార గ్రంథాలు :-

1. డాక్టర్ గురువారెడ్డి "గురువాయణం" అమెజాన్ ఇండియా (2011).
2. నిరద్ సి.చేదరి "ఆన్ ఆటోగ్రఫి ఆఫ్ అన్ నోన్ ఇండియా" మాక్ మిలాన్ (1951).
3. నవీత్ సుందర్ "ఫేక్ బాడీ ప్యూరిటీ మైండ్" అమీద చూహన్ పబ్లికేషన్, చెన్నై (2007).
4. భాటియా సోదక్ కడాక్ "సైలెంట్ థింక్" సూసైరా పబ్లికేషన్, కలకత్తా (2009).
5. ఆశయం వెంకట శివుడు తిరుపతి దేవస్థాన ప్రచురణలు, చిత్తూరు (1997).
6. బుచ్చిబాబు "నా అంతరంగ కథనం" లోగిలి పబ్లికేషన్స్, హైదరాబాద్ (2001).
7. దర్శి చెంచయ్య "నేను నా దేశం" భ్రమరాంబ ప్రచురణలు, హైదరాబాద్ (2014).

14
దక్షిణ భారతీయ భాషలలో అంతర్ముఖ నవల - అంతరంగ అన్వేషణ

- డా॥ వేలం పళని & ఆచార్య డి. ఉదయ కుమారి

భారతీయ భాషల ఆధునిక నవలా సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ఒక ప్రత్యేక ధోరణి కనిపిస్తుంది. సాహిత్య విమర్శకులు ఆధునిక భారతీయ నవలలలో వ్యక్తి మానసిక సంఘర్షణలు, ఆత్మవిమర్శ, జీవితార్థంపై కలిగే ప్రశ్నలు వంటి అంశాలు ప్రధానంగా ప్రతిఫలిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సాహిత్యాలలో వచ్చిన కొన్ని ముఖ్యమైన నవలలను అంతర్ముఖ నవలల ఉదాహరణలుగా పరిగణించవచ్చు.

తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు రచించిన చివరకు మిగిలేది నవల వ్యక్తి జీవితాన్ని వెనుదిరిగి పరిశీలించే ఒక అంతరంగ యాత్రగా కనిపిస్తుంది. ఈ నవలలో కథానాయకుడు తన గత అనుభవాలను, తన సంబంధాలను, తన నిర్ణయాలను తిరిగి పరిశీలిస్తూ జీవితార్థాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధంగా వ్యక్తి అంతరంగ విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఈ నవల తెలుగు సాహిత్యంలో ఒక ముఖ్యమైన అంతర్ముఖ నవలగా గుర్తించబడింది. తెలుగు సాహిత్య విమర్శకురాలు కాత్యాయని విద్మహే తన పరిశోధనలో ఈ నవలలో వ్యక్తి అంతరంగ సంఘర్షణను రచయిత ఎంతో లోతుగా చిత్రించాడని వ్యాఖ్యానిస్తుంది.

తమిళ సాహిత్యంలో జయమోహన్ రచించిన సుందరకాండం నవల కూడా వ్యక్తి జీవితంలోని అంతరంగ అన్వేషణను ప్రతిబింబించే రచనగా పరిగణించబడుతుంది. ఈ నవలలో కథానాయకుడు జీవితంలోని ఆధ్యాత్మిక అర్థాన్ని అన్వేషించడానికి చేసే ప్రయత్నం ప్రధానంగా కనిపిస్తుంది. ఆధునిక తమిళ సాహిత్య విమర్శకులు కా. చెల్లప్పన్ వంటివారు ఈ నవలను వ్యక్తి ఆత్మవిమర్శను ప్రతిబింబించే ఒక తాత్విక నవలగా పేర్కొన్నారు.

కన్నడ సాహిత్యంలో శివరామ కారంత్ రచించిన మరణదనంతర నవల జీవితం, మరణం మధ్య ఉన్న సంబంధాన్ని తాత్విక దృష్టితో పరిశీలిస్తుంది. ఈ నవలలో వ్యక్తి తన జీవితాన్ని ఒక

ఆలోచనాత్మక దృష్టితో తిరిగి పరిశీలించే ప్రయత్నం కనిపిస్తుంది. కన్నడ సాహిత్య విమర్శకుడు సి.డి. నరసింహయ్య ఆధునిక కన్నడ నవలలలో వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ధోరణి గణనీయంగా పెరిగిందని పేర్కొంటూ కారంత్ రచనలను ఈ సందర్భంలో ప్రస్తావిస్తాడు.

మలయాళ సాహిత్యంలో మలయాట్టూర్ రామకృష్ణన్ రచించిన వేరుకళ్ నవల వ్యక్తి తన మూలాలను, తన వ్యక్తిత్వాన్ని, తన జీవితం ఆధారపడిన విలువలను అన్వేషించే కథగా నిలుస్తుంది. ఈ నవలలో కథానాయకుడు తన కుటుంబం, సమాజం, గత అనుభవాలు వంటి అంశాల ద్వారా తన అస్థిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. మలయాళ సాహిత్య చరిత్రకారుడు కె.ఎం. జార్జ్ తన రచనలో ఈ నవలను వ్యక్తి మూలాలను అన్వేషించే ఒక అంతర్ముఖ నవలగా పేర్కొన్నాడు.

ఈ నాలుగు భాషలలో వచ్చిన ఈ నవలలను పరిశీలించినప్పుడు ఒక ముఖ్యమైన సామాన్య లక్షణం కనిపిస్తుంది. వీటిలో కథానాయకుడు తన జీవితాన్ని తిరిగి పరిశీలించే ప్రయత్నం చేస్తాడు. అతను తన గతాన్ని, తన అనుభవాలను, తన నిర్ణయాలను విశ్లేషిస్తూ జీవితం యొక్క అర్థాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధంగా వ్యక్తి అంతరంగ అన్వేషణ ఈ నవలల ప్రధాన లక్షణంగా నిలుస్తుంది.

అందువల్ల భాషలు వేరైనా ఈ నవలలన్నింటిలో ఒకే తాత్విక ధోరణి కనిపిస్తుంది. వ్యక్తి జీవితాన్ని ఒక అంతరంగ యాత్రగా చిత్రించడం ఈ నవలల సాధారణ లక్షణంగా చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో భారతీయ భాషలలో అంతర్ముఖ నవల ఒక ముఖ్యమైన ఆధునిక సాహిత్య ధోరణిగా అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు.

భాష	నవల	రచయిత	ప్రధాన అంశం
తెలుగు	చివరకు మిగిలేది	బుచ్చిబాబు	వ్యక్తి అంతరంగ విశ్లేషణ
తమిళం	సుందరకాండం	జయమోహన్	ఆధ్యాత్మిక అన్వేషణ
కన్నడ	మరణదనంతర	శివరామ కారంత్	జీవితం, మరణం తాత్విక విచారణ
మలయాళం	వేరుకళ్	మలయాట్టూర్ రామకృష్ణన్	అస్తిత్వ మూలాల అన్వేషణ

3. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' - అంతర్ముఖ అన్వేషణకు తెలుగు రూపం:

తెలుగు ఆధునిక నవలా సాహిత్యంలో బుచ్చిబాబు రచించిన చివరకు మిగిలేది ఒక ప్రత్యేకమైన స్థానం పొందిన రచన. ఈ నవల వెలువడిన కాలం తెలుగు సాహిత్యంలో ఒక ముఖ్యమైన మలుపును సూచిస్తుంది. అప్పటి వరకు వచ్చిన అనేక నవలలు ప్రధానంగా సామాజిక సమస్యలను, సంస్కరణ అవసరాన్ని, మధ్యతరగతి జీవితంలోని సంఘర్షణలను ప్రతిబింబించాయి. కానీ బుచ్చిబాబు ఈ నవలలో వ్యక్తి అంతరంగాన్ని, అతని ఆత్మవిమర్శను, జీవితార్థాన్వేషణను

ISSN: 2319-3905

ప్రధానంగా చిత్రించారు. ఈ కారణంగా ఈ నవల తెలుగు సాహిత్యంలో అంతర్ముఖ అన్వేషణకు సంబంధించిన ఒక ముఖ్యమైన మైలురాయిగా పరిగణించబడుతుంది.

ఈ నవలలో కథానాయకుడు ఎదుర్కొనే సమస్యలు ప్రధానంగా బాహ్య సంఘటనలకు సంబంధించినవి కావు. అతను సమాజంతో పోరాడే వ్యక్తి కాదు; తనతో తానే ప్రశ్నలు వేసుకునే వ్యక్తి. అతని జీవితంలో ఎదురైన అనుభవాలు, అతను తీసుకున్న నిర్ణయాలు, అతను కోల్పోయిన అవకాశాలు అన్నీ అతని మనస్సులో తిరిగి ప్రత్యక్షమవుతాయి. ఈ జ్ఞాపకాలు అతని అంతరంగాన్ని క్రమంగా ఒక ఆత్మవిమర్శ వైపు నడిపిస్తాయి. ఈ విధంగా చివరకు మిగిలేది నవల ఒక వ్యక్తి జీవితాన్ని వెనుదిరిగి పరిశీలించే అంతరంగ ప్రయాణంగా రూపుదిద్దుకుంది.

ఈ నవలలో కథానాయకుడు తన జీవితాన్ని పరిశీలిస్తూ "జీవితం అంటే ఏమిటి?", "మనిషి ఎందుకు జీవిస్తాడు?", "మనిషి జీవితానికి నిజమైన విలువ ఏమిటి?" వంటి ప్రశ్నలను ఎదుర్కొంటాడు. ఈ ప్రశ్నలు కేవలం వ్యక్తిగత అనుభవానికి సంబంధించినవి మాత్రమే కాదు; అవి మానవ జీవితంలోని తాత్విక అర్థాన్ని అన్వేషించే ప్రశ్నలు. ఈ సందర్భంలో ఈ నవలలో కనిపించే ఆత్మవిమర్శ భారతీయ తాత్విక సంప్రదాయాన్ని గుర్తు చేస్తుంది. ఉపనిషత్తులలో కనిపించే ఆత్మవిచారణ భావన వ్యక్తి తన జీవితాన్ని పరిశీలించడం ద్వారానే నిజమైన జ్ఞానం పొందగలడని సూచిస్తుంది. అదే విధంగా ఈ నవలలో కథానాయకుడు తన అనుభవాలను పరిశీలిస్తూ తన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ఉపనిషత్తులలోని ఆత్మాన్వేషణ భావనతో ఒక సారూప్యతను కలిగి ఉంటుంది.

ఇక ఈ నవలలో కనిపించే అంతరంగ సంక్షోభం ఆధునిక అస్తిత్వవాద తత్వాన్ని కూడా గుర్తు చేస్తుంది. అస్తిత్వవాద తత్వవేత్తలు వ్యక్తి జీవితంలో అర్థాన్వేషణ ప్రధానమైన సమస్యగా మారుతుందని పేర్కొన్నారు. జాన్ పాల్ సార్త్రే, అల్బేర్ కామ్యూ వంటి తత్వవేత్తలు ఆధునిక మానవుని జీవితంలో ఒంటరితనం, అనిశ్చితి, అస్థిత్వ సంక్షోభం వంటి భావనలు ప్రధానంగా కనిపిస్తాయని వివరించారు. ఇదే విధంగా చివరకు మిగిలేది నవలలో కథానాయకుడు అనుభవించే ఒంటరితనం, జీవితార్థంపై అతనికి కలిగే సందేహాలు ఈ అస్తిత్వ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తాయి.

ఈ నవలలో కథానాయకుడి అంతరంగ విశ్లేషణ ఆధునిక మనోవిజ్ఞాన సిద్ధాంతాలను కూడా గుర్తు చేస్తుంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ మానవ మనస్సులో అవచేతనలో దాగి ఉన్న జ్ఞాపకాలు మరియు అనుభవాలు వ్యక్తి ఆలోచనలను ప్రభావితం చేస్తాయని పేర్కొన్నాడు. ఈ నవలలో కూడా కథానాయకుడి గత అనుభవాలు, అతని జ్ఞాపకాలు, అతను అనుభవించిన మానసిక సంఘర్షణలు అతని ఆలోచనలను నిరంతరం ప్రభావితం చేస్తాయి. అతను తన గతాన్ని గుర్తు చేసుకుంటూ తన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ఆధునిక మనోవిజ్ఞాన దృష్టితో కూడా విశ్లేషించదగిన అంశంగా కనిపిస్తుంది.

ఇక కథన శిల్పం దృష్టిలో కూడా ఈ నవల ప్రత్యేకమైనది. సంప్రదాయ నవలలలో కనిపించే విధంగా కథ క్రమబద్ధమైన సంఘటనల శ్రేణిగా ముందుకు సాగదు. కథానాయకుడి జ్ఞాపకాలు, ఆలోచనలు, అనుభవాలు కథా నిర్మాణాన్ని నిర్దేశిస్తాయి. గతం మరియు వర్తమానం మధ్య జరిగే ఈ అంతరంగ సంభాషణే నవల యొక్క ప్రధాన నిర్మాణంగా మారుతుంది. ఆధునిక నవలలలో కనిపించే చైతన్య ప్రవాహం, అంతరంగ స్వగతం, జ్ఞాపక కథనం వంటి కథన పద్ధతుల లక్షణాలు ఈ నవలలో కూడా కనిపిస్తాయి.

తెలుగు సాహిత్య విమర్శలో ఈ నవలపై అనేక పరిశోధనలు జరిగాయి. ముఖ్యంగా సాహిత్య విమర్శకులు కాత్యాయని విద్మహే ఈ నవలపై చేసిన విశ్లేషణలో ఒక ముఖ్యమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమె అభిప్రాయం ప్రకారం చివరకు మిగిలేది నవలలో కథానాయకుడి జీవితం ఒక బాహ్య సంఘటనల క్రమం కాదు; అది ఒక అంతరంగ సంక్షోభం. ఈ సంక్షోభం ద్వారా వ్యక్తి తన జీవితాన్ని తిరిగి పరిశీలించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

కాత్యాయని విద్మహే గారి విశ్లేషణలో మరో ముఖ్యమైన అంశం కథానాయకుడి ఒంటరితనం. ఆమె అభిప్రాయం ప్రకారం ఈ నవలలో కథానాయకుడు అనుభవించే ఒంటరితనం సామాజికమైన ఒంటరితనం మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మికమైన ఒంటరితనం కూడా. అతను సమాజంలో జీవిస్తున్నప్పటికీ తన జీవితానికి అర్థం ఏమిటి అనే ప్రశ్న అతన్ని లోతుగా కలవరపెడుతుంది. ఈ అంతరంగ సంక్షోభమే నవల యొక్క ప్రధాన భావప్రవాహంగా నిలుస్తుంది.

ఈ నవలలో కనిపించే మరో ముఖ్యమైన అంశం ఆత్మవిమర్శ. కథానాయకుడు తన జీవితాన్ని పరిశీలిస్తూ తన నిర్ణయాలను, తన సంబంధాలను, తన ఆశయాలను తిరిగి ప్రశ్నించుకుంటాడు. ఈ ఆత్మవిమర్శ ద్వారా అతను తన జీవితాన్ని ఒక కొత్త దృష్టితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రక్రియలో అతను సమాజం విధించిన విలువలను కూడా ప్రశ్నిస్తాడు.

ఈ నవలలో బుచ్చిబాబు ఆధ్యాత్మికతను సంప్రదాయ మతాచారాల రూపంలో చూపించలేదు. ఉపవాసాలు, పూజలు, మతపరమైన నియమాలు వంటి అంశాలు ఈ నవలలో ప్రధానంగా కనిపించవు. బదులుగా రచయిత ఆధ్యాత్మికతను ఒక అంతరంగ అనుభవంగా చూపించారు. జీవితం గురించి ప్రశ్నించడం, తనను తాను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం, తన జీవితాన్ని తిరిగి పరిశీలించడం ఈ ప్రక్రియల ద్వారానే ఆధ్యాత్మికత వ్యక్తమవుతుందని ఈ నవల సూచిస్తుంది.

ఈ కారణంగా చివరకు మిగిలేది నవల తెలుగు సాహిత్యంలో ఒక కొత్త దిశను సూచించింది. అప్పటి వరకు నవల ప్రధానంగా సమాజ సమస్యలను ప్రతిబింబించే ప్రక్రియగా ఉన్నప్పుడు బుచ్చిబాబు వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ఒక కొత్త కథన విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఈ నవల తర్వాత తెలుగు నవలా సాహిత్యంలో వ్యక్తి మనోవిశ్లేషణకు సంబంధించిన రచనలు పెరిగాయి.

అందువల్ల చివరకు మిగిలేది నవలను కేవలం ఒక వ్యక్తి జీవిత కథగా మాత్రమే చూడలేం. ఇది ఒక తాత్విక ప్రశ్నను ముందుకు తెచ్చిన రచన. ఈ నవల "జీవితం చివర మనకు మిగిలేది ఏమిటి?" అనే ప్రశ్నను పాఠకుడి ముందుంచుతుంది. ఈ ప్రశ్నకు రచయిత స్పష్టమైన సమాధానం ఇవ్వరు. బదులుగా పాఠకుడే తన జీవితాన్ని పరిశీలించి ఆ ప్రశ్నకు సమాధానం కనుగొనాలని సూచిస్తారు.

ఈ విధంగా బుచ్చిబాబు చివరకు మిగిలేది నవల భారతీయ తాత్విక సంప్రదాయం, అస్తిత్వవాద తత్వం, ఆధునిక మనోవిజ్ఞానం, అంతర్ముఖ కథన శిల్పం అనే అన్ని అంశాలను ఒకే రచనలో సమన్వయం చేసిన ప్రత్యేకమైన నవలగా తెలుగు సాహిత్యంలో నిలిచింది.

4. తమిళ, కన్నడ, మలయాళ నవలల్లో అంతర్ముఖ అన్వేషణ – తులనాత్మక విశ్లేషణ:

భారతీయ భాషల ఆధునిక నవలా సాహిత్యాన్ని సమగ్రంగా పరిశీలించినప్పుడు ఒక ముఖ్యమైన లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. అది వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ధోరణి. ఆధునిక సమాజంలో వ్యక్తి అనుభవించే ఒంటరితనం, మానసిక సంఘర్షణ, జీవితార్థాన్వేషణ వంటి అంశాలు నవలలలో ప్రధానంగా ప్రతిఫలించాయి. సాహిత్య విమర్శకులు ఆధునిక భారతీయ నవలలో ఈ లక్షణాన్ని ఒక ముఖ్యమైన సాహిత్య పరిణామంగా గుర్తించారు.

ఈ ధోరణి ఒకే భాషలో మాత్రమే కనిపించలేదు. దక్షిణ భారతీయ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సాహిత్యాలలో కూడా ఇది సమాంతరంగా అభివృద్ధి చెందింది. ఈ భాషలలో వెలువడిన కొన్ని ముఖ్యమైన నవలలను పరిశీలించినప్పుడు వ్యక్తి జీవితాన్ని ఒక అంతరంగ యాత్రగా చిత్రించే ఒక సమానమైన తాత్విక దృష్టి కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు రచించిన చివరకు మిగిలేది నవలలో వ్యక్తి తన జీవితాన్ని వెనుదిరిగి పరిశీలించే ఆత్మవిమర్శ ప్రధానంగా కనిపిస్తుంది. ఇదే విధంగా తమిళంలో జయమోహన్ రచించిన సుందరకాండం, కన్నడంలో శివరామ కారంత్ రచించిన మరణదనంతర, మలయాళంలో మలయాట్టూర్ రామకృష్ణన్ రచించిన వేరుకళ్ నవలలు కూడా వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే రచనలుగా గుర్తించబడతాయి. ఈ నవలలన్నింటిలోనూ కథానాయకుడు తన జీవితాన్ని, తన విలువలను, తన అస్థిత్వాన్ని ప్రశ్నించుకునే ఒక అంతరంగ ప్రయాణం కనిపిస్తుంది.

సాహిత్య చరిత్రకారుడు కె.ఎం. జార్జ్ ఆధునిక దక్షిణ భారతీయ నవలలపై చేసిన పరిశీలనలో ఈ ధోరణిని ప్రస్తావిస్తూ ఆధునిక భారతీయ రచయితలు సమాజాన్ని మాత్రమే కాకుండా వ్యక్తి అంతరంగాన్ని కూడా పరిశీలించే దిశగా ముందుకు సాగారని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఈ నవలలను పరిశీలించినప్పుడు భాషలు వేరైనా ఒక సమానమైన తాత్విక దృష్టి కనిపిస్తుంది.

4.1 తమిళ నవల – జయమోహన్ 'సుందరకాండం':

తమిళ ఆధునిక సాహిత్యంలో జయమోహన్ ఒక ప్రముఖ రచయితగా గుర్తించబడిన వ్యక్తి. ఆయన రచనలలో తాత్విక దృష్టి, ఆధ్యాత్మిక అన్వేషణ, మానవ జీవితంలోని అంతరంగ సంక్షోభం వంటి అంశాలు తరచుగా కనిపిస్తాయి. తమిళ సాహిత్య విమర్శకులు ఆయన రచనలను పరిశీలిస్తూ ఆధునిక మానవుడు అనుభవించే ఆధ్యాత్మిక అసంతృప్తిని ఆయన రచనలు ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.

జయమోహన్ రచించిన సుందరకాండం నవల ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి జీవితాన్ని ఆధారంగా చేసుకుని ముందుకు సాగుతుంది. ఈ నవలలో కథానాయకుడు కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ జీవితం, సామాజిక ఒత్తిడులు వంటి పరిస్థితుల మధ్య తన జీవితాన్ని గడుపుతుంటాడు. బయటికి చూస్తే అతని జీవితం సాధారణంగా కనిపించినప్పటికీ, అతని అంతరంగంలో ఒక తీవ్రమైన అసంతృప్తి క్రమంగా పెరుగుతుంది.

జీవితం ఒక యాంత్రిక ప్రక్రియగా మారిపోయిందనే భావన అతని మనస్సులో క్రమంగా బలపడుతుంది. ఈ అనుభవం అతన్ని ఒక ఆత్మపరిశీలన వైపు నడిపిస్తుంది. జీవితం యొక్క అసలు అర్థం ఏమిటి? మనిషి ఎందుకు జీవిస్తాడు? బాధకు అర్థం ఏమిటి? వంటి ప్రశ్నలు అతని అంతరంగంలో ఉద్భవిస్తాయి.

ఈ ప్రశ్నలకు ఈ నవల స్పష్టమైన సమాధానాలు ఇవ్వదు. కానీ ఈ ప్రశ్నల ద్వారానే కథానాయకుడు తన జీవితాన్ని ఒక కొత్త దృష్టితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధంగా ఈ నవలలో కనిపించే అంతరంగ అన్వేషణ ఆధునిక అస్తిత్వవాద తత్వాన్ని గుర్తు చేస్తుంది. ఆధునిక మానవుని జీవితంలో కనిపించే ఆధ్యాత్మిక అసంతృప్తి అతన్ని ఒక అంతర్ముఖ అన్వేషణ వైపు నడిపిస్తుందని ఈ నవల సూచిస్తుంది.

తమిళ సాహిత్య విమర్శలో ఈ నవలను ఒక ఆధ్యాత్మిక అంతరంగ యాత్రగా పరిగణిస్తారు. జయమోహన్ రచనలలో కనిపించే తాత్విక దృష్టి ఈ నవలలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. వ్యక్తి జీవితంలోని సంఘర్షణలు అతన్ని ఒక అంతరంగ అన్వేషణ వైపు నడిపిస్తాయని ఈ నవల సూచిస్తుంది. ఈ విధంగా సుందరకాండం నవల ఆధునిక తమిళ సాహిత్యంలో వ్యక్తి ఆత్మవిమర్శను ప్రతిబింబించే ఒక ముఖ్యమైన అంతర్ముఖ నవలగా నిలుస్తుంది.

4.2 కన్నడ నవల – శివరామ కారంత్ 'మరణదనంతర':

కన్నడ సాహిత్యంలో శివరామ కారంత్ ఒక ప్రముఖ నవలా రచయిత. ఆయన రచనలు ప్రధానంగా సామాజిక సమస్యలను ప్రతిబింబించినప్పటికీ, కొన్ని రచనలలో తాత్విక దృష్టి కూడా స్పష్టంగా కనిపిస్తుంది. మరణదనంతర నవలలో ఈ తాత్విక దృష్టి మరింతగా వ్యక్తమవుతుంది.

ఈ నవలలో రచయిత జీవితం, మరణం మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించే ప్రయత్నం చేశారు. మనిషి జీవితం ముగిసిన తర్వాత కూడా అతని చైతన్యం కొనసాగుతుందా? జీవితం అంటే ఏమిటి? మరణం మనిషి జీవితానికి ఎలాంటి అర్థాన్ని ఇస్తుంది? వంటి ప్రశ్నలు ఈ నవలలో ప్రధానంగా కనిపిస్తాయి.

ఈ నవలలో కథానాయకుడు మరణానంతరం తన జీవితాన్ని తిరిగి పరిశీలించే ఒక ఆలోచనాత్మక స్థితిలో కనిపిస్తాడు. అతను తన గత అనుభవాలను, తన నిర్ణయాలను, తన ఆశయాలను తిరిగి పరిశీలిస్తాడు. ఈ పరిశీలన ద్వారా జీవితం యొక్క అసలు విలువ ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం కనుగొనడానికి ప్రయత్నిస్తాడు.

ఈ విధంగా మరణదనంతర నవలలో అంతర్ముఖ అన్వేషణ ఒక తాత్విక రూపంలో కనిపిస్తుంది. జీవితం ముగిసిన తర్వాత కూడా మనిషి తన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడనే ఆలోచన ఈ నవల యొక్క ప్రధాన భావప్రవాహంగా నిలుస్తుంది.

4.3 మలయాళ నవల – మలయాట్టూర్ రామకృష్ణన్ 'వేరుకళ్':

మలయాళ సాహిత్యంలో మలయాట్టూర్ రామకృష్ణన్ రచించిన వేరుకళ్ నవల వ్యక్తి మూలాలను అన్వేషించే కథగా ప్రత్యేక స్థానం పొందింది. మలయాళ ఆధునిక నవలా సాహిత్యాన్ని విశ్లేషించిన అనేక సాహిత్య చరిత్రకారులు ఈ నవలను వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ఒక ముఖ్యమైన రచనగా పేర్కొన్నారు. ఈ నవలలో "వేరుకళ్" అనే పదం కేవలం కుటుంబ వంశ మూలాలను మాత్రమే సూచించదు; అది వ్యక్తి జీవితాన్ని నిర్మించిన విలువలు, అనుభవాలు, సాంస్కృతిక నేపథ్యం, మానసిక అనుభూతులు వంటి విస్తృతమైన అంశాలను సూచిస్తుంది.

ఈ నవలలో కథానాయకుడు సమాజంలో ఒక స్థిరమైన జీవితం గడుపుతున్న వ్యక్తిగా కనిపిస్తాడు. బయటికి చూస్తే అతని జీవితం సవ్యంగా సాగుతున్నట్లు అనిపించినప్పటికీ, అతని అంతరంగంలో ఒక ప్రశ్న నిరంతరం మెలకువగా ఉంటుంది తన జీవితానికి అసలు అర్థం ఏమిటి? ఈ ప్రశ్న అతన్ని క్రమంగా ఒక ఆత్మపరిశీలన వైపు నడిపిస్తుంది. తన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి అతను తన గతాన్ని, తన కుటుంబాన్ని, తన బాల్యానుభవాలను తిరిగి గుర్తు చేసుకోవడం ప్రారంభిస్తాడు.

ఈ విధంగా జ్ఞాపకాలు ఈ నవలలో ఒక ముఖ్యమైన కథన పద్ధతిగా కనిపిస్తాయి. కథానాయకుడు తన గత అనుభవాలను గుర్తు చేసుకుంటూ తన ప్రస్తుత జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. గతం, వర్తమానం మధ్య జరిగే ఈ అంతరంగ సంభాషణ నవల యొక్క ప్రధాన నిర్మాణంగా మారుతుంది. ఆధునిక నవలలలో కనిపించే జ్ఞాపక కథనం, అంతరంగ స్వగతం వంటి కథన పద్ధతుల లక్షణాలు ఈ నవలలో స్పష్టంగా కనిపిస్తాయి.

ఈ నవలలో కథానాయకుడు తన మూలాలను అన్వేషించడం ద్వారా తన అస్థిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ అన్వేషణ కేవలం కుటుంబ చరిత్రను తెలుసుకోవడమే కాదు; తన వ్యక్తిత్వాన్ని నిర్మించిన అనుభవాలను అర్థం చేసుకోవడమూ కూడా. ఈ విధంగా వ్యక్తి తన మూలాలను అన్వేషించే ప్రయత్నం ఒక అంతరంగ యాత్రగా రూపుదిద్దుకుంటుంది.

మలయాళ సాహిత్య విమర్శలో ఈ నవలను వ్యక్తి అస్తిత్వ అన్వేషణకు సంబంధించిన ఒక ముఖ్యమైన రచనగా పరిగణిస్తారు. సాహిత్య చరిత్రకారుడు కె.ఎం. జార్జ్ మలయాళ ఆధునిక నవలలపై చేసిన విశ్లేషణలో ఆధునిక రచయితలు వ్యక్తి అంతరంగ జీవితాన్ని పరిశీలించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంటూ మలయాట్టూర్ రామకృష్ణన్ రచనలను ఈ సందర్భంలో ప్రస్తావించారు. వ్యక్తి తన మూలాలను తెలుసుకోవడానికి చేసే ప్రయత్నం ద్వారా జీవితం యొక్క అర్థాన్ని అన్వేషించే ఒక అంతరంగ యాత్ర ఈ నవలలో ప్రతిబింబిస్తుందని ఆయన వ్యాఖ్యానించాడు.

ఈ విధంగా వేరుకళ్ నవలలో కనిపించే మూలాన్వేషణ వ్యక్తి జీవితాన్ని ఒక తాత్విక దృష్టితో పరిశీలించే ప్రయత్నంగా కనిపిస్తుంది. వ్యక్తి తన గతాన్ని, తన అనుభవాలను, తన సంస్కృతిని అర్థం చేసుకోవడం ద్వారా తన జీవితానికి అర్థాన్ని కనుగొనాలని ఈ నవల సూచిస్తుంది. ఈ కారణంగా వేరుకళ్ మలయాళ సాహిత్యంలో వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ఒక ముఖ్యమైన అంతర్ముఖ నవలగా గుర్తించబడింది.

4.4 నాలుగు నవలల తాత్విక సారూప్యత:

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలలో వచ్చిన ఈ నాలుగు నవలలను సమగ్రంగా పరిశీలించినప్పుడు కొన్ని ముఖ్యమైన తాత్విక సారూప్యతలు కనిపిస్తాయి. భాషలు వేరైనా, సాంస్కృతిక నేపథ్యాలు వేరైనా, ఈ నవలలన్నింటిలో వ్యక్తి జీవితాన్ని ఒక అంతరంగ యాత్రగా చిత్రించే ఒక సమానమైన దృష్టి కనిపిస్తుంది. ఆధునిక భారతీయ నవలలో వ్యక్తి అంతరంగాన్ని పరిశీలించే ధోరణి ఒక ప్రధాన లక్షణంగా అభివృద్ధి చెందిందని సాహిత్య విమర్శకులు పేర్కొంటారు. ఈ నాలుగు నవలలను పరిశీలించినప్పుడు ఆ ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది.

మొదటిగా, ఈ నవలలన్నింటిలో కథానాయకుడు తన జీవితాన్ని తిరిగి పరిశీలించే ఒక ఆత్మవిమర్శ కనిపిస్తుంది. చివరకు మిగిలేది, సుందరకాండం, మరణదనంతర, వేరుకళ్ అనే నవలలలో కథానాయకుడు తన గతాన్ని, తన అనుభవాలను, తన నిర్ణయాలను గుర్తు చేసుకుంటూ తన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధమైన ఆత్మవిమర్శ భారతీయ తాత్విక సంప్రదాయంలో కనిపించే ఆత్మాన్వేషణ భావనను గుర్తు చేస్తుంది. ఉపనిషత్తులలో వ్యక్తి తనను తాను తెలుసుకోవడం ద్వారానే నిజమైన జ్ఞానం సాధ్యమవుతుందని చెప్పబడింది. అదే విధంగా

ఈ నవలలలో కూడా కథానాయకుడు తన జీవితాన్ని పరిశీలించడం ద్వారా తన అస్థిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు.

రెండవది, ఈ నవలలలో బాహ్య సంఘటనల కంటే అంతరంగ అనుభవాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కథానాయకుడి జ్ఞాపకాలు, ఆలోచనలు, భావోద్వేగాలు, మానసిక సంఘర్షణలు కథను ముందుకు నడిపించే ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. ఈ లక్షణం ఆధునిక మనోవిజ్ఞాన సిద్ధాంతాలను గుర్తు చేస్తుంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ మరియు కార్ల్ యూంగ్ మానవుని మనస్సులో దాగి ఉన్న అనుభవాలు మరియు జ్ఞాపకాలు వ్యక్తి ఆలోచనలను ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ఈ నవలలలో కథానాయకుడి గత జ్ఞాపకాలు ఇంకా అనుభవాలు అతని అంతరంగాన్ని ప్రభావితం చేస్తూ కథా నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

మూడవది, ఈ నవలలలో కథానాయకుడు ఎదుర్కొనే ప్రశ్నలు ప్రధానంగా తాత్విక స్వభావం కలిగినవిగా కనిపిస్తాయి. జీవితం యొక్క అర్థం ఏమిటి? మనిషి ఎందుకు జీవిస్తాడు? వ్యక్తి జీవితానికి నిజమైన విలువ ఏమిటి? వంటి ప్రశ్నలు ఈ నవలలలో ప్రధానంగా కనిపిస్తాయి. ఈ ప్రశ్నలు ఆధునిక అస్తిత్వవాద తత్వాన్ని గుర్తు చేస్తాయి. అస్తిత్వవాద తత్వవేత్తలు ఆధునిక మానవుని జీవితంలో అస్థిత్వ సంక్షోభం ఒక ముఖ్యమైన సమస్యగా మారుతుందని పేర్కొన్నారు. ఈ నవలలలో కథానాయకులు కూడా తమ జీవితానికి అర్థాన్ని అన్వేషించే ప్రయత్నం చేస్తారు.

ఇంకా ఒక ముఖ్యమైన అంశం ఈ నవలల ముగింపు విధానం. సంప్రదాయ నవలలలో కథ చివరికి ఒక స్పష్టమైన పరిష్కారం కనిపిస్తుంది. కానీ ఈ నాలుగు నవలలలో అటువంటి స్పష్టమైన ముగింపు కనిపించదు. కథ ఒక నిర్థిష్ట సమాధానంతో ముగియకుండా ఒక ప్రశ్నతో లేదా ఆలోచనతో ముగుస్తుంది. ఈ విధంగా రచయిత పాఠకుడికి ఒక స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా అతనిని స్వయంగా ఆలోచించడానికి ప్రేరేపిస్తాడు.

ఈ లక్షణాలన్నింటినీ పరిశీలించినప్పుడు ఈ నాలుగు నవలలలో ఒక ముఖ్యమైన తాత్విక సారూప్యత కనిపిస్తుంది. వ్యక్తి జీవితాన్ని ఒక అంతరంగ యాత్రగా చూడడం ఈ నవలల సాధారణ లక్షణంగా నిలుస్తుంది. భారతీయ తాత్విక సంప్రదాయం సూచించిన ఆత్మాన్వేషణ భావన, అస్తిత్వవాద తత్వం ప్రతిపాదించిన జీవితార్థాన్వేషణ, ఆధునిక మనోవిజ్ఞానం సూచించిన అంతరంగ విశ్లేషణ ఈ మూడు భావప్రవాహాలు ఈ నవలలలో పరస్పరం కలిసినట్లు కనిపిస్తాయి.

అందువల్ల చివరకు మిగిలేది, సుందరకాండం, మరణదనంతర, వేరుకళ్ వంటి నవలలను భాషలు వేరైనా ఒకే తాత్విక ధోరణికి చెందిన రచనలుగా పరిగణించవచ్చు. ఈ నవలలన్నీ వ్యక్తి జీవితాన్ని ఒక అంతర్ముఖ అన్వేషణగా చిత్రిస్తూ ఆధునిక భారతీయ నవలా సాహిత్యంలో ఒక ముఖ్యమైన సాహిత్య సంప్రదాయాన్ని నిర్మించాయి.

ఆధార గ్రంథాలు–1) తాత్విక మరియు సిద్ధాంత గ్రంథాలు:

1. అబ్రహామ్స్, ఎం. హెచ్. (2005). ఎ గ్లోసరీ ఆఫ్ లిటరరీ టర్మ్స్. బోస్టన్: థామ్సన్ వాడ్స్‌వర్త్.
2. హమ్‌ఫ్రీ, రాబర్ట్ (1954). స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్ ఇన్ ది మోడ్రన్ నవల్. బర్లీ: కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ ప్రచురణ.
3. సార్త్రే, జాన్ పాల్ (1943). బీయింగ్ అండ్ నథింగ్‌నెస్. పారిస్: గల్లిమార్.
4. సార్త్రే, జాన్ పాల్ (1946). ఎగ్జిస్టెన్షలిజం ఈజ్ ఎ హ్యూమనిజం. పారిస్: నాగెల్ ప్రచురణ.
5. కామ్యూ, అల్బేర్ (1942). ది మిథ్ ఆఫ్ సిసిఫస్. పారిస్: గల్లిమార్.
6. కీర్కెగార్డ్, సోరెన్ (1849). ది సిక్నెస్ అండ్ టు డెత్. కోపెన్‌హాగెన్: రీట్జెల్ ప్రచురణ.
7. ఫ్రాయిడ్, సిగ్మండ్ (1915). ది అన్‌కాన్షియస్. లండన్: హోగర్త్ ప్రెస్.
8. యూంగ్, కార్ల్ గుస్తావ్ (1964). మ్యాన్ అండ్ హిస్ సింబల్స్. లండన్: ఆల్డస్ పబ్లికేషన్స్.

2) భారతీయ తాత్విక గ్రంథాలు:

9. రాధాకృష్ణన్, సర్వేపల్లి (1953). ది ప్రిన్సిపల్ ఉపనిషద్స్. లండన్: జార్జ్ అలెన్ అండ్ అన్‌విన్.
10. రాధాకృష్ణన్, సర్వేపల్లి (1948). ది భగవద్గీత. లండన్: జార్జ్ అలెన్ అండ్ అన్‌విన్.
11. రాధాకృష్ణన్, సర్వేపల్లి (1951). ఇండియన్ ఫిలాసఫీ. లండన్: జార్జ్ అలెన్ అండ్ అన్‌విన్.

3) ప్రాథమిక గ్రంథాలు (నవలలు):

12. బుచ్చిబాబు (1968). చివరకు మిగిలేది. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
13. జయమోహన్ (1990). సుందరకాండం. చెన్నై: కళైఞన్ ప్రచురణాలయం.
14. శివరామ కారంత్ (1978). మరణదనంతర. బెంగళూరు: పుస్తక ప్రచురణ.
15. మలయాట్టూర్ రామకృష్ణన్ (1967). వేరుకళ్. కొచ్చి: కేరళ సాహిత్య అకాడమీ.

4) సాహిత్య విమర్శ గ్రంథాలు:

16. కాత్యాయని విద్మహే (2008). తెలుగు నవల – మానసిక విశ్లేషణ. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
17. కొత్తపల్లి వీరభద్రరావు (1997). తెలుగు నవల చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర.
18. రంగనాథాచార్యులు, కె. కె. (2001). ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ. హైదరాబాద్: ఎమెస్కో
19. చెల్లప్పన్, కా. (2005). ఆధునిక తమిళ నవల. చెన్నై: మక్కల్ ప్రచురణాలయం.
20. మార్క్స్, అ. (2003). తమిళ నవలలో తాత్విక ధోరణులు. చెన్నై: విదియల్ ప్రచురణ.
21. అమూర్, కె.కె. (1986)ఆధునిక కన్నడ సాహిత్యం. బెంగళూరు: మైసూరు విశ్వవిద్యాలయం.
22. జార్జ్, కె. ఎం. (1992). మలయాళ సాహిత్య చరిత్ర. న్యూ ఢిల్లీ: సాహిత్య అకాడమీ.

రచయితల చిరునామాలు

1. **ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్,** సంచాలకులు, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
2. **ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్, తెలంగాణ
3. **ఆచార్య కె. శ్రీదేవి,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం & **ఆర్. సి. కాంతివర్ధిని,** పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
4. **బి.శంకరరాజు,** రిటైర్డ్ లెక్చరర్, డోర్ నెం.4-96, ఇందిరా నగర్, పీలేరు, అన్నమయ్య జిల్లా, సెల్:9440508511
5. **యం.రాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.
6. **యాళ్ళ ఉమామహేశ్వరి,** తెలుగు అధ్యాపకురాలు, ఎలయన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజిమెంట్, మద్దిలపాలెం, విశాఖపట్టణం.
7. **పేరెల్లి శ్రీను,** పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
8. **ఆచార్య ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
9. **డా॥ తోట వెంకటస్వామి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
10. **డా॥ యం.హరికృష్ణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
11. **మహేష్ ఎడ్ల,** తెలుగు అధ్యాపకులు, MJPTBCWRDC(M), BHONGIR, చరవాణి: 9133412673, Email: maheshadla96@gmail.com
12. **ముదావత్ లోకేందర్,** పిహెచ్.డి విద్యార్థి, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
13. **ఆచార్య సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్,** ఆంగ్లశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
14. **డా॥ వేలం పళని,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం & **ఆచార్య డి.ఉదయ కుమారి,** ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ద్రావిడి

(అర్ధ వార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

శైలీ పత్రం

- వ్యాసాలు ద్రావిడ భాషాసాహిత్యాలు, చరిత్ర, సంస్కృతి, జానపదవిజ్ఞానం, తత్త్వశాస్త్రం, మానవశాస్త్రం, ఇతర ఏ మానవీయ శాస్త్రాలకు చెందినదైనా ద్రావిడ సంబంధమైన పరిశోధన వ్యాసాలు రాయవచ్చు. కాని విషయం ఏ శాఖకు చెందినదైనా వ్యాసం తెలుగులోనే ఉండాలి.
- ఇతర ద్రావిడ భాషల పరిశోధన పత్రికలలోని ఉత్తమ వ్యాసాలను మూల రచయితల, ఆ పత్రికల యాజమాన్యాల అనుమతితో తెలుగులోకి అనువదించి పంపవచ్చు. కాని మూలభాషలోని మూల ప్రతిని కూడా పంపాలి.
- వ్యాసాలు తప్పనిసరిగా సరికొత్త పరిశోధనాంశాలతో ఆ శాఖాంశాలపై సరికొత్త ప్రతిపాదనలు కాని సరికొత్త విజ్ఞానదృష్టిని కాని అందించేవై ఉండాలి. ఏ ప్రాచీన సాహిత్యం సరికొత్త సాహిత్య ధోరణుల గురించి రాసినా పరిశోధనలో కొత్తదనం తప్పనిసరి. గతానుగతికమైన వాదనలను ఇప్పటికే చాలా మంది చెప్పిన విషయాలపైన తిరిగి రాసే వ్యాసాలను పత్రిక అనుమతించకపోవచ్చు.
- వ్యాసాల పరిమాణం మరీ చిన్నదిగా ఉండకూడదు. అచ్చులో కనీసం ఐదు పుటల వ్యాసాలు చిన్నవిగా ఉండవచ్చు. మరీ ఎక్కువ పుటలలో ఉంటే పరిశోధన గురుత్వాన్ని బట్టి అంగీకరించవచ్చు.
- వ్యాసాలు ఆధునిక ప్రామాణిక భాషలో ఉండాలి. మాండలిక కథలపైన, ఇతర మాండలిక భాషాధారిత ప్రక్రియలపైన వ్యాసాలు రాసినా వ్యాసం ఆధునిక ప్రామాణిక భాషలోనే ఉండాలి.
- పులుముడు వాక్యాల శైలి దూరాన్వయం దురన్వయం ఉన్న వాక్యాల శైలి కాక సూటిగా క్లుప్తంగా ఉండే వాక్యాలతో విషయాన్ని సూటిగా చెప్పే శైలిని పాటించాలి.
- ఇప్పటికే విస్తృతంగా జరిగిన పరిశోధనాంశాలపైన కొత్త ప్రతిపాదనలు చేసే వ్యాసాలలో తిరిగి ఉపోద్ఘాతాలు చేయకుండా తిన్నగా విషయాంశానికి వెళ్ళి చర్చించవచ్చు. ఉదాహరణకు జానపద గేయాలపై కొత్త వ్యాసం రాయదలచుకున్నప్పుడు. తిరిగి నిర్వచనాలను గురించి చెప్పడం గేయలక్షణాలు వగైరా రాయనవసరం లేదు. భావకవిత్వంపైన సరికొత్త ప్రతిపాదనలు వివాదాలు రాయదలచుకున్న వారు తిన్నగా విషయంలోనికి వెళ్ళవచ్చు. కాని తిరిగి భావకవిత్వ నిర్వచనాలను గురించి ఉపోద్ఘాతాలు అవసరంలేదు.
- విసంధులు పాటించవచ్చు. అందంగా ఉన్నంత వరకూ వైరి సమాసాలను పాటించవచ్చు. పాలాభిషేకం, మెట్లోత్సవం, ఫిల్మోత్సవ్ వంటి మామూలు పాపులర్ భాషలోని దుష్టసంధులు వర్జించాలి. వ్యావహారికమైన పాపులర్ పత్రిక భాషను వాడకూడదు.

ISSN: 2319-3905

- థ-ధ, శ-ష-స భేదాన్ని తప్పక పాటించవలసి ఉంది. శకట రేఫ అవసరమైన చోట అంటే భాషాశాస్త్ర సంబంధి వ్యాసాలలో ప్రాచీన సాహిత్య చర్చకు సంబంధించిన వ్యాసాల్లో వినియోగించవచ్చు.
- వ్యాసానికి పాదసూచికలు/అంత్యసూచికలు ఇవ్వండి. సూచికలో స్పష్టమైన అవసరమైన సమాచారం ఉంటేనే ఇవ్వండి. చర్చలో అధికంగా ఇవ్వవలసిన సమాచారం ఉన్నా ఇవ్వండి. అతి ముఖ్యమైన విషయమైతేనే వ్యాసంలో ఉండాలి.
- ఉపయుక్త గ్రంథాల పట్టీ ఇచ్చేటప్పుడు వ్యాసంలో చర్చలో వినియోగించిన గ్రంథాలను మాత్రమే ఇవ్వాలి. దీనికి సంబంధం ఉన్నా ఇతర పుస్తకాలు జాబితాలో చేరవలసిన పనిలేదు.
- ఉపయుక్త గ్రంథాల జాబితా ఆధునికంగా అంతర్జాతీయంగా ఉపయోగించే పద్ధతిలో ఉండాలి. కింద ఉదాహరణ చూడవచ్చు.

  కృష్ణకుమారి నాయని, 1979. **జానపద గేయగాథలు,** తెలుగు అకాడమీ, హైదరాబాదు.
- జాబితాలో రచయితల పేరు పక్కన వారి బిరుదులు, హోదాలు రాయనవసరం లేదు. వ్యాసాన్ని కోట్ చేసినప్పుడు వ్యాసం ఉన్న పుస్తకాన్ని పై విధంగా రాయాలి. గ్రంథాల జాబితా గ్రంథకర్తల పేర్లతో అకారాది క్రమంలో ఉండాలి. జాబితాకు వరుస సంఖ్య అవసరం లేదు.
- అముద్రిత గ్రంథాలను, అముద్రిత సిద్ధాంత గ్రంథాలను కూడా ఉపయుక్త గ్రంథాల జాబితాలో అకారాది క్రమంలోనే రాయాలి. కాని (అముద్రితం) అని కుండలీకరణంలో, చివరిలో చెప్పాలి.
- Ibid, et.al. Op. Cit, వంటి వాటిని యథాతథంగా వాడుకోవచ్చు.
- ఉపశీర్షికలు వ్యాసరచనలో మరింత స్పష్టతనిస్తాయి. కాబట్టి వాడుకోవచ్చు.
- ఉటంకించే పాఠ్యం చిన్నది అయితే కొటేషన్ మార్కులలో ఉంచండి. లేదా ఒక పేరా అంత పరిమాణం ఉంటే దాన్ని ప్రత్యేకంగా మార్జిన్ పెట్టి వేరే చిన్న ఫాంట్‌లో రాయాలి.
- వ్యాసకర్తలే డి.టి.పి చేయించి పంపే పక్షంలో అను (version-7) కు కన్వర్ట్ కాగలిగిన ఫాంట్‌లనే వాడాలి. ఏ సాఫ్ట్‌వేర్ వాడింది ఏ ఫాంట్ వాడింది స్పష్టంగా రాసి పంపాలి. సాఫ్ట్ కాపీ ఇ-మెయిల్‌లో పంపవచ్చు.

  E-mail - dravididu@gmail.com
- మూలరచయిత అనుమతి పత్రం అనువాదానికి తప్పక జతచేయాలి.

ఈ పత్రికను ప్రాంతీయ భాష అయిన తెలుగులో వెలువరిస్తున్నా అంతర్జాతీయంగా వెలువడుతున్న పరిశోధన పత్రికల స్థాయిలో ప్రచురించాలనే మా అభిలాషను అర్థం చేసుకుని పరిశోధకులు సహకరించవలసిందిగా మనవి. ఇందుకు మీరూ తగిన సూచనలు చేయవచ్చు. మరిన్ని వివరాలకు సంపాదక మండలిని సంప్రదించవచ్చు. మీ రచనలు అందించి పత్రికను ఉత్తమ ప్రామాణిక పత్రికగా దిద్దితీర్చడంలో సహకారం అందించాలని మనవి.

సంపాదకమండలి